సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16 సంచిక: 302
సోమవారం 15-7-2024



'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'



4-1తో ముగించారు

చివరిదైన ఐదో టి20లోనూ జింబాబ్వేపై గెలిచిన భారత్ - 12లో



'కింగ్' అల్‌కరాజ్

వరుసగా రెండోసారి వింబుల్డన్ టైటిల్.. ఫైనల్లో జొకోవిచ్‌పై విజయం - 12లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఆందోళనకరంగా కేజ్రీవాల్ ఆరోగ్యం!

జైలులో ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఆరోగ్యం ఆందోళనకరంగా మారిందని ఆప్ నేత, మంత్రి అతిశీ చెప్పారు.

వివరాలు 6లో ►



నిందితుడి ఎన్‌కౌంటర్

బీఎస్పీ తమిళనాడు అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో కీలక నిందితుడు కె.తిరువేంగడమ్ పోలీసు ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడు.


వివరాలు 6లో ►



నా పైనా హత్యాయత్నాలు

గత ఎనిమిది నెలల కాలంలో తనపై రెండు సార్లు హత్యాయత్నం జరిగినట్లు బిలియనీర్, టెస్లా సీఈవో ఎలన్ మస్క్ వెల్లడించారు.

వివరాలు 6లో ►



నేపాల్ ప్రధానిగా కేపీ శర్మ ఓలి

విశ్వాస పరీక్షలో పుష్పకమల్ దహాల్ ప్రచండ ఓడిపోవడంతో నేపాల్ ప్రధానిగా ఖడ్గ ప్రసాద్ శర్మ ఓలి నియమితులయ్యారు.

వివరాలు 6లో ►

రూ.3,000 నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు?

రాష్ట్రంలో 1.60 కోట్ల కుటుంబాల ఎదురుచూపులు

జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతిపై నిరుద్యోగుల గంపెడాశలు

- ఉద్యోగం వచ్చేంత వరకు నెలకు రూ.3 వేలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం
- ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వస్తాయని చిన్న చిన్న ప్రైవేట్ ఉద్యోగాలకు గుడ్ బై
- భృతి వస్తుందనే ధీమాతో అప్పులు చేసి స్టడీ సర్కిళ్లు, లైబ్రరీల బాట
- ప్రభుత్వం ఏర్పడి నెల దాటినా భృతిపై నోరు మెదపని సర్కారు.. యువత ఆందోళన
- భృతి ఎప్పుడిస్తారో ప్రకటించాలని నిరుద్యోగుల డిమాండ్
- గతంలోనూ రూ.2 వేల భృతి ఇస్తానంటూ మాట తప్పిన చంద్రబాబు
- 2014–19 మధ్య బాబు ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలు కేవలం 34 వేలు మాత్రమే
- 2019–24 మధ్య వైఎస్ జగన్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలు 6.38 లక్షలు

2లో



ఉద్యోగాల కల్పన

చంద్రబాబు పాలనలో..	వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో..	
2014-19 మధ్య చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఉద్యోగాలు 34,108	2019-24 మధ్య వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో శాశ్వత ఉద్యోగాలు 2,21,003	ఔట్ సోర్సింగ్, ఇతర ఉద్యోగాలు 3,73,695
	కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగాలు 43,923	వైఎస్ జగన్ ప్రభుత్వం కల్పించిన మొత్తం ఉద్యోగాలు 6,38,621



దుండగుడి కాల్పుల్లో నెత్తురోడుతూ పిడికిలి బిగించి నినాదాలు చేస్తున్న డొనాల్డ్ ట్రంప్‌ను చుట్టుముట్టి అక్కడి నుంచి తరలిస్తున్న అమెరికా సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు

ట్రంప్‌పై హత్యాయత్నం

ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తుండగా కాల్పులు

కుడి చెవిని గాయపరుస్తూ దూసుకెళ్లిన తూటా

- తలపక్కగా దూసుకెళ్లిన నాలుగైదు తూటాలు
- అప్రమత్తమై కిందికి వంగిన మాజీ అధ్యక్షుడు
- సురక్షితంగా తరలించిన భద్రతా సిబ్బంది
- పిడికిలి బిగించి 'ఫైట్' అంటూ నినదించిన ట్రంప్
- ప్రతి నినాదాలతో పెద్దపెట్టున స్పందించిన సభికులు
- దుండగుని కాల్చివేత, 20 ఏళ్ల యువకునిగా గుర్తింపు
- కాల్పుల్లో ఒకరి మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు

6లో

ఎప్పుడేం జరిగిందంటే...

దేవుడే కాపాడాడు:ట్రంప్

పెరిగిన విజయావకాశాలు!

దుండగుడు రిపబ్లికన్ ఓటరే..



ప్రభుత్వాస్పత్రిలో శిశువు అపహరణ

- బందరు జీజీహెచ్‌లో ఘటన
- నర్సు వేషంలో వచ్చి శిశువును అపహరించిన మహిళ
- సెక్యూరిటీ సూపర్‌వైజర్ సమాచారంతో నిందితురాలిని పట్టుకున్న పోలీసులు

5లో



దుర్గమ్మకు తెలంగాణ బంగారు బోనం

2లో

ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని బెజవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మకు హైదరాబాద్ భాగ్యనగర్ శ్రీ మహంకాళీ జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆదివారం బంగారు బోనం సమర్పించింది. 15 ఏళ్లుగా ఈ కమిటీ దుర్గమ్మకు బోనం సమర్పిస్తోంది.



23 నుంచి 'పొలం పిలుస్తోంది'

- వారానికి 2 రోజులు.. రోజుకు 2 గ్రామాలు
- కమిషనర్ నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు పొలంబాట
- వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా రైతులకు అవగాహన

2లో

అద్దిల్లా.. సొంతిల్లా?

ఏది బెటరో అవగాహన కల్పించే కథనం - 13లో

46 ఏళ్ల తర్వాత తెరుచుకున్న

పూరీ రత్నభండార్

వజ్రాభరణాలు, పసిడి నిల్వలను లెక్కించేందుకు సిద్ధమైన బృందం

జగన్నాథ ఆలయంలో ప్రత్యేకపూజలు 6లో



ఆదివారం పూరీ జగన్నాథ ఆలయానికి కొత్త ఇత్తడి పెట్టెలను తీసుకొస్తున్న దృశ్యం. 'రత్న భండార్'లోని నగల తరలింపు కోసం ఈ పెట్టెలను తెచ్చారు.



మరో రెండురోజులు

వర్షాలు

ఉపరితల ఆవర్తనం ఫలితం

సాక్షి, అమరావతి: ఉపరితల ఆవర్తనం ప్రభావంతో వచ్చే రెండురోజులు రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. పశ్చిమబెంగాల్, జార్ఖండ్, ఒడిశా మీదుగా ఉన్న ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి కొనసాగుతుండగా, శనివారం పశ్చిమ బంగాళాఖాతం, కోస్తాంధ్ర తీరంలో ఏర్పడి సముద్రమట్టానికి సగటున 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం దాంతో కలిసిపోయింది. దీని ప్రభావంతో మిగతా 2వ పేజీలో ►

జగన్ వల్లే పెట్టుబడులు పైపైకి..

పెట్టుబడుల ఆకర్షణలో దేశంలోనే మూడో స్థానం	2024 జనవరి- మార్చి మధ్య 15 కొత్త ప్రాజెక్టుల ద్వారా రూ.22,580 కోట్ల పెట్టుబడుల ఆకర్షణ

- మహారాష్ట్ర, గుజరాత్ తర్వాత అత్యధిక పెట్టుబడులు ఆకర్షించిన ఏపీ
- అలాగే, గడిచిన 27 నెలల కాలంలో 120 ప్రాజెక్టుల ద్వారా రూ.50,955 కోట్ల పెట్టుబడులు రాక
- ఇదే సమయంలో 112 యూనిట్లు ప్రారంభం..
- తద్వారా వాస్తవ రూపంలోకి రూ.62,069 కోట్ల పెట్టుబడులు
- కేంద్ర ప్రభుత్వంలోని డీపీఐఐటీ తాజా గణాంకాల్లో వెల్లడి
- నాటి సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక శ్రద్ధతో రాష్ట్రంలో కల్పించిన అనువైన వాతావరణం

2లో



ఇదండీ జోక్



ఫర్లేదు! ఇలా ఇవ్వు! నీ సమస్యలన్నీ పరిష్కరిస్తాను!!

ఆ ముగ్గురి మాటే శాసనం

ముగ్గురు రిటైర్డ్ ఐపీఎస్‌ల గుప్పిట్లో పోలీసు శాఖ



ఏబీ వెంకటేశ్వరరావు | ఆర్పీ ఠాకూర్ | ఘట్టమనేని శ్రీనివాస్

- ఏబీవీ, ఆర్పీ ఠాకూర్, ఘట్టమనేని శ్రీనివాస్‌లే అసలు బాస్‌లు
- పోలీసు శాఖను వీరే నియంత్రిస్తారని చెప్పిన ముఖ్య నేత
- వీరి సర్వీసు అంతా అవినీతి, అక్రమాలు, వివాదాలే
- ఎస్సై నుంచి డీజీ వరకు వారి మాటే వేదం
- ఆ త్రయం ప్రాపకం దక్కితేనే పోస్టింగులు
- వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టాలి.. వేధించాలి
- మూటలు ఇవ్వాలి.. వారి మాటే వినాలి.. ఇవి చేస్తేనే పోస్టింగులు
- వారు సంతృప్తి చెందితేనే చిన బాబు, పెద్ద బాబు వద్దకు

5లో



విశాఖ మెట్రో ప్రాజెక్టు డిజైన్

మెట్రోకు మళ్లీ మోకాలడ్డు!

వైజాగ్ మెట్రో ప్రాజెక్టుని నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుయుక్తులు

మరోసారి డీపీఆర్ తయారీకి సీఎం చంద్రబాబు ఆదేశాలు

- ఇప్పటికే కేంద్రానికి పంపిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- సమగ్ర దూరదృష్టితో నివేదిక సిద్ధం చేసిన వైనం
- 76 కిలోమీటర్ల లైట్ మెట్రో కారిడార్ నిర్మాణానికి రూ.14,309 కోట్లు
- ఇప్పుడు కొత్త డీపీఆర్ పేరుతో టీడీపీ ప్రభుత్వం తాత్సారం
- ముందు అమరావతిలో మెట్రో రైలు తీసుకురావడమే లక్ష్యం
- ఇదయ్యేవరకు రాష్ట్రంలో ఎక్కడా మెట్రో లేనట్టే

3లో

'గంటా' ఆస్తుల వేలం!

రుణాలు ఎగ్గొట్టిన కేసులో టీడీపీ ఎమ్మెల్యేకు బ్యాంకు ఝలక్

- మొత్తం రూ.390 కోట్ల రికవరీకి చర్యలు
- ఇప్పటికే పలుమార్లు నోటీసులిచ్చిన ఇండియన్ బ్యాంకు
- అయినా స్పందించని గంటా, ఆయన బంధువులు
- ఆగస్టు 8న ఆస్తులు వేలం వేస్తామని బ్యాంకు ప్రకటన జారీ



సాక్షి, విశాఖపట్నం: మాజీమంత్రి, టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆయన బంధువులు రూ.వందల కోట్ల మేర రుణాలను ఎగ్గొట్టిన కేసులో వారికి అప్పులిచ్చిన ఇండియన్ బ్యాంకు ఆస్తుల వేలానికి ఉపక్రమించింది. రుణాలను వడ్డీతో సహా వసూలు చేసుకునేందుకు వరుసగా డిమాండ్ నోటీసులు జారీచేసినా గంటా బ్యాచ్ పట్టించుకోకపోవడంతో తనఖా పెట్టిన వాటిలో పలు ఆస్తులను ఇప్పటికే స్వాధీనం చేసుకున్న బ్యాంకు వాటి వేలానికి రంగం సిద్ధంచేసి అందుకు సంబంధించిన తేదీని మిగతా 3వ పేజీలో ►

క్లుప్తంగా...

23 నుంచి 'పొలం పిలుస్తోంది'

సాక్షి, అమరావతి: ఈ నెల 23 నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని చేపడుతున్నారు. కమిషనర్ నుంచి క్షేత్ర స్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ పొలంబాట పట్టనున్నారు. ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులపై రైతుల్లో అవగాహన కల్పించాలన్న సంకల్పంతో క్షేత్ర స్థాయి పర్యటనలకు శ్రీకారం చుడుతున్నారు. ప్రతి సీజన్‌లో వారానికి 2 రోజుల పాటు, రోజుకు 2 గ్రామాల చొప్పున ఈ కార్యక్రమాన్ని నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రతి మంగళ, బుధవారాల్లో తలపెట్టే ఈ కార్యక్రమంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొంటారు. పరిశోధన కేంద్రాలు, కేవీకేల శాస్త్రవేత్తలనూ భాగస్వాములను చేస్తున్నారు. మండలాల వారీగా షెడ్యూల్ ఖరారు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఉదయం రైతు క్షేత్రాల్లో పర్యటించి పంటల స్థితిగతులను పరిశీలిస్తారు. మధ్యాహ్నం ఆర్బీకేలో రైతులతో సమావేశమవుతారు. సీజన్ ముగిసే వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు జిల్లాకో కో–ఆర్డినేటర్‌ను నియమిస్తున్నారు. జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు మండల స్థాయిలో పర్యవేక్షిస్తారు.

దాడులకు పాల్పడితే వదిలిపెట్టం

డీజీపీ ద్వారకా తిరుమలరావు



అమ్మవారి ఆలయంలో డీజీపీ ద్వారకా తిరుమలరావు


కాణిపాకం/చంద్రగిరి(తిరుచానూరు): రాష్ట్రంలో ఎవరైనా దాడులకు పాల్పడితే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని డీజీపీ ద్వారకా తిరుమలరావు స్పష్టం చేశారు. కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని ఆదివారం ఆయన కుటుంబ సమేతంగా దర్శించుకుని మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో గతంలో జరిగిన దాడులు..ప్రస్తుతం జరుగుతున్న దాడులు సరికాదన్నారు. రహదారి ప్రమాదాలను తగ్గించడానికి, రహదారి భద్రతపై దృష్టి సారించామన్నారు. ఎర్రచందనం, గంజాయి వంటి మత్తు పదార్థాలను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలను కేటాయించామన్నారు. కాగా, తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని డీజీపీ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు.

సోమశిల మరమ్మతులకు రూ.80 కోట్లు

- కండలేరు రిపేర్లకు రూ.16 కోట్లు
- మంత్రి రామానాయుడు

రాపూరు (తిరుపతి జిల్లా): సోమశిల జలాశయంలో తక్షణ మరమ్మతులకు రూ.80 కోట్లు అవసరమని అధికారులు నివేదించారని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. సోమశిల రోప్ మరమ్మతులకు రూ.2.5 కోట్లు అవసరమని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఆయన ఆదివారం రాపూరు మండలంలోని కండలేరు జలాశయ అతిథిగృహంలో జిల్లా జలాశయాల స్థితిగతులపై మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి ఇరిగేషన్‌శాఖ, కండలేరు, సోమశిల జలాశయాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కండలేరు జలాశయం మరమ్మతులకు రూ.16 కోట్లు అవసరమని అధికారులు నివేదికలు సిద్ధం చేశారని, ఈ నిధులు త్వరితగతిన మంజూరు చేసి పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

జగన్ వల్లే పెట్టుబడులు పైపైకి..



పెట్టుబడుల ఆకర్షణలో దేశంలోనే మూడో స్థానం

సాక్షి, అమరావతి: మాజీ సీఎం వైఎస్ జగన్ తన హయాంలో కనబర్చిన ప్రత్యేక శ్రద్ధతో పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక గుర్తింపు సాధించింది. ఈ విషయంలో ఏపీ 2024 జనవరి నుంచి మార్చి వరకు 3 నెలల కాలంలో దేశంలోనే మూడో స్థానంలో నిలిచింది. ఈ సమయంలో రాష్ట్రంలోకి కొత్తగా 15 ప్రాజెక్టుల ద్వారా రూ.22,580 కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) తాజాగా విడుదల చేసిన గణాంకాల్లో వెల్లడించింది. ఇదే సమయంలో రూ.1,02,534 కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా మహారాష్ట్ర మొదటి స్థానంలో ఉండగా.. రూ.36,329 కోట్ల పెట్టుబడులతో గుజరాత్ రెండో స్థానంలో నిలిచింది. ఇదే కాలంలో ఏపీలో కొత్తగా 14 యూనిట్ల ఉత్పత్తి ప్రారంభించడం ద్వారా రూ.1,049 కోట్ల పెట్టుబడులు వాస్తవ రూపంలోకి వచ్చాయి.

నాటి సీఎం జగన్ ప్రత్యేక చొరవవల్లే

వాస్తవానికి.. నాటి సీఎం జగన్ ప్రత్యేక కృషితో ఏపీలో అనువైన వాతావరణం కల్పించడంవల్లే ఈ కాలంలో కొత్త పరిశ్రమలు రాష్ట్రం వైపు ఎక్కువగా మొగ్గు చూపాయి.ఏపీలో 4 పోర్టుల పనులు యుద్ధప్రాతిపదికన చేయించడం.. 10 ఇండస్ట్రియల్ నోడ్స్‌ను ప్రారంభించడం.. 10 ఫిషింగ్ హార్బర్ల పనులకు కూడా శ్రీకారం చుట్టడం.. ఎంఎస్ఎంఈలకు ఎన్నడూలేని విధంగా ప్రోత్సహించడం లాంటి అంశాలు ఏపీలో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం ఏర్పడడానికి ప్రధాన కారణాలు. కేంద్రం సైతం ఇందుకు బలం చేకూరుస్తూ తన నివేదికల్లో ఏపీలో పరిశ్రమల ఏర్పాటును ప్రస్తావించింది.

కోవిడ్ తర్వాత పెట్టుబడుల ఆకర్షణలో దూకుడు

ప్రపంచాన్ని కుదిపేసిన కోవిడ్ మహమ్మారి తర్వాత కాలంలో కొత్త పెట్టుబడులను ఆకర్షించడం, వాటిని వాస్తవ రూపంలోకి తీసుకురావడంలో ఆంధ్రప్రదేశ్ దూకుడు ప్రదర్శించింది. ఈ విపత్కర సమయంలో రాష్ట్రంలో ఒక్క పరిశ్రమ కూడా మూతపడకుండా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వారిని చేయిపట్టి నడిపించడంతో పాటు పరిశ్రమలకు గతంలో చంద్రబాబు సర్కారు ఎగ్గొట్టిన బకాయిలను చెల్లించడంతో పారిశ్రామికవేత్తలకు ఏపీపై నమ్మకం ఏర్పడింది. దీంతో 2022 నుంచి 2024 మార్చి వరకు అంటే 27 నెలల కాలంలో రాష్ట్రంలోకి పెద్దఎత్తున పెట్టుబడులు వచ్చాయి. ఈ 27 నెలల కాలంలో రాష్ట్రంలోకి 120 సంస్థలు కొత్తగా పెట్టుబడులు పెట్టడానికి ఒప్పందాలు చేసుకున్నాయని, దీనికి సంబంధించి ఇండస్ట్రియల్ ఎంటర్‌ప్రెన్యూర్స్ మెమోరాండం (ఐఈఎం) పార్ట్–ఏను జారీచేసినట్లు డీపీఐఐటీ పేర్కొంది. ఈ 120 ఒప్పందాల ద్వారా రాష్ట్రంలోకి రూ.50,955 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇదే సమయంలో కొత్తగా 112 యూనిట్లు ఉత్పత్తి ప్రారంభించడం ద్వారా రూ.62,069 కోట్ల పెట్టుబడులు వాస్తవరూపం దాల్చాయి. ఈ 112 సంస్థలు ఉత్పత్తి ప్రారంభించడంతో ఐఈఎం పార్ట్–బీని మంజూరుచేసినట్లు డీపీఐఐటీ ఆ నివేదికలో వెల్లడించింది. రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రంలోకి ఈ స్థాయిలో భారీ పెట్టుబడులు రావడం ఇదే ప్రథమమని పరిశ్రమల శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

మార్చి 2024లో కొత్తగా కుదిరిన ఒప్పందాలు..

- గ్రీన్‌కో (సోలార్ పవర్)
- లిండే ఇండియా (ఆక్సిజన్, నైట్రోజన్)
- జెనిత్ మెటాప్లాస్ట్ (ఫర్నిచర్)
- మార్క్స్‌కింగ్ ఇండియా (ఫుట్‌వేర్)
- శ్రేయాస్ ఇండస్ట్రీస్ (డీ శాలినేషన్)
- సిగాచీ ఇండస్ట్రీస్ (ఫార్మా)
- సింపోలో ఇంటర్నేషనల్ (సిరామిక్ టైల్స్)
- విశాఖ ఎనర్జీ (విద్యుత్)
- యూనివర్త్ ఓవర్సీస్ (ముడి జీడిపప్పు)

మార్చి 2024లో ఉత్పత్తి ప్రారంభించిన సంస్థలు

కంపెనీ	రంగం
ఏఐఎల్ డిక్సన్ టెక్నాలజీ	సెక్యూరిటీ కెమెరాలు
కోకోకోలా	కార్బొనేటెడ్ డ్రింక్స్
దేవీ సీఫుడ్స్	రొయ్యల మేత
లిండే ఇండియా	ఆక్సిజన్, నైట్రోజన్
టీజీవీసార్క్	లిక్విడ్ క్లోరిన్, మిథైలైన్ క్లోరైడ్

రూ. 3,000 నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు?

రాష్ట్రంలో 1.60 కోట్ల కుటుంబాల ఎదురుచూపులు

జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతిపై నిరుద్యోగులు గంపెడాశలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉద్యోగాలు, ఉపాధి కోసం యువత ఎదురు చూస్తోంది. జాబ్ క్యాలెండర్‌పై గంపెడాశలు పెట్టుకుంది. చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు ఇంటికో ఉద్యోగం వచ్చేంత వరకు 'నిరుద్యోగ భృతి' ఇవ్వాలని కోరుతోంది. అధికారంలోకి వచ్చి నెల దాటినా, నిరుద్యోగ భృతి గురించి మాట్లాడటం లేదని, ఎప్పటి నుంచి ఇస్తారో స్పష్టంగా చెప్పాలని ఆంధ్రప్రదేశ్‌లోని 1.60 కోట్ల కుటుంబాల్లోని యువత డిమాండ్ చేస్తోంది. 2014లో చంద్రబాబు ఇంటికొక ఉద్యోగం లేకుంటే నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులను నట్టేట ముంచారు. అప్పట్లో చంద్రబాబు విసిరిన మాయ వలలో చిక్కుకుని ఐదేళ్లు నిరుద్యోగ యువత విలవిల్లాడిపోయారు. మరోసారి అలాంటి హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. ప్రభుత్వం ఏర్పడి నెల రోజులైనా నిరుద్యోగ భృతిపై నోరు మెదపక పోవడం నిరుద్యోగులను ఆందోళనకు గురిచేస్తోంది. గతంలో మూడుసార్లు సీఎంగా పని చేసిన చంద్రబాబు.. మళ్లీ బూటకపు హామీలతోనే ఇప్పుడు నాలుగోసారి అధికారంలోకి వచ్చారు. కానీ, ఆయన రాజకీయ జీవితంలో చెప్పింది చెప్పినట్లు ఏనాడు ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిన దాఖలాలు లేవు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం, హామీలను అమలు చేయడం ఆయన డిక్షనరీలోనే లేదు. ఇలాంటి పరిస్థితుల్లో భారీ సంఖ్యలో యువత ప్రభుత్వ కొలువులు వస్తాయని.. లేదంటే నిరుద్యోగ భృతి అందుతుందనే ఆశతో ఎదురు చూస్తోంది. చాలామంది చిన్నా చితకా పనులు వదిలేసి.. స్టడీ సర్కిళ్లు, లైబ్రరీల బాట పడుతున్నారు. కుటుంబానికి ఆర్థిక భారంగా మారినప్పటికీ ప్రభుత్వం ఇచ్చే భృతితో ఎలాగోలా నెట్టుకు రావచ్చనే ఉద్దేశంతో పోటీ పరీక్షల్లో రాణించేందుకు ప్రణాళికలు వేసుకుంటున్నారు.

సూపర్ సిక్స్ టాప్‌లో భృతి

ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన తమ ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్‌లో నిరుద్యోగులకు పెద్ద పీట వేస్తున్నట్టు ప్రకటించారు. నిరుద్యోగులందరికీ ఉద్యోగాల కల్పనతో పాటు ఉద్యోగం వచ్చేంత వరకు ప్రతి ఒక్కరికీ నెలకు రూ.3 వేల భృతి ఇస్తామంటూ ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల దాటినప్పటికీ ఆ ఊసే ఎత్తట్లేదు. మెగా డీఎస్సీ పేరుతో నామమాత్రంగా ప్రకటించిన 16 వేల పోస్టుల భర్తీ కాస్తా నత్త నడకను తలపిస్తోంది. డిగ్రీ అర్హతతో ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూప్స్ పరీక్షలతో పాటు ఇంటర్మీడియట్, పదవ తరగతి అర్హతతో ప్రభుత్వ కొలువుల కోసం పోటీపడే వారు లక్షల్లో ఉన్నారు. వీరితో పాటు ప్రభుత్వ కొలువు సాధించేందుకు ఇంకా వయస్సు ఉండి.. ఆర్థిక తోడ్పాటు లేక పోటీ పరీక్షలను పక్కన పెట్టి ఊళ్లలో వ్యవసాయం, పట్టణాల్లో చిన్న చిన్న పనులు చేసుకుంటూ కాలం వెల్లదీస్తున్న వారందరినీ కలుపుకుంటే దాదాపు ప్రతి ఇంటిలో ఒక నిరుద్యోగి కనిపిస్తున్న పరిస్థితి. ప్రభుత్వ కొలువుల కోసం కష్టపడి ఆగిపోయిన వారందరూ కూటమి ప్రభుత్వ నిరుద్యోగ భృతి హామీతో తిరిగి పోటీ పరీక్షల వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే ప్రభుత్వం ఈ హామీని అమలు చేయడంలో జాప్యం చేస్తుండటంతో నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోచింగ్‌కు రూ.లక్షల్లో ఫీజులు

ప్రభుత్వ కొలువుల కోసం యువత శిక్షణ తీసుకునేందుకు రూ.లక్షల్లో ఫీజులు కట్టాల్సిన పరిస్థితి నెలకొంది. కుటుంబానికి ఆర్థిక భారం అయినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే తపనతో అప్పులు చేస్తున్నారు. పేరొందిన సంస్థల్లో గ్రూప్ 1 శిక్షణ, స్టడీ మెటీరియల్ కోసమే రూ.లక్షలు, సాధారణ శిక్షణ కేంద్రాల్లో రూ.50 వేల వరకు ఖర్చవుతోంది. గ్రూప్–2కు అయితే రూ.30 వేల నుంచి రూ.70 వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది. డీఎస్సీ, కానిస్టేబుల్, ఇతర పోస్టులకు శిక్షణ తీసుకోవాలన్నా రూ.వేలల్లోనే ఫీజులు ఇవ్వాల్సిన పరిస్థితి. వీటికి తోడు భోజనం, హాస్టల్ ఖర్చుల నిమిత్తం తక్కువలో తక్కువ నెలకు రూ.6 వేలకుపైగా ఖర్చవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో నిరుద్యోగులు నోటిఫికేషన్ల విడుదలతో పాటు, ప్రభుత్వం ఇస్తామన్న భృతి కోసం కళ్లలో వత్తులు వేసుకుని ఎదురు చూస్తున్నారు.

గతంలో చేసినట్టే చేస్తారా?

రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన చేపట్టే వరకు నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రధాన హామీగా పదే పదే ప్రచారం చేసుకుంది. అయితే అధికారంలోకి రావడం.. పాలనను ప్రారంభించడంతో పాటు.. నిత్యం ముఖ్యమంత్రి, మంత్రులు శాఖల వారీగా సమీక్షలు మొదలెట్టారు. కానీ, నిరుద్యోగులకు ఇవ్వాల్సిన భృతిపై ఒక్క మాట కూడా మాట్లాడట్లేదు. నిరుద్యోగ భృతి అమలుపై కనీసం విధి విధానాలు, మార్గదర్శకాల జారీపై కసరత్తు కూడా ప్రారంభించలేదు. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు 2014–19లో నెలకు రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి.. ఐదేళ్లు పబ్బం గడుపుకుని మొండి చెయ్యి చూపించారు. అప్పట్లో కూడా ఇంటికో ఉద్యోగం అని ఊదరగొట్టి నిరుద్యోగులను నట్టేట ముంచారు. నిరుద్యోగ భృతికి 2017–18లో రూ.500 కోట్లు కేటాయింపులు చేసినప్పటికీ, రూపాయి కూడా ఇవ్వలేకపోయారు. అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రంగా ఒత్తిడి తేవడంతో ఎన్నికలకు ముందు యువ నేస్తం పేరుతో తూతూ మంత్రంగా డ్రామా నడిపించారు. విధివిధానాల రూపకల్పనకు మంత్రి వర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసి సవాలక్ష ఆంక్షలు విధించి నిరుద్యోగ భృతి ఇచ్చే వారి సంఖ్యను భారీగా కుదించారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ చదివిన వారు అనర్హులని తేల్చడంతో పాటు 22 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాలలోపు డిగ్రీ చదివిన వారికే భృతి వర్తిస్తుందని మెలిక పెట్టారు. కొన్ని చోట్ల కారు డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వారికి, 120 సీసీ ద్విచక్ర వాహనం ఉన్న వారిని సైతం పక్కన పడేశారు. ఇలా వడపోత అనంతరం తొలుత 12 లక్షల మందికి పైగా నిరుద్యోగ భృతికి అర్హులుగా తేల్చగా.. ఆ తర్వాత ఆ సంఖ్యను పది లక్షలకు కుదించారు. మళ్లీ అందులో 2.10 లక్షల మందే అర్హులంటూ.. 1.62 లక్షల మందికే ఇస్తామని.. దీనికి ఈ–కేవైసీ లింక్ పెట్టి కేవలం వేల సంఖ్యలో మాత్రమే నిరుద్యోగ భృతి ఇచ్చి మమ అనిపించారు. గతంలో ఇలా నిరుద్యోగ భృతి హామీని నీరుగార్చి.. ఉద్యోగాలను భర్తీ చేయకపోగా ఆరోగ్య మిత్రలను, ఫీల్డ్ అసిస్టెంట్లను, గోపాల మిత్రలను ఉద్యోగాల నుంచి తొలగించారు. ఈ అనుభవం దృష్ట్యా ఈ సారైనా నిరుద్యోగులు అందరికీ ఉద్యోగాలతో పాటు ఉద్యోగం వచ్చే వరకు భృతి ఇవ్వాలని నిరుద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

వయో పరిమితిని గుర్తించాలి..

రాష్ట్రంలో ఏపీపీఎస్సీ పరీక్షలకు ఓపెన్ కేటగిరీ అభ్యర్థులకు వయో పరిమితి 42 ఏళ్లు, రిజర్వ్‌డ్ కేటగిరి అభ్యర్థులకు మరో 5 ఏళ్లు అదనంగా ఉంటుంది. ఈ క్రమంలో 40 ఏళ్లు దాటినప్పటికీ ప్రభుత్వ కొలువు సాధించాలనే సంకల్పంతో చాలా మంది ఇప్పటికే పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతూ, విజయం కూడా సాధిస్తున్నారు. ఏపీపీఎస్సీ వయో పరిమితి ఇలా ఉంటే.. గతంలో చంద్రబాబు ప్రభుత్వం దీనిని పరిగణనలోకి తీసుకోకుండా కేవలం 22–35 ఏళ్ల వయస్కులు మాత్రమే భృతికి అర్హులని ప్రకటించడంతో చాలా మంది నష్టపోయారు. ఇంటర్ చదువుకున్న వారు కూడా ఏదో ఒక పోటీ పరీక్షకు సన్నద్ధం అవుతారు. డిప్లొమా చేసిన వారి వయసు కూడా 19 ఏళ్ల లోపుగానే ఉంటుంది. వీళ్లందరినీ కూడా గతంలో గుర్తించక పోవడం నిరుద్యోగుల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. దేశ రాజకీయ చరిత్రలో చంద్రబాబు ప్రజలను మభ్యపెట్టినట్టు మరే నాయకుడూ చేసి ఉండరు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసి, మరోసారి అధికారంలోకి వచ్చిన ఈయన పాలనలో ఉద్యోగాల భర్తీ అనేది కనిపించదు. 2009 ఎన్నికల్లో లక్షల్లో ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి అని హామీలు గుప్పిస్తే ప్రజలు విశ్వసించలేదు. రాష్ట్ర విభజన సమయంలో 2014లో 600కు పైగా ఇచ్చిన హామీల్లో నిరుద్యోగ భృతిని చేర్చి అధికారంలోకి వచ్చారు. కానీ, ఐదేళ్ల అధికారం అనుభవించి ఎన్నికల దగ్గరకు వచ్చే సరికి యువ నేస్తం అంటూ మభ్యపెట్టారు. తాజాగా 2024లోనూ నిరుద్యోగ పల్లవి అందుకుని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అండ్ కో అసలు ఉద్యోగాల ఊసే ఎత్తకపోవడం గమనార్హం.

నిరుద్యోగ భృతిపై స్పష్టత ఇవ్వాలి



జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. గతంలో మాదిరి కాకుండా తక్షణమే భృతిని ప్రకటించాలి. ఒక్క నెల నోటిఫికేషన్ ఆలస్యమైనా లక్షలాది మంది నిరుద్యోగులు వయో పరిమితి దాటి ప్రభుత్వ ఉద్యోగానికి అర్హత కోల్పోతారు. యువగళంలో లోకేశ్.. లక్షల్లో ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు. టీడీపీ 2014–19లో నోటిఫికేషన్లు ఇచ్చి కోర్టుల్లో కేసులు వేయించి అడ్డుకుని నిరుద్యోగులతో ఆడుకుంది. ఇప్పుడు అలాంటి పరిస్థితి వస్తే నిరుద్యోగుల ఉద్యమ సత్తాను చూడాల్సి వస్తుంది.

– వై.రామచంద్ర, నిరుద్యోగ ఐక్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు

తక్షణం నిరుద్యోగ భృతి ఇవ్వాల్సిందే



గతంలో మాదిరి నిరుద్యోగులను మోసం చేయకుండా జనరల్ అభ్యర్థులతో సహ అందరికీ నిరుద్యోగ భృతి ఇవ్వాల్సిందే. ఉద్యోగాలు కల్పించే వరకు ఆర్థిక సాయంగా భృతి ఇస్తే నిరుద్యోగులకు, వారి కుటుంబాలకు ఎంతో తోడ్పాటు ఇచ్చినట్టు అవుతుంది. ఈసారి అమలు చేయబోయే నిరుద్యోగ భృతి కనీసం 40 ఏళ్లు దాటి పోటీ పరీక్షలు రాసేందుకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇవ్వాల్సిందే.

– సమయం హేమంత్ కుమార్, ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు

నిరుద్యోగుల ఊసే ఎత్తట్లేదు



ప్రభుత్వం ఏర్పడి నెల గడుస్తున్నా నిరుద్యోగుల ఊసే ఎత్తట్లేదు. నిరుద్యోగ భృతి హామీ అయితే ఇచ్చారు గానీ అమలుపై ధీమా లేకుండా చేస్తున్నారు. అసలు నిరుద్యోగ భృతి అమలు చేసే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి ఉందా? లేకుంటే ఎప్పటిలానే యూటర్న్ తీసుకుంటారా? నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను విస్మరిస్తే ఆ ప్రభావం రాష్ట్రంలోని 1.70 కోట్ల కుటుంబాలపై నేరుగా పడుతుంది.

– మేడూరి నవీన్ దాస్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లా కాలేజ్, విశాఖపట్నం

జాబ్ క్యాలెండర్ ఎప్పుడు?



ఏపీలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి. జాబ్ క్యాలెండ్ కంటే ముందు పాత నోటిఫికేషన్లను పూర్తి చేయాలి. ఈలోగా నిరుద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రతి నెలా రూ.3 వేల భృతి వెంటనే అమలు చేయాలి. దీని స్పష్టమైన తేదీలను ప్రకటించాలి.

– కొనిగపాగ అనిల్ బాబు, విజయవాడ

వీటి సంగతేంటి బాబూ?

వైఎస్సార్ రైతు భరోసా

ఈ పథకం కింద ఏటా రూ.13,500 చొప్పున గత వైఎస్ జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో సగటున ఏటా 51,13,249 మంది రైతులకు రూ.6,857.63 కోట్లు.. ఐదేళ్లలో రూ.34,288.17 కోట్లు ఇచ్చింది. కూటమి హామీ మేరకు ఏటా రూ.20 వేల చొప్పున ఎప్పుడు ఇస్తారు?

వైఎస్సార్ మత్స్యకార భరోసా

గత ప్రభుత్వం వైఎస్సార్ మత్స్యకార భరోసాను రూ.4 వేల నుంచి రూ.10 వేలకు పెంచి, ఏటా సగటున 1,07,602 మందికి రూ.107.60 కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.538.01 కోట్లు ఇచ్చింది. మీరు ఇచ్చిన హామీ మేరకు ఏటా రూ.20 వేల చొప్పున ఎప్పటి నుంచి ఇస్తారు?

వైఎస్సార్ సున్నా వడ్డీ

ఈ పథకం కింద గత ప్రభుత్వంలో ఏటా సగటున 96,70,720 మంది అక్కచెల్లెమ్మలకు రూ.1,242.26 కోట్ల చొప్పున నాలుగేళ్లలో 4,969.05 కోట్లు ఇచ్చింది. ఈ పథకం సొమ్మును మీరు ఎప్పుడు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తారు?

జగనన్న విద్యా, వసతి దీవెన

ఈ పథకం కింద (పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్), వసతి దీవెన పథకాల కింద వైఎస్ జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో సగటున 27 లక్షల మంది విద్యార్థులకు రూ.18,663.44 కోట్లు అందజేసింది. విద్యార్థులకు మీరు ఈ సాయాన్ని ఎప్పుడు అందిస్తారు?

అమ్మ ఒడి పథకం

ఈ పథకం కింద రూ.15 వేలు చొప్పున సగటున 42.62 లక్షల మంది తల్లులకు నాలుగేళ్లలో వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.26,067.28 కోట్లు ఇచ్చింది. ఒక ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంత మందికీ ఏటా రూ.15 వేల చొప్పున 'తల్లికి వందనం' కింద కోటికి పైగా పిల్లలకు మీరు ఎప్పుడు ఈ సాయం అందిస్తారు?


మరో రెండురోజులు వర్షాలు

▶ మొదటి పేజీ తరువాయి

వచ్చే రెండురోజులు రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. అనేకచోట్ల ఉరుములతో కూడిన జల్లులు పడతాయని, అక్కడక్కడా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని, పలుప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వివరించారు. ఆదివారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరులో 24 గంటల్లో 9.4 సెంటీమీటర్ల వర్షం కురిసింది. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడిలో 6 సెంటీమీటర్లు, పశ్చిమగోదావరి జిల్లా పోలవరంలో 7, కదిరిలో 4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

మానవ హక్కుల కౌన్సిల్ సేవలు ప్రశంసనీయం

- ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్
- విశాఖలో ఘనంగా కౌన్సిల్ రజతోత్సవం



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్‌ను సత్కరిస్తున్న కౌన్సిల్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): సమాజాభివృద్ధిలో మానవ హక్కుల కౌన్సిల్ సేవలు ప్రశంసనీయమని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్ చెప్పారు. విశాఖలోని ఓ హోటల్లో ఆదివారం మానవ హక్కుల కౌన్సిల్ రజతోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు వ్యభిచార రొంపిలోకి వెళ్లకుండా.. వారి హక్కులు కాపాడేలా మానవ హక్కుల కౌన్సిల్ ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పోలీస్, రెవెన్యూ, జిల్లా లీగల్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రజలు, మహిళలు, విద్యార్థులకు భరోసానిచ్చేలా ఈ కార్యక్రమాలుండాలని, ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వై.సత్యనారాయణ మాట్లాడుతూ మానవ హక్కుల కౌన్సిల్‌ను స్థాపించి పాతికేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మహిళలు, చిన్నారుల రక్షణ విషయంలో ప్రత్యేక దృష్టి సారించేలా తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. త్వరలో కౌన్సిల్ ఆధ్వర్యంలో వలంటీర్లను తయారుచేసి, వారి ఆధ్వర్యంలో గ్రామ స్థాయి నుంచి విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ మాట్లాడుతూ గత పదేళ్లుగా పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా సుమారు 6 వేల ఫిర్యాదులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తిని కౌన్సిల్ ప్రతినిధులు సత్కరించారు. కమిషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లా కాలేజీ ప్రిన్సిపాల్ సీతామహాలక్ష్మి, విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బెవరా సత్యనారాయణ, వివిధ జిల్లాల కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు తెలంగాణ బంగారు బోనం



దుర్గగుడి ఈఓ రామరావుకు బంగారు బోనం సమర్పిస్తున్న జోగిని విశాక్రాంతి తదితరులు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ భాగ్యనగర్ శ్రీ మహంకాళీ జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆదివారం బంగారు బోనం సమర్పించింది. 15 ఏళ్లుగా ఈ కమిటీ దుర్గమ్మకు బంగారు బోనం సమర్పిస్తోంది. విజయవాడ బ్రాహ్మణ వీధిలోని జమ్మిదొడ్డి ఆవరణలో రావిచెట్టు వద్ద అమ్మవారి ఉత్సవమూర్తికి కమిటీ అధ్యక్షులు గాజుల అంజయ్య, దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు దంపతులు, కమిటీ ప్రతినిధులు పూజ నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, పోతురాజు విన్యాసాలు, కళాకారుల నృత్య ప్రదర్శనల నడుమ బంగారు బోనంతో ఊరేగింపు ప్రారంభమైంది. దుర్గాఘాట్‌లో పవిత్ర కృష్ణవేణికి గంగ తెప్పను సమర్పించి ఇంద్రకీలాద్రిపై అమ్మవారి ఆలయానికి ఊరేగింపు చేరుకోగా, అక్కడ ఉత్సవ కమిటీ ప్రతినిధులకు ఈవో స్వాగతం పలికారు. కమిటీ సభ్యులు అమ్మవారిని దర్శించుకుని బంగారు బోనం, పట్టు చీర, పూలు, పండ్లు సమర్పించారు.

క్లుప్తంగా...

బాలిక ఆచూకీ కనుగొనడంలో ప్రభుత్వ వైఫల్యం

ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య మండిపాటు

సాక్షి, అమరావతి: ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం అతి దారుణమని, మైనర్ బాలిక ఆచూకి కనుగొనడంలో ప్రభుత్వం ఘోర వైఫల్యం చెందిందని ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. నంద్యాల జిల్లా ముచ్చుమరి మండలం కొత్తఎల్లాలలో వారం కిందట అదృశ్యమైన మైనర్ బాలిక ఘటనపై ప్రభుత్వం తక్షణం స్పందించాలని డిమాండ్ చేశారు. ఆ బాలికపై అత్యాచారం చేసి ఆపై హత్య చేసి ఎక్కడో చెరువులో పడేశామని నిందితులైన మైనర్ బాలురు చెప్పడం రాష్ట్రంలో సంచలనంగా మారిందన్నారు. రోజులు గడుస్తున్నా బాలిక ఆచూకీ గురించి హోం మంత్రి సైతం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఈ ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని బాలికను కొనుగొనాలని, బాలిక కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షలు పరిహారం, ఒకరికి ఉద్యోగం, 5 ఎకరాల భూమి, ఇంటి స్థలం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కాపులకు 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే

కాపు ఐక్యవేదిక డిమాండ్

సాక్షి, అమరావతి: 'కేంద్రం ఇచ్చే ఈడబ్ల్యూఎస్ 10 శాతం కోటాలో.. కాపులకు ఐదు శాతం సబ్ కోటాకు అంగీకరిస్తే మన కళ్లను మనమే పొడుచుకున్నట్లు అవుతుంది' అని కాపులకు కాపు ఐక్య వేదిక స్పష్టం చేసింది. కాపులకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ విషయంపై రాష్ట్రంలోని కాపులకు కాపు ఐక్య వేదిక బహిరంగ లేఖ రాసింది. వేదిక రాష్ట్ర చైర్మన్ రావి శ్రీనివాస్ ఆ లేఖను ఆదివారం మీడియాకు విడుదల చేశారు. రిజర్వేషన్ల విషయంలో కనీస అవగాహన లేని రాజకీయ నిరుద్యోగుల మాటలు నమ్మి మరోసారి కాపులు మోసపోవద్దని సూచించారు. మహారాష్ట్రలో మరాఠాలకు ఇచ్చిన మాదిరిగా ఏపీలోని కాపులకు పది శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం.. కాపులకు పది శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. కాపులకు రిజర్వేషన్లు ఇస్తారో? లేదో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పదోన్నతులు కల్పించండి

మహిళా శిశు సంక్షేమ శాఖ సంచాలకులకు అసోసియేషన్ వినతి

సాక్షి, అమరావతి: మహిళా శిశు సంక్షేమ శాఖలో పనిచేస్తున్న అన్ని తరగతుల ఉద్యోగులకు వారి అర్హతను బట్టి వెంటనే పదోన్నతులు, రీ పోస్టింగ్‌లు, సెలవుల మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఎంప్లాయీస్ ఆఫ్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ సంచాలకులకు ఇచ్చిన వినతిపత్రాన్ని అసోసియేషన్ అధ్యక్షుడు డి.శ్రీకాంత్‌రాజు ఆదివారం మీడియాకు విడుదల చేశారు. రాష్ట్రంలోని నాలుగు జోన్‌ల పరిధిలో అనేక మంది అర్హత కలిగిన ఉద్యోగులు పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఇటీవల ఒంగోలు, విశాఖపట్నం జోన్‌లలో జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్‌లకు పదోన్నతి కల్పించారన్నారు. కర్నూల్ జోన్ పరిధిలో పదోన్నతులు కల్పించలేదన్నారు. నెలల తరబడి ఆర్జేడీ కార్యాలయానికి తిరుగుతున్నా కుంటిసాకులతో కాలయాపన చేస్తున్నారని, ఇటువంటి పరిస్థితిని చక్కదిద్ది ఉద్యోగులు, సిబ్బందికి న్యాయం చేయాలని శ్రీకాంత్‌రాజు కోరారు.

నేడు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలపనున్న జూడాలు

సాక్షి, అమరావతి: విజయవాడ జీజీహెచ్‌లో జూనియర్ డాక్టర్‌లపై జరిగిన దాడికి నిరసనగా సోమవారం నుంచి చేపట్టాల్సిన సమ్మె నిర్ణయాన్ని విరమించామనీ, అయితే నల్ల బ్యాడ్జీలతో రాష్ట్రవ్యాప్తంగా విధులకు హాజరవ్వాలని ఏపీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దక్షిత్ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. తమపై దాడులు జరగకుండా రక్షణతో పాటు, దాడి ఘటనల్లో బాధ్యులపై చర్యలు తీసుకునేలా జీవో రూపంలో హామీని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇదే అంశంపై డీఎంఈతో మరో మారు సమావేశమవుతున్నామన్నారు. అనంతరం సమ్మెపై నిర్ణయం ప్రకటిస్తామన్నారు.


మెట్రోకు మళ్లీ మోకాలడ్డు!

వైజాగ్ మెట్రో ప్రాజెక్టును నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుయుక్తులు

మరోసారి డీపీఆర్ తయారీకి సీఎం చంద్రబాబు ఆదేశాలు

విశాఖపట్నం వాసులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మెట్రోపై మళ్లీ చంద్రబాబు నీలినీడలు కమ్ముకుంటున్నాయి. అభివృద్ధి అంతా ఒక్కచోటకే పరిమితం చేసేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ఆలోచనలు విశాఖ నగరాభివృద్ధికి ఆటంకంగా నిలుస్తున్నాయి. ముందు అమరావతికి మెట్రో రైలు వచ్చేవరకు రాష్ట్రంలో ఇంకెక్కడా మెట్రో ఉండకూడదన్న లక్ష్యంతో చంద్రబాబు ప్రభుత్వం అడుగులేస్తోంది. ఇందులో భాగంగానే వైజాగ్ మెట్రో ప్రాజెక్టు పనులకు అంతా సిద్ధమవుతున్న సమయంలో.. వాటిని మరింత ఆలస్యం చేసేందుకు మళ్లీ మొదటికి తీసుకొస్తోంది. ఇప్పటికే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి పంపింది. అయితే దీన్ని రద్దు చేసి కొత్త డీపీఆర్‌ను సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు మెట్రో అధికారులకు ఆదేశాలు జారీ చేయడం ఇందుకు నిదర్శనమని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

– సాక్షి, విశాఖపట్నం



వైజాగ్ మెట్రో స్వరూపం ఇదీ..

- మొత్తం 4 కారిడార్లు.. 76.90 కి.మీ.. 54 స్టేషన్లు)
- తొలి రైలు తిరిగే సమయం పనులు: ప్రారంభించిన 3 ఏళ్ల లోపు
- ప్రాజెక్టు పూర్తి చేసేందుకు సమయం: 8 ఏళ్లు
- మొత్తం ఖర్చు రూ.14,309 కోట్లు
- ఇందులో తొలి దశలో 3 కారిడార్ల అంచనా వ్యయం రూ. 9,699 కోట్లు
- రెండో దశలో 4వ కారిడార్ అంచనా వ్యయం రూ.4,610 కోట్లు
- ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా.. రూ.5,723.6 కోట్లు
- ప్రైవేట్ నిర్మాణ సంస్థ వాటా.. రూ.8,585.4 కోట్లు



చంద్రబాబుకి నచ్చలేదట..

రాష్ట్రంలోనే అతిపెద్ద నగరంగా, రాష్ట్ర ఆర్థిక రాజధానిగా ఉన్న విశాఖపట్నాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వం ముందడుగు వేసింది. లైట్ మెట్రో ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేసింది. 76 కిలోమీటర్ల మేర నాలుగు కారిడార్లతో నిర్మించనున్న తొలి విడత ప్రాజెక్టుకు రూ.14,309 కోట్లు వ్యయం అవుతుందని పేర్కొంటూ గతేడాది డిసెంబర్ 29న ఉత్తర్వులు సైతం జారీ చేసింది. పబ్లిక్ – ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో చేపట్టబోయే ఈ ప్రాజెక్టులో ప్రభుత్వాల వాటా 40 శాతం కాగా, టెండరు దక్కించుకున్న సంస్థ 60 శాతం భరించనున్నట్లు ఉత్తర్వుల్లో పొందుపరిచింది. జనవరిలో కేంద్ర ప్రభుత్వానికి డీపీఆర్‌ని కూడా పంపింది. అయితే.. కూటమి ప్రభుత్వం రావడంతో ఆలస్యం, అలసత్వం చోటు చేసుకుంటున్నాయి. విశాఖ అభివృద్ధి తమకు ఇష్టం లేదన్నట్టు చంద్రబాబు వ్యవహరిస్తున్నారు. ఇటీవల విశాఖలో పర్యటించిన ఆయన మెట్రో అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలోనే పూర్తిస్థాయిలో మెట్రో డీపీఆర్ తయారు చేసినట్లు వివరించినా.. తనకు ఆ డీపీఆర్ నచ్చలేదని చంద్రబాబు చెప్పేశారు. మళ్లీ కొత్తగా డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ)తో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

ఇలాగైతే మోక్షమెప్పుడో..

జాతీయ రహదారుల నిర్మాణాల్లో తలమునకలైన ఎన్‌హెచ్‌ఏఐతో కలిసి మెట్రో డీపీఆర్ రూపొందించడం అనేది అంతులేని కథగా మారనుందని అధికారులు భావిస్తున్నారు. ఆలస్యం, అలసత్వంతో వైజాగ్‌కు మెట్రో రాకుండా చేసేందుకే చంద్రబాబు ఈ తరహా ఆదేశాలు జారీ చేశారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముందు గన్నవరం నుంచి అమరావతి వరకు మెట్రో రైలు నిర్మించడమే చంద్రబాబు లక్ష్యమని తెలుస్తోంది. అది పూర్తయ్యే వరకూ రాష్ట్రంలో ఎక్కడా మెట్రో మాటే లేకుండా కుయుక్తులు పన్నుతున్నట్లు సమాచారం. కొత్త డీపీఆర్ తయారీకి.. ఏడాది సమయం పట్టే అవకాశం ఉంది. దానిలో మార్పులు చేర్పులు అంటూ మెలికపెడితే.. మరో ఆరు నెలలు గడిచిపోతుంది. దాన్ని కేబినెట్ ఆమోదించి.. కేంద్రానికి పంపించేందుకు మరో 6 నెలలు.. కేంద్రం ఆమోదించేందుకు మరో ఏడాది.. ఇలా.. ఈ ఐదేళ్లు విశాఖ మెట్రో ప్రాజెక్టు కాగితాల్లోనే కునారిల్లేలా చేయడమే చంద్రబాబు ఉద్దేశమని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఏదో వంక.. అటకెక్కించడం పక్కా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైజాగ్ మెట్రో ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు వడివడిగా అడుగులు వేసింది. విశాఖపట్నం భవిష్యత్తు అవసరాలు, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా.. మొత్తం 76.90 కి.మీ మేర లైట్‌మెట్రో ప్రాజెక్టుకు డీపీఆర్‌ను అధికారులు సిద్ధం చేశారు. దీన్ని కేబినెట్ కూడా ఆమోదించింది. పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం(పీపీపీ)–వయబిలిటీ గ్యాప్ ఫండింగ్(వీజీఎఫ్) విధానంలో మెట్రో నిర్మించడానికి గత ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీ చేసింది. మొత్తం ప్రాజెక్టు విలువ రూ.14,309 కోట్లు అవుతుందని.. ఇందులో ప్రభుత్వాలు రూ.5,723.6 కోట్లు భరించాల్సి ఉండగా ప్రైవేట్ డెవలపర్.. వీజీఎఫ్ కింద రూ.8,585.4 కోట్లు భరిస్తూ పనులు ప్రారంభించాలని నిర్ణయించింది. ప్రాజెక్టు టెండర్లు ఖరారైనప్పటి నుంచి మూడేళ్లకే తొలి మార్గంలో ప్రయాణికులకు మెట్రో సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కృతనిశ్చయంతో అడుగులు వేసింది. భవిష్యత్తులో విశాఖలో నిర్మించే ఫ్లైఓవర్లను కూడా దృష్టిలో పెట్టుకొని డీపీఆర్ డిజైన్లు సిద్ధం చేశారు. అయితే చంద్రబాబు.. మెట్రో ఫ్లైఓవర్ల ఎత్తు, వెడల్పులు సరిగా లేవని.. అందులో మార్పులు చేయాలని సూచించడం గమనార్హం. మెట్రో పిల్లర్ల ఎత్తు ఎలా పెంచాలి? ఏ ప్రాంతంలో ఫ్లైఓవర్ పొడవుగా ఉండాలి.. ఎక్కడ వెడల్పు తక్కువగా ఉండాలో నిపుణులకు క్లాస్ తీసుకున్నట్లు సమాచారం. ఇలా.. ఏదో ఒక వంకతో.. వైజాగ్ మెట్రో ప్రాజెక్టుని నెమ్మదిగా అటకెక్కించేందుకు కూటమి ప్రభుత్వం కుయుక్తులకు పాల్పడుతోంది. దేశంలోనే శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఒకటైన విశాఖని వెనక్కి నెట్టేందుకు కుట్రలు పన్నడంపై నగర ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జీపీఎస్ గెజిట్‌ను ఉపసంహరించుకోవాలి



రాజపత్ర నోటిఫికేషన్‌ను దహనం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు



భీమవరంలో జీఓ ప్రతులను దహనం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

- పాత తేదీలతో రాజపత్రం జారీ దుర్మార్గం
- ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలను విస్మరించడం తగదు
- రాష్ట్ర ప్రభుత్వంపై యూటీఎఫ్ నేతల మండిపాటు.. గెజిట్ కాపీలు దహనం

అనకాపల్లి/భీమవరం: గ్యారంటీడ్ పెన్షన్ స్కీం (జీపీఎస్) అమలుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీచేయడంపై ఉపాధ్యాయ సంఘాలు ఆదివారం కూడా ఆందోళన బాటపట్టాయి. రాజపత్రాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పాత పెన్షన్ విధానాన్ని అమలుచేస్తుందని ఆశించామని.. కానీ, మా ఆశలను వమ్ముచేస్తూ జీపీఎస్‌కు చట్టబద్ధత తెచ్చి గెజిట్ నోటిఫికేషన్ జారీచేయడం చాలా అన్యాయమంటూ ఆదివారం అనకాపల్లిలోని సీఐటీయూ కార్యాలయం వద్ద యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వత్సవాయి శ్రీలక్ష్మి, గొంది చిన బ్బాయిలు విమర్శించారు. గెజిట్ కాపీలను దగ్ధంచేశారు. పైగా.. జీపీఎస్ విధానాన్ని అమలుచేస్తూ పాత తేదీలతో రాజపత్రాన్ని విడుదల చేయడం దుర్మార్గమని చెప్పారు. జీపీఎస్ కంటే మెరుగైన విధానాన్ని అమలుచేస్తామని పవన్‌కళ్యాణ్, నారా లోకేశ్‌లు కూడా హామీ ఇచ్చారని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకుని, పాత పెన్షన్ విధానం అమలుకు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎల్లయ్యబాబు, ఎంవీ అప్పారావు, జిల్లా కార్యదర్శి శేషుబాబు, కోశాధికారి జోగా రాజేష్, మున్సిపల్ ఉపాధ్యాయుల నాయకులు సతీష్, మోడల్ స్కూల్ నాయకులు ఆశాలత, ఏపీసీపీఎస్ఈఏ నాయకులు ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మరోవైపు, ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీవన్మరణ సమస్యగా ఉన్న కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలుచేస్తుందని భావించామని.. కానీ, అందుకు విరుద్ధంగా కొత్త ప్రభుత్వం జీపీఎస్‌పై గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడం చాలా అన్యాయమని యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి, జిల్లా అధ్యక్షుడు పీఎస్ విజయరామరాజు అన్నారు. భీమవరంలో ఆదివారం వారు జీఓ కాపీలను దగ్ధం చేశారు. కొలువుదీరిన నెలలోపు ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలను అమలుచేయడం దేనికి సంకేతమని వారు ప్రశ్నించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సీహెచ్ పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు సీహెచ్ కుమారబాబ్జి, డి. ఏసుబాబు, ఎస్.రత్నరాజు, జి. రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

'గంటా' ఆస్తుల వేలం!



▶ మొదటి పేజీ తరువాయి

తాజాగా ప్రకటించింది. గంటా రుణాల ఎగవేత కేసులకు సంబంధించిన వివరాలు ఏమిటంటే..

విశాఖపట్నం వన్‌టౌన్‌లోని లక్ష్మీటాకీస్ వద్ద ప్రత్యూష రిసోర్సెస్ అండ్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో మాన్యుఫ్యాక్చరింగ్, మిషనరీ అండ్ ఎక్విప్‌మెంట్ కార్యకలాపాల కోసం రిజిస్ట్రేషన్ నం.047165తో 2005 ఆగస్టు 18న రిజిస్టర్ అయ్యింది. రూ.500 కోట్ల ఆథరైజ్డ్ క్యాపిటల్, రూ.240.671 కోట్ల పెయిడ్ అప్ కాపిటల్‌తో ఈ సంస్థ ఏర్పడింది. కంపెనీలో యాక్టివ్ డైరెక్టర్లుగా గంటా తోడల్లుడైన పరుచూరి వెంకట భాస్కరరావు, ఆయన సోదరులు రాజారావు, వెంకయ్య, ప్రభాకరరావు ఉన్నారు. ఈ కంపెనీకి భీమిలి టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో పాటు కొండయ్య, బాలసుబ్రహ్మణ్యం, నార్నే అమూల్యలు హామీదారులుగా ఉన్నారు. కంపెనీ విస్తరణ పేరుతో దాబా గార్డెన్స్ శారదా వీధిలో ఉన్న ఇండియన్ బ్యాంకు నుంచి రుణాలు పొందారు. ఇవి పొందినప్పటి నుంచి ఒక్క వాయిదా కూడా చెల్లించలేదు. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరి 29 నాటికి ఒక దఫా తీసుకున్న రుణం తాలూకా బకాయిలు అక్షరాలా రూ.390.58 కోట్లుగా బ్యాంకు అధికారులు లెక్కగట్టారు. మరో దఫా రుణానికి సంబంధించి వడ్డీతో కలిసి రూ.141.68 కోట్లు బకాయిలుగా పేరుకుపోయాయని ఇండియన్ బ్యాంకు జారీచేసిన నోటీసుల్లో పేర్కొంది.

నోటీసులిచ్చినా బేఖాతరు.. ఆస్తుల స్వాధీనం..

ఈ నేపథ్యంలో.. 2016 అక్టోబరు 4 నుంచి పలు దఫాలుగా బ్యాంకు అధికారులు నోటీసులు జారీ చేసి వడ్డీతో సహా కలిపి బకాయిలు చెల్లించాలని కోరారు. అయినాసరే ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం.. మరోపక్క గడువు ముగియడంతో బ్యాంకు ఆస్తులు స్వాధీనం చేసుకోవడం మొదలుపెట్టింది. అయినప్పటికీ గంటా ముందుకు రాకపోవడం.. బకాయిలు చెల్లించకపోవడంతో మరోసారి ఏడు స్లాట్స్‌లో పూచీకత్తుగా పెట్టిన మరికొన్ని స్థలాల్ని స్వాధీనం చేసుకుంటున్నట్లు ఈ ఏడాది మార్చి 18న బ్యాంకు నోటీసులు జారీచేసింది. ప్రత్యూష కంపెనీకి చెందిన ఆస్తులు, కంపెనీ డైరెక్టర్లయిన పరుచూరి వెంకట భాస్కరరావు, రాజారావు, వెంకయ్య ప్రభాకరరావుల ఆస్తులతో పాటుగా కంపెనీకి హామీదారులుగా ఉన్న మంత్రి గంటా శ్రీనివాసరావు, కేబీ సుబ్రహ్మణ్యం, అమూల్య ఆస్తులను కూడా స్వాధీనం చేసుకోవడంతో పాటు మరికొన్ని ఆస్తుల వేలం వేస్తున్నట్లు బ్యాంకు ప్రకటన జారీచేసింది. కాగా, గతంలోనే బ్యాంకు కొన్ని ఆస్తులను వేలం వేయగా.. ఇప్పుడు రూ.390 కోట్ల రికవరీకి బ్యాంకు మరిన్ని ఆస్తుల వేలం ప్రకటన జారీచేసింది.

నిజానికి.. పోర్టులో వ్యాపార లావాదేవీల కోసం ఎమ్మెల్యే గంటా స్వయంగా తన బంధువులతో కలిసి ఈ కంపెనీ ప్రారంభించారని.. మొదట్లో గంటా కూడా డైరెక్టర్‌గా కొంతకాలం కొనసాగారని తెలుస్తోంది. ఈ కంపెనీకే జిల్లా గ్రంథాలయ సంస్థ నిర్మాణ బాధ్యతలను అప్పగించగా.. వ్యతిరేకత వ్యక్తంకావడంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఈ నేపథ్యంలో.. గంటా శ్రీనివాసరావుతో పాటు ఆయన బంధువుల ఆస్తుల్ని వేలం వేస్తున్నట్లు బ్యాంకు ప్రకటించడం చర్చనీయాంశమవుతోంది.

ఆగస్టు 8న ఈ-వేలం..

ఈ ప్రకటనలో.. పద్మనాభం మండలం ఐనద గ్రామం వద్ద ఉన్న సర్వేనెం.12లో వీరికి స్టార్ విలేజ్ పేరున వుడా లేఅవుట్‌లోని 5,326.54 చ.గజాల విస్తీర్ణంలో ఏడు స్లాట్స్‌లో ఉన్న 33 ప్లాట్లను స్వాధీనం చేసుకుంటున్నట్లు నోటీసుల్లో స్పష్టంచేసింది. వీటి విషయంలో ఎలాంటి లావాదేవీలు జరపడానికి వీల్లేదని, బ్యాంకు హెచ్చరిక జారీచేసింది. అదేవిధంగా రూ.390.58 కోట్ల బకాయిలు రాబట్టుకునేందుకు గతంలో స్వాధీనం చేసుకున్న స్థిరాస్తుల విక్రయానికి కూడా మార్చి 18న బ్యాంకు మరోసారి నోటీసులు జారీచేసింది. దీనికి సంబంధించిన వేలం ప్రక్రియ కూడా నిర్వహిస్తున్నట్లు పత్రికల్లో శనివారం ఇండియన్ బ్యాంకు ప్రకటనలిచ్చింది. మెస్సర్స్ ప్రత్యూష అసోసియేట్స్ పేరుతో నగరంలోని గంగులవారి వీధిలో ఉన్న 274.65 చ.గజాల వాణిజ్య భవనం వేలం వేస్తున్నట్లు ప్రకటించింది. దీనికి రిజర్వ్ ధరగా రూ.2.56 కోట్లుగా నిర్ణయించింది. దీంతో పాటు ద్వారకానగర్‌లోని అదే సంస్థ పేరుతో శ్రీశాంత కాంప్లెక్స్‌లో ఉన్న ఫ్లాట్ నం.138సీ లోని 2,500 చ.గజాల విస్తీర్ణంగల రెండు ఫ్లాట్లను వేలం వేస్తున్నట్లు ప్రకటించారు. వీటికి రిజర్వ్ ధరగా 1.26 కోట్లుగా నిర్ణయించారు. ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా.. ప్రాతిపదికన వేలంలో విక్రయిస్తామని బ్యాంకు వెల్లడించింది. ఆగస్టు 8వ తేదీన గంటా అండ్ కో ఆస్తుల ఈ–వేలం పాట జరుగుతుందని ఇండియన్ బ్యాంకు పేర్కొంది.

ఇంత ఘోరంగా మోసం చేస్తారా?

కూటమి ప్రభుత్వంపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం

- జీపీఎస్ గెజిట్ రద్దు చేసి.. పాత పెన్షన్ విధానం తేవాలని డిమాండ్
- లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరిక
- 16, 17 తేదీల్లో నిరసన ప్రదర్శనలు చేయనున్నట్లు ఏపీటీఎఫ్ వెల్లడి

సాక్షి, అమరావతి/నూజివీడు/సత్తెనపల్లి

కూటమి ప్రభుత్వం గ్యారెంటీడ్ పెన్షన్ స్కీం (జీపీఎస్) గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. కూటమి పార్టీలు మాట తప్పి తమను నిలువునా మోసం చేశాయని మండిపడ్డాయి. వెంటనే గెజిట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశాయి. పాత పెన్షన్ విధానం తీసుకురావాలని.. ఎన్నికల హామీలను నెరవేర్చాలని తేల్చి చెప్పాయి. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించాయి.

ఇది దుర్మార్గం: ఎస్‌జీటీఎఫ్

ఎన్నికల ప్రచారంలో జీపీఎస్ దుర్మార్గమని ప్రచారం చేసి.. ఇప్పుడు ఇంత అంతకంటే దుర్మార్గంగా వ్యవహరిస్తారా? అని కూటమి ప్రభుత్వంపై సెకండరీ గ్రేడ్ టీచర్స్ ఫెడరేషన్(ఎస్‌జీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొక్కెరగడ్డ సత్యం ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల పోరాటాల ఫలితంగా గత ప్రభుత్వం జీపీఎస్‌పై ముందుకు వెళ్లలేదన్నారు. కూటమి పార్టీలు తాము అధికారంలోకి వస్తే ఉద్యోగులకు సరైన పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చాయన్నారు. కానీ ఇప్పుడు ఏకపక్షంగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసి.. ఉద్యోగులను, ఉపాధ్యాయులను మోసం చేశాయని మండిపడ్డారు.



కొక్కెరగడ్డ సత్యం



గార్లపాటి సునీల్‌బాబు

మాట తప్పడం అన్యాయం: సీపీఎస్ ఉద్యోగుల సంఘం

టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సీపీఎస్, జీపీఎస్‌పై సమీక్ష జరిపి ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపుతామంటూ మేనిఫెస్టోలో హామీ ఇచ్చారని.. కానీ ఇప్పుడు ఎలాంటి సమీక్ష లేకుండా గెజిట్ జారీ చేశారని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు గార్లపాటి సునీల్ మండిపడ్డారు. ఇలా మాట తప్పడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ తీరును ఖండించారు. గెజిట్ రద్దు చేయకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ఉద్యోగుల సహనాన్ని పరీక్షించొద్దు: ఆప్టా

ఉద్యోగుల మనోభావాలకు వ్యతిరేకంగా ఉన్న జీపీఎస్‌ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం(ఆప్టా) డిమాండ్ చేసింది. ఉద్యోగుల సహనాన్ని పరీక్షించొద్దని ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరావు, ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రావు ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఉద్యోగుల్లో అశాంతి ఏర్పడక ముందే గెజిట్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మేం కోరుకున్నది ఓపీఎస్: బీటీఏ

కూటమి ప్రభుత్వం ఉద్యోగులను మోసం చేసిందని ప్రభుత్వంపై బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.మనోజ్ కుమార్, సీహెచ్.రమేశ్ మండిపడ్డారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు కోరుకున్నది పాత పెన్షన్ స్కీం(ఓపీఎస్) మాత్రమేనన్నారు. ఎన్నికలప్పుడు ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆకాంక్షలను నెరవేరుస్తామని చెప్పిన కూటమి పార్టీలు.. అధికారంలోకి వచ్చాక జీపీఎస్ గెజిట్ జారీ ద్వారా ముంచేసిందని మండిపడ్డారు.

పాత పెన్షన్ విధానమే కావాలి: పీఆర్టీయూ ఏపీ

పాత పెన్షన్ విధానమే కావాలని.. జీపీఎస్ గెజిట్‌ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్(పీఆర్టీయూ–ఏపీ) రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా క్రిష్ణయ్య డిమాండ్ చేశారు. వెంటనే ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని.. సమస్యలను పరిష్కరించాలన్నారు. 2023 జూలై నుంచి నూతన పీఆర్సీ అమలు చేయాలని, అంతవరకు ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, యూనియన్ గౌరవాధ్యక్షుడు భైరి అప్పారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ వి.కరుణానిధిమూర్తి, పత్రికా సంపాదకులు గద్ద నారాయణ, సీపీఎస్ కన్వీనర్ గుజ్జల తిరుపాల్ పాల్గొన్నారు.

16, 17 తేదీల్లో నిరసన: ఏపీటీఎఫ్

జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని.. 2004లోపు నోటిఫికేషన్ ద్వారా నియామకమైన టీచర్లు, పోలీసులు, ఉద్యోగులకు ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్న డిమాండ్‌తో అన్ని జిల్లా కేంద్రాల్లో ఈనెల 16, 17 తేదీల్లో నిరసన ప్రదర్శనలు చేయనున్నట్టు ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి తెలిపారు. అలాగే బాలికలపై అత్యాచారాలను అరికట్టే విధంగా పాఠ్యాంశాల్లో మార్పులు చేయాలన్నారు. బోధన, పరీక్షల నిర్వహణ ఏ మీడియంలో నిర్వహించాలన్న దానిపై విద్యా శాఖ మంత్రి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ ప్రక్రియ మొదలుపెట్టాలని, ఆలోగా 30 శాతం మధ్యంతర భృతి విడుదల చేయాలన్నారు.



నేను కణాల విశ్వాన్ని, విశ్వంలో కణాన్ని.
– రిచర్డ్ పి. ఫెయిన్‌మాన్

సాక్షి
సోమవారం, 15 జూలై 2024

ముసుగు మనుషులు

‘సుగుణం మేలిముసుగు, దుర్గుణం దొంగముసుగు’ అన్నాడు ఫ్రెంచ్ రచయిత, రాజనీతిజ్ఞుడు విక్టర్ హ్యూగో. ‘కరోనా’ కాలంలో మనుషులందరికీ ముసుగులు అనివార్యంగా మారాయి. మహమ్మారి కాలంలో మూతిని, ముక్కును కప్పి ఉంచే ముసుగులు లేకుంటే మాయదారి మహమ్మారి రోగం మరెందరిని మట్టుబెట్టేదో! ముసుగులు పలు రకాలు. అన్నింటినీ ఒకే గాటన కట్టేయలేం. పిడుక్కీ బియ్యానికీ ఒకటే మంత్రం కుదరదు కదా! అనివార్యంగా ధరించే ముసుగులు కొన్ని, మతాచారాల కారణంగా ధరించే ముసుగులు ఇంకొన్ని– ఇవి ప్రమాదకరమైన ముసుగులు కాదు. ఇలాంటి ముసుగుల చాటున ఉన్న మనుషులను గుర్తించడమూ అంత కష్టం కాదు.

అయితే, వచ్చే చిక్కంతా దేవతా వస్త్రాల్లాంటి ముసుగులతో మన మధ్య తిరుగుతుండే మనుషులతోనే! కనిపించని ముసుగులు ధరించే మనుషుల బతుకుల్లో లెక్కలేనన్ని లొసుగులు ఉంటాయి. వాటిని దాచుకోవడానికే ముఖాలకు దేవతావస్త్రాల ముసుగులను ధరిస్తుంటారు. అలాంటివారు మన మధ్య ఉంటూ, మనతోనే సంచరిస్తుంటారు. మనం పనిచేసే కార్యాలయాల్లో, మనం నివసించే కాలనీల్లో ఉంటారు. ముసుగులకు చిరునవ్వులు అతికించుకుని మనల్ని పలకరిస్తుంటారు కూడా! వాళ్లను ముసుగులతో తప్ప ముఖాలతో గుర్తుపట్టలేని పరిస్థితికి చేరుకుంటాం. వాళ్ల అసలు ముఖాలను పోల్చుకునే సరికి కనిపించని ఊబిలో కూరుకుపోయి ఉంటాం.

గాంభీర్యం చాలా గొప్పగా ఉంటుంది గాని, చాలా సందర్భాల్లో అది పిరికిపందలు ధరించే ముసుగు. అలాగే, పలు సందర్భాల్లో భూతదయా ప్రదర్శనలు క్రౌర్యానికి ముసుగు; బహిరంగ వితరణ విన్యాసాలు లుబ్ధబుద్ధులకు ముసుగు; నిరంతర నీతి ప్రవచనాలు అలవిమాలిన అవినీతి పనులకు ముసుగు; సర్వసంగ పరిత్యాగ వేషాలు సంపన్న వైభోగాలకు ముసుగు– ఇలా చెప్పుకుంటూ పోతే ముసుగుల జాబితా కొండవీటి చేంతాడు కంటే పొడవుగా తయారవుతుంది.

‘ఒక్క బంగారు ముసుగు అన్ని వైకల్యాలనూ కప్పిపుచ్చుతుంది’ అన్నాడు ఇంగ్లిష్ నాటక రచయిత థామస్ డెకర్. బంగారు ముసుగులు తొడుక్కోవడం అందరికీ సాధ్యమయ్యే పని కాదు. అందుకని తెలివిమంతులు దేవతా వస్త్రాల ముసుగులలో తమ తమ లొసుగులను కప్పిపుచ్చుకుంటూ, నిక్షేపంగా సమాజంలో పెద్దమనుషులుగా చలామణీ అయిపోతుంటారు. ఇలాంటి పెద్దమనుషుల అసలు ముఖాలేవో గుర్తించడం దుస్సాధ్యం. ముసుగుల మాటునున్న ముఖాలను గుర్తించేలోపే అమాయకులు కాటుకు గురైపోతారు. సాధారణంగా ముసుగులు నాటకాది ప్రదర్శనల వేషధారణలో భాగంగా ఉంటాయి. ఇటీవలి కాలంలో ముసుగులూ వేషాలూ దైనందిన జీవితంలో నిత్యకృత్యాలుగా మారిపోయాయి.

అతి వినయం ధూర్త లక్షణానికి ముసుగు. ‘వదనం పద్మదళాకారం వచశ్చందన శీతలం/ హృదయం కర్తరీ తుల్యం, అతి వినయం ధూర్త లక్షణం’ అని మనకో సుభాషిత శ్లోకం ఉంది. అలాగే, ‘జటిలో ముండీ లుంఛిత కేశః/ కాషాయాంబర బహుకృత వేష/ పశ్యన్నిపిచ న పశ్యతి మూఢో/ ఉదర నిమిత్తం బహుకృత వేషం’ అన్నాడు ఆదిశంకరుడు. పైన ఉదహరించిన సుభాషిత శ్లోకాన్ని, ఆదిశంకరుడి శ్లోకాన్ని గమనిస్తే, ముసుగులూ వేషాలూ ఆనాటి నుంచే ఉన్నట్లు అర్థమవుతుంది. కాకుంటే, అప్పటివి సత్తెకాలపు ముసుగులు. అతి తెలివిని ప్రదర్శించబోయిన అమాయకపు వేషాలు. ప్రధానంగా వాటి ప్రయోజనం ఉదర నిమిత్తానికే పరిమితమై ఉండేది. కేవలం ఉదర నిమిత్తం వేసుకునే ముసుగులూ వేషాల వల్ల ఎంతో కొంత వినోదమే తప్ప సమాజానికి పెద్దగా చేటు ఏమీ ఉండదు. అయినా, ఆనాటి సమాజంలోని ప్రాజ్ఞులు ముసుగులనూ, వేషాలనూ నిరసించేవారు. అలాంటివారి నిరసనల వల్ల ముసుగులూ వేషాలూ శ్రుతి మించకుండా ఉండేవి.

అప్పట్లో ముసుగులకూ వేషాలకూ పెద్దగా ప్రచారం ఉండేది కాదు. అంతగా జనాదరణ ఉండేది కాదు. సినిమాలు వచ్చాక చిత్రవిచిత్ర వేషాలకు ప్రచారమూ పెరిగింది. నాటకాలు, సినిమాలు మాత్రమే వినోద సాధనాలుగా ఉన్న కాలంలో నటీనటులు మాత్రమే పాత్రోచిత వేషాలు వేసేవారు. సమాజంలో పెద్దమనుషుల ముసుగులో ఉండే వేషధారులు అక్కడక్కడా మాత్రమే ఉండేవారు. ఇక స్మార్ట్‌ఫోన్లు చేతిలోకి వచ్చాక మనుషులంతా వేషధారులుగా మారిపోయిన పరిస్థితి దాపురించింది. కృత్రిమ మేధ తోడయ్యాక మనుషుల అసలు ముఖాలను పోల్చుకోవడమే కష్టమయ్యే పరిస్థితి వాటిల్లింది. ఇప్పుడు నటీనటులే కాదు, వారికి పోటీగా దేశాధినేతలు కూడా యథాశక్తిగా దేవతావస్త్రాల ముసుగులను తొడుక్కుని, రకరకాల వేషాలతో నవరసాభినయ చాతుర్యంతో జనాలను విస్మయంలో ముంచెత్తుతున్నారు.

‘స్మార్ట్’ వేషాల సంగతి ఒక ఎత్తయితే, ఇప్పుడు చైనాలో సిలికాన్ ముసుగులు అందుబాటులోకి వచ్చాయి. ఇవి అలాంటిలాంటివి కావు, అల్ట్రా రియలిస్టిక్ ముసుగులు. ఒక నలభయ్యేళ్ల వ్యక్తి ఒక వృద్ధుడి ముఖాన్ని పోలిన సిలికాన్ ముసుగు వేసుకుని నేరాలకు పాల్పడిన సంగతి బయటపడటంతో కలకలం మొదలైంది. సిలికాన్ ముసుగుల చట్టబద్ధతపై కూడా చర్చ మొదలైంది. అయినా, ఎంత సిలికాన్ ముసుగులైతే మాత్రం అవేమైనా దేవతా వస్త్రాల ముసుగులా? అసలు ముఖాలను ఎంతకాలం దాచగలవు పాపం?!

అంబేడ్కర్ ఆలోచనల్ని ప్రతిఫలిస్తాయా?

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

నూతనంగా ఏర్పడిన ఎన్డీఏ 3.0 ప్రభుత్వం 2024–25కి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి సమాయత్తమవుతోంది. దీనిమీద అందరిలోనూ ఆసక్తి నెలకొని వుంది. అణగారిన సామాజిక వర్గాలు అభివృద్ధి చెందితేనే ప్రపంచ వ్యాప్తమైన ఆర్థికాభివృద్ధిలో భారతదేశం భాగస్వామ్యం కాగలుగుతుందని అంబేడ్కర్ ఏనాడో చెప్పారు. షెడ్యూల్డ్ కులాల ఆర్థిక విమోచన జరగాలంటే, వారికి భూములను పంచే ముఖ్య విషయం మీద ప్రభుత్వం దృష్టి పెట్టాలని కూడా అంబేడ్కర్ సూచించారు. దానికి బడ్జెట్‌లో ప్రాధాన్యమివ్వాలి. కుల నిర్మూలనకు, స్త్రీ సాధికారతకు, వ్యవసాయ కూలీలను వ్యవసాయదారులుగా మలిచేందుకు బడ్జెట్ కేటాయింపులు జరగాలి. బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేసేలా, కొత్త ఉద్యోగాలు కల్పించేలా బడ్జెట్ కేటాయింపులు జరపాలి.

2024–25 సంవత్సరానికి కేంద్రంలోని నూతన ఎన్డీఏ ప్రభుత్వం జూలై 22, 23 తేదీల్లో బడ్జెట్ ప్రవేశపెడుతున్న సందర్భంగా దళితుల్లోనూ, స్త్రీలలోనూ, ఆదివాసీలలోనూ కొత్త ఆశలు కలుగుతున్నాయి. మొత్తం పార్లమెంట్‌లో 111 మంది దళిత ఎంపీలు ఉన్నారు. అస్పృశ్యతా నిర్మూలనకు, కుల నిర్మూలనకు, స్త్రీ సాధికారతకు, వ్యవసాయ కూలీలను వ్యవసాయదారులుగా మలిచే అంశాల పట్ల దేశంలో ఎంతో ఆసక్తి నెలకొనివుంది.



ఈ క్రమంలో ముఖ్యంగా స్త్రీ సాధికారత భారతదేశంలో చాలా అవసరంగా కనిపిస్తుంది. పురుషుల సంఖ్యతో దాదాపు సమానంగా ఉన్న స్త్రీలలో 20 కోట్ల మందికి పనిలేదు. ముఖ్యంగా దళిత స్త్రీలకు సొంత భూమి లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగించే విషయం. భూమి చరిత్ర చూస్తే భూస్వామ్య ఆధిపత్య కులాలకే భూమి ఉంది. భూమి ఉత్పాదకతపై వారికి పూర్తి అవగాహన ఉండేది. సమాజంలో వారు బలమైన వర్గంగా వ్యవహరించేవారు. అందుకే కేంద్ర పాలకులు వారిని విస్మరించడం కానీ, వారితో వైరం పెట్టుకోవడం కానీ జరిగేది కాదు. తరతరాలుగా పాలకవర్గాలు అగ్రకులాలకు భూ వసతిని కల్పించడంలోనూ, వాటికి నీటి వసతి కల్పించడంలోనూ జాగరూకతతో ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్ భూపరిమితి చట్టాన్ని 1958లో అప్పటి ప్రభుత్వం తెచ్చింది. అది జూన్ 1961లో అమల్లోకి వచ్చింది. కానీ ఇప్పటి వరకూ దానికి తూట్లు పడుతూనే వున్నాయి. ప్రధానమైన విషయం ఆంధ్రప్రదేశ్ వ్యావసాయిక రాష్ట్రం. ఇందులో 69.7 శాతం మంది వ్యవసాయ కూలీలు. అందులో 90 శాతం మంది దళితులు. ఈ దళితులకు ఉన్నత స్థాయి కలిగించాలంటే తప్పకుండా వీరికి భూమి ఇవ్వాలి. రాను రాను వ్యవసాయ కూలీపని మీద శిథిలమౌతున్న వృత్తులవారందరూ ఆధారపడుతున్నారు.

పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లో భూమి రేటు విపరీతంగా పెరగడం వల్ల ఏ వ్యవసాయ కూలీలైతే భూమిని చదును చేసి వ్యవసాయీకరించారో వారు భూమి కొనలేని పరిస్థితుల్లోకి నెట్టబడ్డారు. అలాగే కృష్ణా డెల్టాలో అసలు మిగులు భూమి లేదని అధికారులు ప్రకటిస్తున్నారు. ఇటు వ్యవసాయ కూలి పని లేక, అటు ప్రభుత్వం భూమి ఇవ్వక, గ్రామాల్లో ఉండే పరిస్థితులు లేక తీవ్రమైన వలసలకు దళితులు గురి అవుతున్నారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కనీసం రూ.1,000 కోట్లు అయినా భూమి కొనుగోలు పథకానికి కేటాయించవలసిన అవసరం ఉందని సామాజిక ఆర్థిక శాస్త్రవేత్తలు కోరుకుంటున్నారు. ఈ విషయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మొదటి ప్రణాళిక సంఘంలోనే భూమి కొనుగోలు పథకానికి 20 కోట్ల కేటాయింపు చేసిన విషయాన్ని మనం గుర్తు చేసుకోవాలి.

అంబేడ్కర్ 1954 సెప్టెంబర్ 6వ తేదీన రాజ్యసభలోని చర్చల్లో ఇలా నివేదించారు: ‘‘ఆర్యా! నేనిప్పుడు షెడ్యూల్డ్ కులాల ఆర్థిక విమోచన సమస్యను ప్రస్తావిస్తున్నాను. చదువుతో పాటుగా ఉద్యోగాలు కూడా షెడ్యూల్డ్ కులాల ఆర్థిక హోదా పెరుగుదలకు ఎక్కువ ప్రాధాన్యమైనవి. అయితే ఇప్పుడు షెడ్యూల్డ్ కులాల ఆర్థిక హోదా పెరుగుదలకు ఏమి అవకాశాలున్నాయి? షెడ్యూల్డ్ కులాల ఆర్థిక విమోచన లాభదాయకమైన వృత్తులలో ప్రవేశం పొందే అవకాశం మీదనే ఆధారపడి ఉందని స్పష్టమైంది. లాభదాయకమైన వృత్తుల్లోకి ద్వారాలు తెరవబడనంత వరకు, వారి ఆర్థిక విమోచన జరిగే వీలు లేదు. వారు బానిసలుగానే మిగిలి పోతారు. బానిసలు కాకపోయినా, గ్రామాలలో భూస్వాముల సేవకులుగా మిగిలిపోతారు. ఆ విషయంలో ఏమాత్రం అనుమానం లేదు. ఆర్యా! నిస్సందేహంగా షెడ్యూల్డ్ కులాల వారికి ప్రభుత్వంవారు భూమిని పంచే ముఖ్యమైన విషయంపై దృష్టి ఉంచాలి. భూస్వాముల పొలాలపై పరిమితిని విధించి, అంతకన్నా ఎక్కువ ఉన్న భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని దానిని షెడ్యూల్డ్ కులాల వారికి ఇవ్వాలి. రెండవదేమిటంటే అమ్మకానికి వచ్చిన భూమిని కొనుక్కోవటం కోసం వారికి ఋణాలివ్వాలి.’’

ఇకపోతే స్త్రీలకు భారతదేశ వ్యాప్తంగా కుటీర పరిశ్రమలు రూపొందించి వాటిని వస్తూత్పత్తి కేంద్రాలుగా రూపొందించాలి. అక్కడ తయారైన వస్తువులకు ప్రపంచ మార్కెట్‌లో స్థానం ఏర్పాటు చేయగలిగితే మన స్త్రీలు చైనాను మించిపోతారు. నిజానికి గత రెండు దశాబ్దాలుగా నిరుద్యోగుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. చైనా నుంచి దిగుమతులు పెరుగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల గ్రాడ్యుయేట్ యువతలో నిరుద్యోగ రేటు 42 శాతానికి పెరిగింది. దీని వల్ల నిరుద్యోగులలో నిరాసక్తత, సోమరితనం పెరుగుతున్నాయి. మత్తు మందుల వాడకం పెరగడానికి కూడ నిరుద్యోగితే కారణం. ఈ నిరుద్యోగుల్లో మహిళలు ఎక్కువగా ఉండటం గమనించదగ్గ విషయం. స్త్రీల విద్య, ఉపాధి విషయాల గురించి అంబేడ్కర్ హిందూ కోడ్ బిల్లులోనూ, ఆ తరువాత పార్లమెంట్ చర్చల్లోనూ ఎన్నో సలహాలు ఇచ్చారు. వాటిని పెడచెవిన పెట్టడం వల్లే ఈ రోజున స్త్రీలు చదువుకొని కూడా అటు వ్యవసాయపని చేయలేక, ఇటు ఉద్యోగం దొరక్క సంక్షోభంలో ఉండిపోయారు. నిరుద్యోగ నిర్మూలన కోసం బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేసేలా, కొత్త ఉద్యోగాలు కల్పించేలా బడ్జెట్ కేటాయింపులు జరపాలి. దళిత విద్యార్థుల కోసం గురుకుల పాఠశాలలను దేశం మొత్తంగా మండలానికి ఒకటి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. నిజానికి గురుకుల పాఠశాలల్లోనే దళితులకు సరైన విద్య, ఆహారం లభిస్తాయి.

ఈ బడ్జెట్‌లో కుల నిర్మూలన కోసం, కులాంతర వివాహితుల రక్షణ కోసం కూడా కేటాయింపులు తప్పకుండా అవసరం. కుల నిర్మూలనను ఒక ఉద్యమంగా చేపట్టడం వల్ల సమాజంలో విస్తృతమైన మార్పులు వస్తాయనీ, సామాజిక సమతుల్యత ఏర్పడుతుందనీ అంబేడ్కర్ స్పష్టం చేశారు. అందుకే సాంఘిక స్వాతంత్ర్యాన్ని, మేధా స్వాతంత్ర్యాన్ని, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని, రాజకీయ స్వాతంత్ర్యాన్ని ప్రజలకు కలిగించాలంటే దానికి అవసరమైన బడ్జెట్ కేటాయింపులు ఉండాలని సూచించారు. దేశ బడ్జెట్ అనేది ఉత్పత్తి శక్తుల మానసిక, శారీరక సౌష్ఠవాన్ని పెంచే దిశగా ఉండాలన్నారు. తాగుడు, సిగరెట్, ఇతర వ్యసనాల నుండి దూరం చేసే నైతిక అధ్యయన కేంద్రాలు పెంచడం వల్ల సంపద మిగులు ఏర్పడుతుందని చెప్పారు. యువకుల నైపుణ్యాలను పెంచే కేంద్రాలను పెంచడం వల్ల వాళ్లు ఏ రంగంలోనైనా అభివృద్ధి చెందగలుగుతారనీ, ఆధీనత భావాన్ని తగ్గించే దిశగా బడ్జెట్ ఉండాలనీ సామాజిక, ఆర్థికవేత్తలు కోరుతున్నారు.

శ్రమ నుండే మానవాళి అభివృద్ధి జరుగుతుంది. శ్రమ నుండే చైతన్యం వస్తుంది. ప్రభుత్వం ఎన్ని సబ్సిడీలు కల్పించినా ప్రజలు ఆర్థికాభివృద్ధి చెందరు. వారిలో ఉత్సాహాన్ని, జీవన భద్రతని కల్పించాలంటే వారు చేసే పనికి ప్రతిఫలం లభించాలి. ‘ప్రభుత్వం ఏదైనా ఇస్తే బతుకుదాం’ అనే పరిస్థితుల్లోకి ప్రజలు నెట్టబడుతున్నారు. దీని వల్ల చాలా నష్టం కలగడమే కాక జాతుల్లో అలసత్వం పెరిగే ప్రమాదం ముంచుకొస్తుందని అంబేడ్కర్ ప్రజలకు ఉద్బోధించారు. నిజానికి ఆయన భూమిని జాతీయం చేయండి, పరిశ్రమలను జాతీయం చేయండి అని పిలుపును ఇచ్చిన మేధావి. భారతదేశంలో అణగారిన సామాజిక వర్గాలు అభివృద్ధి చెందితేనే ప్రపంచవ్యాప్తమైన ఆర్థికాభివృద్ధిలో భారతదేశం భాగస్వామ్యం కాగలుగుతుందని చెప్పారు. విద్య, విజ్ఞానం, ఉత్పత్తి, భూపంపిణీ, సామాజిక అభివృద్ధి, పారిశ్రామికీకరణ, స్త్రీ అభివృద్ధి, యువశక్తి వినియోగం, వృద్ధుల రక్షణ, పర్యావరణ పరిరక్షణ, నదుల అనుసంధానం... వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని కేంద్ర బడ్జెట్ రూపకల్పన జరిగినపుడు భారతదేశం నిజమైన వికాసాన్ని, ప్రాభవాన్ని పొందుతుందని చెప్పారు. ఆ దిశగా పాలకులు, ప్రజలు నడుస్తారని ఆశిద్దాం.

వ్యాసకర్త దళితోద్యమ నాయకుడు । 98497 41695

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

హత్య సరే కానీ...



జూన్ 25ను ఇకనుంచీ ‘సంవిధాన్ హత్యా దివస్’ (రాజ్యాంగాన్ని హత్య చేసిన రోజు)గా ప్రకటించడం పట్ల నాకు చాలా ప్రశ్నలున్నాయి. ఆ రోజు డ్రై డేనా (మద్యం అందుబాటులో ఉండని రోజు)? బ్యాంకుకు సెలవు ఉంటుందా? దాన్ని ఎలా ఆచరిస్తాం? నా ‘భక్త్’ స్నేహితుడికి ‘హ్యాపీ సంవిధాన్ హత్యా దివస్’ అని వాట్సాప్‌లో మెసేజ్ పంపాచ్చా?

– అతుల్ ఖత్రీ, కమెడియన్

కొత్త పదాలు



‘ఆ పెళ్లి’కి వచ్చిన ప్రచారం చూస్తుంటే, 2024 ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలోకి చేరే కొత్త పదాల్లో సంగీత్, మెహెందీ, హల్దీ ఉంటాయని కచ్చితంగా చెప్పవచ్చు.

– పర్మీందర్ సింగ్, వ్యాపారవేత్త

ఒంటరి పరిస్థితి



క్లినిక్‌కు వెళ్లాను. పెద్దవాడైన మగ రిసెప్షనిస్ట్, ‘భర్త పేరు?’ అని అడిగారు. లేదని చెప్పాను. నిరాశగా కనబడ్డారు. ‘పితాజీ ఉండివుంటారు గదా?’ అన్నారు. ‘వెళ్లిపోయారు. నా అస్తిత్వం ఒకరి భార్యగానో, కూతురిగానో ఎందుకు ఉండాలి? అదీ ఈ వయసులో’ అన్నాను. ఆయనలో మరింత నిరాశ. (అయినా) నా కార్డు మీద శ్రీమతి స్మితా శర్మ అని కనబడింది.

– స్మితా శర్మ, పాత్రికేయురాలు

వాస్తవ నిరాకరణ



మహమ్మద్ అలీ జిన్నా ఒక గుజరాతీ షియా ముస్లిం. భారతదేశం ఆయన తాలూకు ఈ గుజరాతీ పార్శ్వాన్ని గుర్తుంచుకోవాలని అనుకోదు. పాకిస్తాన్ ఆయన షియా పార్శ్వాన్ని గుర్తుంచుకోవాలని అనుకోదు.

– దేవ్‌దత్ పట్నాయక్, రచయిత

మేధావుల్లారా మీరెటువైపు?

గత పదేళ్లుగా బీజేపీ పాలనలో పరిస్థితులను గమనిస్తే ప్రపంచంలోనే గొప్ప ప్రజాస్వామ్య దేశం అని చెప్పుకునే మనదేశంలో పూర్తిగా అప్రజాస్వామిక పాలన నడుస్తున్నదని అర్థమవుతుంది. పాలనా వ్యవస్థ రోజు రోజుకూ గాడి తప్పి చివరకు దేశం ఫాసిజం వైపు అడుగులు వేస్తున్నది. మధ్యభారత ఆదివాసీల ప్రాంతంలో ఖనిజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు విచ్చలవిడిగా తవ్వుకోవడానికి బీజేపీ ప్రభుత్వం అనుమతులు ఇచ్చి, ఆదివాసులను నిర్వాసితులను చేస్తోంది. రాజ్యాంగం లోని 5వ, 6వ షెడ్యూళ్లను పట్టించుకోకుండా అటవీ చట్టాలను అతిక్రమించి, గ్రామసభ తీర్మానాలు అమలుకాకుండా ఆదివాసీల జీవించే హక్కును హరిస్తోంది ప్రభుత్వం. దీన్ని శాంతియుతంగా, ప్రజాస్వామిక నిరసన పోరాటాలతో ఆదివాసులు ప్రతిఘటిస్తున్నారు.

వీరి ఆందోళనలను అణచి వేయడానికి ఈ అటవీ ప్రాంతంలో దాదాపు 2 కిలోమీటర్లకు ఒక సైనిక క్యాంపు పెట్టారు. డిసెంబర్ 2023 నుండి ‘ఆపరేషన్ కగార్’ అనే అత్యంత పాశవిక అణచివేత పద్ధతిని ప్రవేశపెట్టారు. దీనిలో భాగంగా ఆదివాసీ గ్రామాలపై డ్రోన్ దాడులు, హెలికాప్టర్‌తో బాంబు దాడులు చేస్తున్నారు. ఆదివాసులకు అండగా ఉన్న మావోయిస్టుల ఏరివేత పేరుతో అంతర్జాతీయ సహజ న్యాయ సూత్రాలను కూడా పట్టించుకోకుండా బస్తర్ రీజియన్, కాంకేర్, నారాయణపూర్‌లలో అకృత్యాలకు పాల్పడుతున్నారు పాలకులు. కాంకేర్ లో 2024 జనవరి 1 నుండి జూన్ చివరి వరకు 150 మంది ఆదివాసులను, మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్ల ద్వారా క్రూరంగా చంపారు.

ఖనిజాలు, ఇతర అటవీ సంపద కొందరి చేతుల్లో కేంద్రీకృతం కాకుండా అందరికీ చెందాలనడం, పచ్చని అడవులను ఖనిజాల తవ్వకాల ద్వారా ధ్వంసం చేయకుండా ఉండాలనడం, రాజ్యాంగం ఇచ్చిన ఆదివాసీ హక్కులను కాపాడాలనడం నేరమెట్లా అవుతుంది? ఈ లక్ష్యాల సాధన కోసం ఉద్యమిస్తున్న ఆదివాసీలకు అండగా కవులు, రచయితలూ, ఇతర మేధావులూ నిలబడాలి. దేశం సమన్యాయం, ప్రజాస్వామ్యాల దిశలో ప్రయాణం చేయడానికి బాధ్యత గల కవులు, రచయితలు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలి. బ్రిటిష్‌వాళ్లకూ, నిజాం నవాబుకూ వ్యతిరేకంగా ఎందరో కవులూ, రచయితలూ గొప్ప రచనలు చేశారు. షోయబుల్లా ఖాన్, కాళోజీ, బందగి, సుంకర, సుద్దాల హనుమంతులాంటి రచయితలు పీడితుల పక్షాన నిలిచారు. ఇప్పుడు స్వదేశీ పాలకుల అన్యాయాలను ఎదుర్కోవడానికి మనమూ వారి మార్గాన్ని అనుసరించాలి.

– బాలసాని రాజయ్య;
విప్లవ రచయితల సంఘం, పెద్దపల్లి । 9441970025

ప్రజాసేవలో తరించిన రాజు!

జ్ఞాపకం



జి.వి. భూదానం సుబ్బారావు

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన మొదట్లో అధికార పక్షమైన కాంగ్రెస్‌కూ, కమ్యూనిస్టులకూ మధ్యేవాద పార్టీగా సోషలిస్ట్ పార్టీ ఉండేది. కార్ల్ మార్క్స్ సిద్ధాంతంతో కార్మిక, శ్రామిక వర్గాల కోసం జాతీయ భావంతో ఆ పార్టీ పనిచేస్తోంది. ఈ తరుణంలో మద్రాస్ విశ్వవిద్యాలయంలో డా॥ మీనన్ ప్రభావానికి గురైన విజయనగరం మహారాజు పూసపాటి విజయరామ గజపతిరాజు (పీవీజీ రాజు) సోషలిస్టుగా మారారు. దీంతో ముఖ్యంగా విశాఖ, శ్రీకాకుళం జిల్లాల్లో ఈ పార్టీ పెద్ద రాజకీయ శక్తిగా మారింది. పార్లమెంటు, శాసన సభ స్థానాలను గెలుచుకునే స్థాయికి చేరింది. పీవీజీపై ప్రజలకు అపారమైన విశ్వాసం ఉండేది. ఆయన్ని దైవ సమానులుగా చూసేవారు. అలాగే ఆయన కూడా ప్రజలను ఎంతో ప్రేమించారు. అందుకే ఆయన ఆస్తిపాస్తులలో చాలా భాగం ప్రజల పరం చేశారు. ఒకసారి ఆయన రాష్ట్ర మంత్రిగా గ్రామాల పర్యటనకు వెళ్లగా ‘రాజుగా’ కాకుండా మంత్రిగా వచ్చారని రాజ్యాధికారం ఎవరో తీసుకున్నారనే భావనతో ఆ యా గ్రామాల్లో ప్రజలు గగ్గోలు పెట్టినట్లుగా వార్తలు వచ్చాయి.



పీవీజీ రాజు
(1914–1995)

1951లో నేను బెజవాడలో విద్యార్థిగా ఉన్న సమయంలో సోషలిస్టు పార్టీ విద్యార్థి సంఘాలలో క్రియాశీలకపాత్ర పోషిస్తుండేవాడిని. ఒక చిన్న కారులో 30 ఏళ్ల లోపున్న యువకుడిగా పీవీజీ రాజు తన భార్య కుసుమా గజపతితో కలిసి బెజవాడ బంగారు దుకాణాల బజారులో రాంపిళ్ళ తాతబాబు ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి మద్రాసు నుండి వచ్చారు. మేడపైన హాలులో ఏర్పాటుచేసిన సమావేశానికి హాజరైన రాజు మాటలు తెలుగు ఇంగ్లీష్ సమ్మేళనంగా ఉంది. ఆ సమావేశంలో పార్టీ నిర్మాణానికి ఉత్సాహంగా పని చేయాలని చెప్పారు. మా నాన్న పాపారావు కూడా ఆ సమావేశంలో ఉన్నారు.

1954లో కర్నూలు జిల్లాలో ‘కరివెన ఈనాం రైతు సత్యాగ్రహం’ సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో నడుపుతున్న సమయంలో... సోషలిస్టు పార్టీ – కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీలు విలీనమై ‘ప్రజా సోషలిస్టు పార్టీ’ అవతరించింది. ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు నాయకత్వంలో తెలుగు నేలపై ఈ పార్టీ నడిచింది. ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఉద్యమాన్ని సోషలిస్టులు నడిపి 1953లో సాధించగా... ముఖ్యమంత్రిగా ప్రకాశం పంతులు బాధ్యతలు తీసుకోవాలని నెహ్రూ స్వయంగా మద్రాసు వచ్చి కోరారు. ప్రజా సోషలిస్టు పార్టీ అధ్యక్షుడైన ప్రకాశం పంతులు ముఖ్యమంత్రిగా... తన అనుచరులు తెన్నేటితో సహా కాంగ్రెస్ వారిని కలుపుకొని మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశారు. ఇందుకు రాష్ట్రంలోని సోషలిస్టు వర్గంవారు పార్టీకి ద్రోహం చేసి వెళ్లారని వారిని నిందించారు. ఈ సందర్భంలో కరివెన ఇనాం భూములపై వ్యవసాయం చేసుకొని జీవిస్తున్నవారికి భూమిపై హక్కులను కల్పించవలసిందిగా కోరుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇనాం రైతు సత్యాగ్రహం ఎమ్‌బీ సుబ్బారెడ్డి, రత్నసభాపతి వంటివారి నాయకత్వంలో ప్రారంభమయ్యింది.

ముగ్గురు పార్లమెంటు సభ్యులు, 12 మంది శాసన సభ్యులు ప్రతిరోజూ కరివెనకు వచ్చి సత్యాగ్రహులుగా అరెస్టు అవుతూ వచ్చారు. నేను కూడా నలుగురి సహచరులతో బెజవాడ నుండి నంద్యాల ద్వారా కరివెన సత్యాగ్రహ శిబిరానికి చేరగా మమ్మల్ని బెజవాడ పాపిరెడ్డి బృందంలో చేర్చారు. నన్ను అరెస్టు చేశారు. పీవీజీ రాజు తన అనుచరులతో మా కంటే ముందే అరెస్టు అయ్యారు. కోర్టులో తాను చేసిన శాంతియుత సత్యాగ్రహం రాజ్యాంగ విరుద్ధం కాదని న్యాయపోరాటం చేయడం వల్ల శిక్ష పడకుండా కర్నూల్ సబ్ జైలులో ఉంచి అన్ని వసతులూ కల్పించారు. పోలీసులు మమ్మల్ని కర్నూల్ సబ్ జైలుకు తీసుకొచ్చిన సందర్భంలో పీవీజీతో కలిసి ఉన్నాం. తెలుగుభాష రాని రాజు జైలులోనికి తీసుకొచ్చిన ‘ఆంధ్రప్రభ’ పేపర్ హెడ్డింగ్ చదివి తాను తెలుగు కూడా చదవగలుగుతున్నాని మా అందరికీ చెప్పి నవ్వించారు.


1958లో విజయనగరం వెళ్లి ఆయన్ని కలిశాను. నన్ను చూసి ‘పాపారావు కొడుకువురా’ అని నన్ను దగ్గరికి పిల్చి ఈ కోటను విద్యాసంస్థలకు ఇస్తున్నాను. భోజనాలు చేయడానికి ముందే వెళ్ళి అంతా చూసి రండి అని మనిషిని ఇచ్చి పంపారు. 1976–78లో పూరి ‘సర్వోదయ’ సమ్మేళనానికి వెళ్ళి తిరుగు ప్రయాణంలో సింహాచలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దైవ దర్శనం చేసుకొని దేవాలయ వంశ పారంపర్య ధర్మకర్త పీవీజీ అక్కడే ఉంటున్నారని తెలిసి వారిని చూడడానికి వెళ్ళి వారి శ్రీమతితో మాట్లాడి వచ్చాము. ఆయన గుర్తుపట్టగల స్థితిలో లేరు. సిమ్లాలో కారు ప్రమాదం వలన మెదడు దెబ్బతిని చాలా కాలం నుండి కోమాలో ఉండి ఈ పరిస్థితికి వచ్చారని తెలిసింది.

ఆంధ్రరాష్ట్రంలో ప్రజా సోషలిస్టు పార్టీ చీలిపోయి లోహియా అనుచరులుగా ఆంధ్రా సోషలిస్టు పార్టీ అధ్యక్షులుగా పీవీజీ రాజు, కార్యదర్శిగా మా నాన్న జీవీఎల్ నర్సింహారావు (పాపారావు) బాధ్యతలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత విద్యాశాఖమంత్రిగా పీవీజీ మా తమ్ముడి ఉన్నత విద్యాభ్యాసానికి ఆర్థిక సహకారం అందించారు. దేశానికి ఎనలేని సేవలు చేసిన రాజుగారు 1995 నవంబర్ 14న స్వర్గస్థులైనారు. వివిధ ప్రదేశాల్లో 1951 నుండి 1972 వరకు ఆయన్ని కలిసినప్పటి జ్ఞాపకాలు ఇవన్నీ. మహోన్నతమైన వ్యక్తి, త్యాగ శీలి, విద్యాప్రదాత అయిన రాజుగారు అందరికి పూజనీయులు.

వ్యాసకర్త తెలంగాణ గాంధీ స్మారక నిధి అధ్యక్షులు । 9440296710
(పీవీజీ రాజు శతజయంతి సంవత్సరం సందర్భంగా)

అపాత్ర దానం

పద్దెనిమిది రోజులు జరిగిన మహాభారత సంగ్రామంలో, భీష్ముని సర్వసేనాధిపత్యంలో పది రోజులు, ద్రోణుడి సేనాధిపత్యంలో ఐదు రోజులు యుద్ధం జరిగిన తరువాత, దుర్యోధనుడి చేత కర్ణుడు సర్వసేనాధిపతిగా నియమించబడ్డాడు. తన సర్వసేనాధిపత్యంలో రెండవ రోజు యుద్ధరంగంలోకి ప్రవేశిస్తూన్న తరుణంలో తన సేనలో ఉన్న వారిని ఉద్దేశించి కర్ణుడు ‘ఎవరైనా సరే నాకు అర్జునుడిని సత్వరం చూపిస్తే అతడికి నేను బంగారు రథాలైనా, వెలకట్టలేని అందం కలిగిన గర్రాలనైనా, ఏనుగులనైనా, పెద్ద గ్రామాన్నైనా... వారికి ఏది కావాలంటే అది బహుమానంగా ఇస్తాను. కృష్ణార్జునులను ఇద్దరినీ చూపిస్తే, ఈరోజు వారిద్దరినీ ఓడించి వారిరువురి సంపదనంతా వారిని నాకు చూపించిన వాళ్ళకు బహుమానంగా ఇస్తాను!’ అంటాడు. కర్ణుడి రథసారథి అయిన శల్యుడికి ఇవన్నీ మతి తప్పిన వాడి మాటలుగా అనిపించి, ఆ మాటలలో కర్ణుడి వాచాలత్వానికి తనలో తాను నవ్వుకుని, ‘యుద్ధరంగంలో ఒకరు కృష్ణార్జునులను చూపడమేమిటి? కాసేపు ఆగితే ఎక్కడ చూసినా వారిరువురే కనబడతారు కదా!’ అని మనసులో అనుకుంటూ, ఆ మాటలనే కర్ణుడితో కొంత పరిహాసం జోడించి ఇలా చెబుతాడు.



**ఎవ్వరు సూప నేల? నరు నిప్పుడె కాంచెదు; రిత్త వారికిం
గ్రొవ్వున నుజ్జ్వలార్థములు గొండని యీ వల; దిట్టు లిచ్చినన్
నవ్వు జనంబు, మిక్కిలి ధనంబులు గల్గిన జేయరాదె నీ
కెవ్విధినైన సద్వ్యయము, లెందు నపాత్రపు టీవి యొప్పునే?**

‘ఒకరు చూపేదేమిటి? కాసేపు ఆగితే అర్జునుడు తానే కనిపిస్తాడు. అనవసరమైన మాటలు మాట్లాడి, అర్హత లేని వారికి డబ్బు ఇస్తానంటూ జనం దృష్టిలో చులకన కావద్దు. అలా ఇస్తే జనం నవ్వుతారు కూడా! అంతగా నీ దగ్గర సంపద అధికంగా ఉంటే దానితో ఏవైనా సత్కార్యాలు చేయడం, అందుకోసం వినియోగించడం మంచిది. అనర్హుడైనవాడికి సంపదను దానం చెయ్యడం సరైన పని అనిపించుకుంటుందా?’ అని తిక్కన మహాకవి రచనలోని ఆంధ్ర మహాభారతం, కర్ణపర్వం, ద్వితీయాశ్వాసంలోనిపై పద్యం భావం. యోగ్యత తెలిసి చేసే దానమే సత్ఫలితాలను ఇస్తుంది. అనర్హుడికి చేసిన దానం, ఆ దానం చేసిన వ్యక్తి విచక్షణను ప్రశ్నించేలా చేస్తుందని మహాభారతంలోని పై సన్నివేశం ద్వారా చెప్పబడింది.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం; **తిథి:** శు.నవమి ప.3.50 వరకు, తదుపరి దశమి; **నక్షత్రం:** స్వాతి రా.10.09 వరకు, తదుపరి విశాఖ; **వర్జ్యం:** తె.4.10 నుండి 5.53 వరకు (తెల్లవారితే మంగళవారం); **దుర్ముహూర్తం:** ప.12.30 నుండి 1.22 వరకు, తదుపరి ప.3.06 నుండి 3.58 వరకు; **అమృత ఘడియలు:** ప.12.31 నుండి 2.16 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు; **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు; **సూర్యోదయం:** 5.36 ; **సూర్యాస్తమయం:** 6.34

క్లుప్తంగా...

అంబులెన్స్ కోసం 12 గంటలు

- పురిటి నొప్పులతో గర్భిణికి ఇంట్లోనే నరకయాతన
- ప్రైవేటు జీపులో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలింపు
- తల్లి, మగబిడ్డ క్షేమం

పెదబయలు: అత్యవసర సమయాల్లో సత్వరం ఆదుకోవాల్సిన 108 అంబులెన్స్ 12 గంటలు గడిచినా రాకపోవడంతో ఒక గర్భిణి పురిటి నొప్పులతో నరకయాతన అనుభవించింది. సమాచారం ఇచ్చిన తరువాత 12 గంటలు గడిచినా అంబులెన్స్ జాడ లేకపోవడంతో ఆమెను ప్రైవేటు జీపులో ఆస్పత్రికి తరలించారు. అల్లూరి జిల్లా పెదబయలు మండలం గిన్నెలకోట పంచాయతీ పెద్దపాడు గ్రామానికి చెందిన వనుగురు పెద్దమ్మికి శనివారం రాత్రి 8 గంటలకు పురిటి నొప్పులు మొదలయ్యాయి. దీంతో 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. గంటలో వస్తామని అంబులెన్స్ సిబ్బంది చెప్పారు. సుమారు 12 గంటలు గడిచినా.. ఆదివారం ఉదయానికి కూడా అంబులెన్స్ రాలేదు. రాత్రి నుంచి తీవ్రమైన పురిటినొప్పులతో అవస్థలు పడుతున్న గర్భిణిని చూసి కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. 108 అంబులెన్స్ రాకపోవడంతో గత్యంతరం లేక పెద్దమ్మిని ఆదివారం ఉదయం ప్రైవేట్ జీపులో పాడేరు ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు ఆమె భర్త నాగురాజు, కుటుంబసభ్యుడు బూడిదె కృష్ణారావు చెప్పారు. ఆస్పత్రిలో వైద్యులు తక్షణమే సేవలందించారని, మధ్యాహ్నం 12.30 గంటలకు పెద్దమ్మికి మగబిడ్డ పుట్టాడని నాగురాజు తెలిపారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని చెప్పారు.

జీవో 29ని తక్షణం రద్దు చేయాలి

ఏఐవైఎఫ్ జాతీయ మాజీ కార్యదర్శి ఈశ్వరయ్య



గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): తల్లికి వందనం పథకానికి సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవో 29 రద్దు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ మాజీ కార్యదర్శి జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ తల్లికి వందనం పథకం వర్తింపజేయాలన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ హనుమాన్‌పేటలోని సీపీఐ భవన్‌లో ఏఐవైఎఫ్ ఆఫీస్ బేరర్స్ సమావేశం ఆదివారం జరిగింది. ఇందులో ఈశ్వరయ్య మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. సూపర్ సిక్స్ పథకాల్లోనూ తల్లికి వందనం చేర్చారని పేర్కొన్నారు. అధికారంలోకి రాగానే ఒక్కరికీ మాత్రమే రూ.15 వేలు ఇస్తామని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు.

ముంబై విమానంలో సాంకేతిక లోపం

విమానాశ్రయం (గన్నవరం): ముంబై వెళ్లాల్సిన ఎయిరిండియా విమానం ఆదివారం సాంకేతిక సమస్యల కారణంగా గన్నవరం విమానాశ్రయంలో నిలిచిపోయింది. ఎయిరిండియాకు చెందిన ఎయిర్‌బస్ ఏ320 విమానం 171 మంది ప్రయాణికులతో రాత్రి 7.10 గంటలకు ముంబై బయలుదేరేందుకు సిద్ధమైంది. సాంకేతిక సమస్యను గుర్తించిన పైలెట్లు ఏటీసీకి సమాచారం ఇచ్చారు. ఏటీసీ సూచన మేరకు విమానాన్ని టెర్మినల్‌కు తరలించారు. మరమ్మతులకు ఇంజినీర్లు రావాల్సి ఉండడంతో సర్వీస్‌ను రద్దుచేస్తున్నట్లు ఎయిరిండియా ప్రతినిధులు ప్రకటించారు. ఈ విమానంలోనే ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ కూడా ఉన్నారు. విమానం రద్దుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

బ్రేక్ ఫెయిలై చెట్టును ఢీకొన్న బస్సు



పెద్దదోర్నాల: బ్రేక్ ఫెయిల్ కావడంతో ఓ టూరిస్టు బస్సు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటన ప్రకాశం జిల్లా, పెద్దదోర్నాల మండలంలోని ఐనముక్కల రెడ్డి కాలనీ సమీపంలో ఆదివారం చోటు చేసుకొంది. శ్రీశైలం నుంచి కర్ణాటక వెళ్తున్న ఓ టూరిస్టు బస్సుకు ఐనముక్కల కొండారెడ్డి కాలనీ వద్ద బ్రేకులు ఫెయిలయ్యాయి. దీంతో అదుపు తప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొట్టింది. దీంతో బస్సులోని ఐదుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో వర్షం పడుతున్న కారణంగా రోడ్డు నిర్మానుష్యంగా ఉంది. అలాగే ప్రమాద సమయంలో బస్సు చెట్టును ఢీకొనకుండా నేరుగా రోడ్డు పక్కన ఉన్న నివాస గృహాల్లోకి దూసుకెళ్లి ఉంటే భారీగా నష్టం జరిగేదని, చెట్టు వల్ల పెను ప్రమాదమే తప్పిందని కాలనీ వాసులు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారిని మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించారు.

ముగ్గురి మాటే శాసనం

రిటైర్డ్ ఐపీఎస్‌ల గుప్పిట్లో పోలీసు శాఖ

- ఏబీవీ, ఆర్పీ ఠాకూర్, ఘట్టమనేని శ్రీనివాస్‌లే అసలు బాస్‌లు
- పోలీసు శాఖను వీరే నియంత్రిస్తారని చెప్పిన ముఖ్య నేత.. వీరి సర్వీసు అంతా అవినీతి, అక్రమాలు, వివాదాలే
- ఎస్సై నుంచి డీజీ వరకు వారి మాటే వేదం
- ఆ త్రయం ప్రాపకం దక్కితేనే పోస్టింగులు.. వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టాలి.. వేధించాలి
- మూటలు ఇవ్వాలి.. వారి మాటే వినాలి
- ఇవన్నీ చేస్తేనే పోస్టింగులు
- వారు సంతృప్తి చెందితేనే చిన బాబు, పెద్ద బాబు వద్దకు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో పోలీసు శాఖలోకి రాజ్యాంగేతర శక్తులు ప్రవేశించాయి. రిటైర్డైపోయిన ముగ్గురు ఐపీఎస్ అధికారుల గుప్పిట్లో పోలీసు శాఖ చిక్కుకుంది. రిటైర్డ్ డీజీ ఏబీవీ వెంకటేశ్వరరావు, రిటైర్డ్ డీజీపీ ఆర్పీ ఠాకూర్, రిటైర్డ్ డీఐజీ ఘట్టమనేని శ్రీనివాస్‌ల మాటే శాసనంగా చలామణి అవుతోంది. సర్వీసు మొత్తం అత్యంత వివాదాస్పదంగా ముద్రపడ్డ ఈ ముగ్గురూ ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వంలో పోలీసు శాఖపై పూర్తి ఆధిపత్యం చలాయిస్తున్నారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు అడుగులకు మడుగులొత్తే ఈ అధికారులు ఎస్సై నుంచి డీజీపీ స్థాయి అధికారిని కూడా శాసిస్తున్నారు. వారి ప్రాపకం పొందిన అధికారులకే పోస్టింగులు ఇస్తున్నారు. వారు చెప్పినట్టల్లా ఆడాలని, చెప్పిన వారిపై అక్రమ కేసులు పెట్టి వేధించాలని షరతులు పెడుతున్నారు. ఇందుకు ఒప్పుకొన్న వారికే సీఎంవో కటాక్షం లభించి, పోస్టింగులు వస్తున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే పోలీసు శాఖలో ఈ ముగ్గురి మాటే శాసనం.

సర్వీసు అంతా అవినీతి, అక్రమాలు, వివాదాలే..

ఈ ముగ్గురు అధికారుల సర్వీసు మొత్తం వివాదాస్పదమే. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు వీరు చెలరేగిపోయారు. పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారన్నది బహిరంగ రహస్యం. ఆశ్రిత పక్షపాతం, రాజకీయ కక్ష సాధింపులతో పక్కా రాజకీయ నేతల మాదిరిగానే వ్యవహరించారు. వీరిలో డీజీ హోదాలో ఇటీవల రిటైరైన ఏబీ వెంకటేశ్వరరావు సర్వీసు అంతా అత్యంత వివాదాస్పదం. గతంలో నిఘా విభాగం అధిపతిగా చేసినప్పుడు వైఎస్సార్‌సీపీ నేతలను వేధించడం, ప్రలోభాలకు గురి చేయడమే పనిగా పెట్టుకున్నారు. 23 మంది వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురి చేసి, టీడీపీలో చేర్పించడంలో ప్రధాన పాత్రధారి. టీడీపీ రాజకీయ ప్రత్యర్థులపై నిఘా పెట్టేందుకు ఈయన ఏకంగా కేంద్ర భద్రతా చట్టాలను ఉల్లంఘించి మరీ ఇజ్రాయెల్ నుంచి నిఘా పరికరాలను కొనడం సంచలనం సృష్టించింది. తన కుమారుడి కంపెనీ ద్వారా పెగాసస్ కంపెనీ స్పైవేర్‌ను అక్రమంగా కొన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం పెగాసస్ స్పైవేర్ కొన్నట్లు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆ రాష్ట్ర శాసన సభలోనే చెప్పడం సంచలనం రేపింది.

☛ పూర్వపు డీజీపీ ఆర్పీ ఠాకూర్ అవినీతి, వివాదాలకు మారుపేరుగా ముద్ర పడ్డారు. ఆయన రాయలసీమలో పని చేసినప్పుడు ఫ్యాక్షనిస్టులతో అంటకాగి శాంతి భద్రతలను గాలికొదిలేశారు. 2018లో అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విశాఖపట్నం విమానాశ్రయంలో హత్యాయత్నం జరిగితే.. డీజీపీగా ఉన్న ఠాకూర్ కనీసం ప్రాథమిక విచారణ కూడా చేయకుండా ఏకపక్షంగా ఆ కేసును పక్కదారి పట్టించేందుకు యత్నించారు. దానిపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. అప్పటి రాష్ట్ర పోలీస్ బాస్‌గా ఉన్న ఈయన మాత్రం ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించారు. ఇంత చేసినా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆయన సీనియారిటీని గౌరవించి కీలక పోస్టింగులు ఇచ్చింది. ఆర్టీసీ ఎండీగా గౌరవనీయమైన పోస్టులో రిటైరయ్యే అవకాశం కల్పించింది. రిటైరైన తరువాత కూడా కీలక పదవిలో నియమించింది. ఆయన మాత్రం పచ్చ రాజకీయ వాసనలను వీడలేదు. ఇటీవలి ఎన్నికల సమయంలో టీడీపీ ప్రధాన కార్యాలయంలో మకాం వేసి మరీ ఆ పార్టీ కోసం పని చేశారు. పోలీసు అధికారులను బెదిరించారు. ఎన్నికల కమిషన్‌ను ప్రభావితం చేసేందుకూ సాహసించారు. ఎన్నికల్లో టీడీపీ అక్రమాల కుట్రలో కీలకంగా వ్యవహరించారు. డీఐజీ స్థాయిలో రిటైరైన ఘట్టమనేని శ్రీనివాస్ గత ఐదేళ్లుగా టీడీపీ బ్యాక్ ఆఫీసులో కీలకంగా వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్ కేంద్రంగా పని చేశారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసేందుకు డబ్బు, మద్యం పంపిణీని ఆయనే పర్యవేక్షించారు.

చెప్పినట్లు చేస్తేనే పోస్టింగులు

ఈ ముగ్గురికీ ప్రభుత్వం ఎలాంటి నామినేటెడ్ పదవులు, ఇతరత్రా అధికారిక హోదా ఏదీ ఇవ్వలేదు. అయినా వారు చెప్పిందే చేయాలని ముఖ్య నేత పోలీసు ఉన్నతాధికారులకు స్పష్టం చేసినట్టు సమాచారం. తద్వారా పోలీసు శాఖను ఈ ముగ్గురే నియంత్రిస్తారని తేల్చి చెప్పారు. ఈ విషయంలో ఎవరూ జోక్యం చేసుకోవద్దని మంత్రులు, ఎమ్మెల్యేలకు కూడా ముఖ్య నేత కార్యాలయం స్పష్టం చేసింది. దీంతో ఈ ముగ్గురూ చెలరేగిపోతున్నారు. రాష్ట్రాన్ని ప్రాంతాలవారీగా పంచేసుకుని ఎస్సై నుంచి డీజీపీ వరకూ యావత్ పోలీసు వ్యవస్థనే గుప్పిట్లోకి తీసుకున్నారు. జిల్లా ఎస్పీలు, డీఐజీల పోస్టింగులు అన్నీ వీరే ఖరారు చేస్తున్నట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు. ఈ ముగ్గురి కనుసన్నల్లోనే రాష్ట్రంలో ఐపీఎస్ అధికారుల బదిలీల ప్రక్రియ సాగుతోంది. శనివారం 37 మంది ఐపీఎస్ అధికారుల బదిలీలు, అంతకుముందు కొన్ని రోజుల క్రితం అదనపు డీజీ, ఐజీ స్థాయి అధికారుల బదిలీలన్నీ ఈ ముగ్గురి ఎంపిక మేరకే జరిగాయి. వీరు ముగ్గురూ ఐపీఎస్ అధికారులను పిలిపించుకుని మాట్లాడి సంతృప్తి చెందిన తరువాతే వారి ఫైళ్లు ముందుకు కదిలాయి. అనంతరమే పెద్ద బాబు, చిన బాబు ఆమోదముద్ర వేశారు. ఐపీఎస్‌లే కాదు.. సీఐల పోస్టింగులు కూడా వీరి కనుసన్నల్లోనే సాగుతున్నాయి. ఐపీఎస్ నుంచి సీఐ వరకు పోస్టింగులకు రేటు కూడా ఫిక్స్ చేస్తున్నట్లు పోలీసు శాఖలో చర్చ నడుస్తోంది. అంతేకాదు.. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తల మీద అక్రమ కేసులు ఎలా పెడతారు? ఎలా వేధిస్తారు? అంటూ పోస్టింగులకు ముందు అధికారులను వీరు ముగ్గురూ ప్రశ్నిస్తున్నారు. తాము సంతృప్తి చెందితేనే పోస్టింగుల జాబితాలో వారి పేరు ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. ఇప్పటివరకు చేసిన బదిలీలన్నీ అదే ప్రాతిపదికన చేశారు.

ఇవిగో ఉదాహరణలు

రాజధాని ప్రాంతంలో కీలక జిల్లా పోలీసు అధికారి పోస్టు ఆశించిన ఓ ఐజీ స్థాయి అధికారిని కొన్ని రోజుల క్రితం వీరు పిలిపించారు. వైఎస్సార్‌సీపీ నేతలు ఎవరెవరి మీద ఎక్కడెక్కడ అక్రమ కేసులు ఎలా పెట్టవచ్చో ఒక లిస్టు తయారు చేసి ఇవ్వాలని చెప్పారు. ప్రస్తుతం తాము పెట్టిస్తున్న అక్రమ కేసులను పర్యవేక్షించాలని, జిల్లా ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలతో మాట్లాడుతూ కేసుల నమోదు, వేధింపులు వేగవంతం చేసేట్టు చూడాలని కూడా చెప్పారు. తాము సంతృప్తి చెందితే ఆయన ఆశించిన కీలక పోస్టింగ్ ఇస్తామని షరతు విధించారు. దాంతో ఆ అధికారి వారు చెప్పిన పని చేశారు. వైఎస్సార్‌సీపీ నేతల మీద అక్రమ కేసులను ప్రత్యేకంగా పర్యవేక్షించారు. ఆయన పనితీరుతో ఆ ముగ్గురు రిటైర్డ్ అధికారులు సంతృప్తి చెంది పచ్చ జెండా ఊపారు. దాంతో ప్రభుత్వం ఆయనకు రాజధాని ప్రాంతంలో కీలక పోలీసు అధికారిగా పోస్టింగ్ ఇచ్చింది.

☛ ఇటీవలి ఎన్నికల్లో గుంటూరులో అత్యంత వివాదాస్పద అధికారిగా మారిన ఓ సీనియర్ ఐపీఎస్ అధికారి కూడా పోస్టింగ్ కోసం వీరి వద్దకు వచ్చారు. ఎన్నికల్లో టీడీపీకి కొమ్ముకాశాను కాబట్టి కీలక పోస్టింగ్ కావాలని కోరారు. ఆయనకు కూడా ఇదే విధమైన షరతు విధించారు. గతంలో టీడీపీ కార్యాలయంపై దాడితో ఏమాత్రం సంబంధం లేని వారిని ఆ కేసులో ఇరికించాలని, వేధించాలని చెప్పారు. అలా చేస్తేనే మరింత ప్రాధాన్యమున్న పోస్టింగ్ ఇస్తామని చెప్పారు.

☛ జిల్లాల ఎస్పీలతో సహా శనివారం బదిలీ చేసిన 37 మంది ఐపీఎస్ జాబితా తయారు చేసిందీ ఈ ముగ్గురే. ఇటీవలి ఎన్నికల్లో ఏకపక్షంగా వైఎస్సార్‌సీపీ నేతలపై కేసులు పెట్టి వేధించి తీవ్ర వివాదాస్పదమైన బిందుమాధవ్ నాయుడును కర్నూలు జిల్లా ఎస్పీగా నియమించారు. టీడీపీ సీనియర్ నేతకు సమీప బంధువైన కోయ ప్రవీణ్‌ను కర్నూలు రేంజ్ డీఐజీగా నియమించారు. టీడీపీకి అనుకూలంగా ఏకపక్షంగా వ్యవహరిస్తారని పేరు బడ్డ దామోదర్‌కు ప్రకాశం జిల్లా ఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. ఈ విధంగా మొత్తం ఐపీఎస్‌ల నియామకాలన్నీ ఈ ముగ్గురు రిటైర్డ్ అధికారుల ఎంపిక మేరకే చేసినట్టు పోలీసు వర్గాలు చెబుతున్నాయి.



మల్లన్న సన్నిధిలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి దంపతులు



త్రిపురాంతకం ఆలయంలో జస్టిస్ జ్యోతిర్మయి ప్రతాప



ఆలయం వెలుపల జస్టిస్ ఏవీ రవీంద్రబాబు

శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప దంపతులు దర్శించుకున్నారు. వీరికి దేవస్థాన ఈవో పెద్దిరాజు, అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వారు మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర సేవలు నిర్వహించుకున్నారు. వేదపండితులు వేదమంత్రాలు పలకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. స్వామివారి శేషవస్త్రాన్ని, లడ్డూ ప్రసాదాలను, జ్ఞాపికను ఈవో అందజేశారు. కాగా, ప్రకాశం జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రమైన బాలాత్రిపురసుందరీదేవి, పార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయాల్లో జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వారికి అభిషేకాలు, బాలాత్రిపుర సుందరీదేవికి కుంకుమార్చనలను అర్చకులు విశ్వనారాయణశాస్త్రి, ప్రసాదశర్మ చేశారు. అలాగే శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు కూడా దర్శించుకున్నారు. వీరికి అధికారులు ఘన స్వాగతం పలికారు.

- శ్రీశైలం టెంపుల్/త్రిపురాంతకం/తిరుమల

శ్రీవారి ఆలయంలో రేపు ఆణివార ఆస్థానం



తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో జూలై 16న సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినం ఘనంగా నిర్వహించనున్నారు. ఆ రోజున సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి శోభాయమానంగా అలంకరించిన పుష్పపల్లకిపై తిరుమల వీధుల్లో ఊరేగుతారు. ఆణివార ఆస్థానం కారణంగా జూలై 16న అష్టదళ పాద పద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

దర్శనానికి 24 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. భక్తులతో అన్ని కంపార్ట్‌మెంట్లు నిండి క్యూ లైన్ టీబీసీ వద్దకు చేరుకుంది. శనివారం అర్ధరాత్రి వరకు 75,916 మంది శ్రీవారిని దర్శించుకుని హుండీలో రూ.3.87 కోట్లు వేశారు. టైంస్లాట్ టోకెన్‌లు ఉన్నవారికి సకాలంలో, దర్శన టికెట్లు లేనివారికి 24 గంటల్లో, ఎస్‌ఈడీ టికెట్లు ఉన్నవారికి 2 గంటల్లో దర్శనమవుతోంది.

శ్రీవారి సేవలో సీఎస్

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) నీరబ్ కుమార్ ప్రసాద్ దంపతులు ఆదివారం శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికారు. శ్రీవారి తీర్థప్రసాదాలు, డైరీ, క్యాలెండర్‌ను జేఈవో వీరబ్రహ్మం అందజేశారు. భారత క్రికెట్ అండర్ 19 వైస్ కెప్టెన్ షేక్ రషీద్, అనంతపురం ఎంపీ లక్ష్మీనారాయణ కూడా స్వామివారిని దర్శించుకున్నారు.

స్థలం ఇప్పించండి.. సేవ చేస్తాం!

ప్రభుత్వానికి అఖిల భారతీయ అగర్వాల్ సమ్మేళన్ విజ్ఞప్తి

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): తమ సేవా కార్యక్రమాలకు విశాఖలో స్థలం కేటాయిస్తే మరింత విస్తృతంగా సేవలు అందిస్తామని అఖిల భారతీయ అగర్వాల్ సమ్మేళన్ సంఘం నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏపీలో నూతన కార్యవర్గం చేపట్టనున్న అనేక కార్యక్రమాల్ని వివరించేందుకు నేతలు ఆదివారం ఓ హోటల్‌లో సమావేశం నిర్వహించి మీడియాతో మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా 54 దేశాల్లో 22 వేల బ్రాంచీలతో అనేక సేవలందిస్తున్నామని సంఘం నేతలు తెలిపారు. ఇప్పటికే విశాఖలో వీల్‌చైర్ల అందజేత వంటి ఎన్నో కార్యక్రమాల్ని చేపట్టినట్టు గుర్తుచేశారు. సంఘం జాతీయ అధ్యక్షుడు గోపాల్ శరణ్ గార్గ్ మాట్లాడుతూ తమ సంఘం ఏర్పడి వచ్చే ఏడాదికి 50 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్టు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ అధ్యక్షుడు వినీత్ లోహియా, కార్యదర్శి దీపక్ కన్సారియా, కోశాధికారి సంజయ్ కుమార్ టిక్మణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో శిశువు అపహరణ

- బందరు జీజీహెచ్‌లో ఘటన
- నర్సు వేషంలో వచ్చి 5 రోజుల శిశువును అపహరించిన మహిళ
- నిందితురాలిని గుర్తించిన సెక్యూరిటీ సూపర్‌వైజర్
- అతనిచ్చిన సమాచారంతో నిందితురాలిని పట్టుకున్న పోలీసులు
- తల్లి చెంతకు క్షేమంగా శిశువు..

మచిలీపట్నం టౌన్: బందరు ప్రభుత్వాస్పత్రిలో తల్లి పొత్తిళ్లలో వెచ్చగా సేదదీరుతున్న ఐదు రోజుల శిశువును ఓ మహిళ అపహరించింది. నర్సు వేషంలో వచ్చి.. తల్లితో మాటలు కలిపి.. ఆమె నిద్రపోగానే శిశువును ఎత్తుకెళ్లిపోయింది. ఈ ఘటన మచిలీపట్నంలో కలకలం సృష్టించింది. కృష్ణా జిల్లా ఘంటసాల మండలం శ్రీకాకుళానికి చెందిన చిట్టూరి స్వరూపరాణి ఈ నెల 8వ తేదీన డెలివరీ కోసం మచిలీపట్నంలోని సర్వజనాస్పత్రిలో చేరింది. 9వ తేదీన మగ బిడ్డకు జన్మనిచ్చింది. శనివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో నర్సు వేషంలో వచ్చిన ఓ మహిళ.. స్వరూపరాణితో మాటలు కలిపింది. కొద్దిసేపటికి స్వరూపరాణి నిద్రలోకి జారుకోగా.. ఆ మహిళ శిశువును ఎత్తుకెళ్లిపోయింది. ఆ తర్వాత 15 నిమిషాలకు స్వరూపరాణి మెలుకువ వచ్చి లేచి చూడగా.. పొత్తిళ్లలోని శిశువు కనిపించలేదు. వెంటనే ఆమె తన తల్లిదండ్రులకు, భర్తకు సమాచారం ఇచ్చింది. వారు ఆస్పత్రి సిబ్బందికి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆస్పత్రికి చేరుకొని సీసీ టీవీ కెమెరాల పుటేజీలు పరిశీలించారు. స్వరూపరాణికి సహాయం చేసినట్లు నటించిన నర్సు వేషంలో ఉన్న మహిళే శిశువును తీసుకెళ్లినట్లు గుర్తించారు.



నిందితురాలు లక్ష్మి



తల్లి స్వరూపరాణి చెంతకు చేరిన శిశువు

సెక్యూరిటీ సూపర్‌వైజర్ సమాచారంతో..

కొద్ది రోజుల క్రితం ఆస్పత్రిలో సెల్‌ఫోన్లు చోరీకి గురవ్వడంతో ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ నిందితుడికి.. శిశువును కిడ్నాప్ చేసిన మహిళే బెయిల్ ఇచ్చిందని ఆస్పత్రి సెక్యూరిటీ సూపర్‌వైజర్ రాజు పోలీసులకు తెలియజేశాడు. పోలీసులు ఆ దిశగా దర్యాప్తు జరిపి ఆమె వివరాలు సేకరించారు. గంటల వ్యవధిలోనే ఆమె ఇంటికి చేరుకుని నిందితురాలిని అదుపులోకి తీసుకొని.. శిశువును స్వాధీనం చేసుకున్నారు. ఉదయం ఆరు గంటలకల్లా పోలీసులు శిశువును క్షేమంగా తల్లి స్వరూపరాణి చెంతకు చేర్చారు. దీంతో స్వరూపరాణి సంతోషం వ్యక్తం చేసింది.

ఆడబిడ్డ కోసమని..!

నిందితురాలిని తమ్మిశెట్టి లక్ష్మిగా పోలీసులు గుర్తించారు. ఆమె స్థానిక రామానాయుడుపేట సెంటర్‌లో కోడిగుడ్ల వ్యాపారం నిర్వహిస్తోంది. ఆమెకు ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. ఆడబిడ్డ కోసమని తాను శిశువును అపహరించానని నిందితురాలు విచారణలో తెలిపింది. తాను ఎత్తుకొచ్చింది మగ శిశువనే విషయాన్ని గమనించలేదని వెల్లడించింది. కాగా, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన స్టాఫ్ నర్సు దీవెన, సెక్యూరిటీ గార్డు విజయలక్ష్మిని సస్పెండ్ చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ రమేశ్ తెలిపారు. ఎస్ఎన్‌సీయూ విభాగంలోని ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఎఫ్ఎన్‌ఓ, సెక్యూరిటీ గార్డులకు చార్జ్ మెమోలు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

పెరుగుతున్న గోదా‘వడి’

- ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి 78,209 క్యూసెక్కులు సముద్రంలోకి
- కృష్ణాలో మరింత తగ్గిన వరద



సాక్షి, అమరావతి/ ధవళేశ్వరం: నది పరీవాహక ప్రాంతం (బేసిన్)లో వర్షాలు కురుస్తుండటంతో గోదావరిలో వరద ఉధృతి క్రమేణ పెరుగుతోంది. ఆదివారం ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి 88,409 క్యూసెక్కులు చేరుతుండగా బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.30 అడుగులకు చేరింది. 10,200 క్యూసెక్కులు గోదావరి డెల్టాకు విడుదల చేస్తూ మిగిలిన 78,209 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు. బ్యారేజీలో మొత్తం 175 క్రస్ట్‌గేట్లకుగాను 129 గేట్లను పైకిలేపి జలాలను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. గోదావరి డెల్టాకు విడుదల చేసిన నీటిలో తూర్పు డెల్టాకు 3 వేలు, మధ్య డెల్టాకు 1,200, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కులు వదిలారు.

ఆల్మట్టిలోకి 23,678 క్యూసెక్కులు

పశ్చిమ కనుమల్లో వర్షపాత విరామం వల్ల కృష్ణా, ఉపనదుల్లో వరద తగ్గింది. ఆల్మట్టి డ్యామ్‌లోకి 23,678 క్యూసెక్కులు చేరుతుండగా.. విద్యుదుత్పత్తి చేస్తూ 3,980 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం ఆల్మట్టి డ్యామ్‌లో 90.33 టీఎంసీల నీరుంది. ఆల్మట్టి నిండాలంటే 39 టీఎంసీలు అవసరం. కృష్ణా ప్రధాన ఉపనది తుంగభద్ర నదిలోను వరద ప్రవాహం తగ్గింది. తుంగభద్ర డ్యామ్‌లోకి 12,194 క్యూసెక్కులు వస్తుండటంతో నీటినిల్వ 31.7 టీఎంసీలకు చేరింది. ఇక తెలుగురాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు అయిన శ్రీశైలంలోకి 1,060 క్యూసెక్కులు చేరుతుండగా.. కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా 1,600 క్యూసెక్కులను తెలంగాణ సర్కార్ తరలిస్తుండటంతో నీటినిల్వ 36.24 టీఎంసీలకు తగ్గింది. నాగార్జునసాగర్‌లోకి వరద ప్రవాహం చేరడం లేదు.

ఆత్మహత్యాయత్నమా... సెల్ఫీ ప్రమాదమా?

తిరుపతి సిటీ (తిరుపతి జిల్లా): ఎస్వీ వెటర్నరీ పశువైద్య కళాశాలలో బీవీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉంది. చిత్తూరుకు చెందిన ఓ విద్యార్థిని వెటర్నరీ కళాశాలలో యూజీ చదువుతూ వర్సిటీ ఆవరణలోని కళాశాల హాస్టల్‌లో ఉంటోంది. ఆదివారం హాస్టల్ భవనం పైకి వెళ్లి సెల్‌ఫోన్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు కింద పడటంతో గాయాలయ్యాయని అధికారులకు సమాచారం అందింది. వెంటనే వర్సిటీ అంబులెన్స్‌లో రుయా ఆస్పత్రికి తరలించి తల్లిదండ్రులకు సమాచారం అందించామని అధికారులు తెలిపారు. రుయా ఆస్పత్రిలో వైద్యులు పరీక్షలు నిర్వహించి వెన్నెముక, కుడి చేయికి బలంగా గాయాలైనట్లు గుర్తించారు. వెంటనే తల్లిదండ్రులు మెరుగైన వైద్యం కోసం ఆమెను తమిళనాడు వేలూరు సీఎంసీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

అసలు కారణం ఏంటి?

యువతికి సెల్ఫీ మోజు ఎక్కువని, ఎప్పుడూ సోషల్ మీడియాలో వీడియోలు, సెల్ఫీలు పెట్టే అలవాటుందని తోటి విద్యార్థులు చెబుతున్నారు. ఆదివారం సెలవు కావడంతో ఉదయం హాస్టల్ భవనంలోని వాటర్ ట్యాంక్‌పైకి ఎక్కి సెల్ఫీ తీసుకుంటున్న క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడినట్లు సమాచారం. మరికొందరు ఆమె సహచరులు మాత్రం ఇది ఆత్మహత్యగా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆమె ప్రతినిత్యం ఏదో ఆలోచిస్తూ ఉంటుందని, ఎవరితోనూ పెద్దగా కలవదని, సెల్‌ఫోన్ అతిగా ఉపయోగిస్తుందని చెబుతున్నారు. దీంతో ఆమెది ఆత్మహత్యాయత్నమా లేదా సెల్ఫీ ప్రమాదామా అనేది తెలియాల్సి ఉంది.

కరెంట్ షాక్‌తో పారిశుధ్య కార్మికుడు మృతి

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఓ పారిశుధ్య కార్మికుడు ఆదివారం ఉదయం కరెంట్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయాడు. కాకినాడ అయోధ్యనగర్‌లోని రోడ్ నంబర్ 5లో నివాసం ఉంటున్న నక్కా గోవింద్(35) కాకినాడ జీజీహెచ్‌లో 18 ఏళ్లుగా పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం 6 గంటలకు విధులకు హాజరయ్యాడు. ఎంఆర్ఐకు విద్యుత్ సరఫరా కోసం కొద్ది నెలల క్రితం ఆస్పత్రిలోని డంప్ యార్డ్‌కు ఆనుకొని ఒక భారీ జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. ఆ జనరేటర్‌కు, గోడకు మధ్య ఉన్న ఖాళీ స్థలాన్ని శుభ్రం చేసేందుకు గోవింద్ ప్రయత్నించాడు. ఈ క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గోవింద్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఆర్‌డీవో ఇట్ల కిశోర్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.



ట్రంప్‌పై హత్యాయత్నం

ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తుండగా కాల్పులు

షికాగో/వాషింగ్టన్: అమెరికా చరిత్రపై మరో రక్తపు మరక. ఆ దేశ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (78)పై హత్యా యత్నం జరిగింది. నవంబర్లో జరగనున్న ఎన్నికల్లో గెలిచి మరోసారి అధ్యక్ష పదవి చేపట్టేందుకు రిపబ్లికన్ల అభ్యర్థిగా సర్వశక్తులూ ఒడ్డుతున్న ఆయన ఈ ప్రాణాంతక దాడి నుంచి త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డారు. స్థానిక కాలమానం ప్రకారం శనివారం పెన్సిల్వేనియాలోని బట్లర్ టౌన్‌లో ఔట్‌డోర్ ఎన్నికల ర్యాలీలో ఉండగా ఈ ఘోరం జరిగింది. భారీగా హాజరైన మద్దతుదారులు, అభిమానులను ఉద్దేశించి సాయంత్రం ఆరు గంటలకు ట్రంప్ ప్రసంగం మొదలు పెట్టారు. అప్పటికే సమీప గోడౌన్‌పై నక్కిన ఓ దుండగుడు ఏఆర్ శ్రేణి ఆటోమేటిక్ అసాల్ట్ రైఫిల్‌తో ట్రంప్‌పైకి కనీసం ఐదు రౌండ్లకు పైగా కాల్పులు జరిపాడు. దాంతో ఒక్కసారిగా గందరగోళం చెలరేగింది. అరుపులు, కేకలు, ఆక్రందనలు, పారిపోతున్న జనాలతో పరిస్థితి గందరగోళంగా మారింది. ఒక తూటా ట్రంప్ కుడి చెవి పై భాగాన్ని గాయపరిచింది. మరిన్ని తూటాలు ఆయన తలకు అతి సమీపం నుంచి దూసుకెళ్లాయి. ట్రంప్ బాధతో తన చెవిని చేత్తో పట్టుకుంటూనే తూటాల నుంచి తప్పించుకునేందుకు వెంటనే డయాస్ కిందకు వంగారు. ఆలోపే సీక్రెట్ సర్వీస్ సిబ్బంది టంప్రను చుట్టుముట్టి రక్షణ కవచంలా నిలిచారు. చెవి నుంచి కుడి చెంప మీదుగా రక్తమోడుతున్న ట్రంప్‌ను హుటాహుటిన వేదిక నుంచి తీసుకెళ్లి కార్లో కూర్చోబెట్టి సురక్షితంగా తరలించారు. వేదికను వీడుతూ ట్రంప్ పిడికిలి బిగించి పైకెత్తి, సభికులనుద్దేశించి 'ఫైట్' అని పదే పదే భావోద్వేగంతో బిగ్గరగా నినాదాలు చేశారు. వారు కూడా తమ నేతకు మద్దతుగా ఫైట్ అంటూ పెద్దపెట్టున ప్రతి నినాదాలు చేశారు. అక్కణ్నుంచి ట్రంప్‌ను హుటాహుటిన పిట్స్‌బర్గ్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కారెక్కే ముందు కూడా ట్రంప్ మరోసారి పిడికిలి బిగించి నినాదాలు చేశారు. ఈ మొత్తం ఉదంతానికి సంబంధించిన వీడియో ప్రపంచమంతటా వైరలవుతోంది. ట్రంప్ క్షేమంగా ఉన్నట్టు అనంతరం ఆయన ప్రచార కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. దుండగుని కాల్పుల్లో సభికుల్లో ఒకరు దుర్మరణం పాలయ్యారు. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సమీప భవనాలపై మోహరించి ఉన్న సీక్రెట్ సర్వీస్ స్నైపర్లు తక్షణం స్పందించి దుండగున్ని కాల్చి చంపారు. అతన్ని 20 ఏళ్ల థామస్ మాథ్యూ క్రూక్స్ అనే యువకునిగా గుర్తించారు. అతను కాల్పులకు తెగబడేందుకు కారణం తెలియాల్సి ఉంది. అమెరికా వంటి అగ్ర రాజ్యంలో మాజీ అధ్యక్షుని స్థాయి నేతపై ఇంత సమీపం నుంచి కాల్పులు జరగడం ఘోర భద్రతా వైఫల్యమేనంటున్నారు. ఈ ఘటనపై ఎఫ్‌బీఐ పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుపుతోంది. ట్రంప్‌పై దాడితో ప్రపంచం నివ్వెరపోయింది. హత్యా యత్నాన్ని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్, ప్రధాని నరేంద్ర మోదీతో సహా దేశాధినేతలంతా ఈ ఘటనను ఖండించారు.


ట్రంప్ చుట్టూ రక్షణ కవచంలా కమ్ముకుంటున్న సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు


సిబ్బంది రక్షణ మధ్య డయాస్‌పై కిందికి వంగిన ట్రంప్



దాడి అనంతరం ట్రంప్‌ను సురక్షితంగా తరలిస్తున్న భద్రతా సిబ్బంది

దేవుడే కాపాడాడు: ట్రంప్



ప్రాణాంతక దాడి నుంచి తనను భగవంతుడే రక్షించాడని ట్రంప్ అన్నారు. కాల్పుల ఘటనపై తన సొంత సోషల్ మీడియా 'ట్రూత్'లో ఆయన స్పందించారు. కాల్పుల్లో మరణించిన, గాయపడ్డ వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ''నిర్భయంగా ముందుకెళ్దాం. ఈ సమయంలో అమెరికన్లమంతా మరింత సమైక్యంగా నిలబడాల్సిన అవసరముంది. అమెరికన్లుగా మన వ్యక్తిత్వాన్ని చాటాల్సిన, దుష్టశక్తి గెలవకుండా అడ్డుకోవాల్సిన సమయమిది. మిమ్మల్ని, మన దేశాన్ని నేను త్రికరణశుద్ధిగా ప్రేమిస్తున్నా. త్వరలో విస్కాన్సిన్ సభ ద్వారా మీ అందరినీ ఉద్దేశించి మాట్లాడేందుకు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా'' అని రిపబ్లికన్ పార్టీ మూడు రోజుల సదస్సును ఉద్దేశించి అన్నారు. ఈ సదస్సులో అధ్యక్ష అభ్యర్థిని అధికారికంగా ప్రకటించనుండటం తెలిసిందే.

> **జుయ్‌మంటూ తూటాలు దూసుకెళ్తున్న శబ్దాలు స్పష్టంగా విన్పించాయి. ఏదో జరుగుతోందని అనుకునేంతలో ఓ తూటా నా కుడి చెవి పై భాగాన్ని ఛిద్రం చేసింది. చర్మం తెగిపోయింది. విపరీతంగా రక్తం కారింది. ఏం జరుగుతోందో అప్పటికి నాకర్థమైంది. అమెరికా వంటి దేశంలో ఇలాంటి చర్య జరగడం అనూహ్యం. గాడ్ బ్లెస్ అమెరికా**
>
> - తనపై కాల్పులను ఉద్దేశించి సొంత సోషల్ మీడియా 'ట్రూత్'లో డొనాల్డ్ ట్రంప్

120 మీటర్ల నుంచే కాల్పులు

ట్రంప్‌పై కాల్పుల ఘటనపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. కేవలం 120 నుంచి 150 మీటర్ల దూరం నుంచి కాల్పులు జరిగినట్టు ప్రాథమికంగా తేలింది. అత్యంత కట్టుదిట్టమైన భద్రతా వలయంలో ఉండే అమెరికా మాజీ అధ్యక్షునిపైకి ఇంత సమీపం నుంచి కాల్పులు జరపడం నమ్మశక్యం కాని విషయమని ఎఫ్‌బీఐ స్పెషల్ ఏజెంట్ కెవిన్ రోజెక్ అన్నారు. అంతమంది భద్రతా సిబ్బంది రక్షణలో ఉన్న ట్రంప్‌పైకి దుండగుడు అన్ని రౌండ్ల పాటు కాల్పులు జరపగలగడం వింతగా ఉందని అభిప్రాయపడ్డారు. ''దుండగుడు అంత సమీపానికి ఎలా రాగలిగాడు, ఎవరు సహకరించారు వంటి కోణాల్లోనూ దర్యాప్తు జరుగుతుంది'' అని చెప్పారు.

దుండగుడు రిపబ్లికన్ ఓటరే



ట్రంప్‌పై కాల్పులకు తెగబడ్డ థామస్ మాథ్యూ క్రూక్స్ రిపబ్లికన్ పార్టీ ఓటరుగా నమోదు చేసుకున్నట్టు తేలడం విశేషం. అయితే 2021లో డెమొక్రటిక్ పార్టీ అనుబంధ విభాగానికి 15 డాలర్ల విరాళం ఇచ్చినట్టు కూడా వెల్లడైంది. కొద్ది రోజుల ముందే ట్రంప్‌ను ద్వేషిస్తూ, రిపబ్లికన్ పార్టీని విమర్శిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడట. క్రూక్స్‌ది పెన్సిల్వేనియాలో పిట్స్‌బర్గ్ శివార్లలోని బెథెల్ పార్క్ అని తేలింది. బతికుంటే ఈ నవంబర్లో అతను తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునేవాడు. మృతదేహం వద్ద గుర్తింపు కార్డుల వంటివేవీ లభించకపోవడంతో అతన్ని గుర్తించడం ఏజెంట్లకు కష్టంగా మారింది. దాంతో చివరికి డీఎన్ఏ పరీక్ష చేసి గుర్తించారు.

దుండగుని ముందస్తు ఏర్పాట్లు!

ట్రంప్‌పై కాల్పులకు తెగబడేందుకు దుండగుడు ముందుగానే పక్కాగా ఏర్పాట్లు చేసుకున్నట్టు భావిస్తున్నారు. దాడికి పాల్పడ్డ గోడౌన్ వంటి భవనం ర్యాలీకి అతి సమీపంలో ఉంది. దానిపైకి చేరుకునేందుకు ఒక నిచ్చెన కూడా ఏర్పాటు చేసి ఉంది. అతని మృతదేహం పక్కన పలు రకాలైన ప్యాకేజీలను పోలీసులు గుర్తించారు. వాటిలో పేలుడు పదార్థాలు ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

భీతావహంగా ఘటనా స్థలి

ట్రంప్‌పై హత్యా యత్నం జరిగిన బట్లర్ కేవలం 13 వేల జనాభా ఉండే చిన్న పట్టణం. పశ్చిమ పెన్సిల్వేనియాలో పిట్స్‌బర్గ్‌కు 33 మైళ్ల దూరంలో ఉంటుంది. ఆరుబయట మైదాన ప్రదేశంలో ర్యాలీ జరిగింది. తన మార్కు ఎర్ర టోపీ, నల్ల సూటులో ట్రంప్ వేదికపైకి చేరుకుని ప్రసంగం మొదలు పెట్టారు. అమెరికాలోకి అక్రమ వలసలు పెరిగిపోయాయంటూ చార్ట్ సాయంతో వివరిస్తుండగా కాల్పులు మొదలయ్యాయి. దాంతో అంతా ప్రాణభయంతో కేకలు వేశారు. తూటాలను తప్పించుకునేందుకు నేలపై పడుకుండిపోయారు. ఆ ప్రదేశమంతా భీతావహంగా మారింది. ట్రంప్‌ను సురక్షితంగా తరలించాక కూడా చాలాసేపటిదాకా జనం నేలపై పడుకునే కన్పించారు. అనంతరం భద్రతా సిబ్బంది రంగప్రవేశం చేసి ర్యాలీ వేదికను అదుపులోకి తీసుకున్నారు.

ముందే చూసిన జనం...!

ట్రంప్‌పై కాల్పులకు దిగిన దుండగుడు క్రూక్స్‌ను తాము ముందే చూసినట్టు సభికుల్లో పలువురు వెల్లడించారు. అతడు గోడౌన్‌పై నెమ్మదిగా కదులుతూ ట్రంప్‌కు వీలైనంత సమీపంగా వచ్చినట్టు ఇద్దరు ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. కాల్పులకు ముందే క్రూక్స్ చేతిలో తుపాకీని స్పష్టంగా చూసినట్టు మరో ప్రత్యక్ష సాక్షి చెప్పాడు. ''దేవుడా! అతని చేతిలో తుపాకీ ఉందంటూ అరిచా. అంతలోనే కాల్పులకు తెగబడటంతో వెంటనే నేలపై పడుకుని తలెత్తి చూశా. ఏజెంట్ల తూటాలకు అతని తల పేలిపోవడాన్ని కళ్లారా చూశా'' అని చెప్పుకొచ్చాడు.

పెరిగిన ట్రంప్ విజయావకాశాలు!

అధ్యక్ష ఎన్నికల రేసులో ఇప్పటికే దూసుకుపోతున్న ట్రంప్ విజయావకాశాలు కాల్పుల ఉదంతం నేపథ్యంలో మరింతగా పెరిగినట్టు చెబుతున్నారు. ఆయన విజయావకాశాలు గత 24 గంటల్లోనే 8 శాతం పెరిగి ఏకంగా 70 శాతానికి చేరినట్టు రాజకీయ అంచనాల వేదిక పాలీ మార్కెట్ పేర్కొంది. అంతటి ప్రాణాపాయ పరిస్థితిలోనూ ట్రంప్ అత్యంత వీరోచితంగా వ్యవహరించారంటూ అన్నివైపుల నుంచీ ప్రశంసల వర్షం కురుస్తోంది. ''తల పక్కనుంచి తూటాలు దూసుకెళ్లాయి. ఒకటి చెవిని ఛిద్రం చేసింది. అయినా ట్రంప్ అస్సలు భయపడలేదు. ప్రాణాలు కాపాడుకోవడానికి మోకాళ్లపై పాక్కుంటూ పోవడం వంటివేవీ చేయలేదు. ఏ మాత్రం వెరవకుండా తిరిగి లేచి నుంచున్నారు. భద్రతా సిబ్బందిని నిలువరించి మరీ పిడికిలి బిగించి పోరాట నినాదాలు చేశారు'' అంటూ పలువురు మద్దతుదారులు ప్రశంసిస్తున్నారు.

ట్రంప్‌తో మాట్లాడిన బైడెన్

హత్యా యత్నంపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ విస్మయం వెలిబుచ్చారు. ఈ దారుణ ఘటనను అంతా తీవ్రంగా ఖండించాల్సిన అవసరముందన్నారు. ట్రంప్ క్షేమంగా ఉండటం పట్ల హర్షం వెలిబుచ్చారు. ఆయనకు ఫోన్ చేసి మాట్లాడారు. అనంతరం బైడెన్ ప్రజలనుద్దేశించి కూడా మాట్లాడారు. ఇలాంటి హింసకు అమెరికాలో తావు లేదన్నారు. షెడ్యూల్ ప్రకారం వారాంతాన్ని గడిపేందుకు బైడెన్ డెలావెర్ వెళ్లాల్సి ఉన్నా పర్యటన రద్దు చేసుకుని వైట్‌హౌస్‌కు తిరిగొచ్చారు. ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌తో పాటు మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, బిల్ క్లింటన్, జార్జి బుష్, డెమొక్రటిక్, రిపబ్లికన్ పార్టీ నేతలు తదితరులు కూడా దాడిని తీవ్రంగా ఖండించారు.

మోదీ ఖండన

ట్రంప్‌పై హత్యా యత్రాన్ని ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో, రాజకీయాల్లో హింసకు తావు లేదని స్పష్టం చేశారు. ''నా మిత్రుడు ట్రంప్‌పై దాడి పట్ల తీవ్రంగా ఆందోళన చెందా. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా'' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దేశాధినేతలు మాక్రాన్ (ఫ్రాన్స్), స్టార్మర్ (బ్రిటన్), ఆల్బనీస్ (ఆస్ట్రేలియా), మెలోనీ (ఇటలీ), కిషిదా (జపాన్), ట్రూడో (కెనడా), జెలెన్‌స్కీ (ఉక్రెయిన్), నెతన్యాహూ (ఇజ్రాయెల్) తదితరులు కూడా దాడిని తీవ్రంగా ఖండించారు.

ఎప్పుడు ఏమి జరిగిందంటే

అమెరికా స్థానిక కాలమానం ప్రకారం శనివారం సాయంత్రం ఆరింటికి ర్యాలీని ఉద్దేశించి ట్రంప్ ప్రసంగం మొదలైంది. తర్వాతేం జరిగిందంటే...

6:11:33 - ట్రంప్‌పై కాల్పులు జరిగాయి. ఒక తూటా కుడి చెవికి తాకడంతో బాధతో ముఖాన్ని తడుముకున్నారు

6:11:35 - తూటాల నుంచి తప్పించుకునేందుకు డయాస్ కిందికి వంగారు. 'గెట్ డౌన్' అని అరుస్తూ భద్రతా సిబ్బంది పోడియం పైకి దూసుకొచ్చారు. రక్షణ కవచంలా ట్రంప్‌ను చుట్టుముట్టారు. అంతలో మరిన్ని తూటాలు దూసుకొచ్చాయి.

6:11:41 - 'ఏం చేస్తున్నాం మనం? ఏం జరుగుతోంది?' అంటూ మహిళా ఏజెంట్ కేకలు. జనం కేకలు, అరుపులు. అంతటా గందరగోళం

6:11:50 - మళ్లీ కాల్పుల చప్పుడు. ఒక మహిళ ఆక్రందన

6:11:58 - ''స్పేర్ (కారు) దగ్గరికి కదలండి'' అంటూ ట్రంప్ భద్రతా ఏజెంట్ల పరస్పర హెచ్చరికలు

6:12:06 - 'హాక్‌ఐ (కౌంటర్ అటాక్ టీం) వచ్చేసింది, కారు వైపు వెళ్దాం' అన్న భద్రతా సిబ్బంది

6:12:09 - సిద్ధంగా ఉండాలంటూ కార్లోని సిబ్బందికి సూచనలు

6:12:21 - షూటర్ చనిపోయాడని నిర్ధారించుకున్న ట్రంప్ భద్రతా సిబ్బంది

6:12:22 - కారువైపు కదిలేందుకు సేఫేనా అంటూ ఏజెంట్ల ఆరా

6:12:23 - 'అంతా సేఫ్, కారువైపు పదండి' అన్న మరో ఏజెంట్. ట్రంప్‌ను పైకి లేపిన సిబ్బంది.

6:12:35 - అంతా ఓకే అని ట్రంప్‌కు చెప్పిన ఏజెంట్లు


6:12:36 - తన షూ వేసుకోనివ్వాలన్న ట్రంప్

6:12:37 - 'ఆగండి సర్. మీ తలంతా రక్తం' అని ట్రంప్‌తో ఓ ఏజెంట్

6:12:39 - 'సర్, మనం కారువైపు కదలాలి' అన్న మరో ఏజెంట్

6:12:47 - 'ఆగండి, ఆగండి' అంటూ భద్రతా సిబ్బందిని నిలువరించిన ట్రంప్. జనంకేసి చూస్తూ పిడికిలి బిగించి 'ఫైట్' అంటూ బిగ్గరగా నినాదాలు. అంతే బిగ్గరగా బదులిచ్చిన జనం

6:12:54 - 'మనమిక వెళ్లాలి' అంటూ ట్రంప్‌ను కారుకేసి తీసుకెళ్లిన భద్రతా సిబ్బంది. మరోసారి నినాదాలు చేస్తూ కార్లో కూర్చున్న ట్రంప్




రత్నభండార్‌ను తెరుస్తున్న సందర్భంగా జగన్నాథాలయం వెలుపల భక్తులు

పూరీలో తెరుచుకున్న.. రత్నభండార్

భువనేశ్వర్: అశేష భక్తజనం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. ఒడిశాలోని ప్రఖ్యాత పూరీ జగన్నాథ స్వామికి శతాబ్దాలుగా రాజులు, భక్తులు కానుకగా సమర్పించిన వజ్రాభరణాలు, వెండి, బంగారు నిల్వలను దాదాపు 46 ఏళ్ల తర్వాత తొలిసారిగా తనిఖీచేయనున్నారు. ఆభరణాలను తూకం వేసి, నాణ్యత లెక్కించి, అవసరమైతే మరమ్మతులు చేయనున్నారు. ఆలయంలోని రహస్య ఖజానా గది జీర్ణావస్థకు చేరిన నేపథ్యంలో గదికి మరమ్మతులు చేయనున్నారు. అంతవరకు అపారమైన ఖజానాను జాగ్రత్తగా వేరేచోట భద్రపరచనున్నారు. ప్రభుత్వ కమిటీ సభ్యులు ఆదివారం మధ్యాహ్నం ఆలయానికి చేరుకున్నారు. ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు చేసి ఖజానా యజమానులైన విమలా మాత, మహాలక్ష్మీ ఆజ్ఞ తీసుకున్నారు. తర్వాత ఖజానాకు రక్షకుడైన లోకనాథ్ స్వామి అనుమతి తీసుకున్నారు. మధ్యాహ్నం 1.28 గంటలకు ఖజానా గది తలుపులు తెరిచారు. 11 మంది మాత్రమే సంప్రదాయ దుస్తుల్లో గదిలోకి వెళ్లారు. ఆభరణాలను లెక్కించకుండానే సాయంత్రం 5.20కి బయటికి వచ్చారు.

తరలింపు మరో రోజున


''లోపలి గది తాళాలు తెరుచుకోకపోవడంతో వాటిని పగలగొట్టి తెరిచాం. ఆభరణాలు, విలువైన వస్తువులను తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లోకి తరలించి సీల్ వేశాం. అన్నింటినీ ఒకే రోజు తరలించడం కష్టం. త్వరలో తేదీని నిర్ణయించి తరలింపు మొదలెడతాం. రిపేర్ల తర్వాత ఆభరణాలకు విలువ కట్టే పని మొదలుపెడతాం' అని ఏఎస్ఐ శాఖ అధికారులు వెల్లడించారు. గదిలోని ఆభరణాలను తరలించేందుకు సిద్ధం చేసిన 4.5 అడుగుల పొడవు, 2.5 అడుగుల వెడల్పు, 2.5 అడుగుల లోతున్న పెద్ద టేకు చెక్కపెట్టెలను గది వద్దకు తెప్పించారు. గదిలో పాములేవీ లేవని తేలింది.

'ఎక్స్'లో మోదీ ఫాలోయర్లు 10 కోట్లు..!



న్యూఢిల్లీ: సామాజిక మాధ్యమ వేదికలపై ఎల్లప్పుడూ చురుగ్గా ఉండే ప్రధాని మోదీ మరో మైలురాయిని అధిగమించారు. 'ఎక్స్'హ్యాండిల్‌లో ప్రధాని మోదీ ఫాలోయర్ల సంఖ్య ఆదివారం రికార్డు స్థాయిలో 10 కోట్లను దాటిపోయింది. గత మూడేళ్లలో అదనంగా 3 కోట్ల మంది ఫాలోయర్లు నమోదవడంతో మోదీ ఈ ఘనత సాధించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో అత్యధిక ఫాలోయర్లు కలిగిన ప్రపంచ నేతల్లో ఒకరిగా ఆయనకు ఇప్పటికే పేరుంది. దేశంలో ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్‌కు 2.75 కోట్ల మంది, కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీకి 2.64 కోట్ల మంది ఫాలోయర్లు ఉన్నారు. ప్రపంచ నేతల్లో అమెరికా అధ్యక్షుడు బైడెన్‌కు 3.81 కోట్ల మంది, తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగన్‌కు 2.15 కోట్ల మంది ఫాలోయర్లు ఉన్నారు. క్రీడాకారుల్లో క్రికెటర్ విరాట్ కోహ్లికి 6.41 కోట్ల మంది, ఫుట్‌బాల్ క్రీడాకారుడు నెయ్‌మార్‌కు 6.36 కోట్లు, అమెరికా బాస్కెట్ బాల్ క్రీడాకారుడు లెబ్రాన్ జేమ్స్‌కు 5.29 కోట్ల మంది ఫాలోయర్లు ఉన్నారని 'ఎక్స్'అధికారి ఒకరు వివరించారు. అమెరికాకు చెందిన సెలెబ్రిటీ టేలర్ స్విఫ్ట్‌కు 9.53 కోట్లు, లేడీ గాగాకు 8.31 కోట్లు, కిమ్ కర్దాషియన్‌కు 7.52 కోట్ల మంది ఫాలోయర్లు ఉన్నట్లు తెలిపారు.

నేపాల్ నూతన ప్రధానిగా కేపీ శర్మ ఓలి



కఠ్మాండు: నేపాల్ ప్రధానమంత్రిగా ఖడ్గ ప్రసాద్ శర్మ ఓలి నాలుగోసారి నియమితులయ్యారు. ఆదివారం అధ్యక్షుడు రాం చంద్ర పౌడెల్ ఆయన్ను ప్రధానిగా నియమించారు. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్- యూనిఫైడ్ మార్కిస్ట్ లెనినిస్ట్ (సీపీఎన్-యూఎంఎల్)-నేపాలీ కాంగ్రెస్(ఎన్‌సీ)లతో కొత్తగా ఏర్పాటైన సంకీర్ణ ప్రభుత్వానికి చైనా అనుకూలవాదిగా పేరున్న ఓలి నాయకత్వం వహించనున్నారు. పార్లమెంట్‌లో శుక్రవారం జరిగిన విశ్వాస పరీక్షలో పుష్ప కమల్ దహల్ ప్రచండ ఓడిపోవడంతో కొత్త ప్రభుత్వం ఏర్పాటు అనివార్యమైంది. ఓలితోపాటు ఆయన మంత్రివర్గం సోమవారం ప్రమాణం చేయనుంది. గతంలో నేపాల్ ప్రధానిగా కేపీ శర్మ ఓలి 2015-16, 2018-2021 సంవత్సరాల మధ్యలో పనిచేశారు. అయితే, అప్పటి రాజకీయ పరిణామాల నేపథ్యంలో 2021 మే 13వ తేదీన మరోసారి ఓలిని రాష్ట్రపతి బిద్యాదేవి భండారీ ప్రధానిగా నియమించడం వివాదమైంది. ఈ నియమాకం రాజ్యాంగ విరుద్ధమంటూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించడంతో ఓలి అప్పట్లో రాజీనామా చేయాల్సి వచ్చింది. తాజాగా ఏర్పడిన సంకీర్ణంలో మరో ఐదు పార్టీలు చేరే అవకాశాలున్నాయంటున్నారు.

నా పైనా రెండు హత్యాయత్నాలు: మస్క్



వాషింగ్టన్: గత ఎనిమిది నెలల కాలంలో తనపై రెండుసార్లు హత్యాయత్నం జరిగినట్లు బిలియనీర్, టెస్లా సీఈవో ఎలన్ మస్క్ వెల్లడించారు. టెక్సాస్‌లోని టెస్లా ప్రధాన కార్యాలయం సమీపంలో తుపాకులతో ఉన్న వ్యక్తులను భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారన్నారు. అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్‌పై హత్యాయత్నం నేపథ్యంలో మస్క్ వ్యక్తిగత భద్రతపై ఆయన సొంత సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో ఓ యూజర్ 'దయచేసి మీకున్న భద్రతా ఏర్పాట్లను మూడింతలు పెంచుకోండి. ఇవాళ ట్రంప్.. రేపు మీ వంతు రావచ్చు'అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి మస్క్ స్పందిస్తూ... 'నిజమే, ప్రమాదం పొంచి ఉంది. గత ఎనిమిది నెలల్లో నన్ను చంపేందుకు ఇద్దరు వ్యక్తులు ప్రయత్నం చేశారు. తుపాకీలతో సహా వారిని అరెస్ట్ చేశారు'అని తెలిపారు. ఏ సమయంలోనైనా తాను హత్యకు గురి కావచ్చునంటూ గతంలోనూ మస్క్ ఆందోళన వ్యక్తం చేశారు.

'జుక్తోసాధన' భారత సంప్రదాయం

ప్రస్తుతం పరమత సహనంపై దృష్టిపెట్టాలన్న ఆర్థికవేత్త అమర్త్యసేన్




కోల్‌కతా: మతాలకతీతంగా హిందువులు, ముస్లింలు కలిసి జీవించడం, పనిచేసుకోవడం భారత సంప్రదాయమని ప్రముఖ ఆర్థిక వేత్త, నోబెల్ గ్రహీత అమర్త్యసేన్ అన్నారు. అలీపూర్ జైలు మ్యూజియంలో జరిగిన పుస్తక పఠన కార్యక్రమంలో యువతను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ''మన దేశ చరిత్రను చూస్తే.. కొన్ని యుగాలుగా హిందువులు, ముస్లింలు మతసామరస్యంతో కలిసిమెలసి జీవిస్తున్నారు. క్షితిమోహన్ సేన్ దీనిని 'జుక్తోసాధన' అన్నారు. ఒకమతం వారు ఇంకో మతంపై విద్వేషాన్ని ప్రదర్శిస్తున్న ప్రస్తుత కాలంలో ఈ సిద్ధాంతంపై మనం దృష్టి పెట్టాల్సి ఉంది. పిల్లలు ఇలాంటి విషపూరిత భావజాల బారిన పడకపోవడం వల్లే వారు ఎలాంటి భేదభావాలు లేకుండా బతుకుతున్నారు. సమాజంలో పరమత సహనం విలువలను పెంపొందించాల్సిన అవసరం ఉంది. 'జుక్తోసాధన' సామాజిక సేవ, కళల్లో వ్యక్తమవుతోంది'' అని ఆయన అన్నారు. ఉపనిషత్తులను పార్శీలోకి అనువదించిన ముంతాజ్ కుమారుడు దారా షికోను ప్రస్తావిస్తూ దేశంలోని బహుళ సంస్కృతిని గుర్తు చేశారు.

ఆందోళనకరంగా కేజ్రీవాల్ ఆరోగ్యం: ఆప్



న్యూఢిల్లీ: జైలులో ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఆరోగ్యం ఆందోళనకరంగా మారిందని ఆప్‌నకు చెందిన మంత్రి అతిశీ పేర్కొన్నారు. జైలులో ఉన్న కాలంలో కేజ్రీవాల్ 8.5 కిలోల వరకు బరువు తగ్గారని, రక్తంలో చక్కెర స్థాయి నిద్రిస్తున్న సమయంలో 50 కంటే దిగువకు పడిపోతోందని పేర్కొన్నారు. తప్పుడు కేసులో ఇరికించి, బీజేపీ ఆయన్ను జైలులోనే ఉంచాలని కుట్ర పన్నిందని అతిశీ ఆరోపించారు. వెంటనే జైలు నుంచి విడుదల చేసి, సరైన వైద్యం అందించకుంటే ఆయనకు ఏదైనా ప్రమాదం జరగొచ్చని, అందుకు బాధ్యతెవరిదని ఆమె ప్రశ్నించారు. మద్యం కుంభకోణంలో మనీ లాండరింగ్ ఆరోపణలనెదుర్కొంటున్న కేజ్రీవాల్‌ను ఈడీ మార్చి 21న అరెస్ట్ చేసింది.

తమిళనాడు బీఎస్పీ చీఫ్ హంతకుని ఎన్‌కౌంటర్



చెన్నై: తమిళనాడు బహుజనసమాజ్ పార్టీ(బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసు నిందితుడు కె.తిరువేంగడమ్(33) పోలీసు ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడు. కస్టడీలో ఉన్న అతను తప్పించుకున్నాడని, వెతికి అరెస్ట్ చేయబోతే దేశవాళీ పిస్టల్‌తో కాల్పులు జరిపాడని తమిళ పోలీసులు చెప్పారు. ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన ఎదురుకాల్పుల్లో తిరువేంగడమ్ చనిపోయాడని స్పష్టంచేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యకు వినియోగించిన స్వాధీనంచేసుకునేందుకు నిందితుడిని వెంటబెట్టుకుని ఎస్కార్ట్ పోలీసు బృందం ఆదివారం తెల్లవారుజామున బయల్దేరింది. మార్గమధ్యంలో ఒక చెరువు సమీపంలో నిందితుడు కాలకృత్యాల కోసం పోలీసు వాహనం ఆపారు. ఈ సమయంలో ఎస్కార్ట్ పోలీసులను తోసేసి అక్కడి నుంచి నిందితుడు పరారయ్యాడు. అటవీప్రాంతంలో అతని ఆచూకీ కనిపెట్టారు. నిందితుడు కాల్పులు జరిపాడు. ఎదురుకాల్పుల్లో తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రికి తరలించేలోపే కన్నుమూశాడు.

నిందితుడి తరలింపులో ఇంత నిర్లక్ష్యమా: పళనిస్వామి

ఎన్‌కౌంటర్ ఘటనపై విపక్ష నేత, అన్నాడీఎంకే చీఫ్ కె.పళనిస్వామి స్పందించారు. ''వాహనంలో తరలించేటపుడు నిందితుడికి బేడీలు వేశారా?. కస్టడీలో ఉన్న వ్యక్తి విషయంలో ఇంత నిర్లక్ష్యమా? తెల్లవారుజామునే ఎందుకు తరలించారు? అసలు నిందితులను కాపాడేందుకు బూటకపు ఎన్‌కౌంటర్ చేశారన్న అనుమానాలొస్తున్నాయి' అన్నారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
సోమవారం । 15 । జూలై । 2024

హరిత శోభ



ఆదివారం బెళగావి దగ్గర కనబర్గి గ్రామంలో పొలం పనులు. మంచి వర్షాలు రావడంతో ఎటుచూసినా పచ్చదనంతో ఆకట్టుకుంటోంది.

న్యూస్‌రీల్

31 టీఎంసీలకు తుంగభద్ర



తుంగభద్ర డ్యాంలో నీటిమట్టం

హొసపేటె: మల్నాడులో భారీ వర్షాలు కురుస్తుండటంతో తుంగభద్ర డ్యామ్‌కు వరద నీరు వచ్చి చేరుతోంది. ఆదివారం 31 టీఎంసీలకు చేరుకుంది. శివమొగ్గ జిల్లా గాజనూరులో ఉన్న తుంగా జలాశయం వరద నీటితో పరవళ్లు తొక్కుతోంది. దీంతో నీటిని అధికారులు దిగువకు విడుదల చేశారు. మరో రెండు మూడు రోజులు డ్యామ్‌కు భారీగా నీరు చేరే అవకాశం ఉంది. శివమొగ్గ, ఆగుంబె, శృంగేరి, తీర్థహళ్లి, మొరాళ్లు తదితర ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం టీబీ డ్యామ్‌లో నీటిమట్టం 1606.81 అడుగులు, ఇన్‌ఫ్లో 1456 క్యూసెక్కులు ఉందని మండలి అధికారులు తెలిపారు.

స్నేహమేరా జీవితం



రాజరత్న అవార్డులను అందజేసిన దృశ్యం

తుమకూరు: నేటికాలంలో మనిషికి, మనిషికి మధ్య స్నేహం కూడా లేకుండా పోతోందని సాహితీవేత్త డాక్టర్. బరగూరు రామచంద్రప్ప అన్నారు. తుమకూరు నగరంలోని కన్నడ భవనంలో అమరజ్యోతి కళా బృందం ఆధ్వర్యంలో డాక్టర్. రాజరత్న, అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. సీనియర్ కన్నడ నాడు సుందర్ రాజు, డాక్టర్. లక్ష్మణ్‌దాస్‌కు ఈ అవార్డులను ప్రదానం చేశారు. కన్నడ కంఠీరవ డాక్టర్.రాజ్ కుమార్ అత్యంత స్నేహమయి అనిపించుకున్నారని, అందువల్లనే అనేకమంది అభిమానులను పొందారని అన్నారు. రైతులను దేవుళ్లు అని నమ్మిన గొప్పనటులు అని అన్నారు.

బైక్- కారు ఢీ, ఇద్దరు మృతి



ప్రమాదస్థలిలో బైక్, కారు

యశవంతపుర: కారు బైకును ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందిన ఘటన చిత్రదుర్గ జిల్లా హొసదుర్గ తాలూకా బోకికెరె గ్రామం వద్ద జరిగింది. చిక్కమగళూరు జిల్లా సిద్దాపుర గ్రామానికి చెందిన ప్రవీణ్ (26), హొసదుర్గ తాలూకా కడివాణకట్టె గ్రామానికి చెందిన యోగీశ్ (27)లు మృతి చెందారు. శనివారం అర్ధరాత్రి హొసదుర్గ నుంచి సిద్దాపురకు బైకుపై వెళుతుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. బైక్ నుజ్జునుజ్జు కాగా ఇద్దరూ తీవ్ర గాయాలతో అక్కడే మరణించారు. హొసదుర్గ పోలీసులు చేరుకుని మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు.

ఆగుంబె ఘాట్‌లో ఆగమాగం



పలుచోట్ల విరిగిపడిన రాళ్లు, మట్టిపెళ్లలు

శివమొగ్గ: శివమొగ్గ నగరంతో పాటు జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రధాన రహదారి అయిన ఆగుంబె ఘాట్ అతలాకుతలమవుతోంది. ఈ ఘాట్ రోడ్డులో రోజూ వేలాది వాహనాలు తిరుగుతుంటాయి. రోడ్డుకు ఇరువైపునా బండరాళ్లు, మట్టిపెళ్లలు కూలి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ రోడ్డులో శనివారం రాత్రి కొన్నిచోట్ల పెళ్లలు విరిగిపడ్డాయి, దీంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. ఘాట్ మలుపుల్లో వాననీరు ప్రవాహంతో పాటు బురద, రాళ్ల వల్ల పరిస్థితి ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా ఈ ఘాట్ రోడ్డులో ఉన్న ఐదు, ఆరవ క్రాస్‌లో ఎక్కువగా మట్టి చరియలు పడిపోతున్నాయి. ప్రస్తుతం కుండపోత వర్షాలు పడుతుండడం వల్ల కొన్ని రోజుల పాటు ఇలాగే ఉంటుందని, వాహనాలు ప్రత్యామ్నాయ మార్గాలలో వెళ్లడం మంచిదని స్థానికులు తెలిపారు.



ఆదివారం కార్వార నగరంలో వర్షం



ధార్వాడలో జోరు వాన

కుంభవృష్టి అలర్ట్

కోస్తా, పరిసర జిల్లాల్లో భారీ వర్షాలు

- లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయం
- కావేరి, తుంగ, భద్ర నదులకు వరద
- పలు జిల్లాల్లో జన జీవనానికి ఇబ్బందులు

బనశంకరి: రాష్ట్రంలో మళ్లీ రుతుపవన వర్షాలు ఊపందుకున్నాయి. గత రెండు రోజులుగా ఉత్తర కన్నడ, కొడగు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో జలాశయాల్లోకి నీరు చేరుతోంది. కొడగులో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో హారంగి జలాశయం చుట్టుపక్కల ముంపు భయం నెలకొంది. గత కొన్నిరోజుల నుంచి పశ్చిమ కనుమల్లో భారీ వర్షాలు కురుస్తుండగా నదులు, వాగులు పరుగులు పెడుతున్నాయి. కబిని, హారంగి డ్యాంలు కళకళలాడుతున్నాయి. కొడగు జిల్లాలో ఆదివారం పెనుగాలితో కుండపోత కురిసింది. కుశాలనగరలోని హారంగి జలాశయానికి 3 గంటల్లో 3 వేల క్యూసెక్కులు నీరుచేరింది. నదిలోని నీటిని పెద్దమొత్తంలో బయటకు విడుదల చేశారు. కావేరి, హారంగి నదుల చుట్టుపక్కల లోతట్టు గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని చాటింపు వేయించారు.

కరావళి, మలెనాడులో రెడ్ అలర్ట్

కరావళి, మలెనాడు, ఉత్తర కన్నడ, ఉడుపి, దక్షిణ కన్నడ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలంటూ అధికారులు రెడ్ అలర్ట్‌ను ప్రకటించారు. ఉత్తర కన్నడ జిల్లా అంకోలా, కుమటా, కద్ర గెరుసోప్ప, హొన్నావరలో జనజీవనం స్తంభించిపోయింది. సముద్రంలోకి చేపలు వేటకు వెళ్లరాదని ఆదేశించారు. ఉడుపి జిల్లా కార్కళ, కొడగు జిల్లా భాగమండలలో శనివారం 13 సెంటీమీటర్ల కుంభవృష్టి కురిసింది. మలెనాడు, కరావళి ప్రాంతంలో రోడ్లు, వంతెనలు జలమయం కాగా పంటపొలాలు మడుగులయ్యాయి. అనేకచోట్ల ఇళ్లలోకి నీరుచొరబడి ప్రజలు అవస్థలకు గురయ్యారు. కావేరి నదీ పరీవాహక ప్రాంతాల్లో అధిక వర్షం వల్ల ప్రవాహం పెరిగింది. కృష్ణరాజసాగర డ్యాంకు ఇన్‌ఫ్లో ప్రమాణం పెరిగింది. శివమొగ్గ, మలెనాడు ప్రాంతాల్లో వర్షాలతో తుంగా, భద్ర నదులు, డ్యాముల్లో ఇన్‌ఫ్లో అధికమైంది. ఇక బెళగావి జిల్లాలో ఆదివారం నుంచి మూడురోజుల పాటు ఎల్లో అలర్ట్ ప్రకటించారు. ధారవాడ, యాదగిరి, హావేరి, విజయపుర, రాయచూరు, బాగల్‌కోటే తదితర జిల్లాల్లో కూడా ఎల్లో అలర్ట్ ప్రకటించారు. రాబోయే రెండు రోజులు బెంగళూరు నగరం చుట్టుపక్కల మేఘావృతమై సాధారణ వర్షం కురిసే అవకాశముంది.



కార్వార వద్ద హోసదేవతా ఫాల్స్ పరుగులు



సిలికాన్ సిటీలో మేఘావృతమైన ఆకాశం

టూరిస్టులపై నిషేధం

ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున పర్యాటకులు జలాశయాల వీక్షణకు రాకుండా నిషేధం విధించారు. జలపాతాల వద్ద పర్యాటకులు అజాగ్రత్తగా సెల్ఫీలు, ఫోటోలు తీసుకునే ప్రయత్నంలో ప్రమాదాలు సంభవిస్తుంటాయి. ఈ నేపథ్యంలో ఉత్తర కన్నడ జిల్లాలో ప్రముఖ జలపాతాలు, డ్యాంల వద్ద అధికారులు నిషేధం విధించారు. గతంలో సాదోడి, మాగోడు జలపాతం, సిద్దాపుర శాల్కల నదిలో పర్యాటకులు మునిగిపోయిన ఘటనలు జరిగాయి. దాండేలిలో కాళీ నదిలో ఓ కుటుంబం కొట్టుకుపోయింది. హొన్నావర బంగార కుసుమ, కారవార శిరవాడలో జంజే జలపాతం, నాగరముడి జలపాతం, తోడూరి గోలారి తదితర జలపాతాల్లో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడ పర్యాటక మిత్ర పేరుతో కాపలా సిబ్బందిని నియమించారు. మరింత మంది సిబ్బంది అవసరమని పర్యాటక శాఖ డిప్యూటీ డైరెక్టర్ జయంత్ తెలిపారు.



శివమొగ్గ జిల్లాలో ప్రఖ్యాత జోగ్ జలపాతం సొగసులు

ఆర్టీసీ బస్సు చార్జీల పెంపు యోచన



యశవంతపుర: ఆర్టీసీ బస్సు చార్జీలను పెంచే యోచనలో ఉన్నట్లు వాయువ్య కేఎస్ ఆర్టీసీ అధ్యక్షుడు రాజు కాగె తెలిపారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన తరువాత బస్సు టికెట్ చార్జీలను పెంచడంపై ప్రభుత్వం యోచిస్తోందని రాజు కాగె చెప్పారు. నారీ శక్తి యోజనలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణ సౌలభ్యం కల్పించటం వల్ల సంస్థ నష్టాల్లో ఉందని చెప్పడం గమనార్హం. డీజిల్‌తో పాటు బస్సుల విడిభాగాల ధరలు, సంస్థ నిర్వహణ ఖర్చు పెరగడం వల్ల చార్జీలను పెంచాలని భావిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో గత 10 ఏళ్ల నుంచి బస్సు చార్జీలను పెంచలేదన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణ పథకం భారంగా ఉన్నా కూడా సంస్థను నడుపుకొంటూ వెళుతున్నట్లు చెప్పారు. సంస్థకు చెందిన ఆస్తులను అమ్మడంతో పాటు పాత భవనాలను నవీకరణ చేసి బాడుగలకు ఇస్తామన్నారు.

వక్ఫ్ మండలిలోనూ స్వాహా పర్వం?

శివాజీనగర: రాష్ట్ర వాల్మీకి ఆదివాసీ అభివృద్ధి మండలిలో రూ. 185 కోట్ల నిధుల కుంభకోణం కేసు సంచలనంగా మారగా, వక్ఫ్ మండలిలోనూ సొమ్ము అక్రమ బదిలీ అయినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మాజీ సీఇఓ జుల్ఫికారుల్లాకు వ్యతిరేకంగా ప్రధాన లెక్కాధికారి మీర్ అహమ్మద్ బెంగళూరు హైగ్రౌండ్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు తనిఖీ చేపట్టారు. ఆస్తి అమ్మకానికి సంబంధించి రూ.4 కోట్లు మండలి ఖాతాలోకి చేరాయి. 2016లో చింతామణిలో విజయా బ్యాంక్‌లోని ఖాతాకు ఆ సొమ్మును బదిలీ చేశారు. సీఇఓ జుల్ఫికారుల్లా పేరుతో రెండు చెక్కుల ద్వారా నగదు బదిలీ అయ్యింది. మండలి దృష్టికి తీసుకురాకుండా జుల్ఫికారుల్లా రూ.8 కోట్లు స్వాహా చేసినట్లు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టారు.

పవిత్రా గౌడకు అనారోగ్యం



పవిత్రా గౌడ   హీరో దర్శన్ (ఫైల్)

బనశంకరి: రేణుకాస్వామి హత్య కేసులో జైలుపాలైన నటి పవిత్రా గౌడ అనారోగ్యానికి గురి కావడంతో పరప్పన అగ్రహార జైలులోనే ఆసుపత్రి వార్డులో చికిత్స అందిస్తున్నారు. చికిత్స తరువాత ఆమె కోలుకున్నట్లు తెలిసింది. హత్య కేసులో ప్రముఖ నటుడు దర్శన్‌తో పాటు 17 మంది నిందితులు పరప్పన జైలులో ఉన్నారు. జూన్ 11వ తేదీన నిందితులను అన్నపూర్ణేశ్వరి నగర పోలీసులు అరెస్టు చేశారు. రెండువారాల పాటు తీవ్రంగా విచారించి, తరువాత జైలుకు పంపారు. మరోవైపు దర్శన్ కూడా జైలులో ఆహారం సరిపడక ఇబ్బందులు పడుతున్నాడు. మానసిక ఒత్తిడితో బాధపడుతున్నట్లు తెలిసింది. సరిగా నిద్రపోవడం లేదని, నిరంతరం చింతిస్తున్నాడని సమాచారం. ఫలితంగా బాగా బరువు కూడా తగ్గిపోయాడు.

కుటుంబానికి ఆత్మహత్యల శాపం

- ఇటీవల భార్య బలవన్మరణం
- తట్టుకోలేక పిల్లలతో కలిసి భర్త ఆత్మహత్యాయత్నం
- పిల్లలు మృత్యువాత





కుటుంబంలో అల్లకల్లోలం

మైసూరు: వరుస ఆత్మహత్యలు ఒక కుటుంబాన్ని ఛిద్రం చేశాయి. సమస్యలు ఉంటే పరిష్కరించుకోవడానికి బదులు ఆత్మహత్యలను ఆశ్రయించడంతో మొదట భార్య, ఆ తరువాత పిల్లలు కానరాని లోకాలకు వెళ్లిపోయారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యతించగా పిల్లలు చనిపోగా, తండ్రి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన మైసూరు జిల్లాలోని కేఆర్ నగర తాలూకాలోని చీరనహళ్ళిలో జరిగింది.

రెండు నెలల కింద భార్య..

గ్రామంలో మంజునాథ్ (40), భార్య సుమిత్ర (33), ఇద్దరు పిల్లలు చైత్ర (16), శ్రేయస్(12) ఉంటున్నారు. మంజునాథ్ రైతు కాగా, చైత్ర 10వ తరగతి, శ్రేయస్ 6వ తరగతి చదువుతున్నారు. కుటుంబ సమస్యల వల్ల సుమిత్ర రెండు నెలల కిందట ఆత్మహత్య చేసుకుంది. అప్పటి నుంచి తీవ్రమైన ఆవేదనలో ఉన్న మంజునాథ్ పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించాడు. శనివారం సాయంత్రం పిల్లలను పొలానికి తీసుకెళ్లి వారిచేత పురుగుల మందు తాగించి తరువాత తానూ తాగాడు. విషయం తెలుసుకున్న చుట్టుపక్కలవారు వచ్చి కెఆర్ నగర పట్టణంలోని ఆస్పత్రికి తరలించారు. కొంతసేపటికి శ్రేయస్, చైత్ర మరణించారు. మెరుగైన చికిత్స కోసం తండ్రిని మైసూరుకు తరలించారు. అతని పరిస్థితి విషమగా ఉంది. కేఆర్ నగర పట్టణ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

మహిళా దొంగల ముఠా అరెస్టు

శివమొగ్గ: శివమొగ్గ నగరంలోని కేఎస్ ఆర్టీసీ బస్టాండులో మహిళా ప్రయాణికుల నుంచి డబ్బు, బంగారం దోచుకుంటున్న మహిళా దొంగల ముఠాను దొడ్డపేటె పోలీసులు అరెస్టు చేశారు. ఐదు మంది నిందితుల్లో నలుగురు స్త్రీలు కాగా, ఒక పురుషుడు ఉన్నారు. భద్రావతిలోని హోసమనె హనుమంత నగర లేఔట్‌కు చెందిన శాంతి (31), మీనాక్షి (38), సుశీలమ్మ (66), దుర్గా (29), బాబా (29) నిందితులు, వీరి నుంచి రూ. 8 లక్షల విలువ చేసే 122 గ్రాముల బంగారు నగలు, కొంత డబ్బుని సీజ్‌చేశారు. బస్టాండులో తరచుగా చోరీలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో నిఘా వేసి ముఠాని పట్టుకున్నారు.



సీజ్ చేసిన సొత్తు

నాగేంద్రకు ఈడీ ప్రశ్నలు

- వాల్మీకి మండలి నిధుల స్కాం...

బనశంకరి: బళ్లారి రూరల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి బీ నాగేంద్రను ఈడీ అధికారులు వాల్మీకి గిరిజన అభివృద్ధి మండలిలో రూ. 185 కోట్ల కుంభకోణంలో కూపీ లాగుతున్నారు. నాగేంద్రను శుక్రవారం అరెస్టు చేసి శనివారం కోర్టులో హాజరు పరచగా 6 రోజుల పాటు కస్టడీ విధించారు. నాగేంద్రను ఈడీ అధికారులు కస్టడీలోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. కేసులో ఇప్పటివరకు సేకరించిన సాక్ష్యాధారాలను ముందుపెట్టుకుని సమాచారం రాబడుతున్నారు. నగదు ఎక్కడికి మళ్లించారు, ఎవరెవరికీ ఇచ్చారు, దేనికోసం వినియోగించారు తదితర ప్రశ్నలు వేసినట్లు తెలిసింది. కొన్నింటికి జవాబు ఇవ్వగా మరికొన్ని ప్రశ్నలకు తెలియదని చెప్పినట్లు వినికిడి. ఇదే స్కాంలో ఈడీ దాడులను ఎదుర్కొన్న మరో ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ ఆచూకీ లేదు. ఈడీ అరెస్టు భయంతో ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. సోమవారం నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతారా, లేదా అన్నది అనుమానంగా ఉంది.



నాగేంద్ర.   బసనగౌడ దద్దల్ (ఫైల్)

ఆన్‌లైన్‌లో రూ. 54 లక్షలు టోకరా

మైసూరు: మైసూరు నగరంలో ఆన్‌లైన్ మోసాలకు అంతు లేకుండా పోతోంది. షేరు మార్కెట్ పేరుతో ఓ వ్యక్తి నుంచి సుమారు రూ. 54.50 లక్షలు స్వాహా చేశారు. జయనగరకు చెందిన శంకర్ బాధితుడు. అతని మొబైల్‌ఫోన్‌కు వచ్చిన మెసెజ్‌ను చూసి అందులోని నంబర్‌కు కాల్ చేశాడు. తమ ద్వారా షేరు మార్కెట్‌లో పెట్టుబడి పెట్టాలని, రెట్టింపు లాభాలు వస్తాయని మోసగాళ్లు నమ్మించారు. ఏమాత్రం ఆలోచించని అతడు పలు దఫాలుగా రూ. 54.45 లక్షలను వారు చెప్పిన ఖాతాల్లోకి జమ చేశాడు. ఆ తరువాత అసలు, లాభం కోసం ఫోన్ చేయగా స్విచాఫ్ వచ్చింది. దీంతో అభాగ్యుడు లబోదిబోమంటూ మైసూరు సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వానాకాలం.. మాటల సమరం

- నేటి నుంచి అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు
- కత్తులు నూరుతున్న అధికార, విపక్షాలు
- వాల్మీకి మండలి స్కాం, ముడా గొడవతో సర్కారుకు ఇబ్బంది

శివాజీనగర: రాష్ట్రంలో అనేక వేడెక్కించే పరిణామాల మధ్య అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కాబోతున్నాయి. వాల్మీకి అభివృద్ధి మండలిలో వందల కోట్ల రూపాయల స్వాహా, మంత్రి నాగేంద్ర రాజీనామా, అరెస్టు, మైసూరులో ముడా స్థలాల అక్రమాలు వంటి భారీ పరిణామాల మధ్య విధానసభలో అధికార కాంగ్రెస్, విపక్ష బీజేపీ, జేడీఎస్‌లు తలపడబోతున్నాయి. మూడు పక్షాల మధ్య దాదాపు మాటల యుద్ధమే జరుగుతుందనడం నిస్సందేహం. ముడా వివాదం, వాల్మీకి మండలి కుంభకోణాలను ప్రతిపక్షాలు ఆయుధాలుగా చేసుకోనున్నాయని తెలిసింది. ఈ సమావేశాలు సజావుగా జరుగుతాయా అనే అనుమాలు వినిపిస్తున్నాయి.

ధీమాగా ప్రతిపక్షాలు

జూన్‌లో లోక్‌సభ ఎన్నికల ఫలితాల తరువాత జరుగుతున్న తొలి అసెంబ్లీ సమావేశాలు ఇవే. ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష బీజేపీ అధిక సీట్లు సాధించగా, అధికార కాంగ్రెస్‌కు అంతంతమ్రాతమే రావడం తెలిసిందే. దీంతో బీజేపీ-జేడీఎస్ మిత్రకూటమి ఉల్లాసంగా ఉంది. రాష్ట్రంలో గ్యారంటీ పథకాల అమల్లో జరిగిన లోపాలు, అభివృద్ధి కార్యక్రమాలు స్తంభించాయని, కరువు- రైతుల ఆత్మహత్యలు సహా అనేక చిక్కుముడులను ప్రతిపక్షాలు లేవనెత్తబోతున్నట్లు తెలిసింది. ఇందుగా దీటుగా కాంగ్రెస్ పార్టీ కూడా ప్రతిపక్షాలను నోరు మూయించేందుకు వ్యూహాలను రచించింది. తొలి రోజు ఇటీవల గతించిన ప్రముఖులకు శ్రద్ధాంజలి ఘటిస్తారు.

ప్రధాన బిల్లులకు అవకాశం

అసెంబ్లీ సమావేశాల్లో ఔట్‌సోర్సింగ్ రిజర్వేషన్ బిల్లు, గ్రేటర్ బెంగళూరు అథారిటీ బిల్లు, కన్నడ భాషా బిల్లు, వైద్యులు, వైద్యవిద్యా సిబ్బందికి భద్రత కల్పించే కర్ణాటక వైద్యవిద్యా రిజిస్ట్రేషన్ బిల్లు, ఇతర చట్టాల సవరణల బిల్లు, ఉద్యానవన నర్సరీలకు లైసెన్స్‌ల జారీ బిల్లు, కర్ణాటక అధికార కార్యనిర్వహణ సవరణ బిల్లుతో పాటుగా మొత్తం 8 బిల్లులు ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

వారం విస్తరణకు డిమాండ్

ఈ సమావేశాలు జూలై 26 వరకు జరుగనుండగా, మరో వారం పాటు విస్తరించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. సోమవారం శాసనసభ స్పీకర్ యూ.టీ.ఖాదర్ అధ్యక్షతలో జరిగే సలహా కమిటీ భేటీలో నిర్ణయం తీసుకునే అవకాశముంది.



విధానసౌధ



అధికార- ప్రతిపక్షాల సంగ్రామం

మాజీ సీఎంలు దూరం

ఈ దఫా సమావేశాలకు పలువురు హేమాహేమీలు దూరమయ్యారు. మాజీ ముఖ్యమంత్రులు హెచ్.డీ.కుమారస్వామి, బసవరాజ బొమ్మై, జగదీశ్ శెట్టర్‌లు లోక్‌సభకు వెళ్లిపోయారు. కొందరు ఎమ్మెల్యేలు సైతం ఎంపీలుగా ఎన్నికయ్యారు.

అందరూ సిద్ధంగా ఉండాలి: సీఎం

బనశంకరి: నేటి నుంచి ప్రారంభం కానున్న శాసనసభ సమావేశాల్లో చర్చించే అంశాలపై సమర్థంగా సమాధానం ఇవ్వాలి. అందరూ అసెంబ్లీకి హాజరు కావాలని మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలకు సీఎం సిద్దరామయ్య ఆదేశించారు. ఆదివారం కృష్ణాలో సీఎం మంత్రులు, అధికారులతో చర్చించారు. ఈసారి పూర్తి స్థాయి బడ్జెట్ మార్చిలో ఆమోదం పొందిన నేపథ్యంలో బడ్జెట్ పై చర్చ ఉండదన్నారు. ఈసారి సమావేశాల్లో విపక్షాలు వివిధ ఆరోపణలపై చర్చించే అవకాశం ఉందని, దీనికి సమాధానం ఇవ్వడానికి అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఆయా శాఖల కార్యదర్శులు పూర్తి సమాచారం కలిగి ఉండాలన్నారు. కార్యదర్శులందరూ సమావేశాలకు హాజరుకావాలని, మంత్రులకు సమాచారం అందించాలని, ఆయా మంత్రులు చర్చించే విషయాలపై సమాధానం ఇవ్వాలని తెలిపారు. అవసరమైతే నేను జోక్యం చేసుకుంటానని తెలిపారు. ఈ సమావేశంలో సీఎస్ రజనీశ్ గోయల్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉప జైలర్‌కు పురస్కారం



అమరప్పకు పురస్కారం అందజేస్తున్న హోం మంత్రి

రాయచూరు రూరల్: లింగసుగూరు జైలులో ఉప జైలర్‌గా విధులు నిర్వహిస్తున్న అమరప్ప పేరికి ముఖ్యమంత్రి అవార్డు లభించింది. శనివారం సాయంత్రం బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో హోం మంత్రి పరమేశ్వర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. అమరప్ప పేరి జైలులో ఖైదీలకు పరివర్తన, తప్పులు సరిదిద్దుకోవాలని సలహాలు ఇవ్వడం, ఆరోగ్యం, విద్య, రికార్డుల భద్రత వంటి అంశాలపై అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా జైలు అధికారులు అందాని, పుండలిక్ భాగ్యశ్రీ తదితరులు అమరప్పను అభినందించారు.

అజ్ఞాతంలోకి ఎమ్మెల్యే బసనగౌడ ?

రాయచూరు రూరల్: వాల్మీకి అభివృద్ధి నిగమ మండలిలో భారీ కుంభకోణంకు సంబంధించి విచారణ జోరుగా సాగుతోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ నివాసాలపై ఈడీ సోదాలు చేసింది. నాలుగు రోజుల క్రితం బెంగళూరు, యలహంకలో అధికారులు సోదాలు చేశారు. సిరవార తాలుకా గణదిన్ని ప్రాంతంలో మార్చిలో 4.31 ఎకరాల భూమిని కొనుగోలు చేసి రాయచూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నమోదు చేసుకున్నారు. ఆ భూమి భారత్ మాలా జాతీయ రహదారికి అనుకుని ఉండటం విశేషం. ఇదిలా ఉంటే రాయచూరులో ఈడీ సోదాలు ముగిసిన వెంటనే ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ ఆచూకీ కనిపించలేదు.

నగరంలో ప్రత్యక్షం.. వెంటనే పయనం

ఆదివారం రాయచూరు కొచ్చిన ఎమ్మెల్యే బసన గౌడ దద్దల్ తన కారు వదిలి మరో వాహనంలో మంత్రాలయం, వైజాగ్ వైపు పయనమైనట్లు సమాచారం. ఈడీ అధికారుల అరెస్ట్ నుంచి తప్పించుకుని అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలిసింది.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

కృష్ణరాజపురం : మహదేవపుర నియోజక వర్గం కావేరి నగరలో ఎంఎల్ ఆర్ కన్వెన్షన్ హాలులో కర్ణాటక నాయర్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో దృశ్య విస్మయం సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. వేడుకలను మాజీ మంత్రి ఆరవిందలింబావలి ప్రారంభించారు. కేఎన్ఎస్ అధ్యక్షుడు రామ చంద్రపాలన్, ప్రధాన కార్యదర్శి మనోహర్ కురూప్, కోశాధికారి మురళీధర్‌నాయర్, ఎస్.హరిష్ పాల్గొన్నారు.

లోక కళ్యాణార్థం చాతుర్మాస దీక్షలు



పాదయాత్ర చేస్తున్న స్వామీజీలు

రాయచూరు రూరల్: లోక కళ్యాణార్థం జైన్‌ముని స్వామీజీలు 48 రోజుల పాటు చాతుర్మాస దీక్షలు చేపట్టారు. ఆదివారం నగరంలోని జైనమఠంలో పరమ పూజ్య నరేష్ ముని, గురు మహరాజులు చాతుర్మాసనుష్టానం చేశారు. దేశ సుభిక్షం కోసం, లోక కళ్యాణార్థం, రైతులు సంక్షేమం కోసం నిత్యం తపస్సులోని నిమగ్నులయ్యారు. జీవితంతో మంచి కార్యాలు చేసి సకారత్మక చింతనలు, ఉత్తమ విద్యతో జీవనంలో మార్పులు సంభవిస్తాయన్నారు. ఉదయం ఇద్దరు జైన్ మునులను ఊరేగించారు. ఈ సందర్భంగా కమల్ కుమార్, రవి చోప్రా, శాంతి లాల్, నరేంద్ర మోథా, గౌతమ్ గియా తదితరులు పాల్గొన్నారు.


నిస్వార్థంతో సేవలు అందించాలి



జ్యోతి వెలిగిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: ప్రభుత్వ ఉద్యోగులు సమాజానికి నిస్వార్థంతో సేవలు అందించినప్పుడే అవార్డులు వెతుక్కుంటూ వస్తాయని నవల్‌కల్ అభినవ సోమనాథ శివాచార్యులు అన్నారు. శనివారం రాత్రి సిరవారలో రిమ్స్ అధికారి విజయ శంకర్‌కు రాష్ట్ర స్థాయి ఉత్తమ వైద్య అవార్డు అందుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో పుట్టిన విజయ్ శంకర్ మాన్వి తాలూకాకే గర్వకారణమన్నారు. సమావేశంలో మాన్వి శాసన సభ్యుడు హంపయ్య నాయక్, మాజీ మంత్రి హన్మంతప్ప అల్కోడ్, శరణప్ప గౌడ, గిరిజా శంకర్, చుక్కి సూగుప్ప, ఏసురాజ్, మారుతి, రాజుగౌడ, రమేష్, వీరనగౌడ, ఖాజీ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వేడెక్కిన కావేరి



కేఆర్ఎస్ జలాశయం (ఫైల్)



సమావేశంలో సీఎం సిద్దరామయ్య, డీకే.శివకుమార్, మాజీ సీఎం సదానందగౌడ తదితరులు

- తమిళనాడుకు రోజూ ఒక టీఎంసీ నీరివ్వలేమన్న కర్ణాటక
- సీఎం అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం

బనశంకరి: కర్ణాటక– తమిళనాడు మధ్య కావేరి నదీ జలాల వివాదం రగుల్కొనేలా ఉంది. ఈ నెలాఖరు వరకు తమిళనాడు కు రోజూ 1 టీఎంసీల కావేరి నీటిని వదలాలని ఢిల్లీలోని కావేరి వాటర్ రెగ్యులేషన్ కమిటీ (సీడబ్ల్యూఆర్‌సీ) శనివారం ఆదేశించడంపై కర్ణాటక గరం గరం అవుతోంది. ఈ నేపథ్యంలో ఆదివారం బెంగళూరులో విధానసౌధలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య అధ్యక్షతన అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. అన్ని పార్టీల ఎంపీలు, నేతలు పాల్గొన్నారు. తమిళనాడుకు కావేరి నీటిని వదలరాదని మంత్రులు, విపక్ష నేతలు రాష్ట్ర ప్రభుత్వానికి సలహా ఇచ్చారు. కమిటీ ఆదేశాలపై కావేరి నీటి నిర్వహణ అథారిటీ (సీడబ్ల్యూఎంఏ)లో అప్పీల్ చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం రాష్ట్రంలో నీటి కొరత ఉందని పేర్కొన్నారు. హారంగి డ్యాం 76 శాతం నిండింది, కేఆర్ఎస్ డ్యాం 45 శాతం మాత్రమే భర్తీ అయిందని, శనివారం నాటికి ఈ జలాశయాల్లో 72.58 టీఎంసీల నీరు ఉందని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. కాబట్టి నీటి విడుదల సాధ్యం కాదనే అభిప్రాయానికి వచ్చారు. ఈ సమావేశంలో డిప్యూటీసీఎం డీకే.శివకుమార్, మంత్రులు, బీజేపీకి చెందిన మాజీ ముఖ్యమంత్రులు పాల్గొన్నారు.

జన్మదిన వేడుకలకు వెళ్తుండగా మృత్యు పంజా



ప్రమాదానికి గురైన కారు

- కారును ఢీకొన్న గుర్తు తెలియని వాహనం
- ఇద్దరు యువకుల మృతి



సిద్దార్థ, హర్ష మృతదేహాలు

కృష్ణరాజపురం: జన్మదిన వేడుకలకు వెళ్తుండగా మృత్యువు పంజా విసిరి ఇద్దరు యువకుల ప్రాణాలను బలిగొంది. ఈ విషాద ఘటన చెన్నై ఎక్స్‌ప్రెస్ జాతీయ రహదారిలో బెంగళూరు గ్రామీణ జిల్లా హొసకోటె తాలూకా సూలిబెలె సమీపంలోని అత్తిబెలి వద్ద జరిగింది. బెంగళూరు నగరంలోని హెబ్బాల సమీపంలోని కెంపాపుర వరకు చెందిన సిద్దార్థ(17), హర్ష(18)లు మరో ఇద్దరితో కలిసి స్నేహితుడి జన్మదిన వేడులకు కారులో బయల్దేరారు. అత్తిబెలి వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో సిద్దార్థ, హర్షలు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన మరో ఇద్దరిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. సూలిబెలె పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు మృతి

హుబ్లీ: హుబ్లీ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. హుబ్లీ శివారు పుణె– బెంగళూరు హైవేలోని కబ్బురు దగ్గర ఈ ప్రమాదం జరిగింది. మృతులను ఆనంద నాయకర్ (34), ఈరణ్ణ బడిగేర (36)గా గుర్తించారు. వీరు బైక్‌పై వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు ధార్వాడ జిల్లా కలఘటికి తాలూకా హస్తకట్టి గ్రామానికి చెందిన వారు. దక్షిణ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఇంటిలో చోరీ

ధార్వాడ తాలూకా ఇటగట్టి గ్రామంలో మోహన్ బావటే అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. దొంగలు ఇంటి తలుపులు తొలగించి బీరువాలో ఉన్న రూ. లక్ష విలువైన నగలు ఎత్తుకెళ్లారు. హుబ్లీ రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పరిజ్ఞానం లేదా?

శివాజీనగర: 'జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం కేంద్ర మంత్రి అయ్యారు. ఆయనకు కనీస పరిజ్ఞానం ఉండాల్సింది' అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఎం.లక్ష్మణ్ ధ్వజమెత్తారు. ఆదివారం కేపీసీసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ముడా స్థలాల గురించి సీఎం సిద్దరామయ్యను నిందించడం తగదన్నారు.

కలుషిత నీరు తాగి 9 మందికి అస్వస్థత





చికిత్స పొందుతున్న బాధితులు, ఆస్పత్రిలో బాధితులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ

రాయచూరు రూరల్: కలుషిత నీరు తాగి 9 మంది అస్వస్థతకు గురైన ఘటన యాదగిరి జిల్లాలో చోటు చేసుకుంది. ఆదివారం గురుమిఠకల్ తాలూకా కాకలవారలో కొళాయి నీరు తాగిన కొందరు వాంతులు, విరేచనాలకు గురయ్యారు. వెంటనే వారిని సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో చేతి పంపులు చెడిపోవడంతో ఆదివారం కొళాయిలో వచ్చిన శుద్ధి చేయని నీటిని తాగారు. వెంటనే తొమ్మిది మందికి వాంతులు, విరేచనాలబారిన పడ్డారు. విషయం తెలుసుకున్న కలబుర్గి జిల్లా పంచాయతీ అధికారిని గరీమా పన్వర్ వెంటనే బాధితులను పరామర్శించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పీడీఓను సస్పెండ్ చేశారు. గురుమఠకల్ ఎమ్మెల్యే గౌడ ఆరోగ్య, పంచాయతీ రాజ్ అధికారులతో మాట్లాడి శుద్ధమైన మంచి నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు.

కౌశల్య అభివృద్ధి కేంద్రం ఏర్పాటుకు కృషి

కోలారు: జిల్లాలో కేజీఎఫ్‌తో పాటు అన్ని తాలూకాలలో పరిశ్రమలను స్థాపించడానికి అవసరమైన భూమి, మానవ వనరులు అధికంగా ఉన్నందున ఈ ప్రాంతంలో పరిశ్రమలను స్థాపించడంతో పాటు ఉద్యోగాలు సాధించడానికి అవసరమైన కౌశల్య శిక్షణా కేంద్రాలను స్థాపించడానికి కృషి చేస్తామని ఎంపీ మల్లేష్‌బాబు తెలిపారు. ఆదివారం నగరంలోని గోల్డ్ ఫీల్డ్ క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కౌశల్య అభివృద్ధి కేంద్రం స్థాపించకుండా పరిశ్రమలు వస్తే ఈ పరిశ్రమలలో ఇతర ప్రాంతాలకు చెందిన వారు ఉద్యోగాలు పొందే అవకాశం ఉందని, దీంతో స్థానిక నిరుద్యోగ యువతకు అవసరమైన కౌశల్య శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సహకార యూనియన్ మాజీ అధ్యక్షుడు మూరాండహళ్లి గోపాలప్ప, న్యాయవాది అమరేంద్ర, సొసైటీ న్యాయ సలహాదారు ఎం రామలింగేగౌడ, డైరెక్టర్ డి నాగరాజప్ప తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



రాయచూరు రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని అక్షర దాసోహ కార్యకర్తల సంఘం డిమాండ్ చేసింది. శనివారం అక్షర దాసోహ కార్యాలయం వద్ద అధ్యక్షురాలు రేణుకమ్మ మాట్లాడారు. అక్షర దాసోహ పథకంలో తొలగించిన 10,500 మందిని విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ అక్షర దాసోహ అధికారి ఈరణ్ణకు వినతిపత్రం సమర్పించారు.

కబినీకి కొనసాగుతున్న వరద

మైసూరు : కేరళలోని వయనాడు, చుట్టు పక్కల ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వరద నీరు మైసూరు జిల్లా హెచ్‌డీకోటె తాలూకా, బీచనహళ్లిలో ఉన్న కబిని జలాశయానికి పోటెత్తుతోంది. ఇప్పటికే జలాశయం నిండుకుండలా మారింది. గరిష్ట నీటిమట్టం 2284 అడుగులు కాగా ప్రస్తుతం 283.20 అడుగల మేర నీరు నిల్వ ఉంది. డ్యాంలోకి 19,027 క్యూసెక్కుల నీరు చేరుతుండటంతో జలాశయం భద్రత దృష్ట్యా గేట్లు ఎత్తి దిగువన నది ద్వారా తమిళనాడుకు 16,750 క్యుసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం, నది లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

వేడుకగా వ్యాస జయంతి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: శ్రీ వ్యాసరాయరు గురు, జ్ఞాన పరంపర మేరు శిఖరమని వారి జీవితం, రచన భారతీయ పరంపరలో కలిసి ఉందని అఖిల భారతీయ సాహిత్య పరిషత్ జిల్లా విభాగం కార్యదర్శి, రచయిత్రి మాయా బాలచంద్ర తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన వ్యాస జయంతి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. తన మహా భారత కావ్యం ద్వారా సమాజంలో ఉత్తమ సామాజిక, మానవీయ విలువలను చూపించిన వ్యాసరాయర ఒక జాతి లేదా ధర్మానికి పరిమితం చేయడం సరికాదన్నారు. వేద వ్యాసుడిచే రచించబడిన మహా భారతం, వేల సంవత్సరాల నుంచి ప్రజల హృదయాలలో నిలిచి ఉందన్నారు. జగత్తుకు దారి దీపంగా ఉందన్నారు. మహా కావ్యంలో మహా పాత్రలు మంచి చెడుల గురించి తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎన శ్రీధర్, ఉపాధ్యాయులు దేవరాజ్, రామాంజనేయ, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

హత్య కేసులో నిందితుల అరెస్టు



పోలీసులు అరెస్టు చేసిన ప్రధాన నిందితుడు

మాలూరు: వ్యక్తిని హత్య చేసి చెరువులో పడేసిన ఘటనకు సంబంధించి ఆదివారం మాలూరు పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ నెల 10న తాలూకాలోని మంగాపుర గ్రామానికి చెందిన ప్రముఖ నిందితుడు అంబరీష్ (30), సహచరులు మధు (25), బెంగుళూరు మదన్ (26)లు పట్టణంలోని ఓ బార్‌లో మద్యం కొనుగోలు చేసి లింగాపుర రహదారిలో రాజీవ్ నగర్ వద్ద ఉన్న స్థలంలో పార్టీ చేసుకుని నారాయణ స్వామి అనే వ్యక్తిని హత్య చేసి శవాన్ని కోలారు సమీపంలోని నరసాపురం చెరువులో పడేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్టు చేశారు.

పూజా సామగ్రి ప్రదర్శన



పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న దృశ్యం

కోలారు: నగరంలోని బాలాజీ ప్రార్థనా మందిరంలో శ్రీ వాసవి మహిళా మండలిచే శ్రావణ మాసం పూజా సామాగ్రి ప్రదర్శన, విక్రయ మేళాను నిర్వహించారు. మేళాలో నగర, చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు వచ్చి కొనుగోలు చేశారు. వాసవి మహిళా మండలి ప్రతియేటా మేళాను నిర్వహిస్తుంది. శ్రావణ మాసం ప్రారంభానికి ముందు ఆషాఢ మాసంలో ఈమేళాను నిర్వహిస్తారు. పూజా కార్యక్రమాలకు అవసరమైన అలంకార వస్తువులు, తినుబండారాల ప్రదర్శన, విక్రయానికి ఉంచారు. ఆర్యవైశ్య మహిళలు తామే స్వయంగా తయారు చేసిన చేసిన ఉత్పత్తులను మేళాలో ప్రదర్శించారు. వ్యాపారులకు వాసవి మహిళా మండలి నుంచే భోజన వ్యవస్థ కల్పించారు. మేళా బాధ్యతలను వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు ఎజి జయశ్రీ, ఉపాధ్యక్షురాలు వాణి బాలాజీ, కార్యదర్శి శైలా బదరినాథ్, కోశాధికారి పీవీ సత్యలక్ష్మి, సహ కార్యదర్శి నర్మదా తదితరులు పాల్గొన్నారు.

ఏ స్థానంలో ఉన్నా ఉత్తమ వ్యక్తులుగా ఎదగాలి



పురస్కారం అందజేస్తున్న దృశ్యం

కోలారు: గ్రామ పంచాయతీ సభ్యుల స్థానం నుంచి మంత్రి స్థానం వరకు ఏ స్థానంలో ఉన్నా, డీ గ్రూప్ ఉద్యోగి నుంచి ఉన్నతాధికారి వరకు ఎలాంటి స్థానంలో ఉన్నా ఉత్తమ వ్యక్తులుగా ఎదగాలని జిల్లా కార్యనిరత పాత్రికేయుల సహకార సంఘం అధ్యక్షుడు కెఎస్ గణేష్ అన్నారు. ఆదివారం నగరంలోని గాయత్రి ప్రార్థనా మందిరంలో పది, ఇంటర్ విద్యార్థులకు ప్రతిభా పురస్కార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కోలారు జిల్లాలో ప్రతిభా పురస్కార మనే పరంపర ప్రారంభం అయిందే బ్రాహ్మణ సంఘం నుంచి అన్నారు. కులాల వారీగా ప్రతిభా పురస్కారాలు అందించడం కంటె అన్ని కులాల ప్రతిభావంత విద్యార్థులను గుర్తించి పురస్కారాలు అందించడం శ్లాఘనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమం కోలారు బ్రాహ్మణ సంఘం మాత్రమే చేస్తోందన్నారు. కోలారు బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఉదయకుమార్ మాట్లాడుతూ... విద్యార్థులు చదవుతో పాటు ఉత్తమ సంస్కారాన్ని అలవర్చుకుని మంచి పౌరులుగా మారాలని స్వార్థాన్ని వీడి దేశ సేవకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఇదే సమయంలో పదవ తరగతికి చెందిన 67 మందికి, ఇంటర్‌కు చెందిన 36 మందికి ప్రతిభా పురస్కారాలను అందించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం పదాధికారులు పి చంద్ర ప్రకాష, డాక్టర్ కృష్ణమూర్తి, శంకర మఠం ధర్మాధికారి జె ఎన్ రామకృష్ణ, రవి శంకర్ అయ్యర్, కంప్యూటర్ అమర్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండులో అపస్మారక స్థితిలో మహిళ



ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

కెజీఎఫ్ : బంగారుపేట బస్టాండులో ఆదివారం ఓ మహిళ అపస్మారక స్థితిలో కనిపించడంతో పోలీసులు వెంటనే మహిళతో పాటు ఆమె వద్ద ఉన్న శిశువును కల్యాణ కేంద్రానికి తరలించారు. బస్టాండులో మహిళ పడి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అంబులెన్స్‌లో ఆమెను, చిన్నారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఆరు నెలల చిన్నారిని కేజీఎఫ్ మస్కంలో ఉన్న పిల్లల సంరక్షణ కేంద్రానికి తరలించారు. బంగారుపేట పోలీసులు సీతారం సింగ్, రేఖా విజయలక్ష్మి, మంజులమ్మలు దగ్గరుండి వారిని కేంద్రానికి తీసుకువచ్చారు.

విద్యుత్ షాక్‌తో పెయింటర్ మృతి

హుబ్లీ: విద్యుత్ షాక్‌తో పెయింటర్ మృతి చెందిన ఘటన అణ్ణిగేరి పట్టణంలో జరిగింది. మృతుడిని గాంధీనగర నివాసం మంజునాథగా గుర్తించారు. పెయింటింగ్ పనులు చేసే మంజునాథ అణ్ణిగేరి పట్టణం హైవే పక్కన ఇంటిలో పెయింట్ పనులు చేస్తుండగా ఇంటి ముందు వేలాడుతున్న విద్యుత్ తీగ షాక్ కొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంటి ముందు వేలాడుతున్న విద్యుత్ తీగను తొలగించాలని ఏడాది క్రితమే ఎస్కాం అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించు కోలేదు. దీంతో ఓ యువకుడు మృతి చెందాడు. అణ్ణిగేరి ఎస్కాం శాఖ అధికారులతో పాటు సదరు ఇంటి యజమానిపై మృతుడి తండ్రి నింగప్ప సిరహట్టి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కారు బోల్తా వ్యక్తి మృతి :

కుక్కను తప్పించబోయి కారు బోల్తా పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం ధార్వాడ హెబసూరు రోడ్డులో జరిగింది. మృతుడిని వీరప్ప (38)గా గుర్తించారు. హుబ్లీ గ్రామీణ పోలీసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

పచ్చదనానికి ప్రాధాన్యత ఇవ్వాలి



మాట్లాడుతున్న జయన్న

రాయచూరు రూరల్: నగరంలో పచ్చదనానికి ప్రాధాన్యత ఇవ్వాలని, పరిసరాలను సంరక్షించాలని నగరసభ సభ్యుడు జయన్న పేర్కొన్నారు. ఆదివారం పవన్ కాలనీలో రాయచూరు హసిరు బళగ, అటవీశాఖ, నగర సభ ఆధ్వర్యంలో వృక్ష మహోత్సవంలో మొక్కలు నాటి మాట్లాడారు. భవిష్యత్తులో వేడిమి నుంచి రక్షణ పొందాలంటే ప్రతి ఒక్కరు ఇంటి ముందు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో అటవీ అధికారి రాజేష్, పీరజాద్, పాత్రికేయ సంఘం అధ్యక్షుడు గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషి



వసంత్ కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: వివిధ రంగాల అభివృద్ధికి కృషి చేస్తానని విధాన పరిషత్ సభ్యుడు వసంత్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని హరిజనవాడలో సముదాయం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆది జాంబవ షడాక్షరి స్వామీజీ, నగరసభ సభ్యులు నాగరాజ్, వసంత్, ఈరన్న, బోళబండి ,రవీంద్ర జాలదార్, సిద్దప్ప, నరసింహులు, పద్మ, తిమ్మయ్య, అమరేష్, చెన్నపప్ప, యల్లప్ప, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పంటలు పండించాలి



జ్యోతి వెలిగిస్తున్న హన్మంతప్ప తదితరులు

రాయచూరు రూరల్: జిల్లాలో రైతులు శాస్త్రవేత్తల సలహాలు సూచనలు పాటించి నాణ్యతతో కూడిన పంటలను పండించాలని వ్యవసాయ విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ హన్మంతప్ప పేర్కొన్నారు. ఆదివారం వ్యవసాయ విశ్వ విద్యాలయంలో ఏర్పాటు చేసిన ఆహార భద్రత రక్షణ, నాణ్యత అంశాలపై జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఖరీఫ్, రబీ సీజన్‌లో పంటలకు సోకే రోగాలు, తెగుళ్ల వల్ల పంటల నాణ్యత తగ్గిపోతుందని, అటువంటి సమయంలో సలహాలు, సూచనలు తీసుకుని సమస్యను అధిగమించాలన్నారు. కార్యక్రమంలో నగర సభ కమిషనర్ గురు సిద్దయ్య, శ్రీకర్, కిశోర్, ప్రభురాజ్, ఉదయ కుమార్, నాగరాజ్, శివానంద, సరోజ, అనితా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నీటి విడుదలపై పది రోజుల తర్వాత నిర్ణయం



మాట్లాడుతున్న మంత్రి చెలువరాయస్వామి

మండ్య : కేఆర్ఎస్ జలాశయం నుంచి కాలువలకు నీటిని విడుదల చేసే విషయంపై పది రోజుల తర్వాత నిర్ణయం తీసుకుంటామని వ్యవసాయ శాఖ మంత్రి, మండ్య జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఎన్.చెలువరాయ స్వామి తెలిపారు. ఆదివారం ఆయన మండ్యలో విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం జలాశయంలో 104 అడుగుల నీరు ఉందని, తాగునీటి అవసరాలు, చెరువులను నింపేందుకు ఈ నీటిని కేటాయిస్తామన్నారు. జలాశయం ఇంకా పూర్తి స్థాయిలో నిండలేదని, ఈ నేపథ్యంలో నీటి విడుదలపై పది రోజుల తర్వాత నిర్ణయం తీసుకుంటామన్నారు. తమిళనాడుకు రోజూ ఒక టీఎంసీ నీటిని విడుదల చేయాలనే ఆదేశాలు ఆందోళనకు గురి చేస్తున్నాయన్నారు.

విశ్రాంత అధికారికి సన్మానం



బాలకృష్ణప్పను సన్మానిస్తున్న దృశ్యం

తుమకూరు : పట్టు శాఖలో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చెందిన డాక్టర్ వై.కే.బాలకృష్ణప్పను ఘనంగా సన్మానించారు. జిల్లా పట్టుసాగు అసోసియేషన్, తుమకురు జిల్లా, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమన్వయ సమితి ఆధ్వర్యంలో తుమకూరులోని కేంద్ర గ్రంథాలయం ఆడిటోరియంలో ఆయన్ను పూలమాలతో సన్మానించారు. శ్రీనిజగుణానందమహా స్వామీజీ హాజరయ్యారు.

మృతురాలి ఆచూకీ లభ్యం

శివాజీనగర: మెజిస్టిక్ క్రాంతివీర సంగొళ్లి రాయణ్ణ రైల్వేస్టేషన్ పార్కింగ్ ఏరియాలో ఈనెల 3న హత్యకు గురైన గుర్తు తెలియని బాలిక ఆచూకీ లభ్యమైంది. ఆ బాలిక మరియమ్ (5) అని, ఈ విషయాన్ని ఆమె తండ్రి నిర్ధారించినట్లు పోలీసులు తెలిపారు. బాలిక తల్లి హీనా తన భర్తను వదలి రాజు అనే వ్యక్తితో జీవిస్తోంది. మరియమ్ మృతదేహం లభించిన రోజు నుంచి హీనా, రాజు కనిపించ లేదు. బాలిక హత్యలో వారి ప్రమేయం ఏమైనా ఉందా అనో కోణంలో బెంగళూరు సెంట్రల్ రైల్వే పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

డెంగీతో వ్యక్తి మృతి

యశవంతపుర: డెంగీతో వ్యక్తి మృతి చెందిన ఘటన దక్షిణ కన్నడ జిల్లా బంట్వాళలో జరిగింది. శంభూరు గ్రామానికి చెందిన యతీశ్(52) విపరీతమైన జ్వరంతో ఈ నెల 10న బంట్వాళ ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాడు. ఐసీయూలో చికిత్స పొందుతుండగా మెరుగైన చికిత్స కోసం దేరళకట్టిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. యతీశ్ భార్య తన పుట్టినూరు పుత్తూరులో నివాసం ఉంటోంది.

ప్రయాణికుడికి దేహశుద్ధి

యశవంతపుర: బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ప్రయాణికుడికి తోటి ప్రయాణికులు దేహశుద్ధి చేశారు. ఈ ఘటన బెంగళూరు-మంగళూరు బస్సులో జరిగింది. బెంగళూరు నుంచి మంగళూరు వెళ్తున్న కేఎస్ఆర్‌టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి తన పక్కలో కూర్చున్న బాలికను తాకుతూ అసభ్యంగా వ్యవహరించి వేధించటం ప్రారంభించాడు. ఈ విషయాన్ని బాలిక తన తల్లికి చెప్పింది. దీంతో ఆ వ్యక్తికి బస్సులోనే దేహశుద్ధి చేశారు.

మామిడి పండ్లు చోరీ



స్వాధీనం చేసుకున్న మామిడిపండ్ల సంచులు

చింతామణి: విరగ్గాసిన మామిడి పండ్లను దుండగులు చోరీ చేశారు. ఈఘటన తాలుకాలోని భత్తలహళ్లిలో జరిగింది. అన్సర్‌ఖాన్ అనే వ్యక్తి గ్రామ శివార్లలో మామిడి తోట సాగు చేస్తున్నాడు. శనివారం రాత్రి దొంగలు చొరబడి కాయలు తెంపుకొని ఉడాయించారు. ఆదివారం ఈ విషయం వెలుగు చూసింది. దాదాపు రూ.లక్ష విలువైన మామిడి పండ్లను దుండగులు చోరీ చేసి మాడికెరె క్రాస్‌లోని అమరనాథ మామిడి మండీలో విక్రయించినట్లు సమాచారం తెలుసుకొని తోట యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు అమరనాథ్‌ను విచారణ చేపట్టగా బిమరెడ్డిపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస, చిక్క వెంకరాయప్ప, నాగేష్, హనుమక్క, వెంకటలక్ష్మమ్మలు మామడిపండ్లను విక్రయించినట్లు నోరు విప్పాడు. అనంతరం మండీ నుంచి మామిడి పండ్లను స్వాధీనం చేసుకొని నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

మిల్లులో అగ్ని ప్రమాదం

యశవంతపుర: దక్షిణ కన్నడ జిల్లా మంగళూరు సూరత్కల్ వద్ద ఫిష్ మిల్లులో అగ్ని ప్రమాదం జరిగింది. పెద్ద ఎత్తున మంటలు చెలరేగి సామగ్రి మొత్తం బూడిదైంది. సిబ్బంది బయటకు పరుగులు తీయడంతో ప్రాణహాని తప్పింది. అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పివేశారు. సూరత్కల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



త్రిభువన తిలక చూడామణి, చంద్రనాథ ఆలయం



ఆలయం చుట్టూ రాతి స్తంభాలు



ఆలయం లోపలి భాగం

అబ్బురపరిచే వెయ్యి స్తంభాల ఆలయం

- ఆశ్చర్య పరిచే కట్టడ నిర్మాణ శైలి
- మూడు అంతస్తుల్లో నిర్మాణం
- చూడాలంటే మూడబిదిరి వెళ్లాల్సిందే

బనశంకరి: విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలు, చారిత్రక, పర్యాటక ప్రాంతాలకు నిలయమైన రాష్ట్రంలో మంగళూరుకు 32 కిలోమీటర్ల దూరంలోని మూడబిదిరి పట్టణంలోని వెయ్యి స్తంభాల ఆలయం ఎంతో విశిష్టమైనది. జైనులకు పరమపవిత్రమైన ఈ ఆలయ నిర్మాణం, అందులోని శిల్పకళా సంపద చూపరులను ఆశ్చర్య చకితులను చేస్తుంది. ఈ ఆలయాన్ని త్రిభువన తిలక చూడామణి బసది(దీని అర్థం మూడు లోకాలకు ముకుటాయమానం), చంద్రనాథ ఆలయంగా పిలుస్తారు. ఇక్కడ 8 అడుగుల ఎత్తైన జైనతీర్థకరుడైన చంద్రప్రభనాథుడు భక్తులకు దర్శనమిస్తాడు. 1430లో ఈ ఆలయాన్ని నిర్మించినట్లు తెలుస్తుంది. కట్టడం మొత్తం కఠినశిలతో నిర్మించడం వల్ల ప్రకృతి విపత్తులను తట్టుకుని చెక్కుచెదరకుండా నిలబడింది.

మూడు అంతస్తుల్లో ఆలయ నిర్మాణం

ఈ ఆలయాన్ని మూడు అంతస్తుల్లో నిర్మించారు. 31 ఏళ్లపాటు నిర్మాణ పనులు సాగాయి. మొదటి అంతస్తులో మూలవిరాట్ చంద్రనాథ్ విగ్రహం ఉన్న గర్భాలయం, రెండో అంతస్తులో ప్రార్థనాలయం, మూడో అంతస్తులో 60 అడుగులు ధ్వజ స్తంభాన్ని ఏకశిలతో నిర్మించారు.

అద్భుతమైన శిల్పకళ:

భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే శిల్పకళ ఈ ఆలయంలో కనువిందు చేస్తుంది. వెయ్యి స్తంభాల్లో ప్రతి స్తంభం విభిన్నంగా ఉంటుంది. జైనసంప్రదాయాలను తెలిపి అనేక కుడ్యచిత్రాలు కూడా ప్రధాన ఆలయ గోడలపై చూడవచ్చు. ఏళ్లు గడిచినా కుడ్యచిత్రాలని ఇప్పటికీ రూపు కోల్పోకపోవడం మరో ప్రత్యేకత.

దక్షిణ జైనకాశి

భారత దేశంలోని జైనమునులు ఒక్కసారైనా మూడబిదిరిలోని త్రిభువన తిలక చూడామణి ఆలయాన్ని ఒక్కసారైనా చూస్తే మరో జన్మ ఉండదని, ముక్తి లభిస్తుందని భావిస్తుంటారు. అందువల్ల మూడబిదిరిని దక్షిణ జైనకాశీ అని పిలుస్తారు. ఇక్కడకు వచ్చిన జైనమునులు చాలామంది కనీసం నెలరోజులైనా గడుపుతారు.

మరో 18 ఆలయాలు:

ఇక్కడ వెయ్యి స్తంభాల ఆలయంతోపాటు గురు బసది, కోటిశెట్టిబసది, విక్రమశెట్టిబసది, లెప్పడ బసది తదితర 18 ఆలయాలు ఉన్నాయి. ఇందులో గురుబసది పురాతనమైనది. దీనిని క్రీస్తు శకం 714లో నిర్మించినట్లు తెలుస్తుంది. గురు బసదిలో 52 విగ్రహాలు ఉండేవి.15 విగ్రహాలు కొన్ని సంవత్సరాల క్రితం చోరీకి గురయ్యాయి. కొన్నింటిని పోలీసులు రకవరీ చేశారు. గురు బసదిలో 3.5 మీటర్ల పార్శ్వనాథ విగ్రహం పర్యాటకులను ఆకట్టుకుంటుంది. బసదిలో 12వ శతాబ్దం నాటి తాళపత్రాల గ్రంథాలను కూడా భద్రపరిచారు. క్రూయిజ్‌నౌకలో మంగళూరుకు విహారయాత్రకు వచ్చే విదేశీయుల్లో దాదాపు 90 శాతంమంది మూడబిదిరిని తప్పకుండా సందర్శిస్తారు. కొన్నేళ్లుగా క్రూయిజ్‌నౌకలో మంగళూరుకు వచ్చే యాత్రికుల సంఖ్య పెరుగుతుంది. మూడబిదరిని చూసిన పర్యాటకులు అక్కడ నుంచి దాదాపు 20 కిలోమీటర్ల దూరంలోని వేణూరుకు వెళ్లి గోమతేశ్వరుడి విగ్రహాన్ని సందర్శిస్తారు.

మంగళూరు నుంచి మూడబిదిరి 32 కిలోమీటర్లు, బెంగళూరు నుంచి 400 కిలోమీటర్లు, ఉడుపి నుంచి 55 కిలోమీటర్ల దూరంలో ఉంది. మంగళూరుతో పాటు బెంగళూరు, ఉడుపి నుంచి మూడబిదిరికి బస్సు సర్వీసులు ఉన్నాయి. దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి మంగళూరుకు విమానాలు, రైళ్లు అందుబాటులో ఉన్నాయి.



8 అడుగుల ఎత్తైన జైనతీర్థంకరుడైన చంద్రప్రభనాథుడు



ఆలయంలో ఆకట్టుకునే స్తంభాలు



ఆలయం వద్ద పర్యాటకుల సందడి

22 నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎల్‌కేజీ, యూకేజీ

బనశంకరి: రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 22 నుంచి 250 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు సాంకేతికంగా ప్రారంభిస్తామని మహిళా శిశుసంక్షేమశాఖ మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎల్‌కేజీ, యుకేజీ విద్య అమలు తదితర అంశాలపై ఆదివారం మడివాళ స్త్రీశక్తి భవనంలో నిర్వహించిన సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఎల్‌కేజీ, యూకేజీ పిల్లలకు ఉచితంగా బ్యాగులు, పుస్తకాలు, యూనిఫాం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కన్నడ యూనివర్సిటీ విశ్రాంత అధ్యాపకుడు టీఆర్.చంద్రశేఖర్, సీఐటీయూ కర్ణాటక, రాష్ట్ర అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు వరలక్ష్మి, కార్యదర్శి యమునాగాంవ్కర్, కార్యాధ్యక్షురాలు శాంత ఎన్.ఘంటి, కోశాధికారి జీ.కమలా,ప్రధాన కార్యదర్శి హెచ్ఎస్.సునంద పాల్గొన్నారు.

అవును .. వాళ్లిద్దరూ ఒక్కటయ్యారు



దండలు మార్చుకుని ఒక్కటైన దంపతులు

పావగడ: వివిధ కారణాలతో దూరమైన ఆలుమగలు చాలా కాలంగా విడి విడిగా ఉన్నారు. బంధువుల బుజ్జగింపులు, పెద్దల పంచాయతీలు సైతం వారిద్దరిని దగ్గర చేయలేకపోయాయి. చివరకు ఇద్దరూ కోర్టు మెట్లెక్కారు. ఈ నేపథ్యంలో శనివారం కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ పుణ్యమా అని తాలూకా న్యాయ సేవా సమితి అధ్యక్షుడు వి మాదేశ్ నేతృత్వంలో వారిద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో మరోసారి వారిద్దరూ ఒక్కటవ్వాలని నిర్ణయించుకున్నారు. అక్కడే పూల దండలు మార్చుకొని నూతన జీవితానికి నాంది పలికారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అడిషనల్ జడ్జి సుధీర్, అదనపు సివిల్ జడ్జి ప్రియాంక తదితర న్యాయవాదులు వారిని అభినందించారు. తమను ఒక్కటి చేసిన న్యాయమూర్తి, న్యాయవాదులకు వాళ్లిద్దరూ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆగస్టులో 'బుక్ బ్రహ్మ సాహిత్య ఉత్సవం'

శివాజీనగర: బెంగళూరు నగరం కోరమంగలలో ఉన్న సెయింట్ జాన్స్ సభా మందిర ఆవరణలో ఆగస్టు 9నుంచి 11వరకు బుక్ బ్రహ్మ సంస్థ ఆధ్వర్యంలో 'బుక్ బ్రహ్మ సాహిత్య ఉత్సవం-2024' నిర్వహించనున్నారు. ఈమేరకు సీనియర్ సాహితీవేత్త హంప నాగరాజయ్య ఆదివారం పోస్టర్లు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కన్నడ, మలయాళం, తెలుగు, తమిళు, ఆంగ్ల భాషలకు సంబంధించిన సుమారు 300 మంది సాహితీవేత్తలు హాజరై 80కి పైగా చర్చాగోష్టిల్లో పాల్గొంటారని తెలిపారు. దక్షిణ భారత శ్రేష్ఠ సాహితీవేత్తలైన కే.సచ్చిదానందన్, పెరుమాళ్ మురుగన్, బెన్యమిన్, వోల్గ, హెచ్.ఎస్.శివప్రసాద్, వివేక శానభాగ, గిరీశ్ కాసరవల్లి, మమతా సాగర్, ఎస్.జీ.వాసుదేవ పాల్గొననున్నారని తెలిపారు. డాక్టర్ నరహళ్లి బాలసుబ్రహ్మణ్య మాట్లాడుతూ సాంస్కృతిక స్థితిగతిని పరిశీలిస్తే బుక్ బ్రహ్మ సాహిత్య ఉత్సవం నిర్వహణ ఆవశ్యమన్నారు. నాలుగు భాషా సాహితీవేత్తలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి చర్చాగోష్ఠి నిర్వహించనుండటం భారతదేశంలో ఇదే తొలిసారి అన్నారు. ఈ ఉత్సవంలో 60కి పైగా బుక్ స్టాల్స్ ఏర్పాటు అవుతాయన్నారు. ఉత్సవానికి తల్లిదండ్రులతో కలసి వచ్చే చిన్న పిల్లల కోసం ప్రత్యేక చిణ్ణర దుకాణం కూడా ఉంటుందన్నారు.

ప్రియుడితో కలిసి నవ వధువు బలవన్మరణం





అనూష, వేణు (ఫైల్)



అనూష, వేణు మృతదేహాలు

చింతామణి: నవ వధువు ప్రియుడితో కలిసి నీటిలో దూకి తనువు చాలించింది. ఈఘటన కంచార్లపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని ఎం ముద్దలహళ్లి గ్రామంలో చోటుచేసుకొంది. చేలూరు తాలూకా దొడ్డహళ్లి గ్రామానికి చెందిన అనూషా(19), ఎం.ముద్దలహళ్లి గ్రామానికి చెందిన వేణు (21) రెండేళ్లుగా ప్రేమించుకున్నారు. వీరి కులాలు వేరు కావడంతో పెళ్లికి పెద్దలు అంగీకరించేదు. ఈక్రమంలో అనూషకు గతనెల 26న కాచిహళ్లి గ్రామానికి చెందిన చౌడరెడ్డికి ఇచ్చి వివాహం చేశారు. దంపతులు బెంగళూరు సమీపంలోని దాబస్‌పేటలో నివాసం ఉంటున్నారు. ఆషాఢ మాసం కావడంతో నూతన వధువును సంప్రదాయం ప్రకారం పుట్టింటికి పంపారు. ఏటీఎంలో డబ్బు తీసుకొని వస్తానంటూ అనూష ఇంటినుంచి వెళ్లి తన అవ్వగారి ఊరైన ముద్దలహళ్లికి చేరుకొని ప్రియుడు వేణును కలిసి మాట్లాడింది. కలిసి చనిపోవాలని ఇద్దరూ నిర్ణయించుకున్నారు. నడుములకు చున్నీ కట్టుకొని గ్రామ శివార్లలోని వ్యవసాయ బావిలో దూకారు. అనూష ఎంత సేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. స్పందన లేకపోవడంతో అనూష భర్త చౌడరెడ్డికి సమాచారం ఇచ్చారు. అతని కుటుంబ సభ్యులు గాలించగా బావి వద్ద చెప్పులు కనిపించాయి. లోపలకు దిగి గాలించగా అనూష, వేణుల మృతదేహాలు వెలుగు చూశాయి. పోలీసులు వచ్చి మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మట్టిలో కలిసేవరకు ప్రజలకు సేవ



కేంద్రమంత్రి కుమారస్వామిని సన్మానించి వినాయక ప్రతిమ అందజేస్తున్న దృశ్యం

మండ్య : రాజకీయంగా పునర్జన్మ ఇచ్చిన మండ్య జిల్లా, రాష్ట్ర ప్రజల రుణం తీర్చుకునేవరకు తన శరీరం మట్టిలో కలవదని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి.కుమార స్వామి అన్నారు. పాండవపుర పట్టణంలోని క్రీడామైదానం ముందు ఆదివారం ఆయనకు అభినందన సభ ఏర్పాటు చేశారు. కుమారస్వామి పాల్గొని కార్యకర్తలు, నాయకులు, జిల్లావాసులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సన్మానం స్వీకరించి మాట్లాడారు. మండ్య ఎంపీగా తనను గెలిపించిన జిల్లావాసులను ఎప్పటికీ మరువలేనన్నారు. ఈ ప్రాంత ప్రజల ఆశీర్వాదం వల్లనే తనకు మంత్రి పదవి దక్కిందన్నారు. తనకు మూడో పర్యాయం శస్త్ర చికిత్స జరిగిందని, అయినా మీకు సేవ చేయడానికి బతికి వచ్చానన్నారు.

కన్నడ సాహిత్య సమ్మేళనానికి స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న మంత్రి చెలువరాయస్వామి

మండ్య : జిల్లా కేంద్రంలో ఈ ఏడాది డిసెంబర్‌లో 87వ అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనం నిర్వహణకు సంబంధించి కసరత్తు కొనసాగుతోంది. సమ్మేళనం జరిపేందుకు అనువైన స్థలం కోసం మండ్య జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చెలువరాయస్వామి ఆదివారం జిల్లా కేంద్రాల్ల పలు ప్రాంతాలను పరిశీలించారు. జిల్లా పాలనా విభాగం, చిక్క మండ్య బైపాస్ సమీపంలోని స్థలం, ఆర్ఏపీసీఎంఎస్‌కు చెందిన స్థలాన్ని పరిశీలించారు. వీటిలో ఏదో ఒక స్థలాన్ని ఖరారు చేస్తామని మంత్రి తెలిపారు. సమ్మేళనానికి హాజరయ్యే సాహితీవేత్తలు, విద్యార్థులు, కన్నడ అభిమానులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు ఏర్పాట్లు చేస్తామని మంత్రి తెలిపారు.

నటి అపర్ణ మృతి తీరనిలోటు



అపర్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పట్టణవాసులు

గౌరిబిదనూరు: నటి అపర్ణ అకాల మృతి కళారంగానికి తీరని లోటని నగరసభ సభ్యురాలు పుణ్యవతి జయణ్ణ అన్నారు. పట్టణంలోని ఎంజీ సర్కిల్‌లో ఆదివారం సాయంత్రం నటి అపర్ణ సంతాపసభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పుణ్యవతి మాట్లాడుతూ కన్నడలో అనర్గళంగా మాట్లాడే అపర్ణ 90వ దశకంలో ఆకాశవాణి కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరించి కోట్లాది మంది అభిమానం చూరగొన్నారన్నారు. గౌరిబిదనూరుకు చెందిన బుల్లితెర దర్శకుడు టీఎస్ సీతారాం నిర్మించిన ముక్త-ముక్త సీరియల్‌లో అపర్ణ నటించారన్నారు. కరునాడు కన్నడిగుల రక్షణా వేదిక అధ్యక్షుడు బాలాజీ ప్రసంగిస్తూ 1984 లో గిరీశ్ కర్నాడ్ నిర్మించిన మసణద హూవు సినిమాలో మెదటి సారిగా నటించారన్నరు. తీర్థ ట్రస్ట్ అధ్యక్షుడు ప్రకాశ్, టౌన్ ఎస్ఐ గోపాల్, తా.పం మాజీ అధ్యక్షుడు లోకేశ్, వెంకటాద్రి, నందా, అరుణ్, నాగరాజు, కోటె భాస్కర్ పాల్గొన్నారు.

హోసూరు వార్తలు..

నాటు తుపాకులను అప్పగించాలి



గిరిజన గ్రామాల్లో ప్రచారం చేస్తున్న అటవీ సిబ్బంది

కెలమంగలం: అటవీ ప్రాంత గ్రామాల్లో వన్యమృగాల వేటకోసం, రక్షణ వినియోగిస్తున్న అనుమతి లేని నాటు తుపాకులను స్వయంగా అప్పగించాలని అటవీశాఖ అధికారులు ప్రచారం చేశారు. అటవీ ప్రాంత గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రజలు నాటుతుపాకులను వినియోగిస్తున్నారని, ఈ అనుమతి లేని తుపాకులను జూలై 17 లోపు ఆయా ప్రాంతాల్లోని అటవీశాఖ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్‌లలో అప్పగించాలని కోరారు. లేనిపక్షంలో 17వ తేదీ తరువాత ఆకస్మిక దాడులు జరుపుతామని, నాటు తుపాకులు పట్టుబడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ముందునుంచి చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అయ్యూరు అటవీ శాఖాధికార్లు ఆదివారం ఉదయం బెట్టముగిళాలం, గుల్లట్టి, తొలువబెట్ట, కొడగర్లై, కెంపగర్లై తదితర గ్రామాల్లో చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు.

రోడ్డు పనులు ప్రారంభం

హోసూరు: హోసూరు తాలూకా బాగలూరు సమీపంలోని తుమ్మనపల్లి పంచాయతీ శాంతమంగలం గ్రామంలో రూ. 5 లక్షల ఖర్చుతో సీసీ రోడ్డు నిర్మాణానికి జిల్లా కౌన్సిలర్ ఆర్.కే. రవికుమార్ ఆదివారం భూమిపూజ చేశారు. గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని, ప్రధానంగా మురికి కాల్వలు, సీసీరోడ్లు నిర్మించాలని గత కొద్ది నెలలుగా ఆ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తూ వచ్చారు. కౌన్సిలర్ అభివృద్ధి నిధుల నుంచి రోడ్డు కోసం రూ. 5 లక్షలు మంజూరు చేయించారు.

కారులోని నగదు చోరీ

క్రిష్ణగిరి: సూళగిరి సమీపంలో నిలిపి ఉన్న కారు అద్దాలను పగులగొట్టి నగలు, నగదును దోచుకెళ్లారు. వివరాల మేరకు తూతుకుడి జిల్లాకు చెందిన అంథోనిస్వామి (51) ముంబైలో కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. శనివారం సాయంత్రం కుటుంబ సభ్యులతో కలిసి కారులో స్వగ్రామానికెళ్తుతూ సూళగిరి సమీపంలోని చిన్నారు వద్ద ఓ హోటల్‌లో భోజనానికి వెళ్లారు. తిరిగి వచ్చేలోపు ఎవరో దుండగులు కారు అద్దాలను పగులగొట్టి రూ. 70 వేల నగదు, 15 వేలు విలువ చేసే నగలను దోచుకెళ్లారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

లబ్ధిదారులకు ఇళ్ల వసతి



ఇళ్ల నిర్మాణ ఉత్తర్వులను అందజేస్తున్న ఎమ్మెల్యే

కెలమంగలం: కలైనర్ గృహ వసతి పథకం ద్వారా లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ పనులను ఆదివారం తళి ఎమ్మెల్యే టి. రామచంద్రన్ ప్రారంభించారు. గుడిసెలలో నివాసముంటున్న ప్రజలకు పక్కా ఇళ్ల నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. కెలమంగలం సమితి జెక్కేరి పంచాయతీ చిన్నట్టి గ్రామంలో 17 మందికి ఈ పథకం ద్వారా ఇళ్లను కేటాయించింది. ఎమ్మెల్యే టి. రామచంద్రన్ లబ్ధిదారులకు ఉత్తర్వులు అందజేశారు. చిన్నట్టి గ్రామానికి బస్సు వసతి కల్పించాలని ఈ సందర్భంగా గ్రామస్థులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు.

కుక్కలకు ఆపరేషన్లు

హోసూరు: హోసూరులో వీధికుక్కల దాడుల నుంచి రక్షించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై స్పందించిన మేయర్ ఎస్.ఏ.సత్య, కమిషనర్ స్నేహ ఆదేశాలతో ఆనంద్‌నగర్‌లో వీధికుక్కలకు సంతాన రహిత శస్త్రచికిత్సల కోసం కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పారిశుద్ధ్య శాఖాధికారి ప్రభాకరన్ నేతృత్వంలో కార్పొరేషన్ సిబ్బంది ఆదివారం రోడ్లపై సంచరిస్తున్న వీధికుక్కలను బంధింధ్యా కేంద్రానికి తరలించారు. పశువైద్యులచే కుక్కలకు ఆపరేషన్లు చేసి మళ్లీ అవే ప్రదేశాలలో వదిలిపెట్టారు.

రైలు ఢీకొని ఒకరు మృతి

క్రిష్ణగిరి: రైలు ఢీకొని ఒకరు మరణించిన ఘటన ఊత్తంగేరి సమీపంలో చోటు చేసుకొంది. వివరాల మేరకు ఊత్తంగేరి సమీపంలోని లక్షణకొటాయ్‌కి చెందిన షణ్ముగం (56) పశువులను పోషిస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం సాయంత్రం పశువుల నుంచి సేకరించిన పాలను డెయిరీలో విక్రయించి తిరిగి వస్తూ రైలు పట్టాలను దాటుతున్నాడు. ఇంతలో వేగంగా వచ్చిన రైలు అతనిని ఢీకొని వెళ్లిపోయింది. షణ్ముగం తీవ్రగాయాలతో అక్కడే చనిపోయాడు. రైల్వే పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

కేసరి జెండాను తొలగించిన అధికారులు

- మండ్య జిల్లా కేఆర్ పట్టణంలో ఉద్రిక్తత
- ధర్నాలు నిర్వహించిన హిందూ పోరాట సంఘాలు
- పోలీసుల మోహరింపు



ఆందోళన చేస్తున్న హిందూపోరాట సంఘాల నాయకులు

మండ్య : జిల్లాలోని కెరెగోడులో కొన్ని నెలల క్రితం చోటు చేసుకున్న జెండా వివాదం ముగిసిపోగా ఇదే జిల్లా కేఆర్ పట్టణంలో అదే తరహా వివాదం రాజుకుంది. పర్యాటకమందిరం సర్కిల్‌లో హిందూపోరాట సంఘాలు ఏర్పాటు చేసిన కేసరి రంగు జెండాను స్థానిక పోలీసుల సహకారంతో పురసభ అధికారులు తొలగించారు. దీంతో హిందూ సంఘాలు ఉద్యమించాయి. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వివరాలు.. దాదాపు 40 సంవత్సరాలుగా హిందూసంఘాలు ఇక్కడ కేసరి జెండా ఎగురవేస్తున్నారు. అయితే ఏప్రిల్ మాసంలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా కేసరిజెండా స్థానంలో దళిత సంఘాల నాయకులు నీలి రంగు జెండా ఎగురవేశారు. ఆ సమయంలో ఎన్నికలు జరుగుతుండటంతో హిందూ సంఘాలు పట్టించుకోలేదు. అధికారులు కూడా మిన్నకుండిపోయారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత జూన్ మాసంలో హిందూ సంఘాలు మళ్లీ కేసరి జెండాను ఎగురవేసి నీలిరంగు జెండాను తొలగించారు. దీనిపై దళిత సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఆందోళనలు చేపట్టేందుకు పోలీసుల అనుమతి కూడా తీసుకున్నారు. ఈ విషయంపై నగరసభ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు శనివారం రాత్రి పోలీసు బందోబస్తుతో వచ్చి కేసరి జెండా తొలగించారు. జెండా దిమ్మె చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న హిందూపోరాట సంఘాల నాయకులు ఆదివారం అక్కడకు చేరుకొని ఆందోళన చేపట్టారు. కేసరి జెండాను యథాస్థానంలో ఉంచేందుకు యత్నించారు. అయితే పోలీసులు వారిని అడ్డుకున్నారు. పోలీసు ఉన్నతాధికారులు కూడా ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఆందోళనకారులను అక్కడినుంచి పంపించి వేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఊళ్ల మీదకు గజరాజులు



డెంకణీకోట అటవీ ప్రాంతంలో ఏనుగుల మంద

కెలమంగలం: గత కొద్ది రోజులుగా డెంకణీకోట అటవీ ప్రాంతంలో ఏనుగులు సంచరిస్తూ స్థానిక ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. డెంకణీకోట అటవీ ప్రాంతంలో 20 ఏనుగులకు పైగా మకాం వేశాయి. ఈ మంద నుంచి గుంపులు గుంపులుగా విడిపోయి అటవీ ప్రాంత గ్రామాల పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ రైతుల పంటపొలాలను పాడు చేస్తున్నాయి. ఓ ఒంటి ఏనుగు గ్రామాల్లోకి ప్రవేశించి ప్రజలను భయాందోళనకు గురిచేస్తుంది. ఇక మూడు ఏనుగులు డెంకణీకోట సమీపంలోని తావరకెరె ప్రాంతంలో సంచరిస్తున్నట్లు స్థానిక ప్రజలు అటవీశాఖాధికార్లకు సమాచారం అందజేశారు. ఏనుగులు కండగానపల్లి, దిన్నూరు, ఉబ్బరాయనపల్లి, కెంబత్తపల్లి తదితర ప్రాంతాల్లో సంచరిస్తూఅనప, నువ్వులు, కంది తదితర పంటలతో పాటు తోటలపై పడి కడుపారా ఆరగించి ధ్వంసం చేస్తున్నాయి. ఏనుగులను దూరంగా తరమేయాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా...

అమరావతిలో ఇస్లామిక్ వర్సిటీ ఏర్పాటు చేయాలి

ముస్లిం ఐక్యవేదిక డిమాండ్



మాట్లాడుతున్న జాఫర్ అలీ, రహీంఖాన్

భవానీపురం (విజయవాడ పశ్చిమ): రాజధాని ప్రాంతంలో ఇస్లామిక్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ భవానీపురంలోని ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. విజయవాడ నగర అధ్యక్షుడు రహీంఖాన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జాఫర్ అలీ మాట్లాడుతూ.. త్వరలోనే సీఎం చంద్రబాబును కలిసి తమ సమస్యలను వివరిస్తామని చెప్పారు. ముస్లిం ఐక్యవేదిక అధికార ప్రతినిధి ఖలీల్ సయ్యద్, రాష్ట్ర సమన్వయకర్త అహ్మద్ చందన్ మాట్లాడుతూ.. ముస్లింల సంక్షేమం, విద్యాభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. జస్టిస్ రంగనాథమిశ్రా కమిటీ, జస్టిస్ సచార్ కమిటీ తమ నివేదికలో సూచించిన అంశాలను అమలు చేయాలని కోరారు. ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి సయ్యద్ నూర్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.

ఎస్టీ మహిళనైన నాపై ఇలాంటి దుష్ప్రచారమా?

- విజయసాయిరెడ్డి నాకు తండ్రి సమానులు
- నా బిడ్డ తండ్రి సుభాష్
- మీడియా సమక్షంలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి కన్నీరు



సాక్షి, అమరావతి : ఎస్టీ మహిళనైన తనపై కొన్ని మీడియా సంస్థలు (సాక్షి కాదు) దుష్ప్రచారం చేయడంపట్ల దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. ఎస్టీలోని ఎరుకుల కులానికి చెందిన తనను వ్యక్తిత్వ హననానికి గురిచేస్తూ మానసిక క్షోభ కలిగించేలా తప్పుడు ప్రచారం చేశారంటూ ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. తన బిడ్డకు తండ్రి సుభాష్ అనే వ్యక్తి అని.. అలాంటిది తనకు తండ్రి సమానులైన ఎంపీ విజయసాయిరెడ్డితో సంబంధం అంటకట్టి ఎలా తప్పుడు దుష్ప్రచారం చేస్తారంటూ ఆమె ప్రశ్నించారు. పెద్దాయన అని కూడా చూడకుండా ఇలాంటి ప్రచారం ఎలా చేస్తారని ఆమె మండిపడ్డారు. విజయవాడలో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడారు. సుభాష్‌తో కలిసి తన బిడ్డకు సంబంధించిన ఫంక్షన్ చేసుకుంటున్న సమయంలో తీసిన ఫొటోలను ఈ సందర్భంగా మీడియాకు చూపించారు. ఆంధ్రజ్యోతి, మహాన్యూస్‌లలో తనపై తప్పుడు ప్రచారం చేయడాన్ని ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. విజయసాయిరెడ్డి ఒక ప్రజాప్రతినిధిగా, తాను ప్రభుత్వ ఉద్యోగిగానే తాము మాట్లాడుకున్నామని ఆమె స్పష్టంచేశారు. ఇక దేవదాయ శాఖ కమిషనర్‌కు లేఖ రాసిన మదన్‌మోహన్‌తో 2016లోనే తమ కుల సంప్రదాయాలకు ప్రకారం పెద్దల అంగీకారంతో విడాకుల పత్రాలపై ఇద్దరం సంతకాలు చేసుకున్నామన్నారు. తాను విజయవాడలోనే అందుబాటులో ఉన్న తన వివరణ తీసుకోకుండా తప్పుడు ప్రచారం చేయడంపై శాంతి అభ్యంతరం వ్యక్తంచేశారు. ఇక 2019–20లో తనకు దేవదాయశాఖ అధికారిగా ఉద్యోగం వచ్చిందని.. ఆ తర్వాత తనకు నచ్చిన వ్యక్తితో జీవితం పంచుకుంటున్నానని, తమకు ఓ బాబు పుట్టాడని ఆమె వివరించారు. నిజానికి మదన్‌మోహన్ తనను రూ.కోట్లలో డబ్బులు డిమాండ్ చేశారని ఆమె ఆరోపించారు. చివరికి.. కోర్టులో కూడా విడాకుల కోసం పరస్పర అంగీకారంతో అప్లయి చేసినట్లు ఆమె తెలిపారు. ఆ తర్వాత ఆయన కమిషనర్‌కు ఫిర్యాదు చేశారని శాంతి తెలిపారు.

'ఆపరేషన్ ఖగర్'ను నిలిపివేయాలి

ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక



మాట్లాడుతున్న చిలక చంద్రశేఖర్

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ఛత్తీస్‌ఘఢ్, ఒడిశా రాష్ట్రాల్లో ఆదివాసీలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్‌లో ఆదివాసుల పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేసినట్లు ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక కన్వీనర్ చిలక చంద్రశేఖర్ తెలిపారు. ఆపరేషన్ ఖగర్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివాసీ హక్కుల పరిరక్షణ కమిటీ సన్నాహక సమావేశం ఆదివారం జరిగింది. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఆదివాసీలను అడవుల నుంచి తరిమివేసే కుట్ర జరుగుతోందన్నారు. అటవీ, ఖనిజ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టే ప్రయత్నాలు ప్రభుత్వాలు చేస్తున్నాయని ఆరోపించారు. సీనియర్ జర్నలిస్ట్ భరద్వాజ మాట్లాడుతూ..అభివృద్ధి పేరిట దోపిడీ జరుగుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు, ధర్నాలు నిర్వహించాలని, ఆదివాసీల సమస్యలపై బుక్‌లెట్ ప్రచురించాలని సమావేశం తీర్మానించింది. మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పాల్గొన్నారు.

మెడికోలకు వెన్నుపోటు

ఏరు దాటాక తెప్ప తగలేసిన బాబు ప్రభుత్వం

- గద్దెనెక్కాక హామీలకు తిలోదకాలు ఇస్తున్న దుస్థితి
- ప్రతిపక్షంలో ఉండగా ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ విధానం ఎత్తేస్తామని హామీ
- తీరా అధికారంలోకి వచ్చాక ప్లేట్ ఫిరాయించిన కూటమి ప్రభుత్వం
- సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని కొనసాగిస్తామని హైకోర్టుకు స్పష్టీకరణ



ఇచ్చిన హామీ నెరవేర్చాలి

సెల్ఫ్ ఫైనాన్స్ ఎంబీబీఎస్ సీట్ల విధానాన్ని టీడీపీ తీవ్రంగా వ్యతిరేకించింది. నారా లోకేశ్ సహా పలువురు ముఖ్య నాయకులు ఈ విధానాన్ని రద్దు చేస్తామన్నారు. ఈ క్రమంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలి. నీట్ మార్కుల ఆధారంగా ప్రతిభ కలిగిన విద్యార్థులకు కొత్త వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్లను కేటాయించాలి.

– డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్

సెల్ఫ్ ఫైనాన్స్ విధానంలో ప్రభుత్వమే ఎంబీబీఎస్ సీట్లను అమ్మడం దారుణం. రేపు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక నిరుపేదలకు ఆ సీట్లను అందజేస్తాం. అధికారంలోకి వచ్చాక మొదటి వంద రోజుల్లో జీవోలను రద్దు చేసే బాధ్యత నేను తీసుకుంటాను. ప్రతిభావంతులైన విద్యార్థులకు ఈ సీట్లను అందేలా చూస్తాను.

– 2023 ఆగస్టు 16న మంగళగిరిలో నారా లోకేశ్

ప్రభుత్వం వైద్య కళాశాలల్లో మెడికల్ సీట్లను అమ్ముకోవడం చాలా దురదృష్టకరం. ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇతర వర్గాలకు ఇవ్వాల్సిన సీట్లను డబ్బులకు అమ్ముకోవడం అన్యాయం.

– 2023 అక్టోబర్ 4వ తేదీన కృష్ణా జిల్లా పెడనలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు తీరు ఏరు దాటాక తెప్ప తగలేసినట్లుంది. హామీలకు తిలోదకాలిచ్చే పరంపరలో భాగంగా తాజాగా యువతకు రాష్ట్ర ప్రభుత్వం వెన్నుపోటు పొడిచింది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని రద్దు చేస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకి తూట్లు పొడిచింది. నేటి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎంబీబీఎస్ సీట్లను అమ్మడం దురదృష్టకరం అని గతంలో చిలక పలుకులు పలికారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లకు సంబంధించిన 107, 108 జీవోలను రద్దు చేస్తామని ప్రస్తుత విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ గతంలో ప్రగల్భాలు పలికారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని రద్దు చేయబోమంటూ శుక్రవారం హైకోర్టులో ప్రభుత్వం స్పష్టం చేయడం ద్వారా యువతను దగా చేసింది. దీంతో తమ పిల్లలను డాక్టర్లుగా చూసుకోవాలనే కోరిక ఉండే పేద, మధ్యతరగతి తల్లిదండ్రులు, విద్యార్థులు వీరి మాయ మాటలు నమ్మి మోసపోయారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటులో భాగంగా గత విద్యా సంవత్సరం నంద్యాల, మచిలీపట్నం, రాజమండ్రి, ఏలూరు, విజయనగరం కళాశాలలను సీఎం జగన్ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ క్రమంలో ఆయా కళాశాలల్లో 50 శాతం సెల్ఫ్ ఫైనాన్స్ కోటాగా నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని అప్పట్లో టీడీపీ, జనసేన పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. సెల్ఫ్ ఫైనాన్స్ కోటాను రద్దు చేయాలంటూ టీడీపీ నాయకులు, ఆ పార్టీ శ్రేణులు అప్పట్లో నిరసనలు వ్యక్తం చేశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఈ జీవోలను రద్దు చేస్తామని నమ్మించి ఓట్లు వేయించుకుని.. తీరా గద్దెనెక్కాక మాట తప్పారు.

మా గోడు వినండి!

- పాలిటెక్నిక్ కళాశాలల్లో వర్క్‌షాప్ అటెండర్ల ఆవేదన
- కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న వారిని రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించిన జగన్ సర్కార్
- మార్చిలో జీఓ నంబర్–8 చేసిన గత ప్రభుత్వం
- నియామక పత్రాలు ఇవ్వడంలో ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం
- సీఎఫ్ఎంఎస్ ఖాతాలు బ్లాక్ చేయడంతో నిలిచిపోయిన జీతాలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉద్యోగుల వెతలు మళ్లీ మొదలయ్యాయి. చట్టంలోని నిబంధనలను అమలు చేసి ఉద్యోగులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ముఖ్యంగా గత ప్రభుత్వంలో చట్ట ప్రకారం ఇచ్చిన జీవోలను అమలు చేయకుండా తాత్సారం చేస్తోంది. ఫలితంగా ఉద్యోగులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వివిధ శాఖల్లో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేసే మహాయజ్ఞాన్ని తలపెట్టింది. ఈ క్రమంలోనే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో దశాబ్దాలుగా కాంట్రాక్టు పద్ధతిపై వర్క్‌షాప్ అటెండర్లుగా విధులు నిర్వహిస్తున్న 22 మందిని రెగ్యులర్ చేస్తూ.. ఈ ఏడాది మార్చి 16న జీవో నంబర్–8 జారీ చేసింది. అనంతరం ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో జీవో అమలు తాత్కాలికంగా నిలిచిపోయింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉద్యోగుల శ్రేయస్సును విస్మరించి న్యాయంగా వారికి దక్కాల్సిన హక్కులను దూరం చేస్తోంది.

50 ఏళ్లు పైబడిన వారే ఎక్కువ

ఏపీలో కాంట్రాక్టు ఉద్యోగుల చట్టంలోని నిబంధనల ప్రకారం వర్క్‌షాప్ అటెండర్లుగా పని చేస్తున్న వారిని గత ప్రభుత్వం రెగ్యులర్ చేసింది. వీరు ఐటీఐ, డిప్లొమా విద్యార్హతతో దాదాపు 15 ఏళ్లుగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో పని చేస్తున్నారు. సుమారు 50 ఏళ్ల వయసులో ప్రభుత్వం తమ సేవలను గుర్తించి క్రమబద్ధీకరించడంతో వారంతా సంతోషం వ్యక్తం చేశారు. పదవీ విరమణ 62 ఏళ్లు ఉండటంతో.. మిగిలిన పుష్కర కాలం శాశ్వత ప్రభుత్వ ఉద్యోగిగా పని చేసే అవకాశం దక్కిందనే ఆనందం కాస్తా రెండు నెలల్లోనే ఆందోళనగా మారింది. గత ప్రభుత్వం రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినా సాంకేతిక విద్యాశాఖ మాత్రం వాటిని అమలు చేస్తూ పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వకుండా జాప్యం చేయడం కలవరపెడుతోంది. వాస్తవానికి 22 మంది రెగ్యులర్ ఉద్యోగుల పరిధిలోకి వచ్చినప్పటికీ సాంకేతిక కారణాలతో గడచిన మూడు నెలలుగా కాంట్రాక్టులోనే కొనసాగుతున్నారు. అయితే.. సీఎఫ్ఎంఎస్ ఐడీని మాత్రం బ్లాక్ చేశారు. ఫలితంగా జూన్ నెలలో రావాల్సిన జీతాలు సైతం పెండింగ్‌లో పడ్డాయి. జీతాలపై ఆధారపడటంతో కుటుంబాల పోషణ భారంగా మారుతోంది.

ఎందుకింత ఆలస్యం?

సాంకేతిక విద్యాశాఖలో కాంట్రాక్టు పద్ధతిపై పని చేస్తున్న వారిలో 22 మంది వార్క్‌షాపు అంటెండర్లు, ఇద్దరు లెక్చరర్లను క్రమబద్ధీకరిస్తూ గత ప్రభుత్వం జీవో ఇచ్చింది. ఇద్దరు లెక్చరర్లు నిబంధనలకు విరుద్ధంగా రెగ్యులర్ అయ్యారంటూ కొంతమంది కోర్టులో సవాల్ చేశారు. అయితే న్యాయస్థానం మాత్రం ఆ ఇద్దరు లెక్చరర్లు తప్ప మిగిలిన వారందరికీ నియామక ఉత్తర్వులు ఇవ్వాలని గతంలోనే ఆదేశించింది. కానీ, సాంకేతిక విద్యాశాఖ అధికారులు మాత్రం కావాలనే జాప్యం చేస్తున్నట్టు వర్క్‌షాపు అటెండర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ పేరుచెప్పి ఒకసారి, కోర్టు కేసుల పేరు చెప్పి మరోసారి తమకు అన్యాయం చేస్తున్నారని వాపోతున్నారు.

తెల్లారితే గృహ ప్రవేశం.. అంతలోనే విషాదం

- మిద్దె కూలి దంపతుల దుర్మరణం
- అనంతపురం జిల్లాలో ఘటన



మారెప్ప,లక్ష్మి మృతదేహాలు

విడపనకల్లు : తెల్లారితే నూతన గృహ ప్రవేశం.. అంతలోనే విషాదం చోటుచేసుకుంది. పాత మిద్దె కూలి భార్యాభర్తలు దుర్మరణం పాలయ్యారు. అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం హావళిగి ఎస్సీ కాలనీలో ఆదివారం జరిగిన ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కోనప్పగారి మారెప్ప(42), లక్ష్మి(38) దంపతులు. వీరికి అంజి, హేమంత్ అనే ఇద్దరు కుమారులు, కుమార్తె మానస(మూగ) ఉన్నారు. మారెప్ప పెద్దలు దాదాపు 60 ఏళ్ల క్రితం మట్టితో కట్టించిన ఇంట్లోనే ఉండేవారు. అయితే.. భార్యాభర్త కాయాకష్టం చేసుకుని సంపాదించిన డబ్బుతో ఇటీవల నూతన గృహాన్ని నిర్మించుకున్నారు. ఆదివారం గృహ ప్రవేశం పెట్టుకున్నారు. కాగా, శనివారం రాత్రి భారీ గాలులతో కూడిన చిన్నపాటి వర్షం కురిసింది. రోజూ మాదిరిగానే మారెప్ప, లక్ష్మి దంపతులు కుమార్తెతో కలసి పాత మట్టి మిద్దెలో పడుకున్నారు. వీరితో పాటు లక్ష్మి తమ్ముడు రాము కూడా అదే ఇంట్లో నిద్రించాడు. ఇద్దరు కుమారులు మాత్రం ఇంటి ఆరుబయట మంచంపై పడుకున్నారు. వర్షానికి తడిసిన కారణంగా మట్టి మిద్దె ఆదివారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో ఒక్కసారిగా కుప్పకూలింది. పెద్ద శబ్దం రావడంతో చుట్టుపక్కల వారు ఉలిక్కి పడి లేచారు. మారెప్ప ఇల్లు కూలిపోయిందని గమనించి అరుపులు, కేకలు వేయడంతో కాలనీవాసులంతా వచ్చి మట్టి కింద పూడుకునిపోయిన వారిని వెలికి తీశారు. అప్పటికే మారెప్ప, భార్య లక్ష్మి ప్రాణాలు విడిచారు. కుమార్తె మానసకు చేయి విరిగింది. రాముకు చేతులు, వేళ్లు విరగడంతో పాటు తలకు బలమైన గాయమైంది. గాయపడిన వారిని 108లో ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. ఘటనపై ఎస్‌ఐ ఖాజా హుస్సేన్ కేసు నమోదు చేశారు. మృతదేహాలకు ఉరవకొండ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి కోరారు.

ఊయలలో పసికందుపై అఘాయిత్యం

- 6 నెలల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన కామాంధుడు
- నిందితుడు వరుసకు తాత
- పోక్సో కేసు నమోదు
- రిమాండ్‌కు తరలింపు



నిందితుడు బోయిన ఎరకన్నదొర

రామభద్రపురం: రాష్ట్రంలో మరో దారుణ ఘటన వెలుగుచూసింది. విజయనగరం జిల్లాలో 6 నెలల చిన్నారిపై అఘాయిత్యం జరిగింది. నంద్యాల జిల్లాలో 8 ఏళ్ల చిన్నారిపై అత్యాచార ఘటన మరువక ముందే.. విజయనగరం జిల్లాలో ఈ దారుణం చోటుచేసుకుంది. రామభద్రపురం మండలం కొండకెంగువ పంచాయతీ మధుర గ్రామ పరిధిలోని జీలికవలసలో శనివారం 6 నెలల పసికందుపై వరుసకు తాత అయిన వ్యక్తి లైంగిక దాడికి ఒడిగట్టాడు. డీఎస్పీ పి.శ్రీనివాసరావు ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం 9 గంటల సమయంలో పసి పాపకు స్నానం చేయించిన తల్లి ఊయలలో నిద్ర పుచ్చింది. గ్రామంలోకి నిత్యావసర సరుకులు రావడంతో.. కొనుగోలు చేసేందుకు తల్లి వీధిలోకి వెళ్లింది. ఇంతలో అదే గ్రామానికి చుట్టపు చూపుగా వచ్చిన నేరళ్లవలసకు చెందిన.. బాధిత చిన్నారికి తాత వరసైన బోయిన ఎరకన్నదొర (40) ఊయలలో నిద్రలో ఉన్న పాపపై లైంగిక దాడి చేయడంతో ఏడ్చింది. పక్కింటి వారు పాప ఏడుస్తున్న విషయాన్ని తల్లికి కేక వేసి చెప్పగా.. బిడ్డ ఎందుకు ఏడుస్తుందో చూడమని తన పెద్ద కుమార్తెకు చెప్పింది. పెద్ద కుమార్తె చూసి 'చెల్లిని తాతయ్య ఎత్తుకున్నాడు. రక్తం వస్తోంది' అని తల్లికి చెప్పింది. తల్లి పరుగున వచ్చేసరికి ఎరకన్నదొర పాపను ఊయలలో వేసేసి పారిపోయాడు. పసిపాపకు రక్తస్రావం కావడాన్ని చూసిన తల్లి ఎరకన్నదొరను వెంబడించి అతడిపైకి కర్ర విసిరింది. ఆమె వెంబడించడం చూసి గ్రామస్తులు కూడా పట్టుకోవడానికి ప్రయత్నించారు. అయినా.. ఎరకన్నదొర తప్పించుకుపోయాడు. పాపను బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి విజయనగరంలోని ఘోషాస్పత్రికి తరలించారు. బాడంగి వైద్యాధికారులు పోలీసులను సంప్రదించాలని సూచించడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు క్లూస్‌టీం సహాయంతో జీలికవలస గ్రామానికి వెళ్లి పాప దుస్తులను సీజ్ చేశారు. ఆదివారం వేకువజామున నేరళ్లవలసలో నిందితుడు ఎరకన్నదొరను అదుపులోకి తీసుకుని అతని దుస్తులపై ఉన్న రక్తపు మరకలను సేకరించారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. నిందితుడు గతంలోనూ ఇటువంటి ఘటనలకు పాల్పడ్డాడని గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం పాప విజయనగరం ఘోషాస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆరోగ్యం నిలకడగా ఉంది. డీఎస్పీ వెంట సీఐ తిరుమలరావు, ఎస్ఐ జ్ఞానప్రసాద్ ఉన్నారు.

బాలల హక్కుల కమిషన్ దిగ్భ్రాంతి

సాక్షి, అమరావతి: ఆరు నెలల చిన్నారిపై జరిగిన అఘాయిత్యంపై రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై ఘోషాస్పత్రి పర్యవేక్షణ అధికారిణి అరుణ శుభశ్రీతో మాట్లాడి, మెరుగైన చికిత్స అందించాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా యంత్రాంగం దృష్టి సారించాలని సూచించారు. కాగా.. ఈ ఘటనను రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు ఖండించారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఘటన సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందని, నిండితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

న్యాయం చేశాకే ప్రాజెక్ట్ నిర్మించాలి

- పోలవరంపై సెమినార్‌లో వక్తల ఉద్ఘాటన
- నిర్వాసితుల అంశం శ్వేతపత్రంలో ప్రస్తావించకపోవడంపై ఆగ్రహం



మాట్లాడుతున్న సీపీఎం నేత రాఘవులు

సాక్షి, అమరావతి: నిర్వాసితులకు పునరావాసం, ప్యాకేజీలలో న్యాయం చేశాకే పోలవరం ప్రాజెక్ట్ పనులు ప్రారంభించాలని వక్తలు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో 'పోలవరంపై సెమినార్ (రాష్ట్ర ప్రభుత్వ శ్వేతపత్రంపై పరిశీలన)'ను విజయవాడ బాలోత్సవ భవనంలో ఆదివారం నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబు ఏపీ అంటే అమరావతి–పోలవరం అని చెబుతున్నారని, అదే అమరావతి, పోలవరం అతి ప్రచారమే ఆయన్ను ముంచిందనే విషయాన్ని మరిచిపోతున్నారని ఎద్దేవా చేశారు. నిర్వాసితుల గురించి శ్వేతపత్రంలో ఎక్కడా ప్రస్తావించలేదని తప్పుబట్టారు. ప్రాజెక్టును 70% పూర్తి చేసినట్టు చంద్రబాబు అబద్ధాలు చెబుతున్నారని, వాస్తవానికి పూర్తయింది 22 శాతమేనన్నారు.

గిరిజనులను మనుషులుగా చూడటం లేదు

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో గిరిజనులను మనుషులుగా చూడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పట్టిసీమ కాలువలకు పోయిన భూములకు ఎకరాకు రూ.38 లక్షలు పరిహారం ఇచ్చిన చంద్రబాబు ప్రభుత్వం పోలవరం నిర్వాసితులైన గిరిజనులకు మాత్రం ముష్టి వేస్తున్నట్టు వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మేకల్నే బ్యాన్ చేసిన వ్యక్తి చంద్రబాబు

'ఆదివాసుల జలసమాధి పోలవరం' పుస్తక రచయిత ఆర్.ఉమామహేశ్వరి మాట్లాడుతూ గ్రీనరీ తగ్గడానికి మేకలే కారణం అనుకుని మేకల్ని బ్యాన్ చేసిన వ్యక్తి చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. అలాంటి చంద్రబాబు ఇటీవల విడుదల చేసిన శ్వేతపత్రంలో గిరిజనులు, జీవజాతుల ప్రస్తావన లేదన్నారు. సదస్సులో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, అడ్వకేట్స్ యూనియన్ నేత మాధవరావు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకరరెడ్డి, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, ముంపు ప్రాంతాల నేత లోతా రాంబాబు మాట్లాడారు.

టీడీపీ నేత మా భూములను కబ్జా చేస్తున్నారు

సీఎం చంద్రబాబుకు బాధితుల ఫిర్యాదు



టీడీపీ నేతపై సీఎంకు ఫిర్యాదు చేసిన బాధితులు

రాయచోటి: టీడీపీ నేత మదన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల భూములను ఆక్రమించి దౌర్జన్యాలకు పాల్పడుతున్నాడంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్థానికులు ఫిర్యాదు చేశారు. అన్నమయ్య జిల్లా రాయచోటి రూరల్ మండలం, ఎండపల్లి పంచాయతీకి చెందిన షేక్ యాస్మిన్, వీరబల్లి మనోహర్, మరికొంతమంది ప్రజలు శనివారం ముఖ్యమంత్రి, మంత్రులు లోకేశ్ తదితరులకు తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేశారు. తరతరాలుగా అనుభవిస్తున్న భూములను మదన్‌మోహన్‌రెడ్డి ఆక్రమించుకుంటున్నారని, ప్రశ్నిస్తే భౌతిక దాడులు చేస్తున్నారని తెలిపారు. 37 సర్వే నంబరులో తమ పేరుతో ఉన్న భూమిని తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను తారుమారు చేసి అతని భార్య పేరున పాస్‌బుక్ తెచ్చుకున్నారని మనోహర్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని ముస్లిం, బెస్త, రజక, ఎస్సీలకు చెందిన కోట్ల రూపాయలు విలువ జేసే వందల ఎకరాల భూములను ఆక్రమించి కంచెలు వేస్తున్నారని తెలిపారు. కోర్టుకు వెళ్లి భూములను కాపాడుకుందామని ప్రయత్నించినా.. అతను తన పలుకుబడితో ఎంఆర్‌వో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తమ పేర్న ఉన్న రికార్డులను చించివేశారని తెలిపారు. మదన్‌మోహన్‌రెడ్డి బారి నుంచి తమ భూములకు విముక్తి కలిగించాలని కోరినట్టు బాధితులు చెప్పారు.

తల్లిదండ్రులు మందలిస్తారన్న భయంతో కట్టుకథ

మార్టూరు బాలుడి కిడ్నాప్ అవాస్తవమని తేల్చిన పోలీసులు

మార్టూరు: తనను ఎవరో కిడ్నాప్ చేశారంటూ శనివారం ఓ బాలుడు తండ్రితో వచ్చి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయంలో వాస్తవం లేదని బాపట్ల జిల్లా మార్టూరు సీఐ ఎస్సీ రాజశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటికి ఆలస్యంగా వెళ్లినందుకు తల్లిదండ్రులు మందలిస్తారన్న భయంతో బాలుడే అబద్ధం ఆడినట్టు విచారణలో తేలిందన్నారు. మార్టూరులోని పాత కో–ఆపరేటివ్ బ్యాంక్ రోడ్డులో నివసిస్తున్న కె.కుటుంబరావు కుమారుడు మనస్ (10) శనివారం రాత్రి తనను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారని తండ్రితో కలిసి వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దీంతో పోలీసులు రహదారిపై గల సీసీ కెమెరాలు పరిశీలించగా.. ఎలాంటి అనుమానాస్పద ఘటనలు నమోదు కాలేదు. ఈ క్రమంలో సీఐ బాలుడిని కూర్చోబెట్టి వివరంగా ప్రశ్నించగా.. తాను స్నేహితులతో కలిసి ఆడుకుని ఇంటికి ఆలస్యంగా వెళ్లానని తెలిపాడు. తల్లిదండ్రులు మందలిస్తారనే భయంతో అబద్ధం ఆడినట్టు చెప్పాడు. దీంతో సీఐ రాజశేఖర్‌రెడ్డి బాలుడికి, అతని తండ్రి కుటుంబరావుకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఆగని టీడీపీ విధ్వంసాలు

- పల్నాడు, ఏలూరు జిల్లాల్లో వైఎస్సార్ విగ్రహాల ధ్వంసం
- కర్నూలు జిల్లాలో వీఆర్వో కుటుంబంపై దాడి



దెందులూరులో విరగ్గొట్టిన వైఎస్సార్ విగ్రహం చేతులు



మాదలలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం చెయ్యి విరగ్గొట్టిన దుండగులు

సాక్షి నెట్‌వర్క్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీడీపీ నేతలు, కార్యకర్తలు విధ్వంస చర్యలకు పాల్పడుతూనే ఉన్నారు. శని, ఆదివారాల్లో కూడా ఇష్టారీతిన వ్యవహరించారు. దివంగత సీఎం రాజశేఖరరెడ్డి విగ్రహాలను ధ్వంసం చేశారు. వీఆర్వో కుటుంబంపై దాడిచేశారు.

- ▲ పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం మాదలలోని గ్రామ సచివాలయం వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం చేతిని శనివారం రాత్రి విరగ్గొట్టారు. విగ్రహం ధ్వంసంపై వైఎస్సార్‌సీపీ నాయకులు, వైఎస్ రాజశేఖరరెడ్డి అభిమానులు ముప్పాళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ దుశ్చర్యకు పాల్పడినవారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల పుల్లారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు గోగుల అంజిబాబు, నేతలు చిమటా శ్రీనివాసరావు, తిరుమలశెట్టి అయ్యప్ప, షేక్ దమ్మాలపాటి బుజ్జి, గంటా శ్రీనివాసరావు, షేక్ మస్తాన్‌వలి, ఇందూరి వెంకటరెడ్డి, మహంకాళిరావు, జయరావు, బి.రాజు కోరారు.
- ▲ ఏలూరు జిల్లా దెందులూరులోని లైబ్రరీ సెంటర్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం చేతుల్ని విరగ్గొట్టారు. ఈ విధ్వంసంపై వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు.
- ▲ కర్నూలు జిల్లా సి.బెళగల్ మండలం ఇనగండ్ల గ్రామ వీఆర్వో తిరుపాల్, ఆయన కుటుంబ సభ్యులపై టీడీపీ నాయకులు దాడిచేశారు. వీఆర్వో కథనం మేరకు.. మండలంలోని తిమ్మందొడ్డి గ్రామ ఎస్సీ కాలనీలో వీఆర్వో తిరుపాల్ తన కుటుంబంతో నివాసముంటున్నారు. అదే గ్రామంలో బీసీ వర్గానికి చెందిన టీడీపీ నాయకులు వీఆర్వో కుటుంబసభ్యుల్ని కులం పేరుతో దూషించి, కించపరిచారు. ఈ విషయం తెలుసుకున్న తిరుపాల్ భార్య దేవమ్మ తిట్టిన వారిని ప్రశ్నించడంతో 'ఎస్సీ కులానికి చెందినదానవు, నీవు మా ఇళ్ల దగ్గరకు వస్తావా..' అంటూ మరోసారి దూషించారు. అంతటితో ఆగకుండా ఇంటిమీదకు వెళ్లి తిరుపాల్, దేవమ్మ దంపతుల పైన, వారి కుమారుడు జానుపైన దాడిచేశారు. తమపై టీడీపీకి చెందిన పెద్దశేషన్న కుమారుడు హరి, ముత్యాలు కుమారులు వెంకన్న, గిడ్డయ్య, గౌరన్న కుమారుడు హరి దాడిచేసినట్లు వీఆర్వో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనకు, తన కుటుంబానికి రక్షణ కల్పించి, దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వీఆర్వో కోరారు. ఈ విషయమై ఎస్.ఐ. తిమ్మారెడ్డి మాట్లాడుతూ ఈ ఘటనపై తనకు సమాచారం వచ్చిందని, విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తల్లికి పంగనామం.. విద్యార్థులకు వెన్నుపోటు

వైఎస్సార్‌సీపీ నాయకుడు పోతిన మహేష్



పటమట (విజయవాడ పశ్చిమ): కూటమి ప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనం పథకం పేరును 'తల్లికి పంగనామం.. విద్యార్థులకు వెన్నుపోటు'గా మార్చాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు పోతిన మహేష్ సూచించారు. ఆదివారం విజయవాడలో వీడియో ద్వారా ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 1నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థుల సంఖ్య 1.07 కోట్లని తెలిపారు. వారికి తల్లికి వందనం పథకం కింద కూటమి ప్రభుత్వం కేటాయించాల్సిన బడ్జెట్ రూ.15,700 కోట్లని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఈ బడ్జెట్ అంశంపై వివరణ ఇవ్వకుండా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడం దుర్మార్గమన్నారు. ప్రతి బిడ్డకు అని కాకుండా తల్లికి మాత్రమే అని జీవోలో పొందుపరిచారన్నారు. అదికూడా అందరి తల్లులకు కాదు.. కొంతమంది తల్లులకే అని కూడా స్పష్టంగా ఉందన్నారు. దీనిపై మంత్రి రామానాయుడు వివరణ ఇవ్వకుండా జగన్‌మోహన్‌రెడ్డిపై, గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం దారుణమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఓడిపోయింది జగన్ కాదు.. పేద ప్రజలన్న విషయం తొందర్లోనే అందరికీ అర్థమవుతుందని చెప్పారు. ఇప్పటికైనా చంద్రబాబు ఎన్నికల్లో ప్రచారం చేసిన విధంగానే తల్లికి వందనాన్ని అమలు చేయాలని కోరారు. లేదంటే మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల.. చంద్రబాబు చేతిలో బందీగా మారారని చెప్పారు. షర్మిల రాజశేఖర్‌రెడ్డి బిడ్డనని, పీసీసీ అధ్యక్షురాలినని మర్చిపోయి టీడీపీ అధికార ప్రతినిధిగా, కూటమి రహస్య భాగస్వామిలా మాట్లాడుతున్నారని విమర్శించారు.

ఇస్లాం వెలుగు



ప్రవక్త జీవితంలో ముఖ్య ఘట్టం
మొహర్రం

ఇస్లామీయ క్యాలండర్ ప్రకారం సంవత్సరంలోని మొదటి నెల 'మొహర్రం'. ప్రతి సంవత్సరం ఈ నెల వస్తూనే ముహమ్మద్ ప్రవక్త (స) వారి జీవితంలోని ఓ ముఖ్యమైన ఘట్టం మనసులో మెదులుతుంది. అదే 'హిజ్రత్'. (మక్కా నుండి మదీనాకు వలస). హిజ్రత్ తరువాతనే ధర్మానికి జవసత్వాలు చేకూరాయి, ధర్మం ఎల్లెడలా విస్తరించింది. ధర్మ పరిరక్షణ, మానవ సేవ, మానవులకు సత్య సందేశాన్ని అందించడం లాంటి మహత్తర ఆశయం కోసం కష్ట నష్టాలను సహించాల్సి వచ్చినా, చివరికి స్వదేశాన్ని విడిచి వలస వెళ్ళవలసి వచ్చినా వెనకాడ కూడదనే విషయాన్ని ముహర్రం ప్రతి సంవత్సరం విశ్వాసులకు గుర్తు చేస్తూ ఉంటుంది.

దేవుడు భూమ్యాకాశాలను సృష్టించిన నాటి నుండి నెలల సంఖ్య పన్నెండు మాత్రమే. వాటిలో నాలుగు పవిత్ర మాసాలు'. అందులో 'మొహర్రం' కూడా ఒకటి. ప్రవక్త(స) ప్రవచనం ప్రకారం: 'పన్నెండు నెలలు ఒక సంవత్సరం. అందులో నాలుగు నెలలు గౌరవప్రదమైనవి. జుల్ ఖ అద, జుల్ హిజ్జ, ముహర్రమ్, రజబ్. కనుక ఈ నెలలో ఎక్కువగా సత్కార్యాలు ఆచరిస్తూ పాపాలకు దూరంగా ఉండాలి. సమాజంలో సత్యం, న్యాయం, ధర్మం, మానవీయ విలువల పరిరక్షణకు కృషి చేయాలి. సమాజంలో ప్రబలిన అన్ని రకాల చెడులను రూపుమాపడానికి ప్రయత్నం చేయాలి. సతతం దైవ భీతి (తఖ్వా) తో గడపాలి. అప్పుడే దైవ సహాయం లభిస్తుంది. ఈ నెల ఘనతకు సంబంధించి ముహమ్మద్ ప్రవక్త(స) ఇలా అన్నారు. 'ముహర్రం అల్లాహ్ నెల. రమజాన్ ఉపవాసాల తరువాత శ్రేష్ఠమైన ఉపవాసాలు ముహర్రం ఉపవాసాలే.' (సహీహ్ ముస్లిం: 2755)

రమజాను ఉపవాసాలు ఫర్జ్ కాక ముందు ఆషూర (ముహర్రం పదవ తేది) ఉపవాసం విధిగా ఉండేది. అదే రోజు కాబాపై కొత్తవస్త్రం కప్పేవారు. ప్రవక్త మహనీయులు మదీనాకు వలస వెళ్ళిన తరువాత, అక్కడి యూదులు రోజా (ఉపవాసం) పాటించడం గమనించారు. అది ముహర్రం పదవ తేదీ. (యౌమె ఆషూరా) అప్పుడు ప్రవక్త వారు, 'ఏమిటి ఈరోజు విశేషం?' అని వారిని అడిగారు. దానికి వారు, 'ఇది చాలా గొప్పరోజు. ఈ రోజే దైవం మూసా ప్రవక్త(అ) ను, ఆయన జాతిని ఫిరౌన్ బారి నుండి రక్షించాడు. అప్పుడు మూసా ప్రవక్త, దైవానికి కృతజ్ఞతగా రోజా పాటించారు. కనుక మేము కూడా ఆయన అనుసరణలో ఈ రోజు ఉపవాసం పాటిస్తాము'. అని చెప్పారు. అప్పుడు ప్రవక్తమహనీయులు, 'మూసా ప్రవక్త అనుసరణలో రోజా పాటించ డానికి మీకంటే మేమే ఎక్కువ హక్కుదారులం' అని చెప్పి, తమ అనుచరులకు రోజా పాటించమని ఉపదేశించారు. ముహర్రం మాసం 9, 10 లేదా 10, 11 కాని రెండురోజులు రోజా (ఉపవాసం) పాటించాలి.

ఆషూరా ఉపవాసం పాటించడం వల్ల గత సంవత్సరకాలం పాపాలు మన్నించబడతాయని కూడా ఆయన సెలవిచ్చారు. (సహీహ్ ముస్లిం 1162).

మొహర్రం నెల ప్రాముఖ్యం, హజ్రత్ ఇమామె హుసైన్ (ర) అమరత్వం మామూలు విషయం కాదు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణ, ధర్మసంస్థాపన, దైవప్రసన్నతే ధ్యేయంగా సాగిన సమరంలో హజ్రత్ ఇమామె హుసైన్, ఆయన పరివారం వీరమరణం పొందారు. అందుకని ఆయన ఏ లక్ష్యం కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడి అమరుడయ్యారో మనం దాని నుంచి ప్రేరణ పొందాలి. సమాజంలో దుర్మార్గం ప్రబలినప్పుడు, ఉన్మాదం జడలు విప్పినప్పుడు, విలువల హననం జరుగుతున్నప్పుడు, సమాజ శ్రేయోభిలాషులు, న్యాయప్రేమికులు, పౌరసమాజం తక్షణం స్పందించాలి. న్యాయం కోసం, ధర్మం కోసం, మానవీయ విలువల కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం శక్తివంచన లేకుండా పోరాడాలి. ఇదే ఇమామె హుసైన్ అమరత్వం మన కిస్తున్న సందేశం.

(17, బుధవారం మొహర్రం – యౌమె ఆషూరా)

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్



కాకతాళీయంగా 'కర్బలా' సంఘటన కూడా ఇదే రోజున జరగడం వల్ల దీని ప్రాముఖ్యత మరింతగా పెరిగిపోయింది. అంతమాత్రాన ముహర్రం నెలంతా విషాద దినాలుగా పరిగణించనక్కర లేదు. ఎందుకంటే సత్యం కోసం, న్యాయం కోసం, ధర్మం కోసం, విలువల కోసం, హక్కులకోసం, ఇస్లామీయ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం హజ్రత్ ఇమామె హుసైన్ (ర) అమరగతి పొందిన చారిత్రక రోజిది. అమరత్వం అనేది మానవ సహజ భావోద్రేకాల పరంగా బాధాకరం కావచ్చునేమోగాని, విషాదం ఎంతమాత్రం కాదు. 'కర్బలా' సాక్షిగా ఒక విశ్వాసి పోషించవలసిన పాత్రను ఆయన ఆచరణాత్మకంగా నిరూపించారు. అందుకే ఆ మహనీయుడు అమరుడై దాదాపు వేయిన్నర సంవత్సరాలు కావస్తున్నా, నేటికీ కోట్లాదిమంది ప్రజలకు, ప్రజాస్వామ్య ప్రియులకు ఆదర్శంగా, స్ఫూర్తిగా నిలిచారు. అందుకే ప్రతియేటా 'మొహర్రం' నెలలో ఆయన త్యాగాన్ని ప్రపంచ వ్యాప్తంగా కోట్లాదిమంది ప్రజలు స్మరించుకుంటారు.

ధర్మ జిజ్ఞాస

క్రైస్తవ్యం చెప్పే యుగాంతం



పరిశుద్ధ గ్రంథంలో యుగాంతం గురించిన ప్రస్తావన విరివిగానే కనిపిస్తుంది. దీనిని యేసు ప్రభువు రెండవ రాకడ, ప్రభువు దినం, యుగసమాప్తి, కడవరి దినాలు, అంత్యకాలంగా పేర్కొనడం జరిగింది. ప్రారంభంలో ఈ సృష్టిని చేసిన దేవుడు చివరిగా మానవులను సృజించాడు.

బైబిల్‌లో మొదటి గ్రంథమైన ఆది కాండంలో రాసి ఉన్నట్లుగా నరులు భూమ్మీద విస్తరించే సమయంలోనే మానవులపై దేవుడికి ఎంతో కోపం వచ్చినట్లుగా గమనిస్తాం. కారణం వారు దేవుని మార్గాన్ని విడిచారు. చీకటి మార్గాలు, సాతాను మార్గాలు వెదకడం ప్రారంభించారు. నరుల చెడుతనం భూమిమీద బహుగా విస్తరించడం వారి హృదయ తలంపులు, ఊహలన్నీ చెడ్డవిగా ఉండటం దేవుడు గమనించి, భూమి అంతా బలత్కారంతో నిండబడి ఉండటం దేవునికి సంతాపాన్ని కలుగజేసింది. ఫలితంగా నీతి మంతుడైన ఒక్క నోవహు కుటుంబాన్ని సకల పశుపక్ష్యాదులు, జంతువులను రెండేసి చొప్పున ఓ ప్రత్యేక ఓడ ద్వారా రక్షించి మిగతా మానవులందరినీ మహాజల ప్రళయం ద్వారా నశింప చేసినట్లుగా చూస్తాం. నోవహు సంఘటన క్రీస్తుపూర్వం సుమారు 2,400 సంవత్సరాల క్రితం జరిగినట్లుగా బైబిల్ పండితులు చెబుతుంటారు.

మరల భూమి మీద పాపం విస్తరించినప్పుడు రెండువేల సంవ్సరాల క్రితం దేవుడే యేసుక్రీస్తు రూపంలో నరరూపుధారుడై ఈ భూమ్మీదకి వచ్చాడు.. పాపుల రక్షణార్థమై సిలువమీద మరణించాడు. 3వ రోజున పునరుత్థానుడై పరలోకానికి వెళ్ళాడు. యేసుక్రీస్తు తన బోధల్లో ఈ భూమి అంతం గురించి చాలా స్పష్టంగా తెలియ చేశాడు. త్వరలోనే యుగసమాప్తి ఉంటుందని పాపపు జీవితాన్ని వదిలి వేసి దేవుని నమ్ముకొని మారుమనస్సు పొంది దేవుడిచ్చే ఉచిత రక్షణను స్వీకరించడం ద్వారా పరలోకానికి వారసులవుతారని, పాపులందరి కోసం నరకం సిద్ధంగా ఉందని చెప్పాడు. యుగ సమాప్తి సమయంలో దీనిని యేసుక్రీస్తు మరల రెండవసారి భూమ్మీదకు వస్తాడు. ఆ తర్వాత అంతం ఉంటుంది. దీనిని యేసు ద్వితీయ ఆగమనంగా, క్రీస్తు రెండవ రాకడగా పిలుస్తారు. అయితే ఈ రెండవ రాకడ ఎప్పుడు వస్తుంది? దానికి సూచనలేంటి అని శిష్యులు ఏసుప్రభువును అడిగినప్పుడు యుద్ధాలను గూర్చిన సమాచారం ఎక్కువగా వింటారని, జనాలమీదికి జనం, రాజ్యంమీదికి రాజ్యం లేస్తాయని, కరువులు, భూకంపాలు కలుగుతాయి. భూమ్మీద దేవుని బిడ్డలకు మహాశ్రమ వేదన కలుగుతుందని, మనుష్యుల్లో ఒకరిపట్ల ఒకరికి ద్వేషం పెరుగుతుందని, అక్రమం విస్తరించి మనుషుల్లో ప్రేమ చల్లారుతుందని, అలాగే యుగసమాప్తంలో సూర్యుడు వెలుగు ఇవ్వడని, చంద్రుడు కాంతి కోల్పోతాడని, ఆకాశం నుండి నక్షత్రాలు రాలతాయని, తుదకు క్రీస్తు మహా ప్రభావంతో భూమ్మీదకు వస్తాడని పేర్కొన్నాడు. అయితే ఆయన రాకడ అందరికీ తెలిసే విధంగా ఉండక ఆకస్మాత్తుగా దొంగ వచ్చినట్లు ఉంటుందని, అందుకే దేవుని భయం కలిగి పరిశుద్ధ జీవితం కలిగి జాగరూకతతో జీవించాలని యేసు చెప్పాడు. అంత్యదినాలలో అపాయకరమైన దినాలు వస్తాయని భక్తుడైన పౌలు చెప్పాడు. మనుష్యులు స్వార్థ ప్రియులు, ధనాపేక్షులు, అబద్ధాలాడేవారు అవిధేయులు, కృతజ్ఞత లేని వారు, అపవిత్రులు, తల్లిదండ్రులను గౌరవించని వారు, అనురాగ రహితులు, అతిద్వేషులు, అపవాదకులు, అజితేంద్రియులు, క్రూరులు, సజ్జనద్వేషులు, మూర్ఖులు, గర్వాంధులు, దేవుని కంటే సుఖానుభవం ఎక్కువగా కోరేవారుగా ఉంటారని పౌలు భక్తుడు చెప్పాడు.

అయితే యేసు చెప్పిన రెండవ రాకడ గురుతులు చాలా ఇప్పటికే జరిగాయని, ప్రస్తుత సమాజం చూసినా అది బహిర్గతమౌతుందని, యేసు రాకడ త్వరలో ఉందని దైవజనులు చెపుతున్నారు. ఏ దినమైనా ఏ సమయంలోనైనా ఈ యుగ సమాప్తి జరగవచ్చని, అందుకు సిద్ధంగా ఉండాలని బోధిస్తున్నారు.

– బందెల స్టెర్జి రాజన్

> అంత్యకాలంలో జరిగే విషయాలన్నీ బైబిల్‌లోని ప్రకటన గ్రంథంలో వివరంగా రాయబడ్డాయి. ఆయా కాలాలలో దేవుడు తన భక్తులకు భూమి అంతం గురించి తెలియజేస్తూనే ఉన్నాడు. అంతిమంగా ఈ భూమ్మీద జన్మించిన ప్రతిమనిషి దేవుని తీర్పును ఎదుర్కొంటాడని, దేవుని నమ్ముకున్న వారు, భూమ్మీద పాపం లేకుండా పవిత్రంగా జీవించిన వారు మాత్రమే దేవునితో సదాకాలం జీవించడానికి పరలోకానికి కొనిపోబడతారు. అక్రమంగా జీవించిన వాళ్ళంతా నిత్య నరకాగ్నిలో నిరంతరం వేదన అనుభవిస్తూ జీవిస్తారు.

సినిమా

స్పెషల్ ట్రైనింగ్?



● గౌతమ్, మహేశ్‌బాబు

మహేశ్‌బాబు హీరోగా నటించిన చిత్రం 'వన్: నేనొక్కడినే' (2014). ఈ సినిమాలో మహేశ్‌బాబు చిన్న నాటి సన్నివేశాల్లో ఆయన తనయుడు గౌతమ్ ఘట్టమనేని నటించారు. చైల్డ్ ఆర్టిస్టుగా గౌతమ్‌కి ఇదే తొలి మూవీ. అయితే 'వన్: నేనొక్కడినే' తర్వాత గౌతమ్‌ను స్క్రీన్‌పై చూడాలని మహేశ్ అభిమానులు ఎంతగానో ఆశపడుతున్నారు. అయితే ఇందుకు తగ్గ పక్కా ప్రణాళికను మహేశ్ రెడీ చేస్తున్నారట. ఇటీవల ప్లస్ టూ గ్రాడ్యుయేషన్‌ను విదేశాల్లో పూర్తి చేశాడు గౌతమ్. అయితే విదేశాల్లో కాలేజ్ స్టడీస్ చేసే సమయంలోనే యాక్టింగ్ కోర్సులో కూడా గౌతమ్ జాయిన్ అయ్యేలా మహేశ్ బాబు ఏర్పాట్లు చేస్తున్నారట. ఇందుకోసం ప్రముఖ యాక్టింగ్ ఇన్‌స్టిట్యూషన్స్ వివరాలను సేకరించే పనిలో ఉన్నారని ఫిల్మ్‌నగర్ భోగట్టా. గౌతమ్‌ను యాక్టింగ్ కోర్సులో జాయిన్ చేసే ఆలోచనలో మహేశ్‌బాబు ఉన్నారంటే భవిష్యత్తులో గౌతమ్ హీరోగా చేస్తారని ఆశిస్తున్నారు మహేశ్‌బాబు ఫ్యాన్స్. కాగా ఈ విషయాలపై పూర్తి సమాచారం అందాల్సి ఉంది. ఇదిలా ఉంటే.. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. సెప్టెంబరులో ఈ సినిమా చిత్రీకరణ స్టార్ట్ కానున్నట్లు తెలిసింది.

నాదనాథుడి ఉగ్రరూపం



● శరత్ కుమార్

మంచు విష్ణు కలల ప్రాజెక్టుగా రూపొందుతోన్న చిత్రం 'కన్నప్ప'. 'మహాభారత్' సిరీస్ ఫేమ్ ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. అవా ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్‌లపై మంచు మోహన్ బాబు నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతున్న ఈ మూవీలో ప్రభాస్, మోహన్ బాబు, అక్షయ్ కుమార్, మోహన్ లాల్, శరత్ కుమార్, బ్రహ్మానందం, ప్రీతి ముకుందన్, కాజల్ అగర్వాల్ వంటి వారు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. కాగా ఆదివారం (జూలై 14) శరత్ కుమార్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఈ మూవీలో ఆయన నటిస్తున్న నాదనాథుడి పాత్ర పోస్టర్‌ను రిలీజ్ చేశారు. రెండు చేతుల్లో కత్తులు పట్టుకుని ఉగ్రరూపంలో ఉన్న ఓ యోధుడిలా కనిపిస్తున్నారు శరత్ కుమార్. ''శివ భక్తుడైన కన్నప్ప కథను 'కన్నప్ప'గా తెరపైకి తీసుకొస్తున్నాం. ఇటీవల విడుదల చేసిన టీజర్‌తో ఈ సినిమాపై మరింత బజ్ ఏర్పడింది. ఇందులోని యాక్షన్ సీక్వెన్స్, విజువల్స్ గురించి అందరూ మాట్లాడుతున్నారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ఈ మూవీని గ్రాండ్‌గా విడుదల చేసేందుకు సన్నాహాలు న్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

కాంబినేషన్ రిపీట్?



● రవితేజ

'పవర్' మూవీ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రవితేజ హీరోగా బాబీ (కేఎస్ రవీంద్ర) దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'పవర్'. 2014లో విడుదలైన ఈ మూవీ ప్రేక్షకులను మెప్పించింది. అయితే రవితేజ, బాబీల కాంబినేషన్ మళ్లీ రిపీట్ కానుందనే టాక్ ఫిల్మ్ నగర్‌లో వినిపిస్తోంది. రవితేజ కోసం ఓ పవర్‌ఫుల్ కథను రెడీ చేస్తున్నారట బాబీ. త్వరలోనే రవితేజకి ఫైనల్ నెరేషన్ ఇవ్వనున్నారట దర్శకుడు. అన్నీ కుదిరితే వీరి కాంబినేషన్‌లో మరో సినిమా సెట్ అవుతుందని టాలీవుడ్ టాక్. అంతేకాదు.. ఈ సినిమాని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించనున్నారని భోగట్టా. ఈ సంగతి ఇలా ఉంచితే... చిరంజీవి హీరోగా బాబీ దర్శకత్వంలో రూపొందిన 'వాల్తేరు వీరయ్య' సినిమాలోనూ రవితేజ ఓ కీలక పాత్ర చేశారు. ఈ చిత్రం ఈ ఏడాది సంక్రాంతికి విడుదలై హిట్ మూవీగా నిలిచిన సంగతి తెలిసిందే.

పవర్‌ఫుల్ సినిమాలో...



● మీతా రఘునాథ్



● దేవయాని

సిద్ధార్థ్ హీరోగా '8 తొట్టక్కల్' ఫేమ్ శ్రీగణేష్ దర్శకత్వంలో ఓ ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రం రూపొందనున్న సంగతి తెలిసిందే. శాంతి టాకీస్‌పై 'మావీరన్' ఫేమ్ అరుణ్ విశ్వ నిర్మించనున్నారు. సిద్ధార్థ్ కెరీర్‌లోని ఈ 40వ సినిమా చిత్రీకరణ త్వరలోనే ప్రారంభం కానుంది. తాజాగా ఈ మూవీలో నటి దేవయాని, నటుడు శరత్ కుమార్, 'గుడ్‌నైట్' సినిమా ఫేమ్ మీతా రఘునాథ్, కన్నడ నటి చైత్ర ఆచార్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించనున్నట్లు చిత్రయూనిట్ ఆదివారం అధికారికంగా ప్రకటించింది. ''దర్శకుడు గణేష్ ఓ పవర్‌ఫుల్ స్క్రిప్ట్‌ను రెడీ చేశారు. భారీ బడ్జెట్, అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ మూవీ నిర్మించనున్నాం. త్వరలోనే పూర్తి వివరాలను వెల్లడిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

అప్పుడు సినిమాలకు గుడ్‌బై చెబుతా!



● దుషారా విజయన్

'దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి' అన్నది సామెత. ఈ విషయంలో చాలామంది నటీనటులు ఎప్పుడూ ముందుంటారు. క్రేజ్ ఉన్నప్పుడే వరుస సినిమాలకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తుంటారు. లీడ్ రోల్ దశ దాటాక కొందరు తారలు క్యారెక్టర్ ఆర్టిస్టులుగా చేస్తుంటారు. అయితే ఈ విషయంలో తన రూటే సపరేటు అంటున్నారు హీరోయిన్ దుషారా విజయన్. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా చేయరట. ఎందుకంటే ముప్పై ఐదేళ్ల తర్వాత సినిమాలకు గుడ్ బై చెబుతానంటున్నారామె. 'బోధై ఏరి బుద్ధి మారి' (2019) సినిమా ద్వారా తమిళ ఇండస్ట్రీకి పరిచయం అయ్యారు దుషారా. పా. రంజిత్ దర్శకత్వం వహించిన 'సార్పట్ట పరంబరై' మూవీతో ఆమెకు మంచి గుర్తింపు రావడంతో వరుస అవకాశాలు వచ్చాయి. ప్రస్తుతం రజనీకాంత్ 'వేట్టయాన్', విక్రమ్ 'వీర ధీర శూరన్', ధనుష్ 'రాయన్' సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు దుషారా. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ– ''నాకు ముప్పై ఐదేళ్లు వచ్చాక నటనకు స్వస్తి పలుకుతాను. ఆ తర్వాత విదేశాలన్నీ చుట్టేయాలనుకుంటున్నాను. నేను చూడని దేశమంటూ ఉండకూడదు. అలా ప్లాన్ చేసుకుంటున్నాను'' అన్నారు.

దుబాయ్‌లో మ్యూజిక్ సిట్టింగ్స్



● రత్నవేలు, ఏఆర్ రెహమాన్, బుచ్చిబాబు

రామ్‌చరణ్ హీరోగా 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సాన దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ పతాకాలపై వెంకట సతీష్ కిలారు ఈ సినిమా నిర్మించనున్నారు. ఉత్తరాంధ్ర నేపథ్యంతో సాగే ఈ స్పోర్ట్స్ డ్రామాలో రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేయనున్నారని, ఈ చిత్రానికి 'పెద్ది' అనే టైటిల్‌ను చిత్రయూనిట్ పరిశీలిస్తోందన్న టాక్ ఫిల్మ్‌ఇండస్ట్రీలో వినిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ శరవేగంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈ చిత్ర సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్, కెమెరామేన్ రత్నవేలుతో చర్చలు జరుపుతున్నారు దర్శకుడు బుచ్చిబాబు. దుబాయ్‌లోని ఓ ప్రముఖ స్టూడియోలో వీరి చర్చలు సాగుతున్నాయి. వీలైనంత త్వరగా ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్‌ను పూర్తి చేసి, సెప్టెంబరులో సినిమాను స్టార్ట్ చేయాలని చిత్రయూనిట్ భావిస్తోందని సమాచారం.

ఎలా బయటపడ్డారు!



● రవికృష్ణ

''ఐదుగురు చిన్ననాటి స్నేహితుల్లో పుట్టినరోజు నాడు జరిగిన ఓ ఘటనలో ఒకడు చనిపోతాడు. ఆ తర్వాత ఎదురైన పరిస్థితులను నలుగురు ఫ్రెండ్స్ ఎలా ఎదుర్కొన్నారు? పోలీసుల నుంచి ఎలా తప్పించుకున్నారు? ఆ కేసు నుంచి ఎలా బయటపడ్డారు? అనేది 'ది బర్త్‌డే బాయ్' మూవీలో చాలా ఆసక్తిగా ఉంటుంది'' అని నటుడు రవికృష్ణ అన్నారు. రాజీవ్ కనకాల, రవికృష్ణ, సమీర్ మళ్లా ముఖ్యపాత్రల్లో నటించిన చిత్రం 'ది బర్త్‌డే బాయ్'. విస్కీ దర్శకత్వంలో బొమ్మా బొరుస పతాకంపై ఐ.భరత్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా రవికృష్ణ మాట్లాడుతూ–''విరూపాక్ష' సినిమా చేస్తున్న సమయంలోనే 'ది బర్త్‌డే బాయ్' అవకాశం వచ్చింది. 48 గంటల్లో జరిగే కథ ఇది. నేను సీరియల్స్ చేసినా, బిగ్‌బాస్ రియాలిటీ షోలో పాల్గొన్నా అప్పటి పరిస్థితులను బట్టి చేశాను. అయితే నా లక్ష్యం సినిమాల్లో నటించడమే. 'విరూపాక్ష' తర్వాత సినిమాల్లో మంచి అవకాశాలు వస్తున్నాయి. ప్రస్తుతం 'ఏ1 ఏ2 ఏ3' అనే సినిమాలో హీరోగా చేస్తున్నాను. విజయ్ దేవరకొండ, సాయి ధరమ్ తేజ్‌గార్ల సినిమాల్లో నటిస్తున్నాను'' అన్నారు.

హారర్ కామెడీ



● శివ నాయుడు

ప్రదీప్ రెడ్డి, శివ నాయుడు, గోవా జ్యోతి ముఖ్య తారలుగా నటించిన హారర్ కామెడీ మూవీ 'యజ్ఞ'. చిత్తజల్లు ప్రసాద్ దర్శకుడు. సుభాష్ రావు సమర్పణలో ఆర్‌ఆర్ మూవీ క్రియేషన్స్, రేణుక ఎల్లమ్మ ఫిలింస్‌పై చిలుకోటి రఘురాం, చీలపల్లి విఠల్ గౌడ్ నిర్మించిన ఈ సినిమా త్వరలోనే రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ వేడుకలో శివనాయుడు మాట్లాడుతూ– ''మా మూవీ ప్రేక్షకులకు ఫుల్ మీల్స్‌లా ఉంటుంది'' అన్నారు. ''యజ్ఞ' ని పూర్తి చేయడానికి పెద్ద యజ్ఞమే చేశాం. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం'' అన్నారు చిత్తజల్లు ప్రసాద్. ''ఆడియన్స్‌కి నచ్చేలా మా సినిమా తెరకెక్కించాం'' అన్నారు నిర్మాతలు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు ప్రతాని రామకృష్ణ గౌడ్, సాయివెంకట్, బసిరెడ్డి, గోవా జ్యోతి మాట్లాడారు. ఈ సినిమాకు సంగీతం: లక్ష్మణ సాయి.

మహిళల గొప్పతనంతో...



● ఆదిత్య భాస్కర్, గౌరీ కిషన్

గౌరీ కిషన్, ఆదిత్య భాస్కర్, కలై అరసన్, అమ్ము అభిరామి, శాండీ, సోఫియా, జనని, సుభాష్ ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'హాట్ స్పాట్'. విఘ్నేష్ కార్తీక్ దర్శకత్వం వహించారు. మోజ్విత్, మొవిహాస్ సమర్పణలో అనీల్ రెడ్డి ఎం, మునిచంద్రా రెడ్డి యస్, ఇందు కుమార్ యం నిర్మించారు. కాగా ఈ మూవీ ఈ నెల 17 నుంచి ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కానుందని మేకర్స్ ప్రకటించారు. ''మంచి కథ.. సరికొత్త పాయింట్‌తో 'హాట్ స్పాట్' తీశాం. మహిళల గొప్పతనంతో పాటు నేటి సమాజానికి అద్దం పట్టేలా ఈ మూవీ ఉంటుంది. ఈ చిత్ర కథ అందరి జీవితాలకు కనెక్ట్ అవుతుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.



గైక్వాడ్ చికిత్సకు రూ. 1 కోటి ఇవ్వనున్న బీసీసీఐ

భారత మాజీ క్రికెటర్, టీమిండియా మాజీ కోచ్ అన్షుమన్ గైక్వాడ్‌ను ఆదుకుంటామని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కార్యదర్శి జై షా తెలిపారు. బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న గైక్వాడ్ ప్రస్తుతం లండన్‌లో చికిత్స తీసుకుంటున్నారు. గైక్వాడ్ చికిత్స కోసం తక్షణమే రూ. 1 కోటి విడుదల చేస్తామని బీసీసీఐ ప్రకటించింది. 71 ఏళ్ల అన్షుమన్ గైక్వాడ్ 1975 నుంచి 1987 వరకు భారత జట్టు తరఫున 40 టెస్టులు, 15 వన్డేలు ఆడారు. 1997 నుంచి 1999 వరకు భారత జట్టుకు కోచ్‌గా కూడా పనిచేశారు.

ప్రిక్వార్టర్ ఫైనల్లో అనాహత్ సింగ్

ప్రపంచ జూనియర్ స్క్వాష్ చాంపియన్‌షిప్ బాలికల సింగిల్స్‌లో భారత రైజింగ్ స్టార్, జాతీయ చాంపియన్ అనాహత్ సింగ్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. అమెరికాలో జరుగుతున్న ఈ మెగా టోర్నీలో మూడో రౌండ్‌లో అనాహత్ సింగ్ 11-7, 12-10, 11-6తో సమంతా జాఫీ (అమెరికా)పై గెలిచింది. బాలుర సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్ శౌర్య బావా కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. మూడో రౌండ్‌లో శౌర్య 4-11, 11-7, 12-10, 11-6తో రస్టిన్ వైజర్ (అమెరికా)పై నెగ్గాడు.



భారత ‘ఎ’ జట్టులో షబ్నమ్, యశశ్రీ





ముంబై: వచ్చే నెలలో ఆస్ట్రేలియాలో ఆస్ట్రేలియా ‘ఎ’ మహిళల క్రికెట్ జట్టుతో సిరీస్‌లో పాల్గొనే భారత ‘ఎ’ జట్టును ప్రకటించారు. 18 మంది సభ్యులతో కూడిన భారత ‘ఎ’ జట్టుకు కేరళకు చెందిన ఆఫ్ స్పిన్నర్ మిన్ను మణి కెప్టెన్‌గా వ్యవహరిస్తుంది. ఆంధ్రప్రదేశ్ పేస్ బౌలర్ షబ్నమ్ షకీల్, హైదరాబాద్ అమ్మాయి సొప్పదండి యశశ్రీలకు కూడా భారత ‘ఎ’ జట్టులో చోటు లభించింది. ఆగస్టు 7 నుంచి 25 వరకు జరిగే ఈ సిరీస్‌లో ఆస్ట్రేలియా ‘ఎ’ జట్టుతో టీమిండియా మూడు టి20లు, మూడు వన్డేలు, ఒక నాలుగు రోజుల మ్యాచ్ ఆడుతుంది.

భారత ‘ఎ’ జట్టు: మిన్ను మణి (కెప్టెన్), శ్వేత సెహ్రావత్ (వైస్ కెప్టెన్), ప్రియా పూనియా, శుభ సతీశ్, తేజల్ హసబ్నీస్, కిరణ్ నవ్‌గిరే, సజన, ఉమా చెత్రి, శిప్రా గిరి, రాఘవి బిష్త్, సైకా ఇషాక్, మన్నత్ కశ్యప్, తనుజా కన్వర్, ప్రియా మిశ్రా, మేఘన సింగ్, సయాలీ సత్ఘరే, షబ్నమ్ షకీల్, యశశ్రీ.

ఉరుగ్వేకు మూడో స్థానం



చార్లోటి (అమెరికా): కోపా అమెరికా కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో మాజీ చాంపియన్ ఉరుగ్వే జట్టు మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఆదివారం జరిగిన వర్గీకరణ మ్యాచ్‌లో ఉరుగ్వే ‘షూటౌట్’లో 4-3 గోల్స్ తేడాతో కెనడా జట్టును ఓడించింది. నిర్ణీత సమయం ముగిశాక రెండు జట్లు 2-2తో సమంగా ఉండటంతో విజేతను నిర్ణయించేందుకు ‘షూటౌట్’ను నిర్వహించారు. రెగ్యులర్ టైమ్‌లో కెనడా తరఫున ఇస్మాయిల్ కోన్ (20వ ని.లో), జొనాథన్ డేవిడ్ (80వ ని.లో)... ఉరుగ్వే తరఫున రోడ్రిగో కోల్మన్ (8వ ని.లో), లూయిస్ స్వారెజ్ (90+2వ ని.లో) ఒక్కో గోల్ చేశారు.



4-1తో ముగించారు

చివరి టి20లోనూ భారత జట్టుదే గెలుపు

మెరిసిన సంజూ సామ్సన్, ముకేశ్ కుమార్ ● 42 పరుగులతో ఓడిన జింబాబ్వే

హరారే: మరోసారి ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన భారత జట్టు జింబాబ్వే పర్యటనను ఘనవిజయంతో ముగించింది. ఆదివారం జరిగిన చివరిదైన ఐదో టి20 మ్యాచ్‌లో టీమిండియా 42 పరుగుల తేడాతో జింబాబ్వేను ఓడించింది. వరుసగా నాలుగో గెలుపుతో భారత బృందం సిరీస్‌ను 4-1తో సొంతం చేసుకుంది. కెప్టెన్ హోదాలో శుబ్‌మన్ గిల్ భారత్‌కు తొలి సిరీస్‌ను అందించాడు. ఈ మ్యాచ్‌కంటే ముందే సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత జట్టు ఆఖరి మ్యాచ్‌లోనూ ఆధిపత్యం కనబరిచింది. జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోగా... మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 167 పరుగులు సాధించింది. సంజూ సామ్సన్ (45 బంతుల్లో 58; 1 ఫోర్, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో అలరించాడు. అనంతరం జింబాబ్వే 18.3 ఓవర్లలో 125 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. 26 పరుగులు చేయడంతోపాటు రెండు వికెట్లు పడగొట్టిన శివమ్ దూబేకు ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ అవార్డు లభించింది. 8 వికెట్లు తీయడంతోపాటు 28 పరుగులు చేసిన వాషింగ్టన్ సుందర్‌కు ‘ప్లేయర్ ఆఫ్ ద సిరీస్’ అవార్డు దక్కింది.

సిక్స్‌తో మొదలు...

భారత్ ఇన్నింగ్స్ వరుసగా రెండు సిక్స్‌లతో మొదలైంది. సికందర్ రజా వేసిన తొలి బంతినే యశస్వి జైస్వాల్ (5 బంతుల్లో 12; 2 సిక్స్‌లు) సిక్స్‌గా మలిచాడు. ఇది నోబాల్ కూడా కావడంతో భారత్ ఖాతాలో తొలి బంతికే ఏడు పరుగులు చేరాయి. రెండో బంతిపై కూడా జైస్వాల్ సిక్స్ కొట్టాడు. అయితే మరో రెండు బంతుల తర్వాత జైస్వాల్ బౌల్డ్ అవ్వడంతో భారత్ తొలి వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత మూడో ఓవర్లో అభిషేక్ ఒక సిక్స్ కొట్టగా... గిల్ రెండు ఫోర్లు బాదాడు. ముజరబాని వేసిన నాలుగో ఓవర్లో అభిషేక్ (11 బంతుల్లో 14; 1 సిక్స్), ఎన్‌గరావా వేసిన ఐదో ఓవర్లో గిల్ (14 బంతుల్లో 13; 2 ఫోర్లు) అవుటయ్యారు. దాంతో భారత్ ఐదు ఓవర్లు ముగిసేసరికి 40/3తో ఇబ్బందుల్లో పడింది. ఈ దశలో సంజూ సామ్సన్, రియాన్ పరాగ్ (24 బంతుల్లో 22; 1 సిక్స్) జాగ్రత్తగా ఆడి నాలుగో వికెట్‌కు 65 పరుగులు జోడించారు. ఈ క్రమంలో సామ్సన్ 39 బంతుల్లో తన అర్ధ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. పరాగ్ పెవిలియన్ చేరుకున్నాక వచ్చిన శివమ్ దూబే (12 బంతుల్లో 26; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడటంతో భారత స్కోరు 150 దాటింది. 168 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే ఒకదశలో 85/3తో పటిష్టంగా కనిపించింది. అయితే మైర్స్ (32 బంతుల్లో 34; 4 ఫోర్లు, 1 సిక్స్) అవుటయ్యాకజింబాబ్వే తడబడింది. తొమ్మిది పరుగుల తేడాలో నాలుగు వికెట్లు కోల్పోయి విజయంపై ఆశలు వదులుకుంది.

5 ఇప్పటి వరకు భారత జట్టు ఐదు మ్యాచ్‌లతో కూడిన ఏడు టి20 ద్వైపాక్షిక సిరీస్‌లను ఆడింది. ఇందులో ఐదు సిరీస్‌లను (2020లో న్యూజిలాండ్‌పై; 2021లో ఇంగ్లండ్‌పై; 2022లో వెస్టిండీస్‌పై; 2023లో ఆస్ట్రేలియాపై, 2024లో జింబాబ్వేపై) భారత్ దక్కించుకుంది. ఒక సిరీస్‌ను (2023లో వెస్టిండీస్ చేతిలో) కోల్పోయి, మరో సిరీస్‌ను (2022లో దక్షిణాఫ్రికాతో) సమంగా ముగించింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (బి) సికందర్ రజా 12; శుబ్‌మన్ గిల్ (సి) సికందర్ రజా (బి) ఎన్‌గరావా 13; అభిషేక్ శర్మ (సి) మందాడె (బి) ముజరబాని 14; సంజూ సామ్సన్ (సి) మరుమాని (బి) ముజరబాని 58; రియాన్ పరాగ్ (సి) ఎన్‌గరావా (బి) మవూటా 22; శివమ్ దూబే (రనౌట్) 26; రింకూ సింగ్ (నాటౌట్) 11; వాషింగ్టన్ సుందర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 167. వికెట్ల పతనం:** 1-13, 2-38, 3-40, 4-105, 5-135, 6-153. **బౌలింగ్:** సికందర్ రజా 4-0-37-1, ఎన్‌గరావా 4-0-29-1, ఫరాజ్ అక్రమ్ 4-0-39-0, ముజరబాని 4-0-19-2, మవూటా 4-0-39-1.

జింబాబ్వే ఇన్నింగ్స్: మధెవెరె (బి) ముకేశ్ 0; మరుమాని (ఎల్బీడబ్ల్యూ) (బి) సుందర్ 27; బెనెట్ (సి) దూబే (బి) ముకేశ్ 10; మైర్స్ (సి) అభిషేక్ (బి) దూబే 34; సికందర్ రజా (రనౌట్) 8; క్యాంప్‌బెల్ (సి) తుషార్ (బి) దూబే 4; మదాండె (సి) సామ్సన్ (బి) అభిషేక్ శర్మ 1; ఫరాజ్ అక్రమ్ (సి) సామ్సన్ (బి) ముకేశ్ 27; మవూటా (సి అండ్ బి) తుషార్ దేశ్‌పాండే 4; ముజరబాని (నాటౌట్) 1; ఎన్‌గరావా (బి) ముకేశ్ 0; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (18.3 ఓవర్లలో ఆలౌట్) 125. వికెట్ల పతనం:** 1-1, 2-15, 3-59, 4-85, 5-87, 6-90, 7-94, 8-120, 9-123, 10-125. **బౌలింగ్:** ముకేశ్ 3.3-0-22-4, తుషార్ దేశ్‌పాండే 3-0-25-1, రవి బిష్ణోయ్ 3-0-23-0, వాషింగ్టన్ సుందర్ 2-0-7-1, అభిషేక్ శర్మ 3-0-20-1, శివమ్ దూబే 4-0-25-2.

‘కింగ్’ అల్‌కరాజ్

- వరుసగా రెండో ఏడాది వింబుల్డన్ పురుషుల సింగిల్స్ టైటిల్ కైవసం
- ఫైనల్లో ఏడుసార్లు చాంపియన్ జొకోవిచ్‌పై అలవోక విజయం
- రూ. 29 కోట్ల 23 లక్షల ప్రైజ్‌మనీ సొంతం చేసుకున్న స్పెయిన్ స్టార్



లండన్: పురుషుల టెన్నిస్‌లో కార్లోస్ అల్‌కరాజ్ శకం మొదలైంది! 21 ఏళ్ల ఈ స్పెయిన్ స్టార్ వరుసగా రెండో ఏడాది వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను గెల్చుకున్నాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో మూడో సీడ్ అల్‌కరాజ్ 2 గంటల 27 నిమిషాల్లో 6-2, 6-2, 7-6 (7/4)తో రెండో సీడ్, 24 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ విజేత జొకోవిచ్ (సెర్బియా)పై గెలిచాడు. విజేత అల్‌కరాజ్‌కు 27 లక్షల పౌండ్ల (రూ. 29 కోట్ల 23 లక్షలు) ప్రైజ్‌మనీ... రన్నరప్ జొకోవిచ్‌కు 14 లక్షల పౌండ్ల (రూ. 15 కోట్ల 15 లక్షలు) ప్రైజ్‌మనీ లభించాయి. అల్‌కరాజ్ కెరీర్‌లో ఇది నాలుగో గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్. అతను 2022లో యూఎస్ ఓపెన్, 2023లో వింబుల్డన్, 2024లో ఫ్రెంచ్, వింబుల్డన్ టోర్నీలను సాధించాడు.

బ్రేక్ పాయింట్‌తో మొదలు...

గత ఏడాది ఐదు సెట్‌ల పోరులో జొకోవిచ్‌ను ఓడించిన అల్‌కరాజ్ ఈసారి తొలి పాయింట్ నుంచే ఆధిపత్యం కనబరిచాడు. తొలి సెట్‌లో 14 నిమిషాలపాటు జరిగిన తొలి గేమ్‌లోనే జొకోవిచ్ సర్వీస్‌ను అల్‌కరాజ్ బ్రేక్ చేశాడు. ఆ తర్వాత ఐదో గేమ్‌లో జొకోవిచ్ సర్వీస్‌ను రెండోసారి బ్రేక్ చేసిన అల్‌కరాజ్ అదే జోరులో 41 నిమిషాల్లో తొలి సెట్‌ను సొంతం చేసుకున్నాడు. రెండో సెట్‌లో తొలి గేమ్‌లో, ఏడో గేమ్‌లో జొకోవిచ్ సర్వీస్‌లను బ్రేక్ చేసిన అల్‌కరాజ్ 34 నిమిషాల్లో సెట్ నెగ్గాడు. మూడో సెట్‌లోని తొమ్మిదో గేమ్‌లో జొకోవిచ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన అల్‌కరాజ్ పదో గేమ్‌లోని తన సర్వీస్‌లో 40-0తో మూడు మ్యాచ్ పాయింట్లను సాధించాడు. అయితే ఈ మూడు మ్యాచ్ పాయింట్లను కాపాడుకొని గట్టెక్కిన జొకోవిచ్ ఆ తర్వాత ఇద్దరూ తమ సర్వీస్‌లను కాపాడుకోవడంతో టైబ్రేక్ అనివార్యమైంది. టైబ్రేక్‌లో అల్‌కరాజ్ పైచేయి సాధించి జొకోవిచ్ ఆట కట్టించాడు.

6 ఓపెన్ శకంలో ఒకే ఏడాది ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ టోర్నీ టైటిల్స్ సాధించిన ఆరో ప్లేయర్ అల్‌కరాజ్. గతంలో రాడ్ లేవర్ (ఆస్ట్రేలియా: 1969లో), జాన్ బోర్గ్ (స్వీడన్: 1978, 1979, 1980లలో), రాఫెల్ నాదల్ (స్పెయిన్: 2008, 2010లలో), ఫెడరర్ (స్విట్జర్లాండ్: 2009లో), జొకోవిచ్ (సెర్బియా: 2021లో) ఈ ఘనత సాధించారు.

ఫైనల్ మ్యాచ్ గణాంకాలు

అల్‌కరాజ్		జొకోవిచ్
5	ఏస్‌లు	8
6	డబుల్ ఫాల్ట్‌లు	4
16/22	నెట్ పాయింట్లు	27/53
5/14	బ్రేక్ పాయింట్లు	1/3
42	విన్నర్స్	26
24	అనవసర తప్పిదాలు	25
109	మొత్తం పాయింట్లు	87

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఇండియన్ నేవీలో 10+2 (బీటెక్) క్యాడెట్ ఎంట్రీ స్కీమ్

ఇండియన్ నేవీ.. ఎగ్జిక్యూటివ్, టెక్నికల్ బ్రాంచ్‌ల్లో 10+2(బీటెక్) క్యాడెట్ ఎంట్రీ స్కీమ్ కింద నాలుగేళ్ల బీటెక్ కోర్సులో ప్రవేశాలకు అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. కేరళ రాష్ట్రం ఎజిమలలోని ఇండియన్ నేవల్ అకాడమీలో శిక్షణ ఉంటుంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 40 (మహిళలకు 08 పోస్టులు).
» **బ్రాంచ్:** ఎగ్జిక్యూటివ్, టెక్నికల్. -కోర్సు ప్రారంభం: 2025 జనవరిలో;
» **అర్హత:** కనీసం 70 శాతం మార్కులతో సీనియర్ సెకండరీ పరీక్ష (ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్) ఉత్తీర్ణతతో పాటు జేఈఈ (మెయిన్స్) 2024 పరీక్షలో ర్యాంక్ సాధించి ఉండాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **వయసు:** 02.07.2005 నుంచి 01.01.2008 మధ్య జన్మించిన వారై ఉండాలి.
» **ఎంపిక విధానం:** జేఈఈ (మెయిన్) 2024 ర్యాంక్, పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 06.07.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.07.2024
» **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

ఇండియన్ బ్యాంక్, చెన్నైలో 1500 అప్రెంటిస్‌లు

చెన్నైలోని ఇండియన్ బ్యాంక్ 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంక్ శాఖల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 1500
» **కేటగిరీల వారీగా ఖాళీలు:** ఎస్సీ-255,ఎస్టీ-77, ఓబీసీ-351,ఈడబ్ల్యూఎస్-137,యూఆర్-680
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేట్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 01.07.2024 నాటికి 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
» **శిక్షణ వ్యవధి:** 12 నెలలు.
» **స్టైపెండ్:** నెలకు మెట్రో/అర్బన్ శాఖల్లో రూ.15,000, రూరల్/సెమీ అర్బన్ శాఖల్లో రూ.12,000.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ రాతపరీక్ష, లోకల్ లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** ఆన్‌లైన్ విధానంలో పరీక్ష జరుగుతుంది. రీజనింగ్ ఆప్టిట్యూడ్ అండ్ కంప్యూటర్ నాలెడ్జ్(25 ప్రశ్నలు-25 మార్కులు), జనరల్ ఇంగ్లిష్(25 ప్రశ్నలు-25 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్(25 ప్రశ్నలు-25 మార్కులు), జనరల్ ఫైనాన్షియల్ అవేర్‌నెస్(25 ప్రశ్నలు-25 మార్కులు). పరీక్ష వ్యవధి 60 నిమిషాలు.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** విజయవాడ/గుంటూరు, విశాఖపట్నం, కర్నూలు, విజయనగరం, హైదరాబాద్/సికింద్రాబాద్, ఖమ్మం, కరీంనగర్, వరంగల్.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:** 10.07.2024
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 31.07.2024.
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 10.07.2024 నుంచి 31.07.2024 వరకు
» **వెబ్‌సైట్:** https://www.indianbank.in

ఎయిమ్స్ దియోఘర్‌లో 94 సీనియర్ రెసిడెంట్ పోస్టులు

దియోఘర్ (జార్ఖండ్)లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్).. వివిధ విభాగాల్లో సీనియర్ రెసిడెంట్ (నాన్ అకడమిక్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 94.
» **వేతనం:** నెలకు రూ.67,700.
» **విభాగాలు:** అనెస్తీషియాలజీ-క్రిటికల్ కేర్, అనాటమీ, బయోకెమిస్ట్రీ, బర్న్-ప్లాస్టిక్ సర్జరీ, కార్డియాలజీ, కార్డియోథొరాసిక్-వాస్కులర్ సర్జరీ, కమ్యూనిటీ-ఫ్యామిలీ మెడిసిన్, డెంటల్ సర్జరీ, డెర్మటాలజీ-వెనిరియోలజీ, ఎండోక్రైనాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, గ్యాస్ట్రోఎంటరాలజీ, గ్యాస్ట్రోఇంటెస్టినల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, మైక్రోబయాలజీ, మెడికల్ ఆంకాలజీ, నియోనెటాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, న్యూక్లియర్ మెడిసిన్, ఆబ్‌స్టెట్రిక్స్-గైనకాలజీ, ఆప్తల్మాలజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్లు సడలింపు ఉంటుంది.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రిజిస్ట్రార్ ఆఫీస్, ఫోర్త్ ఫ్లోర్, ఎయిమ్స్, దేవిపూర్(అకడమిక్ బ్లాక్), డియోఘర్ -814152(జార్ఖండ్) చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** ప్రకటన వెలువడిన 15 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** www.aiimsdeoghar.edu.in

క్లర్క్ కొలువుల పిలుపు

బ్యాంకు ఉద్యోగార్థులకు శుభవార్త! ఐబీపీఎస్.. వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 6,128 క్లర్క్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంపిక ప్రక్రియలో విజయం సాధిస్తే.. పదకొండు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో.. క్లరికల్ కేడర్‌లో కొలువుదీరే అవకాశం లభిస్తుంది. వీటికి డిగ్రీ అర్హతతోనే పోటీ పడొచ్చు. ఈ నేపథ్యంలో.. ఐబీపీఎస్ క్లర్క్స్ సీఆర్‌పీ-14 ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 6,128 క్లర్క్ పోస్టులు
» ఐబీపీఎస్ ఆధ్వర్యంలో నియామక ప్రక్రియ
» రెండు దశల రాత పరీక్షలో ప్రతిభతో కొలువు

మొత్తం 6,128 పోస్టులు

ఐబీపీఎస్ తాజాగా విడుదల చేసిన సీఆర్‌పీ క్లర్క్స్-14 ప్రక్రియ ద్వారా మొత్తం పదకొండు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 6,128 క్లర్క్ పోస్టుల నియామకం చేపట్టనున్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంకు, ఐఓబీ, యూకో బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఇండియన్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకుల్లో ఈ ఖాళీలు ఉన్నాయి. సదరు బ్యాంకులకు సంబంధించి ఏపీలో 105 పోస్టులు, తెలంగాణలో 104 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- 2024, జూలై 21 నాటికి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. దీంతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి. స్కూల్/కాలేజ్ స్థాయిలో కంప్యూటర్/ఐటీ ఒక సబ్జెక్ట్‌గా చదివుండాలి.
- **వయసు:** జూలై 1, 2024 నాటికి 20-28 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు.

రెండు దశల ఎంపిక ప్రక్రియ

ఐబీపీఎస్ సీఆర్‌పీ ఫర్ రిక్రూట్‌మెంట్ ఆఫ్ క్లర్క్ ఎంపిక ప్రక్రియ మొత్తం రెండు దశల్లో జరుగుతుంది. అవి.. ప్రిలిమినరీ రాత పరీక్ష; మెయిన్ రాత పరీక్ష. తొలుత అభ్యర్థులకు ప్రిలిమినరీ రాత పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా.. ఐబీపీఎస్ నిర్దేశించిన కటాఫ్ జాబితాలో నిలిచిన వారికి తదుపరి దశలో మెయిన్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. మెయిన్స్ పరీక్షలోనూ విజయం సాధించి.. తుది జాబితాలో నిలిస్తే క్లర్క్ కొలువు ఖాయమవుతుంది.

తొలి దశ ప్రిలిమినరీ

ఐబీపీఎస్ క్లర్క్స్ నియామక ప్రక్రియలోని తొలి దశ ప్రిలిమినరీ పరీక్ష.. మూడు విభాగాల్లో ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 ప్రశ్నలు-30 మార్కులు, న్యూమరికల్ ఎబిలిటీ 35 ప్రశ్నలు-35 మార్కులు, రీజనింగ్ ఎబిలిటీ 35 ప్రశ్నలు-35 మార్కులు.. ఇలా మొత్తం 100 ప్రశ్నలు-100 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష సమయం 60 నిమిషాలు.

మెయిన్స్ పరీక్ష విధానం

తొలిదశ ప్రిలిమినరీ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా పోస్టుల సంఖ్యను అనుసరించి మెరిట్ లిస్ట్‌ను రూపొందిస్తారు. ఆ మెరిట్ లిస్ట్‌లో నిలిచిన వారు మెయిన్స్ ఎగ్జామినేషన్‌కు హాజరవ్వాల్సి ఉంటుంది. మెయిన్స్ ఎగ్జామినేషన్ నాలుగు విభాగాల్లో నిర్వహిస్తారు. జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్ 50 ప్రశ్నలు-50 మార్కులు, జనరల్ ఇంగ్లిష్ 40 ప్రశ్నలు-40 మార్కులు, రీజనింగ్ ఎబిలిటీ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ 50 ప్రశ్నలు-60 మార్కులు, -క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 50 ప్రశ్నలు-50 మార్కులు.. ఇలా 190 ప్రశ్నలు-200 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయం 2 గంటల 40 నిమిషాలు.



ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, జూలై 21
- **ప్రిలిమినరీ పరీక్ష హాల్ టిక్కెట్ల డౌన్‌లోడ్:** 2024, ఆగస్టులో
- **ఆన్‌లైన్ ప్రిలిమినరీ ఎగ్జామ్ తేదీలు:** 2024, ఆగస్టులో
- **మెయిన్ ఎగ్జామినేషన్ తేదీ:** 2024,అక్టోబర్‌లో
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.ibps.in/index.php/clerical-cadre-xiv

రాత పరీక్షలో రాణించేలా

ఐబీపీఎస్ క్లర్క్ నియామక పరీక్షకు సంబంధించి అభ్యర్థులు ముందుగా స్వీయ సమయ ప్రణాళికను రూపొందించుకోవాలి. నోటిఫికేషన్‌లో నిర్దిష్టంగా తేదీని ప్రకటించనప్పటికీ.. ఆగస్టులో ప్రిలిమినరీ పరీక్ష, అక్టోబర్‌లో మెయిన్ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. అంటే.. ఇప్పటి నుంచి ప్రిలిమ్స్‌కు రెండు నెలలు, మెయిన్స్‌కు మూడు నెలల సమయం అందుబాటులో ఉంది. దీనికి అనుగుణంగా.. టైమ్ ప్లాన్‌ను రూపొందించుకుని ప్రిపరేషన్‌కు ఉపక్రమించాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగంలో ఇడియమ్స్, సెంటెన్స్ కరెక్షన్, వొకాబ్యులరీ, సెంటెన్స్ రీ అరేంజ్‌మెంట్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూట్స్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి. గ్రామర్‌కే పరిమితం కాకుండా.. జనరల్ ఇంగ్లిష్ నైపుణ్యం పెంచుకోవాలి. ఇందుకోసం ఇంగ్లిష్ దినపత్రికలు చదవడం,వాటిలో వినియోగిస్తున్న పదజాలం,వాక్య నిర్మాణం వంటి వాటిపై దృష్టి పెట్టాలి.

ఉమ్మడి వ్యూహం

ప్రిలిమ్స్, మెయిన్స్ విధానంలో జరిగే ఐబీపీఎస్ క్లర్క్స్ పరీక్షలో.. మూడు విభాగాలు (ఇంగ్లిష్ లాంగ్వేజ్, రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్/న్యూమరికల్ ఎబిలిటీ) ఉంటాయి. ప్రిలిమ్స్‌లో అడిగే ప్రశ్నల క్లిష్టత స్థాయి కొంత తక్కువగా, మెయిన్స్ క్లిష్టత స్థాయి కొంత ఎక్కువగా ఉంటుంది. కాబట్టి అభ్యర్థులు ఈ మూడు విభాగాలకు సంబంధించి మొదటి నుంచే మెయిన్స్ దృక్పథంతో అధ్యయనం సాగించాలి.

న్యూమరికల్ ఎబిలిటీ

దీన్ని మెయిన్స్‌లో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌కు సరితూగే విభాగంగా పేర్కొనొచ్చు. విద్యార్థులు ప్రధానంగా అర్థమెటిక్ అంశాల(పర్సంటేజెస్, నిష్పత్తులు, లాభ-నష్టాలు, నంబర్ సిరీస్, బాడ్‌మాస్ నియమాలు)పై పూర్తిగా అవగాహన పొందేలా ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు గత పరీక్షలు, వెయిటేజీ కోణంలో డేటా ఇంటర్‌ప్రిటేషన్, డేటా అనాలిసిస్‌లపై ప్రత్యేక దృక్పథంతో ప్రిపరేషన్ కొనసాగించాలి.

రీజనింగ్

ఇది కూడా రెండు పరీక్షల్లో (ప్రిలిమ్స్, మెయిన్స్) ఉంటుంది. ఇందులో మంచి మార్కుల సాధనకు కోడింగ్-డీకోడింగ్, బ్లడ్ రిలేషన్స్, డైరెక్షన్స్, సిలాజిజమ్ విభాగాలను బాగా ప్రాక్టీస్ చేయాలి.

ప్రిలిమ్స్‌తోపాటే మెయిన్స్

ప్రిలిమ్స్ ప్రిపరేషన్‌తోపాటే మెయిన్స్‌లో అదనంగా ఉండే జనరల్ అవేర్‌నెస్, ఫైనాన్షియల్ అవేర్‌నెస్, కంప్యూటర్ నాలెడ్జ్ అంశాల ప్రిపరేషన్ కూడా సాగించాలి. ప్రిలిమ్స్ పూర్తయ్యాక వీటిపై దృష్టి పెట్టాలనుకునే ఆలోచన సరికాదు. సమయాభావం సమస్య కూడా తలెత్తుతుంది. ఎందుకంటే.. ప్రిలిమ్స్ ఆఖరి స్లాట్ పరీక్ష ముగిసిన తర్వాత మెయిన్ ఎగ్జామినేషన్‌కు అందుబాటులో ఉండే సమయం తక్కువగా ఉంటుంది. ఈ సమయంలో మెయిన్స్‌లో అదనంగా ఉండే రెండు విభాగాలకు ప్రిపరేషన్ పూర్తి చేయడం కష్టమవుతుంది.

జనరల్ అవేర్‌నెస్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్

ఈ విభాగంలో బ్యాంకింగ్ రంగం పరిణామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. నోటిఫికేషన్‌లో విత్ స్పెషల్ రిఫరెన్స్ టు బ్యాంకింగ్ అని స్పష్టంగా పేర్కొన్నారు. కాబట్టి బ్యాంకింగ్ రంగంలోని అబ్రివేషన్లు, పదజాలం, విధులు, బ్యాంకులకు సంబంధించిన కొత్త విధానాలు, కోర్ బ్యాంకింగ్‌కు సంబంధించి చట్టాలు, విధానాలు, రిజర్వ్ బ్యాంకు విధులు వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. జనరల్ అవేర్‌నెస్‌లో కరెంట్ అఫైర్స్, స్టాక్ జనరల్ నాలెడ్జ్ కోణంలోనూ ఆర్థిక సంబంధ వ్యవహారాల (ఎకానమీ, ప్రభుత్వ పథకాలు)కు ప్రాధాన్యం ఇవ్వాలి.

కంప్యూటర్ ఆప్టిట్యూడ్

మెయిన్ ఎగ్జామినేషన్‌లో మూడో విభాగంలో ఒక సబ్జెక్ట్‌గా ఉన్న కంప్యూటర్ ఆప్టిట్యూడ్‌కు సంబంధించి కంప్యూటర్ ఆపరేషన్ సిస్టమ్స్, కంప్యూటర్ స్ట్రక్చర్, ఇంటర్నెట్ సంబంధిత అంశాలు, పదజాలంపై దృష్టి పెట్టాలి. కీబోర్డ్ షాట్ కట్స్,కంప్యూటర్ హార్డ్‌వేర్ సంబంధిత అంశాలు(సీపీయూ, మానిటర్,హార్డ్‌డిస్క్ తదితర)గురించి తెలుసుకోవాలి.

గ్రాండ్, మోడల్ టెస్ట్‌లకు ప్రాధాన్యం

ప్రిలిమ్స్ ముగిసిన తర్వాత మెయిన్స్‌కు అందుబాటులో ఉండే వ్యవధిలో అభ్యర్థులు మెయిన్స్ గ్రాండ్ టెస్ట్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రతి రోజు ఒక గ్రాండ్ టెస్ట్ రాసే విధంగా వ్యవహరించాలి. మెయిన్స్‌లోని అదనపు అంశాలకు లభిస్తున్న వెయిటేజీని గుర్తించి ఆమేరకు ప్రిపరేషన్ సాగించాలి. వెయిటేజీ కొంచెం తక్కువగా ఉందని భావిస్తే పెద్దగా ఆందోళన చెందకుండా.. అప్పటికే పట్టు సాధించిన అంశాల్లో మరింత నైపుణ్యం సాధించే విధంగా ముందుకు సాగాలి.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
15-7-2024

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
622	186
80,519	24,502

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ			
నాస్‌డాక్	18,398	▲	115
డోజోన్స్	40,001	▲	247
ఎఫ్‌టీఎస్ఈ 100	8,253	▲	30
డాక్స్	18,748	▲	214
షాంఘై	2,971	▲	1
నికాయ్	41,191	▼	1,033

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.14	84.07
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.69	108.26
€	యూరో	ఎస్‌బీఐ	89.29	91.65
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	51.47	52.60
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.42	57.36
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.50	64.16
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.35	22.92
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.85	23.63
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.36	12.44

అద్దిల్లా..? సొంతిల్లా..?

- ఒకే చోట ఉండేవారికి సొంతిల్లు అనుకూలం
- రుణం తీసుకుని ఈఎంఐ కట్టుకుంటే స్థిరాస్తి
- దీని విలువ దీర్ఘకాలంలో పెరిగేదే
- ఇంటి రుణంపై పన్ను ప్రయోజనాలు
- తరచూ ఉద్యోగాలు మారితే అద్దె ఇల్లు అనుకూలం



చాలా మంది తేల్చుకోలేని అంశం.. అద్దె ఇంట్లో ఉండడం నయమా? లేక సొంతిల్లు సమకూర్చుకోవడం బెటరా? అని. ఈ రెండింటిలో ఆర్థికంగా ఏది లాభదాయకమో నిపుణులను అడిగితే చెబుతారు. కానీ, ఇల్లు అన్నది భావోద్వేగాలు, సామాజిక గుర్తింపు, మానసిక ప్రశాంతత తదితర ఎన్నో అంశాలతో ముడిపడి ఉంటుంది. అద్దె ఇల్లు ఆర్థిక భారం లేనిది. సొంతిల్లు ఆర్థిక బాధ్యతను తెచ్చిపెడుతుంది. ఒకటి రెండు నెలల అడ్వాన్స్ ఉంటే నిమిషాల్లో అద్దె ఇంట్లో దిగిపోవచ్చు. కానీ, సొంతింట్లో కుడి కాలు మోపాలంటే భారీ మొత్తం కావాలి. లేదంటే బ్యాంక్ తలుపు తట్టాలి. అద్దె ఇంట్లో మనకు నచ్చకపోయినా, ఇంటి యజమానికి గిట్టకపోయినా మరో గూడు వెతుక్కోవాల్సిందే. సొంతింట్లో ఎవరికి వారే రారాజు. ఇలా నాణేనికి రెండువైపులా లాభనష్టాలున్నాయి. తమకు ఏది అనుకూలమో ఎవరికి వారు తేల్చుకోవాల్సిందే. ఈ దిశగా అవగాహన కల్పించి, సులువుగా నిర్ణయం తీసుకోవ దానికి దారి చూపించేదే ఈ వారం 'ప్రాఫిట్ ప్లస్' కథనం.

– సాక్షి, బిజినెస్ డెస్క్



ఆర్థిక కోణం...

ఇంటి విషయంలో ముందుగా తమ ప్రాధాన్యతలు ఏంటన్నవి ముఖ్యం. మెట్రో నగరాల్లో ఇంటి ధరలు చూస్తే చుక్కల్లో కనబడుతున్నాయి. కనుక అక్కడ సొంతిల్లు చాలా మందికి సాధ్యపడకపోవచ్చు. అలాంటి చోట అద్దె ఇల్లే ఆర్థికంగా సౌకర్యం. ఇంటి కొనుగోలుతో పోలిస్తే అద్దే తక్కువగా ఉంటుంది. ఇంటి కొనుగోలుకు సరిపడా ఆర్థిక స్థోమత ఉన్న వారి విషయంలో అంత గందరగోళం అక్కర్లేదు. వృత్తి/ఉద్యోగ/వ్యాపార రీత్యా తరచూ ప్రాంతాలు మారే అవసరం లేకపోతే నిశ్చింతగా సొంతింటికి మొగ్గు చూపొచ్చు. కానీ, నగరాలు, పట్టణాల్లో రుణంపై ఇంటిని సమకూర్చుకోవాలని భావించే వారు అక్కడి రెంటల్ ఈల్డ్స్ (ప్రాపర్టీ విలువపై అద్దె రాబడి), ప్రాపర్టీ విలువ పెరుగుదల శాతం ఏ మేరకు ఉంది, తదితర అంశాలను తప్పకుండా పరిగణనలోకి తీసుకోవాలి. మన దేశంలోని చాలా పట్టణాల్లో రుణంపై ఇల్లు కొనుగోలు చేసి చెల్లించే ఈఎంఐతో పోల్చితే.. చాలా తక్కువకే అద్దె ఇల్లు వచ్చేస్తుంది. పట్టణాల్లో ఇంటిని కొనుగోలు చేయడం మంచి ఆప్షనే. కాలం గడిచే కొద్దీ దాని విలువ పెరుగుతూ వెళ్తుంది. కానీ, దాన్ని సమకూర్చుకునేందుకు సరిపడా పెట్టుబడి కావాలి. పెట్టుబడి కోసం అయితే కొత్తగా అభివృద్ధిలోకి వస్తున్న నగర, పట్టణ శివారు ప్రాంతాల్లో ఇల్లు కొనుగోలు చేసుకోవడం వల్ల.. తక్కువ కాలంలోనే ఎక్కువ విలువ సమకూరుతుంది.

ఏమిటి మార్గం?

అద్దిల్లు, సొంతిల్లు విషయంలో ప్రతి ఒక్కరి ఆలోచన, అవసరాలు వేర్వేరుగా ఉంటాయి. కొందరు ఆర్థిక ప్రయోజనానికే పెద్ద పీట వేస్తే.. కొందరు సామాజిక గుర్తింపునకు, స్థిరాస్తి సమకూర్చుకోవడానికి ప్రాధాన్యమిస్తుంటారు. ఇంటిని పెట్టుబడిగా చూసే వారూ ఉన్నారు. తమ ప్రస్తుత ఆదాయ స్థితిగతులు, ప్రాంతం, ఉద్యోగం/వృత్తి/వ్యాపారం ఇలా ఎన్నో అంశాల ఆధారంగా అనుకూలమైన నిర్ణయం తీసుకోవాలి. ముఖ్యంగా రుణానికి చెల్లింపులు చేయగల ఆర్థిక వెసులుబాటు ఉండడం తప్పనిసరి. చివరిగా.. సొంతిల్లుతో ఉండే అనుబంధం ఏ ఆర్థిక సూత్రం కూడా తెచ్చివ్వలేదన్నది వాస్తవం!

అద్దె రాబడి తక్కువ...

మన దేశంలో ఇంటిపై సగటు రాబడి 2.9 శాతంగా ఉంది. ప్రపంచంలో ఇక్కడే తక్కువ. అదే యూఎస్, కెనడా, దుబాయిలోని పట్టణాల్లో ఇంటిపై అద్దె రాబడి 5–6 శాతంగా ఉంది. అద్దె రాబడి 4 శాతాన్ని మించినప్పుడు రుణంపై ఇంటిని కొనుగోలు చేసుకోవడం అత్యుత్తమమని ఆర్థిక గణాంకాలు చెబుతున్నాయి. మీరు ఉండాలనుకుంటున్న ప్రాంతంలో ప్రస్తుత రెంటల్ ఈల్డ్ (అద్దెకు ఇస్తే వచ్చే రాబడి) (ప్రాపర్టీ విలువతో పోలిస్తే చెల్లించే అద్దె రేటు), ఏటా ఎంత చొప్పున పెరుగుతుందన్నది తెలుసుకోవాలి. వీటి ఆధారంగా అద్దె/ఈఎంఐ రేషియో ఎంతో తేల్చుకోవాలి. రియల్ ఎస్టేట్ పరిశోధనా సంస్థ 'లైసస్ ఫొరాస్' ఇందుకు సంబంధించి విలువైన గణాంకాలు రూపొందించింది. దీని ప్రకారం 100 శాతం అంతకంటే తక్కువ నిష్పత్తి ఉన్న పట్టణాల్లో అద్దె ఇంట్లో ఉండడమే లాభం. ఈ రేషియో 100 దాటిన చోట సొంతిల్లు సమకూర్చుకోవడం లాభం.

	విశాఖపట్నం	భువనేశ్వర్, పట్నా	ముంబై, హైదరాబాద్	కోచి, లక్నో	పుణె, గోవా	ఇండోర్, బెంగళూరు	వడోదర
ప్రస్తుత రెంటల్ ఈల్డ్	2	2.3	2.5	2.9	3.3	3.6	4
ఏటా 5 శాతం పెరిగితే రెంట్/ఈఎంఐ రేషియో	57	64	70	81	91	99	109
ఏటా 6 శాతం పెరిగితే	61	68	75	86	97	106	117
7 శాతం పెరిగితే	65	73	80	92	104	113	125
8 శాతం పెరిగితే	70	79	87	100	113	123	136
9 శాతం పెరిగితే	77	86	94	109	123	133	148
10 శాతం పెరిగితే	84	94	104	119	135	146	162

విశ్లేషణ

విశాఖలో రెంటల్ ఈల్డ్ ప్రాపర్టీ విలువపై 2 శాతంగా ఉంది. ఇది ఏటా 5 శాతం పెరుగుతూ పోతే రెంటల్/ఈఎంఐ రేషియో 57 శాతం అవుతుంది. ఏటా 10 శాతం పెరిగితే ఈ రేషియో 84 శాతంగా ఉంటుంది. 11 శాతం పెరిగితే రేషియో 93గా ఉంటుంది. అదే హైదరాబాద్‌లో రెంటల్ ఈల్డ్ 2.5 శాతం.. ఏటా 9 శాతం వరకు పెరిగితే రెంట్/ఈఎంఐ రేషియో 94గా ఉంటుంది. ఒకవేళ ఏటా 10 శాతం పెరిగితే ఈ రేషియో 104కు వెళుతుంది. హైదరాబాద్‌లో ఏటా 10 శాతం చొప్పున అద్దెలు పెరిగేట్టు అయితే అప్పుడు రుణంపై ఇల్లు కొనుగోలు చేసి, ఈఎంఐలు కట్టుకోవడమే ప్రయోజనకరం. అద్దె పెరుగుదల 10 శాతంలోపే ఉంటే కిరాయికి తీసుకోవడం ఆర్థికంగా ప్రయోజనకరం. ఒకవేళ మీరు ఎంపిక చేసుకున్న ప్రాంతంలో ప్రస్తుత రెంటల్ ఈల్డ్ ప్రాపర్టీ విలువపై 4 శాతం అంతకంటే ఎక్కువే ఉండి, ఏటా అద్దె 5 శాతం పెరిగినా సరే.. అక్కడ రుణంపై ఇల్లు కొనుగోలు చేసి ఈఎంఐ కట్టుకోవడమే లాభం.

ఆఫీసుకు దగ్గరుంటే..

తమ కార్యాలయాలకు దగ్గరగా లేదా వ్యాపార సంస్థలకు సమీపంలో ఉండాలనుకుంటే ఇంటిని అద్దెకు తీసుకోవడమే లాభం. అలాంటి చోట సొంతిల్లు సమకూర్చుకోవడానికి భారీ పెట్టుబడి కావాలి. దాంతో పోలిస్తే చాలా తక్కువకే అద్దె ఇల్లు వచ్చేస్తుంది. పైగా రోజూ ఇంటి నుంచి వెళ్లి వచ్చేందుకు ఎక్కువ సమయం పట్టదు. ఇంధన వ్యయాల భారం ఉండదు. విలువైన సమయం, వనరుల ఆదా అవుతాయి.

సెలబ్రిటీలు ఇలా..

సెలబ్రిటీలు మాధురి దీక్షిత్, కృతి సనన్ సొంతింటికి బదులు అద్దింట్లో ఉండడానికే ప్రాధాన్యమిస్తున్నారు. అభిషేక్ బచ్చన్ ముంబైలో ఒకే ప్రాజెక్టులో 6 అపార్ట్‌మెంట్లు కొన్నారు.

ఈ అంశాలు గమనించాలి..

ఆర్‌బీఐ డేటా ప్రకారం 2010–11 నుంచి 2017–18 మధ్య కాలంలో (రియల్ ఎస్టేట్ రంగ నియంత్రణ సంస్థ (రెరా) రాక ముందు) ప్రాపర్టీల ధరలు ఏటా 15 శాతం చొప్పున పెరిగాయి. 2018–19 నుంచి 2022–23 కాలంలో (రెరా వచ్చిన తర్వాత) ఏటా 3 శాతం పెరిగాయి. చారిత్రకంగా చూస్తే దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణం కంటే రెట్టింపు స్థాయిలో ప్రాపర్టీల ధరలు పెరిగినట్టు గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఈ రకంగా చూస్తే ప్రాపర్టీ కొనుగోలు లాభదాయకమే. 30 ఏళ్ల కాలానికి రుణం తీసుకుని ఇల్లు కొనుగోలు చేస్తే, ప్రతి నెలా చెల్లించాల్సిన ఈఎంఐ, ఇంటి అద్దె కంటే రెట్టింపు ఉంటుంది. కానీ, 15–17 ఏళ్లు గడిచే సరికి ఇంటి అద్దె ఏటా పెరుగుతూ రుణ ఈఎంఐకి చేరువ కావచ్చు.

లాభాలు

సొంతిల్లు

- ఒకే చోట స్థిరపడిన వారు శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకోవడాన్ని పరిశీలించొచ్చు. మన దేశంలో పట్టణీకరణ వేగంగా జరుగుతోంది. ఇది ఇళ్లు, స్థలాల విలువలకు దన్నుగా నిలుస్తుంది. కనుక ఇంటిపై పెట్టుబడి దీర్ఘకాలంలో సంపదకు దారితీస్తుంది.
- సొంతిల్లుతో వచ్చే ప్రశాంతతను వెలకట్టలేం. భద్రతకు హామీనిస్తుంది. ఖాళీ చేయాల్సిన అనిశ్చితి ఉండదు. ఎవరికీ సమాధానం చెప్పుకోవాల్సిన అవసరం ఉండదు. గోపత్య ఉంటుంది. ఇంటిని ఎలా వినియోగించుకోవాలనే విషయంలో పరిమితులు ఉండవు. నచ్చినట్టుగా ఇంటిని మార్చుకోవచ్చు. రాజీపడాల్సిన అవసరం ఉండదు.
- అద్దెకు బదులు ఈఎంఐ కట్టుకుంటే స్థిరాస్తి సమకూరుతుంది. రుణంపై ఇంటిని సమకూర్చుకోవడం వల్ల దీర్ఘకాలంలో దాని విలువ పెరగడమే కాదు.. పన్ను రూపంలోనూ ఎంతో ఆదా అవుతుంది. ఇంటి రుణ ఈఎంఐలో అసలు (ప్రిన్సిపల్), వడ్డీ అని రెండు భాగాలుంటాయి. అసలుకు చెల్లించే మొత్తం గరిష్ఠంగా ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షలపై సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు పొందొచ్చు. అలాగే, సెక్షన్ 24 కింద ఇంటి రుణంపై ఒక ఆర్థిక సంవత్సరంలో గరిష్ఠంగా రూ. 2 లక్షల వడ్డీ భాగంపై పన్ను లేకుండా చూసుకోవచ్చు. ఒకవేళ రుణంపై కొనుగోలు చేసిన ఇంటిని అద్దెకు ఇచ్చినట్టయితే అప్పుడు వడ్డీ ఒక ఆర్థిక సంవత్సరంలో ఎంత ఉన్నా, ఆ మొత్తంపై పన్ను మినహాయింపు ప్రయోజనం ఉంది.
- సొంతింటితో అనుబంధం విడదీయరానిది. అదే అద్దె ఇంట్లో ఉండి, చుట్టుపక్కల వారితో మంచి సంబంధాలు ఏర్పడిన తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోవడం కష్టమనిపిస్తుంది. ఉన్నట్టుండి ఇల్లు ఖాళీ చేయాల్సిన అగత్యం ఏర్పడదు. సొంతిల్లు వ్యక్తిగత హోదాను పెంచుతుంది. సామాజిక గుర్తింపును తెస్తుంది.



- చివరిగా సొంతిల్లు ఉంటే.. విశ్రాంత జీవనంలో స్థిరమైన ఆదాయాన్నిచ్చే బంగారు బాతు అవుతుంది. రివర్స్ మార్ట్‌గేజ్‌తో ప్రతి నెలా స్థిరమైన ఆదాయాన్ని బ్యాంక్ నుంచి పొందొచ్చు.

అద్దె ఇల్లు

- అద్దె ఇంటితో ఉండే అత్యంత అనుకూలత.. నచ్చిన ప్రాంతంలో ఉండొచ్చు. సొంతిల్లు అయితే మారకుండా ఎప్పటికీ ఒకేచోట ఉండిపోవాల్సి వస్తుంది.
- ప్రతికూల ఆర్థిక పరిస్థితుల్లో, ఉద్యోగం కోల్పోయి ఖాళీగా ఉండాల్సి వస్తే, తక్కువ అద్దె ఇంటికి వెళ్లి సర్దుకోవచ్చు. సొంతిల్లు అయితే వ్యక్తిగత కష్టాలతో సంబంధం లేకుండా ఈఎంఐ కట్టాల్సిందే.
- అద్దె ఇల్లు అయితే ఇంటి నిర్వహణ భారం తమ మీద పడదు. వాటర్ ట్యాంక్‌లు, నీటి మోటార్‌ల నిర్వహణ, రిపేర్లు, పెయింట్స్ తదితర బాదర బందీలు ఉండవు. వీటి రూపంలో ఆర్థిక భారం పడదు. ఇంటి పన్నుల బాధా ఉండదు.
- రుణంపై ఇల్లు కొనుగోలు చేయాలంటే.. మొత్తం విలువలో 20 శాతం డౌన్ పేమెంట్ కింద సమకూర్చుకోవాలి. అదే అద్దె ఇంటి విషయంలో ఈ అవసరం ఉండదు. కొద్ది నెలల అద్దెకు సరిపడా రిఫండబుల్ డిపాజిట్ చెల్లిస్తే సరిపోతుంది.

వేతన జీవులకు రియల్టీ ఆస్తి



వేతన జీవులకు రియల్ ఎస్టేట్ ఒక ఆస్తిగా మారుతుంది. నీవు ప్రతి నెలా అద్దె కింద రూ.లక్ష చెల్లిస్తుంటే, దానికి అదనంగా రూ.50,000–60,000 చెల్లించేట్టు అయితే సొంతిల్లు దక్కుతుంది. పదేళ్ల పాటు ఇదే అద్దెను చెల్లించడం వల్ల ఎలాంటి ఆస్తి సమకూరదు. కనుక ఈఎంఐతో ఒక ఆస్తిని సమకూర్చుకోవచ్చు.

– అజితేష్ కొరుపోలు, అశోక బిల్డర్స్ (రియల్ ఎస్టేట్ కంపెనీ) సీఈవో

తెలివైన నిర్ణయం కాదు!



గురుగ్రామ్‌లో నేను ఉండే ఇంటికి ప్రతి నెలా రూ.1.5 లక్షలు అద్దె, మెయింటెనెన్స్‌తో కలిపి రూ.1.65 లక్షలు చెల్లిస్తున్నా. అది గోల్ఫ్‌కోర్స్‌తో కూడిన ఖరీదైన ప్రాంతం. నేను ప్రస్తుతం అద్దెకు ఉంటున్న అపార్ట్‌మెంట్ ఖరీదు రూ.7.5–8 కోట్లు. దీన్ని కొనుగోలు చేయాలంటే 70 శాతం మేర రూ.6 కోట్లు రుణం తీసుకోవాలి. దీనికి ప్రతి నెలా రూ.6–7 లక్షల ఈఎంఐ చెల్లించాలి. అంటే నేను ప్రస్తుత ఇంటికి చెల్లిస్తున్న అద్దె కంటే ఈఎంఐ నాలుగు రెట్లు అధికం. కనుక ఇల్లు కొనుగోలు చేయడం నాకు తెలివైన నిర్ణయం కాబోదు. ఇల్లు అనేది లిక్విడిటీ (కోరుకున్న వెంటనే సొమ్ము చేసుకోగల) ఉన్న ఆస్తి కాదు. కనుక నేను అదే రూ.6 లక్షలను పబ్లిక్ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేస్తాను. పైగా అద్దె ఇల్లు తీసుకోవడంలో కొంత స్వేచ్ఛ ఉంటుంది. 15 రోజుల్లోనే చిన్న సైజు నుంచి పెద్ద సైజు ఇంటికి మారొచ్చు. నేను నా పిల్లలు, తల్లిదండ్రులతో కలసి ఉంటే తప్ప ఇంటి విషయంలో నా ఆలోచన ఇదే.

– శంతను దేశ్‌పాండే, బోంబే షేవింగ్ కంపెనీ ఫౌండర్

హాస్యాస్పదం



ప్రస్తుత వేల్యూషన్ల వల్లే నేను రియల్ ఎస్టేట్‌ను కొనుగోలు చేయలేదు. నా వరకు ఈ వేల్యూషన్లు నిజంగా హాస్యాస్పదం. వడ్డీ రేట్ల కంటే ఇంటిపై రాబడులు తక్కువ. ఇళ్లు, ఆఫీస్‌ల ధరలు పెరుగుతాయని కొనుగోలు చేయడం తెలివైన నిర్ణయం అనిపించడంలేదు. పెట్టుబడులపై 10–12 శాతం రాబడులు సంపాదించుకోలిగినప్పుడు, 3 శాతానికే (ప్రాపర్టీ విలువలో) వచ్చే అద్దె ఇల్లు తీసుకోవడమే మంచిది. పెట్టుబడులపై వచ్చే రాబడి కంటే రెంటల్ ఈల్డ్ చాలా తక్కువ. నా తల్లిదండ్రులు నివసించిన ఇల్లు ఒక్కటే నాకు ఉంది. దానికి కూడా భావోద్వేగ పరమైన కారణాలున్నాయి.

– నిఖిల్ కామత్, జెరోదా కో–ఫౌండర్

కోటక్ మహీంద్రా ఏఎంసీ పీఎస్‌యూ ఇండెక్స్ ఫండ్

బీఎస్ఈ పీఎస్‌యూ ఇండెక్స్‌ను ట్రాక్ చేసే కొత్త ఫండ్‌ను కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ జూలై 24తో ముగుస్తుంది. బీఎస్ఈ పీఎస్‌యూ ఇండెక్స్‌లో ప్రస్తుతం వివిధ పరిశ్రమలకు చెందిన



56 ప్రభుత్వ రంగ సంస్థల స్టాక్స్ ఉన్నాయి. ఇంధనం, ఆర్థికం మొదలుకుని డిఫెన్స్, ఇన్‌ఫ్రా వరకు వివిధ రంగాల్లో పీఎస్‌యూలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. వైవిధ్యమైన పీఎస్‌యూ స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా డైవర్సిఫికేషన్ ప్రయోజనాలను పొందడానికి ఈ ఫండ్ ఉపయోగపడగలదని సంస్థ వైస్ ప్రెసిడెంట్ దేవేందర్ సింఘాల్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

15-7-2024	
విశాఖ	575–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	555–00
విజయవాడ	555–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	530–00
వరంగల్	532–00
రిటైల్ ధర	5.90

ఐదేళ్లలో పెట్టుబడి రెట్టింపు ఎలా?

నేను ఐదేళ్ల తర్వాత పదవీ విరమణ తీసుకుంటాను. ప్రస్తుతం నాకు ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో పెద్ద మొత్తంలో నిధి ఉంది. ఈ మొత్తాన్ని నేను రిటైర్మెంట్ అయ్యే నాటికి, ఐదేళ్లలో రెట్టింపు చేసుకోవాలన్నది నా ఆలోచన. కనుక ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలి? – మనోహరన్ వరదరాజన్



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

పెట్టుబడి రెట్టింపునకు ఐదేళ్ల కాల వ్యవధి అన్నది చాలా తక్కువ. ఇంత తక్కువ కాలంలో పెట్టుబడి రెట్టింపు చేసుకోవాలంటే ఏటా 15 శాతం రాబడి సంపాదించాల్సిందే. పూర్తి ఈక్విటీ పెట్టుబడుల పరంగా చూసినా ఇది పెద్ద లక్ష్యమే. రిటైర్మెంట్ తర్వాత మీ జీవన వ్యయాలకు సరిపడా రాబడి కోసం పెట్టుబడులపై ఏ మేరకు ఆధారపడి ఉంటారన్నది కీలకం అవుతుంది. రిటైర్మెంట్ తర్వాత పెట్టుబడుల వచ్చే రాబడి ద్వారానే మీ అవసరాలను తీర్చుకునేట్టు అయితే.. నూరు శాతం పెట్టుబడులను ఈక్విటీలకు కేటాయించుకోవడం రిస్క్ అవుతుంది. పైగా అస్థిరతలు కూడా ఎదుర్కోవాల్సి వస్తుంది. అలాగని మొత్తం పెట్టుబడులను ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాల్లో (డెట్) పెట్టడం కూడా సరి కాదు. ఎందుకంటే డెట్ సాధనాల్లో రాబడులు ద్రవ్యోల్బణంతో పోలిస్తే మెరుగ్గా ఉండవు. దీనికి పరిష్కారం ఈక్విటీ, డెట్‌తో కూడిన అసెట్ అలోకేషన్ ప్రణాళికను రూపొందించుకోవడమే. ఈక్విటీలకు 50 శాతం, డెట్‌కు 50 శాతం కేటాయించుకోవడం అనుకూలంగా ఉంటుంది. అయితే, ఈక్విటీకి కేటాయించిన మొత్తాన్ని ఒకేసారి ఇన్వెస్ట్ చేయకూ



డదు. రెండు నుంచి మూడేళ్ల కాలంలో క్రమంగా ఇన్వెస్ట్ చేయాలి. డెట్ పెట్టుబడులపై 6–7% మేర రాబడి, ఈక్విటీలపై 11–12% రాబడి వస్తుందని అనుకుంటే.. అప్పుడు మీ మొత్తం పెట్టుబడిపై నికర రాబడి 9–10% అవుతుంది. ఈ ప్రకారం మీ పెట్టుబడి వచ్చే ఐదేళ్లలో 50–60% వృద్ధి చెందుతుంది. అంతేకానీ రెట్టింపు కాదు. ఉదాహరణకు మీ వద్ద రూ.10 లక్షలు ఉన్నాయనుకుంటే, అవి ఐదేళ్లలో రూ.16 లక్షలుగా మారతాయి. ఒకవేళ రిటైర్మెంట్ నాటికి ఈ పెట్టుబడి అవసరం లేదనుకుంటే అప్పుడు 70–75 శాతాన్ని ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. అలా చూసినా 15 శాతం రాబడి సహేతుకం కాదు. ద్రవ్యోల్బణానికి దీటైన రాబడి కోరుకుంటే మొత్తం పెట్టుబడుల్లో కనీసం మూడింట ఒకవంతు అయినా ఈక్విటీలకు కేటాయించుకోవాలని గుర్తుంచుకోవాలి. రిటైర్మెంట్ తర్వాత పెట్టుబడి నుంచి ఏటా 6 శాతం మించి ఉపసంహరించుకోకుండా కట్టుబడి ఉండాలి.

నేను 20 ఏళ్ల క్రితం ఓ లిస్టెడ్ కంపెనీలో పెట్టుబడులు పెట్టాను. స్టాక్ బ్రోకర్ ద్వారానే కొనుగోలు చేసి, లావాదేవీపై సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్‌టీటీ) కూడా చెల్లించాను. కానీ, అదే కంపెనీ పదేళ్ల క్రితం స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల నుంచి డీలిస్ట్ అయింది. ఆ పెట్టుబడులను నేను 2023–24లో విక్రయించాను. వీటిపై పన్ను ఎలా అమలవుతుంది? ఇండెక్సేషన్ ప్రయోజనం ఉంటుందా? – సుధాకర్ కోలంగర్త్

మీరు 20 ఏళ్ల క్రితం స్టాక్స్‌ను వాస్తవంగా కొనుగోలు చేశారు. కనుక పెట్టుబడులపై వచ్చిన లాభం నుంచి 20 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. దీనికి ఇండెక్సేషన్ (ద్రవ్యోల్బణం ప్రభావం మినహాయించడం) ఉంటుంది. మీరు విక్రయించినది అన్‌లిస్టెడ్ సెక్యూరిటీ. ఈ తరహా అన్‌లిస్టెడ్ సెక్యూరిటీల్లో 24 నెలలకు పైగా ఉన్న పెట్టుబడులను దీర్ఘకాలికమైనవిగా పరిగణిస్తారు. 24 నెలలలోపు వాటిని స్వల్పకాల పెట్టుబడులుగా ఆదాయపన్ను చట్టం చూస్తోంది. స్వల్పకాల పెట్టుబడులపై లాభం ఇన్వెస్టర్ వార్షికాదాయానికి కలుస్తుంది. తమకు వర్తించే రేటు ప్రకారం పన్ను చెల్లిస్తే సరిపోతుంది.

ఆకర్షణీయంగా ఫ్లెక్సీ, మల్టీ క్యాప్ ఫండ్స్

వచ్చే రెండేళ్లలో 60 నగరాలకు విస్తరణ • ఎడెల్వీజ్ ఎంఎఫ్ ఎండీ రాధికా గుప్తా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కార్పొరేట్ల ఆదాయాలు బాగుంటున్న నేపథ్యంలో వాటితో ముడిపడి ఉన్న మార్కెట్ల పనితీరు కూడా మెరుగ్గానే ఉండగలదని ఎడెల్వీజ్ మ్యుచువల్ ఫండ్ ఎండీ రాధికా గుప్తా చెప్పారు. కొన్ని విభాగాలు కాస్త అధిక వేల్యుయేషన్లలో ట్రేడవుతున్నప్పటికీ స్థూలంగా మార్కెట్‌ని చూస్తే బబుల్‌లాంటి (బుడగలాగా పేలిపోయే) పరిస్థితేమీ లేదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అగ్రెసివ్ ఇన్వెస్టర్లు .. ఫ్లెక్సీ క్యాప్, మల్టీ క్యాప్, బిజినెస్ సైకిల్ ఫండ్స్ మొదలైన వాటిల్లో ఇన్వెస్ట్ చేయొచ్చని సూచించారు. కాస్త కన్జర్వేటివ్‌గా ఉండే వారు బ్యాలెన్స్‌డ్ ఫండ్స్ లాంటి హైబ్రిడ్ ఫండ్స్‌ను ఎంచుకోవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం తమ ఏయూఎం (నిర్వహణలోని ఆస్తుల పరిమాణం) రూ. 1.04 లక్షల కోట్ల స్థాయిలో ఉండగా, 25–30 శాతం వృద్ధి సాధించేందుకు పుష్కలంగా అవకాశాలు ఉన్నాయని రాధిక చెప్పారు. గత ఆరేళ్లలో ఆరు నగరాల నుంచి ప్రస్తుతం 35 పైచిలుకు నగరాలకు కార్యకలాపాలు విస్తరించామని. వచ్చే రెండేళ్లలో ఈ సంఖ్యను 60కి పెంచుకోవాలని నిర్దేశించుకున్నామని తెలిపారు. సుమారు 15 లక్షలుగా ఉన్న ఫోలియోలను 30–40 లక్షలకు పెంచుకోవడంపై దృష్టి పెడుతున్నట్లు వివరించారు.



సిప్‌లు పెరగడమనేది దేశీ మార్కెట్లకు మేలు చేస్తోందని, విదేశీ నిధులపై ఆధారపడే పరిస్థితి తగ్గుతుందని ఆమె చెప్పారు. ఇన్వెస్టర్లు అసాధారణ రాబడులకు హామీలనిచ్చే సాధనాల విషయంలో సదా అప్రమత్తంగా ఉండాలని, పనితీరు మాత్రమే కాకుండా సంస్థ పటిష్టతను కూడా చూసుకోవాలని రాధిక సూచించారు. భారత ఎకానమీ వృద్ధి చెందడమనేది కేవలం ఏదో ఒక రంగంపై ఆధారితమైనది కాకుండా వివిధ రంగాలవ్యాప్తంగా ఉంటుందనే విషయాన్ని రిటైల్ ఇన్వెస్టర్లు గుర్తించి, తదనుగుణంగా పెట్టుబడులు పెట్టాలని పేర్కొన్నారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
రికార్డుల ర్యాలీ కొనసాగొచ్చు
పేటీఎమ్ నుంచి వైదొలగిన సాఫ్ట్‌బ్యాంక్

ఎర్రచందనం దుంగలు స్వాధీనం


పట్టుబడిన ఎర్రచందనం దుంగలు

నల్లచెరువు: శ్రీసత్యసాయి జిల్లా, నల్లచెరువు మండలం, పెద్దయల్లంపల్లి వద్ద శనివారం రాత్రి 13 ఎర్ర చందనం దుంగలను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి రవీంద్రరెడ్డి ఆదేశాల మేరకు పెద్దయల్లంపల్లి జాతీయరహదారిపై అటవీశాఖ అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో మదనపల్లి నుంచి కదిరి వెళ్తున్న కారును గుర్తించారు. అధికారులు వాహనాలను తనిఖీ చేస్తున్నారని గమనించిన ఇద్దరు దుండగులు కొద్దిదూరంలో కారు ఆపి పరారయ్యారు. అధికారులు కారును తనిఖీ చేయగా.. 13 ఎర్రచందనం దుంగలు లభించాయి. వీటి విలువ రూ.2 లక్షలకు పైగానే ఉంటుందని తెలిపారు. వాహనం నంబర్ ఆధారంగా నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. తనిఖీల్లో డిప్యూటీ రేంజ్ అధికారి రామచంద్ర నాయక్, సెక్షన్ అధికారి రామచంద్రారెడ్డి, ఎఫ్‌బీఓలు నాగరాజు, హరిప్రసాద్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా అబ్బాయి.. ఫిలిప్పీన్స్ అమ్మాయి

మైలవరం ఆలయంలో వివాహం



జి.కొండూరు (మైలవరం): ఆంధ్రా అబ్బాయి, ఫిలిప్పీన్స్ అమ్మాయి ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. హిందూ సంప్రదాయం ప్రకారం ఈ వివాహం ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో జరిగింది. ఆదివారం జి.కొండూరు మండలం కుంటముక్కలలో రిసెప్షన్ నిర్వహించారు. గ్రామానికి చెందిన మైలవరపు కైలాసరావు కుమారుడు సతీష్ కుమార్ ఆంధ్రా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ పూర్తిచేసి పీహెచ్‌డీ నిమిత్తం బెల్జియం వెళ్లారు. అతడికి ఫిలిప్పీన్స్ నుంచి వచ్చి బెల్జియంలో ఎమ్మెస్సీ చదువుతున్న డోనా క్యూనో పరిచయమైంది. పరిచయం స్నేహంగా.. ప్రేమగా మూడేళ్లు సాగింది. పెద్దల అంగీకారంతో వారిద్దరు మైలవరంలోని కోదండ రామాలయంలో కుటుంబసభ్యుల సమక్షంలో హిందూ సంప్రదాయం ప్రకారం వేదమంత్రాల నడుమ వివాహం చేసుకున్నారు. ఆదివారం కుంటముక్కలలో బంధుమిత్రులు, స్నేహితులు, గ్రామస్తుల సమక్షంలో రిసెప్షన్ నిర్వహించారు.

పుట్టపర్తిలో సత్యసాయి జాతీయ క్రికెట్ లీగ్

- ట్రోఫీని ఆవిష్కరించిన మాజీ క్రికెటర్ మురళీ కార్తీక్


ట్రోఫీని ఆవిష్కరిస్తున్న మురళీ కార్తీక్, రత్నాకర్‌రాజు తదితరులు

ప్రశాంతి నిలయం: సత్యసాయి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని నేటి యువత మానవతా విలువలను,సేవా స్ఫూర్తిని చాటుతూ ఆదర్శవంతమైన జీవితం సాగించాలని భారత మాజీ క్రికెటర్ మురళీ కార్తీక్ పిలుపునిచ్చారు. పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో సత్యసాయి మహాసమాధి చెంత 'సత్యసాయి జాతీయ క్రికెట్ లీగ్' ట్రోఫీ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. మురళీ కార్తీక్‌తోపాటు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు తదితరులు ట్రోఫీని, క్రికెట్ లీగ్ పోటీల బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుట్టపర్తి స్టేడియంలో ఎగ్జిబిషన్ మ్యాచ్ నిర్వహించారు.

లెక్క తేల్చారు

జేఎన్‌టీయూకే పరిధిలో సీట్లు ఖరారు

- 2024–24 విద్యాసంవత్సరానికి 159 కళాశాలలకు గుర్తింపు
- ఇంజినీరింగ్‌లో 63 వేల సీట్లకు అనుమతి
- కొత్త కోర్సుల్లో 1,500 అడ్మిషన్లకు సిగ్నల్
- రేపు సీట్ల కేటాయింపు



బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంజినీరింగ్ ప్రవేశాలకు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న విద్యార్థులకు కళాశాలల్లో ప్రవేశాలకు లైన్ క్లియర్ కానుంది. ఆన్‌లైన్ దరఖాస్తు, వెబ్ ఆప్షన్ల ప్రక్రియ పూర్తవ్వడంతో ఇక చివరి దశ సీట్లు, కళాశాల ఎంపికకు సంబంధించి మంగళవారం విద్యార్థుల సెల్‌ఫోన్‌కు సమాచారం రానుంది. రాష్ట్రంలో ఉన్న వర్సిటీల నుంచి సీట్ల సంఖ్యపై ఉన్నత విద్యామండలికి నివేదిస్తేనే అక్కడ నుంచి కౌన్సెలింగ్‌కు నోటిఫికేషన్ వస్తుంది. రాష్ట్రంలో అత్యధిక కళాశాలలకు అనుసంధానంతో పాటు సాంకేతిక వర్సిటీల్లో కీలకంగా ఉన్న జేఎన్‌టీయూకే ఈ ప్రక్రియ త్వరగా పూర్తిచేసింది. వర్సిటీ అకడమిక్ అడిట్ డైరెక్టర్ సాయిబాబు నేతృత్వంలో ప్రక్రియ పూర్తి చేసి నివేదిక పంపించారు. ప్రస్తుతం తూర్పు, పశ్చిమ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం ఉమ్మడి జిల్లాల్లోని కళాశాలలు వర్సిటీకి అనుబంధంగా ఉన్నాయి.

ఆన్‌లైన్‌లో కళాశాలల తనిఖీ...

రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు అనుబంధ కళాశాలల తనిఖీలు ఆన్‌లైన్‌లో చేపట్టారు. మౌలిక సదుపాయాల పర్యవేక్షణ, కళాశాల స్థితిగతులు, వసతులు, విద్యార్థి – అధ్యాపకుల నిష్పత్తి, కళాశాల క్యాంపస్ పరిస్థితి, ఆటస్థలం, గ్రంథాలయ సదుపాయం, ల్యాబ్ తదితర అంశాలను పరిశీలన చేస్తారు. ఏటా ఇంజినీరింగ్ కళాశాలలకు అనుబంధ గుర్తింపు ఇచ్చే ముందు నిజ నిర్ధారణ కమిటీ పర్యవేక్షణ చేస్తుంది. కమిటీ సిఫారసు మేరకు ఏయే కళాశాలలకు ఎన్ని సీట్లు కేటాయించాలి అనే అంశంపై చర్చించి నిర్ణయం తీసుకుంటారు. మరోవైపు ఏఐసీటీఈ నుంచి అనుమతి తెచ్చుకున్న ఇంజినీరింగ్ కాలేజీలకు ఎన్ని సీట్లుకు యూనివర్సిటీ అనుబంధ గుర్తింపు ఇస్తుందనే అంశానికి నిజ నిర్ధారణ కమిటీ సిఫార్సులే కీలకం. ఈ కమిటీలో వర్సిటీ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సభ్యులుగా ఉంటారు.

సీఎస్‌ఈ వైపు మొగ్గు

2024–25 విద్యాసంవత్సరానికి కాకినాడ వర్సిటీ ఉన్నత విద్యామండలికి సీట్ల కేటాయింపు కోసం నివేదించింది. వర్సిటీకి అనుబంధంగా ఉన్న 159 కళాశాలల్లో ఇంజినీరింగ్‌లో 63,000 భర్తీ చేసుకోవడానికి అనుమతి ఇచ్చారు. గత ఏడాది బీటెక్ విభాగంలో డిమాండ్ ఉన్న కంప్యూటర్ సైన్స్ కోర్సుకోసం నాలుగు వేల సీట్లకు అనుబంధ కళాశాలలు దరఖాస్తు చేసుకోగా అక్కడి సౌకర్యాలను బట్టి వాటికి అనుమతి ఇచ్చారు. కొత్త కోర్సులకు సంబంధించి ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో వీఎల్‌ఎస్‌ఐ డిజైన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో అడ్వాన్స్‌డ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ కోర్సులకు 1,500 సీట్ల వరకూ అనుమతి ఇచ్చారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ మెయిన్స్‌లో వచ్చిన ర్యాంకు ఆధారంగా ఐఐటీ, ఎన్‌ఐటీలలో సీటు సాధించలేకపోయిన విద్యార్థులు ఏపీ ఈఏపీ సెట్‌లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. వీరు ప్రైవేట్ వర్సిటీలతో పాటు ఏ గ్రేడ్ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్‌ఈ బ్రాంచ్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు.

సదుపాయాలు ఉన్న కళాశాలలకే గుర్తింపు



ఉన్నత విద్యామండలి రాష్ట్రంలో ఉన్న అన్ని యూనివర్సిటీలు, కళాశాలల ప్రమాణాలను ఆన్‌లైన్ ద్వారా పరిశీలన చేసి అనుమతి ఇవ్వాలని సూచించింది. ఆ మేరకూ జేఎన్‌టీయూ కాకినాడ నుంచి ఆన్‌లైన్‌లో పరిశీలన నిర్వహించాం. సాంకేతిక విద్యలో ఉన్నత ప్రమాణాలు పాటించిన, అన్ని వసతులు ఉన్న వాటికే గుర్తింపు కల్పించాం. అటువంటి కళాశాలల్లో అభ్యసిస్తే విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు దక్కుతాయి.
– డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, తాజామాజీ వీసీ, జేఎన్‌టీయూ కాకినాడ

మహిళా సంఘాలకు భారంగా.. ఆటో డెబిట్

- స్త్రీ నిధి రుణాల రికవరీకి అమలు
- రుణం వాడని సభ్యులు నష్టపోయే పరిస్థితి
- వివాదాలకు ఆజ్యం పోయనున్న ఆటో డెబిట్



ఏలూరు: మహిళా సంఘాలకు చంద్రబాబు సర్కారు షాకిచ్చింది. రుణాల రికవరీకి చంద్రబాబు ప్రభుత్వం ఆటో డెబిట్ పేరిట కొత్త విధానం అమల్లోకి తెస్తోంది. స్త్రీ నిధి రుణాలకు ఆటో డెబిట్ విధానం అమలు చేయనుంది. దీంతో మహిళా సంఘాలకు ఈ విధానం భారంగా మారనుంది. ఈ విధానం అమలులోకి వస్తే స్త్రీ నిధి రుణాల శాతం తగ్గే అవకాశముంది.

మహిళా సంఘాల పొదుపు డబ్బుతో రుణాలు రికవరీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సమాయాత్తం అయ్యింది. స్త్రీనిధి రుణాలను బ్యాంకు లింకేజీతో ఎస్‌హెచ్‌సీ గ్రూపులకు స్త్రీనిధి సంస్థ అందిస్తోంది. రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో అందించే ఈ రుణాలు జిల్లా స్థాయిలో గ్రామీణాభివృద్ధి సంస్థ నిర్వహిస్తోంది. రుణాలు తీసుకున్న అనంతరం ఆయా ఎస్‌హెచ్‌జీ గ్రూపులు ఈఎంఐ రూపంలో తిరిగి చెల్లిస్తుంటాయి. ఈ విధానంలో ఒక నెల వాయిదా చెల్లించకపోయినా, మరుసటి నెలలో వడ్డీతో సహా చెల్లించేవారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆటో డెబిట్ ద్వారా ఆయా లబ్ధిదారుల పొదుపు సొమ్మును ఈఎంఐ చెల్లింపునకు వినియోగిస్తారు.

పాత విధానంలో అప్పు తీసుకున్న సభ్యులపైనే భారం

సాధారణంగా ఎస్‌హెచ్‌జీ గ్రూపునకు స్త్రీ నిధి రుణం రూ.లక్ష వరకు మంజూరు చేస్తారు. సంఘంలో కనీసం ముగ్గురు సభ్యులు లేదా సభ్యులందరూ వారి అవసరాల మేరకు తీసుకుంటారు. సభ్యుల మధ్య అవగాహన మేరకు నగదు అవసరాలు ఉన్న వారు వారి అవసరాన్ని బట్టి నగదును వినియోగించుకుంటారు. రుణం తీసుకున్న సభ్యులు ప్రతి నెల వాయిదా సొమ్మును స్త్రీనిధికి నేరుగా, లేదా ఆ గ్రామ అకౌంటెంట్ (సీఏఫ్) ద్వారా చెల్లించేవారు. నగదు చెల్లించిన వెంటనే రసీదు పొందేవారు. రుణం తీసుకున్న వారిలో ఒక నెల, అంతకంటే ఎక్కువ నెలలు వాయిదా సకాలంలో చెల్లించకపోతే వారు తర్వాత వడ్డీతో కలిపి చెల్లించేవారు. ఈ పద్ధతి వల్ల రుణం భారం, వాయిదాలు కేవలం అప్పు తీసుకున్న సభ్యులపై మాత్రమే ఉండేది.

సభ్యుల మధ్య వివాదాలకు ఆస్కారం

రుణాలు సకాలంలో చెల్లింపు జరుగుతున్నప్పుడు, సంఘ సభ్యులందరూ రుణాలు తీసుకున్న సమయంలో ఆటో డెబిట్ విధానం వల్ల కలిగే నష్టం పెద్దగా ఉండకపోయినా.. రుణాల చెల్లింపుల్లో ఆలస్యం జరిగినా, కొంతమంది మాత్రమే రుణం తీసుకున్నా సంఘాల సభ్యుల్లో వివాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఉన్నాయి. ఆటో డెబిట్ విధానంలో రుణం తీసుకున్న వారు సకాలంలో వాయిదాలు చెల్లించకపోతే అందరి పొదుపు డబ్బును బకాయి కింద డెబిట్ చేస్తారు. దీంతో సభ్యుల మధ్య ఐక్యత దెబ్బతిని సంఘాల మనుగడకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. దీంతో ఆటో డెబిట్ విధానాన్ని ఎస్‌హెచ్‌సీ సభ్యులు వ్యతిరేకిస్తున్నారు.

ఆటో డెబిట్ విధానంలో ఇలా

ఆటో డెబిట్ విధానంలో లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్‌కు రుణాలు లింక్ చేస్తారు. దీని ద్వారా వాయిదా సొమ్ము లబ్ధిదారుల బ్యాంకు ఖాతా నుంచి చెల్లిస్తారు. నిర్ణీత తేదీన లబ్ధిదారుడు వాయిదా సొమ్ము చెల్లించకపోతే, రుణానికి జత చేసిన బ్యాంకు అకౌంట్ నుంచి వాయిదా సొమ్ము జమవుతుంది. ఈ విధానంలో సంఘంలో కొంతమంది మాత్రమే రుణం తీసుకున్నప్పటికీ, రుణం తీసుకున్న వారితో పాటు తీసుకోని వారి పొదుపు డబ్బు కూడా పోతుంది. దీంతో మొత్తం సంఘంపై భారం పడుతుంది. రుణం వాడని సభ్యులు కూడా నష్టపోయే పరిస్థితి వస్తుంది. అందరూ రుణం తీసుకుని ఉంటే ఈ సమస్య ఉండదు. కొంతమంది మాత్రమే అప్పు తీసుకొంటే మాత్రం సమస్య తప్పదు.

జిల్లాలో గ్రూపుల సంఖ్య

జిల్లాలో మొత్తం ఎస్‌హెచ్‌జీ గ్రూపులు 42,458 ఉండగా, ఈ గ్రూపుల్లో 4,40,934 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఈ ఏడాది జూలై వరకు సుమారు సుమారు రూ.18 కోట్లు రుణంగా తీసుకున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.160 కోట్లు తీసుకున్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి మోక్షమెప్పుడో ?

- 16 ఏళ్లు దాటినా పూర్తి కాని పరిస్థితి
- కోట్లాది రూపాయలు ప్రజాధనం వృథా ?
- ఆస్పత్రి పూర్తి చేస్తామని పాలకుల హామీలు
- 2008లో బీజేపీ హయాంలో ఆస్పత్రికి శ్రీకారం


బళ్లారిలో అర్ధంతరంగా ఆగిపోయిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి


నిధుల్లేన్న ఆస్పత్రికి గ్రహణం

సాక్షి,బళ్లారి: బళ్లారి నగరంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి అంకురార్పణ జరిగి 16 ఏళ్లు దాటినా ఇం కా పూర్తి కాని పరిస్థితి. దీంతో పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా పనులు కొనసాగుతున్నాయి. నేటికీ ప్రజలకు అందుబాటులోకి రాలేదు. దీంతో ప్రజలు పాలకుల పనితీరును తీవ్రంగా విమర్శిస్తు న్నారు. అప్పట్లో బీజేపీ ప్రభుత్వ హయాంలో నాటి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గాలి జనార్దనరెడ్డి ప్రత్యేక చొరవతో నగరంలోని విశాలమైన స్థలంలో సువిశా లమైన విస్తీర్ణంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దాదాపు రూ.400 కోట్ల నిధులతో బెంగళూరు తరహాలో ఆస్పత్రి పనులు ప్రారంభించారు. భవన నిర్మాణాలు కూడా దాదాపు పూర్తి చేశారు. పందలాది పడక గదులతో, అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, చిన్న ఆపరేషన్ నుంచి గుండె ఆపరేషన్లు కూడా ఇక్కడే చేసే విధం గా చర్యలు చేపట్టారు. ఆస్పత్రి పనులు దాదాపు 80 శాతం పూర్తి అయ్యాయి.

ప్రభుత్వాలు మారినా ఆస్పత్రి ప్రగతి శూన్యం : ఇప్పటికే పందలాది కోట్లు ఖర్చు పెట్టారు. ఇత రత్రా వాటికి మరో రూ.100 కోట్లు దాకా ఖర్చు అవుతుందని అంచనాలు వేస్తున్నారు. పెండింగ్ నిధులు విడుదల చేస్తామని, ఆస్పత్రిని ప్రజలకు అందుబాటులోకి తెస్తామని పాలకులు చెబు తున్నారే కాని ఆచరణలో లేదు. ప్రభుత్వాలు మారుతున్నాయి కాని, ఆస్పత్రి నిర్మాణం పూర్తి కాలేదు. 2008 బీజేపీ ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించిన తర్వాత అర్ధంతరంగా ఆగి పోయాయి. మళ్లీ 2013లో కాంగ్రెస్ ప్రభుత్వం అ ధికారంలోకి వచ్చింది. పనులు పూర్తి చేస్తామని అప్పటి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు హామీలు గుప్పించారు. అనంతరం మళ్లీ 2018లో సంకీర్ణ సర్కార్, అనంతరం బీజేపీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చింది. ఇలా ప్రభుత్వాలు మారుతు న్నాయి కాని, ఆస్పత్రికి ఒక రూపు తీసుకురాలేక పోతున్నాయి. ఈ విషయంపై ప్రజా సంఘాల నేతలు విమర్శలు గుప్పిస్తూ, వందల సార్లు, జిల్లా ధికారికి, మంత్రులకు వినతిపత్రాలు సమర్పిస్తు న్నారే కాని వారి విన్నపాలు బుట్టదాఖలవుతు న్నాయి. జిల్లాలో అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదంటున్నారు, వందల కారు వేల కోట్ల ని ధులు జిల్లా అభివృద్ధి కోసం మూలుగుతూనే ఉన్నాయి. ఆస్పత్రి పనులు మాత్రం పూర్తి చేయ కపోవడంతో సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

క్లుప్తంగా

ఉప జైలర్‌కు పురస్కారం


అమరప్పకు పురస్కారం అందజేస్తున్న హోం మంత్రి

రాయచూరు రూరల్: లింగసుగూరు జైలులో ఉప జైలర్‌గా విధులు నిర్వహిస్తున్న అమరప్ప పేరికి ముఖ్యమంత్రి అవార్డు లభించింది. శని వారం సాయంత్రం బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో హోం మంత్రి పరమేశ్వర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. అమరప్ప పేరి జైలులో ఖైదీలకు పరివర్తన, తప్పులు సరి దిద్దుకోవాలని సలహాలు ఇవ్వడం, ఆరోగ్యం, విద్య, రికార్డుల భద్రత వంటి అంశాలపై అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా జైలు అధికారులు అందాని, పుండలిక్ భాగ్యశ్రీ తదితరులు అమరప్పను అభినందించారు.

అజ్ఞాతంలోకి ఎమ్మెల్యే బసనగౌడ ?

రాయచూరు రూరల్: వాల్మీకి అభివృద్ధి నిగమలో భారీ కుంభకోణంకు సంబంధించి విచారణ జోరుగా సాగుతోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ నివాసాలపై ఈడీ సోదాలు చేసింది. నాలుగు రోజుల క్రితం బెంగళూరు, యలహంకలో అధికారులు సోదాలు చేశారు. సిరివార తాలూకా గణదిన్ని ప్రాంతంలో మార్చిలో 4.31 ఎకరాల భూమిని కొనుగోలు చేసి దాయచూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నమోదు చేసుకున్నారు. ఆ భూమి భారత్ మాలా జాతీయ రహదారికి అనుకుని ఉండ టం విశేషం. ఇలా ఉంటే రాయచూరులో ఈడీ సోదాలు ముగిసిన వెంటనే ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ ఆచూకీ కనిపించలేదు.

నగరంలో ప్రత్యక్షం.. వెంటనే పయనం
ఆదివారం రాయచూరు కొచ్చిన ఎమ్మెల్యే బసన గౌడ దద్దల్ తన కారు వదలి మరో వాహనంలో మంత్రాలయం, వైజాగ్ వైపు పయనమైనట్లు సమాచారం. ఈడీ అధికారుల అరెస్ట్ నుంచి తప్పించుకుని అజ్ఞాతంలోకి వెళ్లి నట్లు తెలిసింది.

సమస్యలు పరిష్కరించండి


వినతిపత్రం సమర్పిస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: తమ సమస్యలు పరిష్క రించాలని అక్షర దాసోహ కార్యకర్తల సంఘం డిమాండ్ చేసింది. శనివారం సాయంత్రం అక్షర దాసోహ కార్యాలయం వద్ద అధ్యక్షురాలు రేణుకమ్మ మాట్లాడారు. అక్షర దాసోహ పథకం లో తొలగించిన 10,500 మందిని విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ అక్షర దాసోహ అధికారి ఈరణ్ణకు వినతిపత్రం సమర్పించారు.

లోక కళ్యాణార్థం స్వామీజీలు చాతుర్మాస దీక్షలు


పాదయాత్ర చేస్తున్న స్వామీజీలు

రాయచూరు రూరల్: లోక కళ్యాణార్థం జైనమునిశ్రీ స్వామీజీలు 48 రోజుల పాటు చాతు ర్మాస దీక్షలు చేపట్టారు. ఆదివారం నగరంలోని జైనమఠంలో పరమ పూజ్య నరేష్ ముని, గురు మహారాజులు చాతుర్మాసనుప్రారంభించారు. దేశ సుభిక్షం కోసం, లోక కళ్యాణార్థం, రైతులు సం క్షేమం కోసం నిత్యం తపస్సులోని నిమగ్నుల య్యారు. జీవితంతో మంచి కార్యాలు చేసి సదా రత్వత చింతనలు, ఉత్తమ విద్యతో జీవనంలో మార్పులు సంభవిస్తాయన్నారు. ఉదయం ఇద్దరు జైన మునులను ఊరేగించారు. ఈ సం దర్భంగా కమల్ కుమార్, రవి బోఫ్రా, శాంతి లాల్, నరేంద్ర మోధా, గౌతమ్ గియా తదిత రులు పాల్గొన్నారు.

నిస్వార్థంతో సేవలు అందించాలి


జ్యోతి వెలిగిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: ప్రభుత్వ ఉద్యోగులు సమాజానికి నిస్వార్థంతో సేవలు అందించిన ప్పుడే అవార్డులు వెతుక్కుంటూ వస్తాయని నవలకల్ అభినవ సోమనాథ శివాచార్యులు అన్నారు. శనివారం రాత్రి సిరవారలో రిమ్స్ అధికారి విజయ శంకర్‌కు రాష్ట్ర స్థాయి ఉత్తమ వైద్య అవార్డు అందుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సమారోహంలో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో పుట్టిన విజయ్ శంకర్ మాన్వి తాలూకాకే గర్వకారణ మన్నారు. సమారోహంలో మాన్వి శాసన సభ్యుడు హంపయ్య నాయక్, మాజీ మంత్రి హంపనగౌడ్ అల్కోడ్, శరణప్ప గౌడ, గిణిజా శంకర్, చుక్కి సూగప్ప, ఏసురాజ్, మారుతి, రాజుగౌడ, రమేష్, వీరనగౌడ, ఖాజీ తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీరు తాగి 9 మందికి అస్వస్థత



చికిత్స పొందుతున్న బాధితులు, ఆస్పత్రిలో బాధితులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ

రాయచూరు రూరల్: కలుషిత నీరు తాగి 9 మంది అస్వస్థతకు గురైన ఘటన యాదగిరి జిల్లాలో చోటు చేసుకుంది. ఆదివారం గురుమిఠకల్ తాలూకా కాక లవారలో కొళాయి నీరు తాగిన కొందరు వాంతులు, విరేచనాలకు గురయ్యారు. వెంటనే వారిని సమీపం లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో దేశి పంపులు దెబ్బతినడంతో ఆదివారం కొళాయిలో వచ్చిన శుద్ధి చేయని నీటిని తాగారు. వెంటనే తొమ్మిది మందికి వాంతులు, విరేచనాలబారిన పడ్డారు. విషయం తెలుసుకున్న కలబుర్గి జిల్లా పం చాయతీ అధికారిణి గరిమా పన్వార్ వెంటనే బాధితు లను పరామర్శించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం గా వ్యవహరించిన పీడీఓను సస్పెండ్ చేశారు. గురు మఠకల్ ఎమ్మెల్యే శరణే గౌడ ఆరోగ్య, పంచాయతీ రాజ్ అధికారులతో మాట్లాడి శుద్ధమైన మంచి నీటిని సర ఫరా చేయాలని ఆదేశించారు.

రెట్టింపు లాభాలు అంటూ లక్షల వంచన

హుబ్లీ: ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్న ప్రజల్లో చైతన్యం రావడం లేదు. ఇలాగే ఓ వ్యక్తి లక్షల్లో మోస పోయారు. ఆశిస్ బాధితుడు. ఆశిస్ తన వాట్సాప్‌కు వచ్చిన ఓ మెసేజ్‌కు స్పందించి వారిచ్చిన నెంబర్‌కు కాల్ చేశారు. శివాని అనే వ్యక్తి పరిచయం చేసుకుని ఫలానా కంపెనీలో పెట్టుబడి పెడితే పది రెట్లు పైగా లాభాలు వస్తాయని నమ్మించారు. దీంతో అమాయ కంగా నమ్మిన ఆశీశ్ రూ. 9.59 లక్షలు పెట్టుబడి పెట్టారు. అనంతరం ఎటువంటి లాభాలు రాక పోవడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు నగర సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎంపీ

హుబ్లీ: హావేరి జిల్లా సిగ్గావి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. ఆదివారం ఎంపీ బసవరాజ్ బొమ్మై మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఎంపీ బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందిం చారు. మృతుల కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ప్రాణం తీసిన అతివేగం :
సవణూరు తాలూకా ఐదుగురు స్నేహితులు బెళగావి జిల్లా కాగవాడ తాలూకా నందగడకు బయ లుదేరారు. ఈ క్రమంలో మరో వాహనాన్ని ఓవర్ టేక్ చేసే క్రమంలో వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొంది. దీంతో ఘటన స్థలంలోనే నలుగురు మృ తి చెందగా తాజాగా ఆదివారం సిగ్గావి ఆస్పత్రిలో మరొకరు మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య ఐదుకు చేరినట్లు పోలీసులు తెలిపారు.

ఈ రోడ్డుకు మరమ్మతు చేయండి


గుంతలమయంగా ఉన్న రోడ్డు

హొసపేట: నగర శివారులో ఉన్న ఆర్టీఓ కార్యాలయ రహదారి గుంతలమయంగా మారింది. దీంతో ఆర్టీఓ కార్యాలయం పైపునకు వెళ్లే వారు నరకయాతనగా అనుభవిస్తున్నారు. ఈ రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరుగుతు న్నాయి. నగరసభ యంత్రాంగం అసలు పట్టిం చుకున్న దాఖలాలు కనిపించలేదు. నిత్యం ఆర్టీఓ కార్యాలయానికి వందల సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. ప్రస్తుతం వర్షాలు పడి గుంతల్లో నీరు ఉండటంతో ఎక్కడ గుంత ఉం దో తెలియక వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికా రులు వెంటనే స్పందించి రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఉన్నత విద్యకు ప్రోత్సాహం కల్పించాలి


మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్వేతా సింగ్

రాయచూరు రూరల్: ఉన్నత విద్యకు ప్రోత్సాహం కల్పించాలని జిల్లా కోర్టు అదనపు న్యాయమూర్తి శ్వేతా సింగ్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని గాంధీ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అం దించి మాట్లాడారు. అత్యున్నత విద్యనభ్యసించి భవిష్యత్తులో ఉజ్వల పేరు తెచ్చి సమాజ సేవకు ముందుండాలని కోరారు. ఈ సందర్భం గా అన్వర్ పాషా, మల్లికార్జున, రజాక్ ఉస్తాద్, నూర్ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకులను గుర్తించడం కష్టం

రాయచూరు రూరల్: సమాజంలో వివిధ రం గాల్లో సేవలందించిన వారిని గుర్తించడం కష్టమని మాజీ విధాన పరిషత్ సభ్యుడు శరణ ప్ప పేర్కొన్నారు. ఆదివారం దేవదుర్గ మాజీ శాసన సభ్యుడు శివన గౌడ నాయక్ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. నేడు మంచి పనులు చేసిన వారిని మరచి పోతు న్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మె ల్యేలు తిప్పరాజ్, గంగాధర్ నాయక్, ఈరణ్ణ, శరణప్ప తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలు పరిష్కరిస్తాం


సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

హొసపేట: స్థానిక ఎమ్మెల్యే గవియప్ప ఆదివారం వివిధ గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ఉదయం ఆయన రాంపుర, నరసాపూర్ మాగాణి, జాగీర్దార్ బండి గ్రామాలను సందర్శించి స్వయంగా ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వివ తులు స్వీకరించి వెంటనే పరిష్కరించాలని అధి కారులకు సూచించారు. రైతులకు మేలు చేసేలా ప్రధాన రహదారి నుంచి పలు పొలాలకు అనుసం ధానం చేసే మాగాణి రోడ్ల అభివృద్ధికి ఆయన శ్రీకారం చుట్టారు. ఇప్పటికే (జిల్లా కాల్వ) గ్రామం లో భోరుబావికి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే వెం ట పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ సహాయ కార్యనిర్వాహణాధికారి కిరణ్, ఆ శాఖ అధికారులు, స్థానిక నాయకులు వినయ్ శెట్టర్ అంజినప్ప, బసవ రాజ్ నాగేనహళ్లి, తొటప్ప తదితరులు ఉన్నారు.

కౌశల్య అభివృద్ధి కేంద్రం ఏర్పాటుకు కృషి

కోలారు: జిల్లాలో కేజీఎఫ్‌తో పాటు అన్ని తాలూ కాలలో పరిశ్రమలను స్థాపించడానికి అవసరమైన భూమి, మానవ వనరులు అధికంగా ఉన్నందున ఈ ప్రాంతంలో పరిశ్రమలను స్థాపించడంతో పాటు ఉద్యోగాలు సాధించడానికి అవసరమైన కౌశల్య శిక్షణా కేంద్రాలను స్థాపించడానికి కృషి చేస్తామని ఎంపీ మల్లేష్‌బాబు తెలిపారు. ఆదివారం నగరంలోని గోల్డ్ ఫీల్డ్ క్రెడిట్ కో ఆపరే టివ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కౌశల్య అభి వృద్ధి కేంద్రం స్థాపించకుండా పరిశ్రమలు వస్తే ఈ పరిశ్రమలలో ఇతర ప్రాంతాలకు చెందిన వారే ఉద్యోగాలు పొందే అవకాశం ఉందని, దీంతో స్థానిక నిరుద్యోగ యువతకు అవసరమైన కౌశల్య శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సహకార యూనియన్ మాజీ అధ్యక్షుడు మూరాండహళ్లి గోపాలప్ప, న్యాయవాది అమరేంద్ర, సొసైటీ న్యాయ సలహాదారు ఎం రామలింగేగౌడ, డైరెక్టర్ డి నాగరాజప్ప తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు మృతి

హుబ్లీ: హుబ్లీ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. హుబ్లీ శివార పుణె– బెంగళూరు హైవేలోని కట్టూరు దగ్గర ఈ ప్రమాదం జరిగింది. మృతులను ఆనంద నాయకర్ (34), ఈరణ్ణ బడిగేర (36)గా గుర్తించారు. వీరు బైక్‌పై వస్తుం డగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు ధార్వాడ జిల్లా కలఘటిగి తాలూకా హస్తకట్టి గ్రామా నికి చెందిన వారు. దక్షిణ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఇంటిలో చోరీ
దార్వాడ తాలూకా ఇటిగట్టి గ్రామంలో మోహన్ బావటి అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగిం ది. దొంగలు ఇంటి తలుపులు తొలగించి బీరువాలో ఉన్న రూ. లక్ష విలువైన నగలు ఎత్తుకెళ్లారు. హుబ్లీ రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పరిజ్ఞానం లేదా?

శివాజీనగర: 'జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం కేంద్ర మంత్రి అయ్యారు. ఆయనకు కనీస పరిజ్ఞానం ఉండాల్సింది' అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఎం.లక్ష్మణ్ ధ్వజమెత్తారు. ఆదివారం కేపీసీసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ముడా స్థలాల గురించి సీఎం సిద్ధరామయ్యను నిం దించడం తగదన్నారు.

వేడుకగా వ్యాస జయంతి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: శ్రీ వ్యాసరాయరు గురు, జ్ఞాన పరంపర మేరు శిఖరమని వారి జీవితం, రచన భారతీయ పరంపరలో కలిసి ఉందని అఖిల భారతీయ సాహిత్య పరిషత్ జిల్లా విభాగం కార్యదర్శి, రచ యిత్రి మాయా బాలచంద్ర తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ బాలి కల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన వ్యాస జయంతి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. తన మహా భారత కావ్యం ద్వారా సమాజంలో ఉత్తమ సామాజిక, మానవీయ విలు వలను చూపించిన వ్యాసరాయర ఒక జాతి లేదా ధర్మానికి పరిమితం చేయడం సరికాదన్నారు. వేద వ్యాసుడే రచించబడిన మహా భారతం, వేల సంవత్సరాల నుంచి ప్రజల హృదయాలలో నిలిచి ఉందన్నారు. జగత్తుకు దారి దీపంగా ఉం దన్నారు. మహా కావ్యంలో మహా పాత్రలు మం చి చెడుల గురించి తెలియజేస్తుందన్నారు. కార్య క్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎన్ శ్రీధర్, ఉపాధ్యా యులు దేవరాజ్, రామాంజనేయ, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

హత్య కేసులో నిందితుల అరెస్టు


పోలీసులు అరెస్టు చేసిన ప్రధాన నిందితుడు

మాలూరు: వ్యక్తిని హత్య చేసి చెరువులో పడే సిన ఘటనకు సంబంధించి ఆదివారం మాలూరు పోలీ సులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ నెల 10న తాలూ కాలోని మంగా పుర గ్రామానికి చెందిన ప్రముఖ నిందితుడు అంబరీష్ (30), సహ చరులు మధు (25), బెంగళూరు మదన్ (26)లు పట్టణంలోని ఓ బార్‌లో మద్యం కొనుగోలు చేసి లింగాపుర రహదారిలో రాజీవ్ నగర్ వద్ద ఉన్న స్థలంలో పార్టీ చేసుకుని నారాయణ స్వామి అనే వ్యక్తిని హత్య చేసి శవాన్ని కోలారు సమీపంలోని నరసాపుర చెరువులో పడేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్టు చేశారు.

పూజా సామగ్రి ప్రదర్శన


పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న దృశ్యం

కోలారు: నగరంలోని బాలాజీ ప్రార్థనా మందిరంలో శ్రీ వాసవి మహిళా మండలి శ్రావణ మాసం పూజా సామగ్రి ప్రదర్శన, విక్రయ మేళాను నిర్వహించారు. మేళాలో నగర, చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు వచ్చి కొనుగోలు చేశారు. వాసవి మహిళా మండలి ప్రతియేటా మేళాను నిర్వహిస్తుంది. శ్రావణ మాసం ప్రారంభానికి ముం దు ఆషాఢ మాసంలో ఈమేళాను నిర్వహిస్తారు. పూజా కార్యక్రమాలకు అవసరమైన అలంకార వస్తు వులు, తినుబండారాల ప్రదర్శన, విక్రయానికి ఉం చారు. ఆర్యవైశ్య మహిళలు తామే స్వయంగా తయారు చేసిన వివిధ ఉత్పత్తులను మేళాలో ప్రద ర్శించారు. వ్యాపారులకు వాసవి మహిళా మండలి నుంచే భోజన వ్యవస్థ కల్పించారు. మేళా బాధ్యత లను వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు ఎజి జయశ్రీ, ఉపాధ్యక్షురాలు వాణి బాలాజీ, కార్యదర్శి శైలా బదరినాథ్, కోశాధికారి పీవీ సత్యలక్ష్మి, సహ కార్యదర్శి సర్వదా తదితరులు పాల్గొన్నారు.

ఏ స్థానంలో ఉన్నా ఉత్తమ వ్యక్తులుగా ఎదగాలి


పురస్కారం అందజేస్తున్న దృశ్యం

కోలారు: గ్రామ పంచాయతీ సభ్యుల స్థానం నుం చి మంత్రి స్థానం వరకు ఏ స్థానంలో ఉన్నా, డీ గ్రూప్ ఉద్యోగి నుంచి ఉన్నతాధికారి వరకు ఎలాంటి స్థానంలో ఉన్నా ఉత్తమ వ్యక్తులుగా ఎద గాలని జిల్లా కార్యనిరత పాత్రికేయుల సహకార సంఘం అధ్యక్షుడు కెఎస్ గణేష్ అన్నారు. ఆది వారం నగరంలోని గాయత్రి ప్రార్థనా మందిరం లో పది, ఇంటర్ విద్యార్థులకు ప్రతిభా పురస్కార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కోలారు జిల్లాలో ప్రతిభా పురస్కార మనే పరంపర ప్రారం భం అయింది బ్రాహ్మణ సంఘం నుంచి అన్నారు. కులాల వారీగా ప్రతిభా పురస్కారాలు అందిం చడం కంటే అన్ని కులాల ప్రతిభావంత విద్యార్థు లను గుర్తించి పురస్కారాలు అందించడం శ్లాఘనీ యమన్నారు. ఇలాంటి కార్యక్రమం కోలారు బ్రాహ్మణ సంఘం మాత్రమే చేస్తోందన్నారు. కోలారు బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఉదయకు మార్ మాట్లాడుతూ... విద్యార్థులు చదవుతో పాటు ఉత్తమ సంస్కారాన్ని అలవర్చుకుని మంచి పౌరులుగా మారాలని స్వార్థాన్ని వీడి దేశ సేవకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఇదే సమయంలో పదవ తరగతికి చెందిన 67 మందికి, ఇంటర్‌కు చెందిన 36 మందికి ప్రతిభా పురస్కారాలను అందించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం పదాధికారులు పి చంద్ర ప్రకా ష్, డాక్టర్ కృష్ణమూర్తి, శంకర మఠం ధర్మాధికారి జె ఎస్ రామకృష్ణ, రవి శంకర్ అయ్యర్, కంప్యూ టర్ అమర్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండులో అపస్మారక స్థితిలో మహిళ


ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

కేజీఎఫ్ : బంగారుపేట బస్టాండులో ఆదివారం ఓ మహిళ అపస్మారక స్థితిలో కనిపించడంతో పోలీసులు వెంటనే మహిళతో పాటు ఆమె వద్ద ఉన్న శిశువును కల్యాణ కేంద్రానికి తరలించారు. బస్టాండులో మహిళ పడి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అంబులెన్స్‌లో ఆమెను, చిన్నారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఆరు నెలల చిన్నారిని కేజీఎఫ్ మస్కంలో ఉన్న పిల్లల సంర క్షణ కేంద్రానికి తరలించారు. బంగారుపేట పోలీసులు సీతారం సింగ్, రేఖా విజయలక్ష్మి, మంజులమ్మలు దగ్గరుండి వారిని కేంద్రానికి తీసుకువచ్చారు.

విద్యుత్ షాక్‌తో పెయింటర్ మృతి

హుబ్లీ: విద్యుత్ షాక్‌తో పెయింటర్ మృతి చెందిన ఘటన అణ్ణిగేరి పట్టణంలో జరిగింది. మృతుడిని గాండీనగర నివాసం మంజునాథగా గుర్తించారు. పెయింటింగ్ పనులు చేసే మంజునాథ అణ్ణిగేరి పట్టణం హైవే పక్కన ఇంటిలో పెయింట్ పనులు చేస్తుండగా ఇంటి ముందు వేలాడుతున్న విద్యుత్ తీగ షాక్ కొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృ తి చెందారు. ఇంటి ముందు వేలాడుతున్న విద్యుత్ తీగను తొలగించాలని ఏడాది క్రితమే ఎస్కాం అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించు కోలేదు. దీం తో ఓ యువకుడు మృతి చెందారు. అణ్ణిగేరి ఎస్కాం శాఖ అధికారులతో పాటు సదరు ఇంటి యజమానిపై మృతుడి తండ్రి నింగప్ప సిరహట్టి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కారు బోల్తా వ్యక్తి మృతి :
కుక్కను తప్పించబోయి కారు బోల్తా పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం ధార్వాడ హుబ్లీ సూరు రోడ్డులో జరిగింది. మృతుడిని వీరప్ప (38)గా గుర్తించారు. హుబ్లీ గ్రామీణ పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పచ్చదనానికి ప్రాధాన్యత ఇవ్వాలి


మాట్లాడుతున్న జయన్న

రాయచూరు రూరల్: నగరంలో పచ్చదనానికి ప్రాధాన్యత ఇవ్వాలని, పరిసరాలను సంరక్షిం చాలని నగరసభ సభ్యుడు జయన్న పేర్కొన్నారు. ఆదివారం పవన్ కాలనీలో రాయచూరు హసిరు బళగ, అటవీశాఖ, నగర సభ ఆధ్వర్యంలో వృక్ష మహోత్సవంలో మొక్కలు నాటి మాట్లాడారు. ప్రతి ఒక్కరు ఇంటి ముందు మొక్కలు నాటి సంరక్షించా లన్నారు. కార్యక్రమంలో ఆటవీ అధికారి రాజేష్, పీరసాబ్, పాత్రికేయ సంఘం అధ్యక్షుడు గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషి


వసంత కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: వివిధ రంగాల అభివృద్ధికి కృ షి చేస్తానని విధాన పరిషత్ సభ్యుడు వసంత్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని హరి జనవాడలో సముదాయం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమం లో ఆది జాంబవ షడ్యాక్షరి స్వామీజీ, నగరసభ సభ్యులు నాగరాజ్, వసంత్, ఈరన్న, బోళబండి ,రవీంద్ర జాలదార్, సిద్దప్ప, నరసింహులు, ఆంజ తిమ్మయ్య, అమరేష్, చెన్నప్ప, యల్లప్ప, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పంటలు పండించాలి


జ్యోతి వెలిగిస్తున్న హన్మంతప్ప తదితరులు

రాయచూరు రూరల్: జిల్లాలో రైతులు శాస్త్రవేత్తల సలహాలు సూచనలు పాటించి నాణ్యతతో కూడిన పంటలను పండించాలని వ్యవసాయ విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ హన్మంతప్ప పేర్కొన్నారు. ఆదివారం వ్యవసాయ విశ్వ విద్యాలయంలో ఏర్పాటు చేసిన ఆహార భద్రత రక్షణ, నాణ్యత అంశాలపై జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఖరీఫ్, రబీ సీజన్‌లో పంటలకు సోకే రోగాలు, తెగుళ్ల వల్ల పంటల నాణ్యత తగ్గి పోతుందని, ఆటువంటి సమయంలో సలహాలు, సూచనలు తీసుకుని సమస్యను అధిగమించాల న్నారు. కార్యక్రమంలో నగర సభ కమిషనర్ గురు సిద్దయ్య, శ్రీకర్, కిశోర్, ప్రభురాజ్, ఉదయ కుమార్, నాగరాజ్, శివానంద, సరోజ, అనిత తదితరులు పాల్గొన్నారు.